


ఈనాడు



వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్

మద్యం కుంభకోణం కేసులో అదుపులోకి తీసుకున్న సిట్

'బిగ్‌బాస్' తరఫున దోపిడీకి కుట్ర, అమల్లో ప్రధాన పాత్ర

ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్ రూపొందించింది ఆయనే

డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని సొంత బ్రాండ్ల తయారీ • ఆధారాలు సేకరించిన సిట్

సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేయటంతో సిట్ ఎదుట హాజరైన మిథున్‌రెడ్డి

ఏడు గంటలపాటు విచారించిన అధికారులు • విచారణకు సహకరించకపోవటంతో అరెస్ట్


విజయవాడలోని సిట్ కార్యాలయానికి వస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ఈనాడు – అమరావతి

మద్యం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో ఒకరు, ఈ కేసులో కీలక నిందితుడైన (ఏ4) వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో అరెస్టు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకూ సుదీర్ఘంగా ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు.. విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించకపోవటంతో నిర్బంధంలోకి తీసుకున్నారు. ఈ మేరకు మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఈ కేసులో అరెస్టైన తొలి ప్రజాప్రతినిధి ఆయనే. జగన్ ప్రభుత్వ హయాంలో నూతన మద్యం విధానం ముసుగులో 'వైకాపా ముఠా' సాగించిన దోపిడీకి కుట్ర, అమలుకు ఏర్పాట్లు, ముఠా సభ్యులకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేయటంలో మిథున్‌రెడ్డిదే 'మాస్టర్ మైండ్' అని సిట్ దర్యాప్తులో గుర్తించింది. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపుల వసూళ్ల కోసం రాజ్ కసిరెడ్డితో కలిసి హవాలా నెట్‌వర్క్ రూపొందించటంలో, వారు వసూలు చేసిన మొత్తాల్ని 'బిగ్‌బాస్'కు చేర్చటంలో ఆయనే కీలక పాత్ర పోషించారని తేల్చింది. పలు డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని సొంత బ్రాండ్ల మద్యం తయారు చేయించి లబ్ధి పొందటమే కాకుండా, ముడుపుల సొత్తులో ప్రతి నెలా రూ.5 కోట్ల చొప్పున వాటాగా పొందారని దర్యాప్తులో వెల్లడైంది. వీటన్నింటికీ కీలక ఆధారాలు లభ్యమవటంతో ఆయన్ను అరెస్టు చేశారు. ఆదివారం కోర్టులో హాజరుపరచనున్నారు. మిథున్‌రెడ్డితో కలిపితే ఈ కేసులో అరెస్టైన నిందితుల సంఖ్య 12కు చేరింది.

దారులన్నీ మూసుకుపోవటంతో..

మద్యం కుంభకోణంలో తన ప్రమేయం బయటపడిందని తెలియగానే మిథున్‌రెడ్డి మార్చి నెలలో ముందస్తు (మిగతా 5లో)

జగన్ అండ.. తండ్రి అధికారం.. మిథున్‌రెడ్డి దోపిడీ!

ఆయన కనుసన్నల్లోనే మద్యం, ఇసుక, గనుల సిండికేట్లు

ప్రకృతి సంపదను చెరబట్టి.. ప్రభుత్వ భూముల కబ్జా

ఐదేళ్లలో పెద్దిరెడ్డి కుటుంబానికి రూ.6 వేల కోట్ల కాంట్రాక్టులు

3లో

ఛార్జ్‌షీట్‌లో జగన్ పేరు

మద్యం కుంభకోణం కేసులో పలుచోట్ల ప్రస్తావించిన సిట్



- దోపిడీకి వీలుగా నూతన మద్యం విధానం రూపకల్పన సహా పలు అంశాల్లో మాజీ సీఎం పేరు ప్రస్తావన
- కొత్తగా మరో 8 మంది నిందితులు
- 16 మంది పాత్రపై అభియోగాలు
- 305 పేజీలతో అభియోగపత్రం.. వేల కొద్దీ అనుబంధ పత్రాలు
- మనీ ట్రయల్ వివరాలు పొందుపరిచిన సిట్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు శనివారం సాయంత్రం ప్రాథమిక అభియోగ పత్రం (ప్రిలిమినరీ ఛార్జ్‌షీట్) దాఖలు చేశారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేరును దీనిలో పలుమార్లు ప్రస్తావించారు. ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా నూతన మద్యం విధానం రూపకల్పన, తదనుగుణంగా తీసుకున్న విధాన నిర్ణయాలు, నేరపూరిత కుట్ర, దాని అమలు, ముడుపుల సొమ్ము ఎలా వసూలు చేశారు? ఎలా మళ్లించారు? ఎక్కడికి మళ్లించారు అనే అంశాలను ఛార్జ్‌షీట్‌లో సమగ్రంగా వివరిస్తూ.. ఆయా సందర్భాల్లో కొన్ని చోట్ల జగన్‌మోహన్‌రెడ్డి పేరు ప్రస్తావించారు. అయితే ఈ అభియోగపత్రంలో ఆయన్ను నిందితుడిగా చేర్చలేదు. (మిగతా 5లో)


రాజకీయాల్లో మలినాలు తొలగించాలి



- నేరపూరిత నేతలు అవసరమా? మనం అడ్డుకోలేమా?
- ఆగస్టు 15 నాటికి సచివాలయం ప్లాస్టిక్ రహితం.. అక్టోబరుకు మున్సిపాలిటీల్లో
- తిరుపతి 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

6లో

లోపలి పేజీల్లో



ఆధ్యాత్మికత అంటే ప్రకృతితో అనుబంధం

పట్టణీకరణకు ప్రత్యామ్నాయంగా మొక్కల పెంపకం

పచ్చదనంతోనే ప్రశాంతత

'ఈటీవీ భారత్' ముఖాముఖిలో రామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేశ్ డి.పటేల్

గ్రీన్ హైడ్రోజన్‌పై పెట్టుబడులు పెరిగాయి

త్వరలో ఏపీ గ్రీన్ హైడ్రోజన్ అసోసియేషన్ ఏర్పాటు

ఘనంగా ముగిసిన సమిట్-2025

పది లక్షల ఉద్యోగాలకు ఎంవోయూలు పూర్తి

ఏపీకి భారీగా తరలివస్తున్న కంపెనీలు: మంత్రి లోకేశ్

గన్నవరంలో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ ప్రారంభం

భారత్, పాక్ ఘర్షణలో 5 జెట్లు కూలాయ్



- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి
- ఏ దేశానివో చెప్పని అగ్ర రాజ్యాధినేత
- ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి: కాంగ్రెస్

రూ.1,147 కోట్ల గ్రీన్‌ల్యామ్ పెట్టుబడులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా మేనకూరు పారిశ్రామికవాడలో గ్రీన్‌ల్యామ్ కంపెనీ రూ.1,147 కోట్లతో అదనపు పరిశ్రమ ఏర్పాటుకు.. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఏపీఐపీసీ) ఆమోదం తెలిపింది. మూడేళ్ల కిందటే కంపెనీ తమ పరిశ్రమను నెలకొల్పి ఉత్పత్తులు ప్రారంభించింది. దాని సామర్థ్యం పెంచుకునేందుకు రూ.1,147 కోట్ల పెట్టుబడులతో ముందుకు వచ్చింది. దాని కోసం 65 ఎకరాలను కేటాయించేందుకు ఏపీఐఐసీ సన్నాహాలు చేస్తోంది. దీని ద్వారా 1,475 ఉద్యోగాలు లభించనున్నాయి. గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్‌లోని రాష్ట్రాల్లోనూ గ్రీన్‌ల్యామ్ కంపెనీలున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానం మేరకు తమ కంపెనీ కార్యకలాపాలను విస్తృతం చేసింది. పూర్తిగా కలపతో తయారవుతున్న తమ ఉత్పత్తులకు డిమాండు పెరగడంతో అదనపు పరిశ్రమ ఏర్పాటుకు గ్రీన్‌ల్యామ్ శ్రీకారం చుట్టింది.

'హరిహర వీరమల్లు' టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 24న పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది. సినిమా విడుదలైన మొదటి రెండు వారాలు రేట్లు పెంచేందుకు అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చిత్ర నిర్మాత కోరగా.. మొదటి పది రోజులకే ధరలు పెంచడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. జులై 24 నుంచి ఆగస్టు 2 వరకూ పెంచిన ధరలు అమల్లో ఉంటాయి. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో లోయర్ క్లాస్ సీటుకు జీఎస్టీతో కలిపి రూ.వంద, అప్పర్ క్లాస్‌పై ఒక్కో సీటుకు రూ.150 (జీఎస్టీతో కలిపి) పెంచుకునే వెసులుబాటు కల్పించింది. మల్టీప్లెక్స్‌లలో రూ.200 (జీఎస్టీతో కలిపి) వరకు పెంచేందుకు అనుమతిచ్చింది. 23న (విడుదలకు ముందురోజు) రాత్రి 9 గంటలకు పెయిడ్ ప్రీమియర్‌కూ అనుమతిచ్చింది. ఈ టికెట్ ధర రూ.600(జీఎస్టీ అదనం)గా నిర్ణయించింది.

ఐటీసీ కంపెనీ గోదాములో భారీ అగ్ని ప్రమాదం


గోదాములో ఎగసిపడుతున్న మంటలు

విశాఖపట్నం (ఆనందపురం), న్యూస్‌టుడే: విశాఖ జిల్లా ఆనందపురం మండలం గండిగుండం సమీపంలోని ఇండియా టొబాకో కంపెనీ లిమిటెడ్ (ఐటీసీ)కు చెందిన గోదాములో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కంపెనీ ఉత్పత్తులు పెద్దమొత్తంలో దగ్ధమయ్యాయి. స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారుల కథనం మేరకు.. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో గోదాము మూసివేసిన గంట తర్వాత సిగరెట్లు, న్యూడిల్స్, అగరబత్తులు నిల్వ ఉంచిన ప్రాంతం నుంచి పొగ రావడాన్ని సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. 40 నిమిషాల్లోనే అగ్నిమాపక సిబ్బంది చేరుకొనే అప్పటికే మంటల ఉద్ధృతి పెరగడంతో ఇతర ప్రాంతాల నుంచి మరో 8 శకటాలు వచ్చాయి. సుమారు 8 గంటల పాటు మంటలను అదుపు చేస్తూనే ఉన్నారు. ఐటీసీ సంస్థ దేశవిదేశాల్లో తయారు చేసిన ఉత్పత్తులను గండిగుండం గోదాములో నిల్వ చేసి ఒడిశాతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లోని సంస్థ ప్రధాన డీలర్లకు పంపిణీ చేస్తున్నారు. ఆరేళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ గోదాములో 20 మంది కంపెనీ సిబ్బంది, 45 మంది రోజువారీ కూలీలు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన జాగ్రత్తలు సరిగా తీసుకోలేదని అధికారులు గుర్తించారు. ప్రమాదానికి కారణాలపై ఆరా తీస్తున్నారు.

ఇంటి నుంచే రిజిస్టర్ పోస్టు బుకింగ్

తపాలా శాఖలో 22 నుంచి అమల్లోకి..

ఈనాడు, ఏలూరు, భీమవరం, గునుపూడి: ఇక పై ఇంటి నుంచే రిజిస్టర్ పోస్టు బుకింగ్ సేవలతో తపాలా శాఖ ప్రజల ముంగిటకు రానుంది. ఇప్పటి వరకు రిజిస్టర్ పోస్టు, స్పీడ్ పోస్టు వంటివి చేయాలంటే వినియోగదారులు తపాలా కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ నెల 22 నుంచి ఇళ్ల వద్దనే సిబ్బంది వచ్చి, వాటిని సేకరించి బట్వాడా చేసేలా ఆ శాఖ సన్నద్ధమవుతోంది. దీనికోసం అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0లో భాగంగా ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెడుతున్నారు. దాన్ని డౌన్‌లోడ్ చేసుకుని సేవల కోసం సిబ్బందికి రిక్వెస్ట్ పంపితే.. ఆ మేరకు సేవలందించేలా చర్యలు తీసుకుంటారు. రూ.500 లోపు విలువైన ఆర్టికల్స్‌ను రిజిస్టర్, స్పీడ్ పోస్టులో పంపాలనుకునే వారు వాట్సాప్ చాట్ ద్వారా తపాలా శాఖను సంప్రదించవచ్చు. ఆ వెంటనే వినియోగదారుడి ఫోన్‌కు బార్‌కోడ్ నంబరుతో పాటు ఓటీపీ పంపుతారు. తరువాత ఇంటికి వచ్చే సిబ్బందితో బార్‌కోడ్, ఓటీపీ వివరాలు సరిచూసుకొని ఆర్టికల్స్ వారికిస్తే సరిపోతుంది. దీనికి సేవా రుసుము ఉండదు. రూ.500కు పైగా విలువ ఉన్న వాటికి మాత్రం నిర్దేశించిన రుసుములు చెల్లించాల్సి ఉంటుందని తపాలా శాఖ ఏలూరు ఎస్పీ శ్రీకర్‌బాబు తెలిపారు. అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0లో భాగంగా క్లౌడ్ టెక్నాలజీకి ప్రస్తుత డేటాను అనుసంధానించడానికి ఈ నెల 21న నో ట్రాన్సాక్షన్ డేగా ప్రకటించారని ఆయన చెప్పారు.

భారత్, పాక్ ఘర్షణలో 5 జెట్లు కూలాయ్

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి
- ఏ దేశానివో చెప్పని అగ్ర రాజ్యాధినేత
- మోదీ సమాధానం చెప్పాలి: కాంగ్రెస్

వాషింగ్టన్: భారత్, పాకిస్థాన్ మధ్య మే నెలలో జరిగిన ఘర్షణలో 5 యుద్ధ విమానాలు (ఫైటర్ జెట్లు) కూలిపోయాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే అవి ఏ దేశానికి సంబంధించినవో స్పష్టంగా వెల్లడించలేదు. శుక్రవారం శ్వేతసౌధంలో రిపబ్లికన్ సెనేటర్లకు విందు ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'భారత్, పాక్ మధ్య ఘర్షణ జరిగింది. ఆ సమయంలో 5 యుద్ధ విమానాలు కూలిపోయాయని నేను అనుకుంటున్నా. రెండూ అణ్వాయుధ సామర్థ్యంగల దేశాలు. వాణిజ్యం ద్వారా సమస్యను పరిష్కరించగలిగాం. మీకు వాణిజ్య ఒప్పందం కావాలనుకుంటే ఆయుధాలను (అణ్వాయుధాలు కూడా) ప్రయోగించడాన్ని ఆపాలని స్పష్టంగా చెప్పాం' అని పేర్కొన్నారు. అయితే ఏ దేశానికి చెందిన విమానాలు కూలాయి.. ఎవరు కూల్చారన్న అంశాలపై ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు ఈ అంశంపై భారత్ వెంటనే స్పందించలేదు. అయితే గతంలోనే విమానాలు కోల్పోయిన విషయాన్ని అంగీకరించింది. అయితే ఎన్ని కోల్పోయిందో చెప్పలేదు. 6 యుద్ధ విమానాలను కూల్చామని పాకిస్థాన్ ప్రచారం చేసుకుంది. కానీ ఆధారాలను చూపలేకపోయింది. అప్పట్లోనే పాక్ వాదనను భారత్ ఖండించింది.

దేశానికి వాస్తవం తెలియాలి: రాహుల్

దిల్లీ: ట్రంప్ వ్యాఖ్యలపై పార్లమెంటు సమావేశాల్లో ప్రధాని మోదీ తప్పక సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండు చేసింది. 'మోదీజీ.. ఐదు జెట్లు కూలడంపై అసలు వాస్తవమేమిటి.. నిజమేమిటో తెలుసుకునే హక్కు దేశానికి ఉంది' అని లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ 'ఎక్స్'లో స్పష్టం చేశారు. దీనిపై మోదీ తప్పకుండా సమాధానం చెప్పాలి' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ డిమాండు చేశారు.

నీట్ కౌన్సెలింగ్‌పై ఉచిత వెబినార్

వైద్యవిద్యలో ప్రవేశం కోసం నిర్వహించే 'నీట్ కౌన్సెలింగ్'పై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అభ్యర్థుల అవగాహన కోసం ఈనాడు- వసుధ, శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ సంయుక్తంగా ఆన్‌లైన్‌లో ఉచిత వెబినార్‌ను జూమ్ ప్లాట్‌ఫామ్‌పై నిర్వహించనున్నాయి.

సమయం: ఈ నెల 20 (ఆదివారం) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.

కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (వరంగల్) వైస్ ఛాన్సలర్ డా. పి.వి. నందకుమార్‌రెడ్డి, డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (విజయవాడ) రిజిస్ట్రార్ డా. వేమిరెడ్డి రాధికారెడ్డి, అనుభవజ్ఞులైన అధ్యాపకులు పాల్గొంటారు. నీట్ కౌన్సెలింగ్ కీలక అంశాలు, రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ మెలకువలు, కాలేజీల ఎంపికలో జాగ్రత్తలు తదితర అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారు.

నీట్ కౌన్సెలింగ్‌కు హాజరవుతున్న అభ్యర్థులు, తల్లిదండ్రులతో పాటు కౌన్సెలింగ్ ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలనుకునేవారు ఎవరైనా ఈ వెబినార్‌లో ఉచితంగా పాల్గొనవచ్చు. వెబినార్‌లో భాగస్వాములు కావాలంటే...

20.7.2025 (ఆదివారం) నాడు...

- క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

లేదా

- https://bit.ly/NEET_AP_TG వెబ్‌లింక్ ఓపెన్ చేయండి.
- zoom id - 953 5620 4227 passcode - 037253 తో జాయిన్ కావచ్చు.

మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం లేదు

- నాస్కామ్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ కార్నిక్
- వైభవంగా గీతం డీమ్డ్ వర్సిటీ 16వ స్నాతకోత్సవం

ఈనాడు, సంగారెడ్డి: కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రపంచంలోనూ.. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం లేదని నాస్కామ్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ కార్నిక్ అన్నారు. శనివారం హైదరాబాద్ శివారు, సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన 16వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏఐ యుగంలో నిరంతర అభ్యాసం అవసరమని, తద్వారా యువత నిర్దేశిత రంగాల్లో పట్టుసాధించే వీలు కలుగుతుందని అన్నారు. గీతం వర్సిటీ అధ్యక్షుడు, ఏపీలోని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ.. పట్టాలు అందుకున్న వారంతా నిర్దేశించుకున్న సమున్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. గీతం వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎర్రోల్ డిసౌజా మాట్లాడుతూ.. సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కోవడానికి పరిశోధనలను విస్తృతం చేయాలని సూచించారు. వివిధ విభాగాలకు చెందిన 2002 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. తొలిసారి 100 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లు ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 32 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు.

ముగ్గురు విశిష్ట వ్యక్తులకు గౌరవ డాక్టరేట్లు

శాస్త్ర.. సాంకేతికత, ఆవిష్కరణ, సామాజిక సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేసిన అత్యుత్తమ కృషికి గుర్తింపుగా ముగ్గురు విశిష్ట వ్యక్తులకు గీతం గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. మౌలిక సదుపాయాల రంగంలో మార్గదర్శక శక్తిగా నిలిచి, గ్రామీణ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తూ ఆర్‌వీఆర్‌గా పేరొందిన ఆర్.వెంకటేశ్వరరావుకు డాక్టర్ ఆఫ్ లెటర్స్(డి.లిట్) ప్రదానం చేశారు. ఆయన నిర్మాణ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. జాతీయ, సామాజిక ప్రాముఖ్యం కలిగిన కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఎన్నో ఆయన్ను ఉన్నత స్థానంలో నిలిపాయి. తన సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని కుటుంబ సభ్యులుగా భావించి ఆరోగ్య సంరక్షణ బీమాను అందిస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఏపీలోని విజయనగరం జిల్లా జామి మండలం విజినిగిరిలో పాఠశాలను స్థాపించి 760 మంది పిల్లలకు నాణ్యమైన విద్యనందిస్తున్నారు.

- భారత దేశ రక్షణ, అంతరిక్ష సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో అణు ఇంజినీరింగ్, విధ్వంస రహిత మూల్యాంకనంలో చేసిన విశేష కృషికి ఇందిరా గాంధీ అణుపరిశోధనా కేంద్రం(ఐజీసీఏఆర్) పూర్వ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట్రామన్‌కు డాక్టర్ ఆఫ్ సైన్స్(డి.ఎస్సీ) ప్రదానం చేశారు.
- తక్కువ ఖర్చుతో రుతు రుమాలు(శానిటరీ ప్యాడ్) తయారీ యంత్రాన్ని కనుగొని ప్యాడ్ మాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన అరుణాచలం మురుగనాథంను డాక్టర్ ఆఫ్ లెటర్స్(డి.లిట్)తో సత్కరించారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి ఎం.భరద్వాజ, అదనపు ఉపకులపతులు ఆచార్య వై.గౌతంరావు, డి.ఎస్.రావు, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.


గీతం వర్సిటీ అధ్యక్షుడు శ్రీభరత్, వైస్ ఛాన్సలర్ ప్రొ.ఎర్రోల్ డిసౌజాల నుంచి గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న ఆర్.వెంకటేశ్వరరావు ● అరుణాచలం మురుగనాథం ● బి.వెంకట్రామన్ (కుడి నుంచి ఎడమకు)

గ్రీన్ హైడ్రోజన్‌పై పెట్టుబడులు పెరిగాయి

- త్వరలో ఏపీ గ్రీన్ హైడ్రోజన్ అసోసియేషన్ ఏర్పాటు
- ఘనంగా ముగిసిన సమిట్-2025

ఈనాడు, అమరావతి: త్వరలో అమరావతిని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా అభివృద్ధి పరచనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో.. ఏపీ గ్రీన్ హైడ్రోజన్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేయాలంటూ డిక్లరేషన్‌లో పొందుపరుస్తామని నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్‌బాబు వెల్లడించారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి తెలుపుతామని, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, పరిశ్రమల స్థాపన వంటి అంశాలపై ఏడాదికోసారి సమీక్షిస్తామని చెప్పారు. అమరావతిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జాతీయ గ్రీన్ హైడ్రోజన్ సమిట్-2025 శనివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల సమిట్‌లో చర్చించిన అంశాలు, పారిశ్రామికవేత్తలు చేసిన సూచనలపై డిక్లరేషన్ డ్రాఫ్ట్‌ను ప్రభుత్వానికి పంపినట్లు ఎస్‌ఆర్‌ఎం రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య నారాయణరావు తెలిపారు. అమరావతి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్ సోమవారం విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. డ్రాఫ్ట్‌లో పొందుపరిచిన అంశాలను వివరించారు.

ఆకట్టుకున్న సెషన్స్: సమిట్‌లో వర్ధమాన పరిశోధకులను ప్లీనరీ సెషన్స్ ఆకట్టుకున్నాయి. ప్రముఖ సంస్థల ప్రతినిధులు, ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, పలు దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు తమ అభిప్రాయాలను తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్‌పై ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు పెరిగాయని, ఉత్పత్తి, నిల్వ, రవాణా అంశాలపై ప్రతి యూనివర్సిటీలోనూ విస్తృతంగా పరిశోధనలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన నిపుణులను యూనివర్సిటీ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఎస్‌ఆర్‌ఎం ప్రొ వైస్‌ఛాన్సలర్ సతీష్‌కుమార్, సమిట్ కన్వీనర్ మారం పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


సమిట్‌లో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధన విద్యార్థులు, ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు, అధికారులు

వైకాపా రాష్ట్ర కార్యదర్శులుగా 51 మంది నియామకం

ఈనాడు, అమరావతి: వైకాపా రాష్ట్ర కార్యదర్శులుగా 51 మందిని నియమించారు. 17 లోక్‌సభ నియోజకవర్గాల నుంచి ముగ్గురి చొప్పున ఎంపిక చేశారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యతలను వీరికి అప్పగించనున్నట్లు వైకాపా కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. సంబంధిత ప్రాంతీయ సమన్వయకర్తలు, లోక్‌సభ నియోజకవర్గ పరిశీలకులకు వీరు సహాయకారిగా వ్యవహరిస్తారని తెలిపింది. అధికారంలో ఉన్నప్పుడు ఒక సామాజికవర్గానికే ప్రాధాన్యమిచ్చిన వైకాపా అధినాయకత్వం.. అధికారం కోల్పోయాక పార్టీ పదవుల్లోనూ అదే సామాజికవర్గానికి ప్రాధాన్యాన్ని కొనసాగించింది. ఇప్పుడు నియమించిన 51 మంది రాష్ట్ర కార్యదర్శుల్లోనూ 27 మంది అదే సామాజికవర్గానికి చెందినవారు ఉండడం గమనార్హం. కర్నూలు, నంద్యాల, అనంతపురం లాంటి జిల్లాల నుంచి ఎంపిక చేసినవారు పూర్తిగా ఆ సామాజిక వర్గం నుంచే ఉన్నారు.

'నేరాలు చేస్తూ ప్రజల ప్రాణాలు తీసే వారికి వైకాపా ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు ఓ గుణపాఠం' అని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. చట్టం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో సీఏలది కీలకపాత్ర

- 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ
- విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి సీఏలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచవ్యాప్త అవగాహన, ఏఐ ఆధారిత నైపుణ్యాలు కలిగి ఉండాలని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో గుంటూరులో శనివారం నిర్వహించిన 'స్ఫూర్తి మెగా సీఏ విద్యార్థుల' సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఏలు కేవలం సంఖ్యా విశ్లేషకులు మాత్రమే కాదు.. ఆర్థిక వృద్ధి చోదకులు అని పేర్కొన్నారు. పాలనా వ్యవస్థలో బడ్జెట్ ఆమోదం ఉన్న ప్రతి ప్రభుత్వ ఫైల్‌కు ఆడిటర్ల ఆమోదముద్ర అవసరమని వెల్లడించారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌తో మారనున్న రాష్ట్ర రూపురేఖలు

'వికసిత్ భారత్‌లో భాగంగా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలన్నది ప్రధానమంత్రి మోదీ ఆకాంక్ష. అందులో 2.4 ట్రిలియన్ డాలర్లు సాధించాలన్నది ఆంధ్రప్రదేశ్ లక్ష్యం. ఇది కఠినమైంది అయినప్పటికీ అసాధ్యం కాదు. దేశ ఆర్థికాభివృద్ధిలో ఏపీ ప్రస్తుత వాటా 4.85 శాతం కాగా.. 2047 నాటికి 6.67 శాతం ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోవడానికి భవిష్యత్తులో 15 శాతం వృద్ధిరేటు సాధించాల్సి ఉంటుంది. ఈ లక్ష్య సాధనలో చార్టర్డ్ ఎకౌంటెంట్లు కీలక పాత్ర వహించాల్సి ఉంటుంది' అని లోకేశ్ అభిప్రాయపడ్డారు. 'దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ వచ్చే జనవరిలో అమరావతిలో ఏర్పాటు కాబోతుంది. గతంలో జన్మభూమి, స్వయం సహాయక సంఘాలు, ఈ-గవర్నెన్స్, ఐటీ హబ్‌తో రాష్ట్ర చిత్రపటాన్ని మార్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీతో ఏపీ రూపురేఖలు మార్చబోతున్నారు' అని లోకేశ్ వివరించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, ఐసీఏఐ గుంటూరు బ్రాంచి ఛైర్మన్ చింతా రఘునందన్, కార్యదర్శి వనిమిరెడ్డి, సికాస ఛైర్మన్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో రఘునందన్, ఎమ్మెల్యే గల్లా మాధవి, ప్రసన్నకుమార్, ముప్పాళ్ల సుబ్బారావు, రాజశేఖర్, నరేష్

డిపాజిట్ల సేకరణకు 'స్నేహ'హస్తం.. చెల్లింపులకు రిక్తహస్తం!

- విశాఖలో రూ.100 కోట్లు సేకరించి బోర్డు తిప్పేసిన మ్యాక్స్
- సంస్థ డైరెక్టర్లు, ఉద్యోగుల అరెస్టు, 14 రోజుల రిమాండ్
- ప్రధాన నిందితుడు, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి శివభాగ్యారావు కోసం గాలింపు

విశాఖపట్నం(కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఆశయ సాధన పేరుతో కోఆపరేటివ్ సొసైటీ స్థాపించి వేల మంది నుంచి డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి కటికల శివభాగ్యారావు 2008లో స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ(స్నేహ మ్యాక్స్)ని విశాఖపట్నంలో స్థాపించారు. 12 శాతం వడ్డీ ఇస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులను, ఇతరులను నమ్మించి డిపాజిట్లు సేకరించారు. విశాఖ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 2,500 మంది నుంచి రూ.100 కోట్లు డిపాజిట్లుగా సేకరించారు. కొన్నాళ్ల పాటు సక్రమంగా వడ్డీ చెల్లించి ఆ తర్వాత క్రమంగా కార్యకలాపాలు తగ్గించుకుంటూ రావడంతో ప్రజలకు అనుమానం వచ్చింది. డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ ఖాతాదారులు డిమాండ్ చేసినా ఫలితం లేకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా సొంత ఆస్తులు కూడబెట్టుకున్నారని డైరెక్టర్లు, సిబ్బందితో కుమ్మక్కై ఖాతాదారులను ముంచేశారని ఉక్కు విశ్రాంత ఉద్యోగి ఎన్.బాలభాస్కరరావుతో పాటు మరో 10 మంది దువ్వాడ, ద్వారకానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి సంస్థ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, డైరెక్టర్లు గూడూరు సీతామహాలక్ష్మి, ఉండవల్లి శ్రీనివాసరావు, ఎల్.విశ్వేశ్వరరావు, మేనేజర్ రంగారావు, ఎకౌంటెంట్ ధనలక్ష్మిలను అరెస్టు చేశారు. గూడూరు సీతామహాలక్ష్మి అవయవదాన ఉద్యమకారిణి, విశ్రాంత ఉపాధ్యాయురాలు, సావిత్రీబాయి పులే ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్‌గా ప్రజలకు సుపరిచితం. సంస్థ ఛైర్మన్ శివభాగ్యారావు పరారీలో ఉన్నారు. ఇంకా 12 మంది కోసం పోలీసులు గాలిస్తున్నారు. అరెస్టు చేసిన వారిని నగరంలోని జిల్లా కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న లారీలు

గ్రానైట్ లారీలు ఆపితే తొక్కించేస్తాం

- అక్రమ రవాణా ముఠా బెదిరింపు
- పల్నాడు జిల్లాలో 14 లారీల పట్టివేత

దాచేపల్లి, న్యూస్‌టుడే: గ్రానైట్ అక్రమ రవాణా ముఠా రెచ్చిపోతోంది. ఏకంగా ప్రైవేటు సైన్యాన్ని నియమించుకుని, లారీలకు ఎస్కార్ట్‌గా పంపిస్తూ రాష్ట్ర సరిహద్దును దాటించేస్తోంది. ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టి యథేచ్ఛగా గ్రానైట్ తరలిస్తోంది. అడ్డుకుంటున్న అధికారులను బెదిరిస్తోంది. శనివారం తెల్లవారుజామున ప్రకాశం జిల్లా చీమకుర్తి నుంచి హైదరాబాద్ వైపు గ్రానైట్‌తో వెళుతున్న లారీలను గుర్తించి, పల్నాడు జిల్లా తంగెడ గ్రామం వద్ద వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేకాధికారులు అడ్డుకున్నారు. గ్రానైట్‌కు ఎలాంటి బిల్లులూ లేనట్లు గుర్తించారు. లారీలను అనుసరిస్తూ వచ్చిన ప్రైవేటు వ్యక్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. లారీలను అడ్డుకుంటే, వాటితోనే తొక్కించేస్తామంటూ బెదిరించారు. ఈలోగా మూడు లారీలు సరిహద్దు దాటి తెలంగాణలోకి వెళ్లిపోయాయి. వెంటనే అధికారులు ఆ శాఖ జాయింట్ కమిషనర్ గీతామాధురికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఆమె పల్నాడు జిల్లా ఎస్పీకి విషయం తెలిపి, బందోబస్తు కోరారు. దీంతో దాచేపల్లి పోలీసులు రంగ ప్రవేశం చేశారు. బిల్లులు లేకుండా గ్రానైట్ తరలిస్తున్న 14 లారీలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని నడికుడి మార్కెట్ యార్డుకు తరలించారు. దీనిపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులను వివరణ కోరగా.. గ్రానైట్ రవాణాకు బిల్లులు, ఇతర అనుమతులపై విచారణ చేస్తున్నామన్నారు. ప్రైవేటు సైన్యం.. అధికారులను బెదిరించిన విషయంపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రహం అనుగ్రహం


20-7-2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం
దశమి: ఉ. 10-55 తదుపరి ఏకాదశి
కృత్తిక: రా. 10-36 తదుపరి రోహిణి
వర్జ్యం: ఉ. 11-25 నుంచి 12-54 వరకు
అమృత ఘడియలు: రా. 8-21 నుంచి 9-51 వరకు
దుర్ముహూర్తం: సా. 4-50 నుంచి 5-42 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.5.38; సూర్యాస్తమయం: సా.6.34

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	39.5	25.5
తాడేపల్లిగూడెం	37.8	27.1
ఒంగోలు	36.7	28.0
నెల్లూరు	36.6	28.0
విజయవాడ	36.4	26.0
నరసాపురం	36.2	28.2
గుంటూరు	35.0	26.0
విజయనగరం	34.0	26.0
విశాఖపట్నం	33.4	27.2
తిరుపతి	33.4	24.8
హైదరాబాద్	32.6	22.4
శ్రీకాకుళం	32.0	27.0
కడప	32.0	26.0
కర్నూలు	31.8	24.0
అనంతపురం	31.7	23.5

ఇదీ సంగతి!



జగన్ అండ.. తండ్రి అధికారం.. మిథున్‌రెడ్డి దోపిడీ!

- ఆయన కనుసన్నల్లోనే మద్యం, ఇసుక, గనుల సిండికేట్లు
- ఐదేళ్లలో పెద్దిరెడ్డి కుటుంబానికి రూ.6 వేల కోట్ల కాంట్రాక్టులు

ఈనాడు, కడప: వైకాపా ప్రభుత్వంలో నంబర్ 2గా వ్యవహరించిన నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి.. జగన్‌తో వారి సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని చెలరేగిపోయారు. మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో యథేచ్ఛగా అక్రమాలు సాగించారు. ప్రకృతి వనరుల్ని, ప్రభుత్వ భూముల్ని చెరబట్టారు. ఎర్రచందనం అక్రమ రవాణాదారులకు మిథున్‌రెడ్డి అండదండలు అందించారన్న ఆరోపణలున్నాయి. ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి ఇంటికి మిథున్‌రెడ్డి తరచూ వెళ్లి వచ్చేవారు. పీలేరు సరిసరాల్లో రూ.400 కోట్ల ప్రభుత్వ భూముల్ని అనుచరులకు పంచగా, ఇది అక్రమమని లోకాయుక్త నిర్ధారించింది. పీలేరు సమీపంలో మరో రూ.100 కోట్ల విలువైన ఏపీఐఐసీ భూములనూ ఇళ్లపట్టాల పేరుతో ఆయన అనుచరులకు పంచేయడం వివాదాస్పదమైంది.

రైతుల శ్రమ దోపిడీ.. గనులపై గుత్తాధిపత్యం

★ మిథున్‌రెడ్డి కుటుంబానికి డెయిరీ, మామిడి గుజ్జు పరిశ్రమలున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో పాడి, మామిడి రైతులకు తక్కువ ధరలు చెల్లించి దోచుకున్నట్టు ఆరోపణలున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలో ఇతర డెయిరీలు పాలసేకరణ చేయకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. తామిచ్చిన ధరకే పాలు విక్రయించాలని రైతుల్ని భయపెట్టి, తక్కువ ధర చెల్లించి దోపిడీకి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు.

★ తండ్రి గనుల శాఖ మంత్రిగా ఉండటంతో ఆయన తరపు వ్యవహారాలు మిథున్‌రెడ్డి కనుసన్నల్లోనే జరిగేవి. రాష్ట్రంలో ఇసుక, మద్యం, గనుల సిండికేట్లను ఆయనే నడిపించేవారన్న ఆరోపణలున్నాయి. ఐదేళ్లపాటు రాష్ట్రంలోని గనులు, ఖనిజ సంపదపై గుత్తాధిపత్యం సాగించారు.

★ రాజంపేట, తంబళ్లపల్లె, రైల్వేకోడూరు ప్రాంతాల్లోని రేవుల నుంచి ఇసుక కొల్లగొట్టారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాలకు వారి టిప్పర్లలోనే అక్రమంగా రవాణా సాగించారన్న ఆరోపణలున్నాయి.

★ మంగంపేట బెరైటీస్ గనుల్లో తవ్వకాలు ఐదేళ్లపాటు మిథున్‌రెడ్డి కనుసన్నల్లోనే జరిగాయి. ఎంత తవ్వారో లెక్కాపత్రం లేవు.

ఐదేళ్లూ అన్ని కాంట్రాక్టులూ పీఎల్ఆర్‌కే

★ జగన్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు రాజంపేట లోక్‌సభ స్థానం పరిధిలో ఏ కాంట్రాక్ట్ అయినా మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ కంపెనీకి వెళ్లాల్సిందే. ఐదేళ్లలో సుమారు రూ.6,000 కోట్ల కాంట్రాక్టులను పీఎల్ఆర్ కంపెనీ దక్కించుకుంది.

★ అన్నమయ్య జిల్లాలోని ముదివేడు, చిత్తూరు జిల్లాలోని నేతిగుంటపల్లి, ఆవులపల్లిలో మూడు భారీ జలాశయాల నిర్మాణ పనుల్ని జగన్ సర్కారు పీఎల్ఆర్ కంపెనీకి రూ.2,244.50 కోట్లతో కట్టబెట్టింది. రైతులకు పరిహారం ఇవ్వకుండా భూముల్ని స్వాధీనం చేసుకుని, అనుమతులు లేకుండానే జలాశయాల నిర్మాణం చేపట్టారు.

★ చివరకు ఎన్జీటీకి కొందరు ఫిర్యాదు చేయడంతో పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టినందుకు రూ.100 కోట్ల జరిమానా విధించింది.

★ వైఎస్సార్ కడప జిల్లాలో కాలేటివాగు ప్రాజెక్టును పీఎల్ఆర్ కంపెనీ అర్ధంతరంగా వదిలేసింది.

తిరుపతి విమానాశ్రయంలో వీరంగం

తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యాక మిథున్‌రెడ్డి 2015లో తిరుపతి విమానాశ్రయంలో వీరంగం సృష్టించారు. పాస్ చూపించాలని కోరినందుకు, చెవిరెడ్డి భాస్కరరెడ్డితో కలిసి విమానాశ్రయాధికారిపై చేయి చేసుకున్నారు. బలవంతంగా విమానాశ్రయంలోకి ప్రవేశించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కేంద్రంలో క్రియాశీలంగా వ్యవహరించిన మిథున్‌రెడ్డి.. నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. నియోజకవర్గం మీదుగా వెళ్లే కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టును పులివెందుల మీదుగా మళ్లించే ప్రయత్నాన్ని అడ్డుకోలేకపోయారు. మిథున్‌రెడ్డి రాజంపేట నుంచి లోక్‌సభకు ఎన్నికవడం ఇది మూడోసారి. ఇప్పటివరకు నియోజకవర్గానికి చెప్పుకోదగ్గ ప్రాజెక్టు ఒక్కటీ తేలేదు.

జేపీ నడ్డాతో ఏపీ భాజపా అధ్యక్షుడు మాధవ్ భేటీ



పీవీఎన్ మాధవ్‌ను అభినందిస్తున్న భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

ఈనాడు, దిల్లీ: భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఆంధ్రప్రదేశ్ భాజపా నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శనివారం దిల్లీలో భేటీ అయ్యారు. రాష్ట్ర భాజపా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి దిల్లీకొచ్చిన ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పార్టీ సంస్థాగత నిర్మాణంపై చర్చ జరిగినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమిని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ఇరువురు నేతలు సమాలోచనలు జరిపినట్లు సమాచారం. అధ్యక్షుడి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మాధవ్ ఓ ప్రకటనలో వెల్లడించారు.





జెండా ఊపి తలసీమియా రన్‌ను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి, కరణం మల్లీశ్వరి, వంగలపూడి అనిత. చిత్రంలో సంగీత దర్శకుడు తమన్ ★ రన్‌లో పాల్గొన్న ప్రజలు

ఆ పిల్లల బాధను చూసి చలించిపోయా!

- ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి
- విశాఖ సాగర తీరంలో 'తలసీమియా రన్'
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

ఈనాడు, విశాఖపట్నం: 'హైదరాబాద్‌లోని రక్తనిధి కేంద్రంలో జరిగే ఎన్టీఆర్ ట్రస్ట్ సమావేశాలకు వెళ్లిన సమయంలో చాలా మంది తల్లులు తలసీమియా బారిన పడిన తమ పిల్లలతో రక్తం కోసం ఎదురు చూసేవారు. ఏమైనా సహాయం చేయగలరా అని అడిగేవారు. ఆ పిల్లల బాధను చూసి చలించిపోయి తలసీమియాపై అవగాహన కల్పించాలనే ఆలోచన వచ్చింది. అందులో భాగంగా గత ఫిబ్రవరిలో విజయవాడలో యుఫోరియా మ్యూజికల్ నైట్ నిర్వహించాం' అని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. పాఠశాలకు వెళ్లాల్సిన చిన్నారుల సగం జీవితం రక్తనిధి కేంద్రాలకు రావడం, రక్త మార్పిడికే సరిపోతుందని, ఊపిరి తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని ఆమె వాపోయారు. విశాఖ సాగర తీరంలో శనివారం సాయంత్రం నిర్వహించిన తలసీమియా రన్ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'హిమోగ్లోబిన్ తక్కువగా ఉండే తలసీమియా బాధితులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రక్తం అందిస్తున్నాం. ఈ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే మా లక్ష్యం. 7 వేల మంది రన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమానికి రావాలని ప్రముఖ క్రీడాకారిణి కరణం మల్లీశ్వరిని మా బృంద సభ్యులు వెళ్లి అడగ్గా, ఆమె అంగీకరించారు. తలసీమియా బాధితుల కోసం సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అందించిన నిధి నుంచి కొంత మొత్తంతో 25 పడకలతో కేంద్రం ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు 8 లక్షల మందికి పైగా రక్తాన్ని అందించాం. 15 వేలకు పైగా 'సంజీవని' ఆరోగ్య శిబిరాలు నిర్వహించి.. లక్షల మందికి వైద్య సేవలందించాం' అని వివరించారు. చిన్నారుల రక్త మార్పిడికి ఫిల్టర్లు, రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు ఖర్చయ్యే మందులు అందజేస్తున్నామని చెప్పారు. దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమానికి వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి కరణం మల్లీశ్వరి, హోంమంత్రి వంగలపూడి అనిత, సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్, ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ అధికారి గోపి తదితరులు హాజరయ్యారు. వివిధ అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులను ఈ సందర్భంగా సత్కరించారు. తమన్ నిర్వహించిన మ్యూజికల్ నైట్ అలరించింది.

మాజీ మంత్రి ముద్రగడకు అస్వస్థత

కిర్లంపూడి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మధుమేహం తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవడం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆయన్ను ఆసుపత్రిలో చేర్చారు. నాణ్యమైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించేందుకు యోచిస్తున్నట్లు సమాచారం.

కరుణానిధి పెద్ద కుమారుడు ఎంకే ముత్తు కన్నుమూత



చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి పెద్ద కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ సోదరుడు ఎంకే ముత్తు (77) అనారోగ్యంతో కన్నుమూశారు. కరుణానిధి, పద్మావతి దంపతులకు 1948లో ఎంకే ముత్తు జన్మించారు. 1970లో తమిళ చిత్రసీమకు నటుడిగా పరిచయమైన ఆయన.. పిళ్లైయో పిళ్లై, సమైయల్‌కారన్, అణైయా విళక్కు, ఇంగేయుం మనిదర్‌గళ్ తదితర సినిమాల్లో నటించారు. ఆయన నటించిన చిత్రాల్లో పాటలు కూడా పాడారు. డీఎంకే కార్యక్రమాల్లో పార్టీ విధానాలను వివరిస్తూ పాటలు ఆలపించారు. ఎంజీఆర్‌కు పోటీగా వెండితెరపైకి వచ్చారనే అభిప్రాయాలుండేవి. అయితే.. ఎంకే ముత్తు నటించిన 'పిళ్లైయో పిళ్లై' షూటింగ్‌ను ఎంజీఆర్ క్లాప్ కొట్టి ప్రారంభించడం గమనార్హం. 2006లో మాట్టుతావణి అనే సినిమాలో దేవా సంగీతంలో ఎంకే ముత్తు పాట పాడారు. అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం ఉదయం కన్నుమూశారు.

బాలిక సజీవ దహనానికి యత్నం

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఒడిశాలో దారుణం చోటు చేసుకుంది. పూరీ జిల్లా బలంగ ఠాణా పరిధిలోని నువా గోపాల్‌పూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు 16 ఏళ్ల బాలికపై కిరోసిన్ పోసి సజీవ దహనానికి యత్నించారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. అదే ప్రాంతానికి చెందిన బాలిక శనివారం తన స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తోంది. గ్రామ శివారులోని భార్గవి నదికి చేరువగా వచ్చేసరికి ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు దుండగులు ఆమెపై కిరోసిన్ పోసి నిప్పుపెట్టి పరారయ్యారు. ఆర్తనాదాలు చేస్తూ ఆమె సమీప గ్రామానికి పరుగులు తీసింది. గ్రామస్థులు మంటలు ఆర్పి, బలంగ పోలీసుల సాయంతో భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. ఆసుపత్రిలో ఎయిమ్స్ సంచాలకుడు ఆచార్య అశుతోష్ బిశ్వాస్ విలేకరులతో మాట్లాడుతూ.. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉందని, 72 గంటల వరకు ఏమీ చెప్పలేమని తెలిపారు. పోలీసులు.. మెజిస్ట్రేట్ సమక్షంలో బాధితురాలి వాంగ్మూలం నమోదు చేశాక, ఆమె కోమాలోకి వెళ్లిపోయింది.

కామవాంఛతో మృగంలా మారాడు

- యజమాని భార్యను హత్యచేసి మృతదేహంపై అత్యాచారం
- ఇలాంటి కేసులో నిందితునికి బెయిలివ్వలేం
- పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు



ఈనాడు, అమరావతి: యజమాని భార్యను హత్యచేసి, మృతదేహంతో లైంగిక వాంఛ తీర్చుకున్న కేసులో నిందితుడికి బెయిలిచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. బెయిలు పిటిషన్‌ను కొట్టేసింది. పోలీసులు దర్యాప్తు పూర్తి అభియోగపత్రం(ఛార్జిషీట్) దాఖలు చేసినంత మాత్రాన కేసు ఆరోపణల తీవ్రత తగ్గిపోదని స్పష్టీకరించింది. 'ప్రాథమిక సాక్ష్యాధారాలను పరిశీలిస్తే... యజమాని ఇంట్లోనే నివాసముంటూ ఆయన భార్యను హత్యచేసి నిందితుడు నమ్మకద్రోహానికి పాల్పడినట్లు కనిపిస్తోంది. కామవాంఛతో ఆమె పట్ల నిందితుడు మృగంలా వ్యవహరించాడు. ఆమె ప్రతిఘటించడం, విషయం బయటకు చెబుతుందనే కారణాలతో అత్యంత దారుణంగా హతమార్చాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం ఈ ఘోరానికి ఒడిగట్టాడు. హత్య అనంతరం మృతదేహంతో లైంగిక వాంఛ తీర్చుకున్నాడు' అని హైకోర్టు మండిపడింది. వాస్తవాలన్నీ విచారణ కోర్టులో తేలాల్సి ఉందని గుర్తుచేసింది. చాలా రోజులుగా కారాగారంలో ఉన్నాడన్న కారణంగా ఇలాంటి కేసులలో నిందితుడు బెయిలు పొందేందుకు అనర్హుడని తేల్చిచెప్పింది. నేర తీవ్రత, నేరానికి పాల్పడిన విధానం, సమాజంపై ప్రభావం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని.. బెయిలివ్వలేమంటూ నిందితుడి పిటిషన్‌ను కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఇటీవల ఈమేరకు తీర్పు ఇచ్చారు.

★ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో ఓ వ్యక్తి కొంతకాలంగా ఫిస్టులా ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన నయాన్ బిస్వాస్ కాంపౌండర్‌గా పనిచేస్తూ... డాక్టర్ కుటుంబంతో కలిసి నివసించేవాడు. డాక్టర్ భార్యపై కన్నేసిన బిస్వాస్ 2024 డిసెంబరు 31న అర్ధరాత్రి దాటాక ఆమె నిద్రిస్తున్న గదిలోకి వెళ్లి అత్యాచారానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో తలపై కొట్టి దారుణంగా హత్యచేశాడు. మృతదేహాన్ని చీకటి ప్రదేశంలోకి లాక్కెళ్లి లైంగిక వాంఛ తీర్చుకున్నాడు. మృతురాలి భర్త ఫిర్యాదు ఆధారంగా కావలి 1వ పట్టణ పోలీసులు నయాన్ బిస్వాస్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ వేశాడు. దర్యాప్తు అధికారి (ఐఓ) ప్రాథమిక అభియోగపత్రాన్ని దాఖలు చేసిన నేపథ్యంలో బెయిలు ఇవ్వాలని కోరాడు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. ఇలాంటి కేసులలో బెయిలిస్తే సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. నేర తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బెయిలు పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు ప్రకటించారు.

కనిపెంచిన తల్లిదండ్రులనే కడతేర్చాడు

- మతిస్థిమితం కోల్పోయిన కుమారుడి చేతిలో తల్లిదండ్రుల హత్య



సన్యాసిరెడ్డి బోడమ్మ నిందితుడు మల్లురెడ్డి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మతిస్థిమితం కోల్పోయిన కుమారుడు.. తల్లిదండ్రులిద్దరి ప్రాణాలు తీసిన దారుణం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం తుర్రవాడలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ విషయం ఊరంతా తెలిసి శనివారం ఉదయం గ్రామస్థులు అక్కడికి వచ్చేవరకూ నిందితుడు మృతదేహాల వద్దే కూర్చున్నాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చావడికోట పంచాయతీ తుర్రవాడకు చెందిన అందాల సన్యాసిరెడ్డి (56), బోడమ్మ (53) దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. చిన్న కుమారుడు, కుమార్తె ఊరిలో ఉంటుండగా, పెద్ద కుమారుడు మల్లురెడ్డితో కలిసి దంపతులిద్దరూ ఊరికి దూరంగా పోడు వ్యవసాయం చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. వివాహం అయ్యాక మల్లురెడ్డి మతిస్థిమితం కోల్పోవడంతో భార్య వదిలేసి వెళ్లిపోయింది. ఆకుమామిడికోటలో శుక్రవారం వారపు సంతకు వెళ్లి ఇంటికొచ్చిన తల్లిదండ్రులతో డబ్బు కోసం మల్లురెడ్డి గొడవపడ్డాడు. వివాదం సద్దుమణిగిన తర్వాత రాత్రి సమయంలో ఇనుప రాడ్డుతో సన్యాసిరెడ్డి, బోడమ్మ తలలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై వారిద్దరూ అక్కడే ప్రాణాలు వదిలారు. శనివారం ఉదయం అక్కడకు వచ్చిన చిన్న కుమారుడు, కుమార్తె.. విగత జీవులుగా ఉన్న తల్లిదండ్రులను చూసి విలపించారు.

ఈనాడు

మనసుంటే...

'కశాఘాతం' అంటే కొరడాదెబ్బ. జాతీయాలు నానుడులు లోకోక్తులు సూక్తులు- ధ్వనిరీత్యా చాలామటుకు మనసుపై కశాఘాతాలే! ఉదాహరణకు 'కయ్యానికి కాలుదువ్వే గుర్రానికి బండిలాగే సహనం ఉండదు- బండి నడిపే గుర్రానికి కాలుదువ్వే సమయం ఉండదు' అని సామెత! ఇది చిన్న వాక్యం కాదు- గొప్ప వ్యాఖ్యానం. మనిషి సోమరితనంపై తీవ్ర కశాఘాతం. బద్ధకం అలసత్వం క్రియారాహిత్యం... అంతెందుకు ఒళ్లొంగకపోవడానికి చెందిన లక్షణాలన్నీ సోమరితనం పాదులోవే. 'అది కలియుగ లక్షణం' అంది భాగవతం. 'అలసులు మందబుద్ధియుతులు... సుకర్మలు ఎయ్యవి చేయజాలరీ కలియుగమందు మానవులు-' అని ఏనాడో చెప్పింది. అయితే మనిషి తెలివైనవాడు. అలసత్వానికి విశ్రాంతి అనే ముసుగు తొడగడం నేర్చినవాడు. ఆత్మవంచనకు వెనుకాడనివాడు. భారవి అంతటి మహాకవి తన కిరాతార్జునీయంలో ఏం చెప్పాడు?... 'సహసా విదధీత నక్రియామ్...' ఏ పనినీ తొందరపడి చేయరాదన్నాడు- అంటూ వక్రభాష్యం చెప్పగలడు. అందుకే మనిషి ఆలోచనల స్థాయిలోనే అలసిపోతాడు.

పనిభారం ఎక్కువై అలసిపోతున్నామా- లేక చేయాల్సిన పనుల గురించిన ఆలోచనల బరువుతో కుదేలవుతున్నామా... అనేది మనమంతా నిజాయతీగా బేరీజు వేసుకోవాలి. రెండోదే నిజమైతే- పని ప్రారంభించకముందే వెనుకడుగు వేస్తున్నట్లు లెక్క. అలాంటివారిని 'విఘ్న ఆయాస సంత్రస్తులు' అన్నాడు భర్తృహరి. రాబోయే ఆటంకాలను ముందే ఊహించుకుని పని మానుకునేవారని అర్థం. అడ్డంకుల గురించి ఆలోచించకుండా ముందుకు సాగిపోవడం 'ప్రజ్ఞానిధుల' లక్షణం అన్నాడాయన. మనిషికి పని రాకపోవడం వేరు- మనిషి పనికిరాకపోవడం వేరు. అసలంటూ ఆరంభిస్తేనే పనితనం అలవడుతుంది. విజయం దక్కుతుంది. గెలవాలంటే ఎన్నో మార్గాలుంటాయి. సమస్య ఎక్కడొస్తుందంటే, పనిని ప్రారంభిస్తే తప్ప- అవేవీ కంటిముందు కనపడవు. అవన్నీ మనకు తెలియవా.. అంటే- శ్రీశ్రీ చెప్పినట్లు 'అందరికీ అన్నీ తెలుసు అదే మన గొప్ప అజ్ఞానం'. మనసు రాకపోవడం- అసలు కారణం. మనసు ఎంత చిత్రమైనదంటే- బుద్ధిపుడితే దారిని చూపిస్తుంది, లేకుంటే సాకును సూచిస్తుంది. కాబట్టి మనసును పనికొచ్చేలా చేసుకోవడమే మనిషి కర్తవ్యం.

పూర్వం స్పానిష్ దళాలు సముద్రంలోని దీవులను ఆక్రమించాలనుకున్నప్పుడు- తమను అక్కడికి చేర్చిన పడవలను వెంటనే కాల్చి బూడిద చేసేవి. ఇక ముందుకు పోవడం తప్ప వేరే దారిలేకుండా చేసుకునేవి. అంటే విఘ్న ఆయాస సంత్రస్తులుగా మిగిలిపోయే అవకాశం ఉండదు. పోరే శరణ్యం- రేవో, చావో వేరే విషయం! పనికి వెనుకాడేవారికి ఇదే బ్రహ్మసూత్రం. అప్పుడు అంతర్గత ఇంధనం అగ్నిగా మారుతుంది. 'ఊరక అనలము(అగ్నిని) దాచుకొన్న ఫలమా? క్రతుయోగ్యము (సద్వినియోగం) కావలెంజుమీ' అని కల్పవృక్షంలో రాముడి గురించి విశ్వామిత్రుడు చెప్పిన మాట అందరి పట్లా నిజమవుతుంది. ఫలం దక్కుతుంది. ఇక సాకులు వెతికే మనసుకు ఎలా నచ్చచెప్పాలో- అస్సాంలోని కలియాబోర్ గ్రామానికి చెందిన రాకేశ్ బనిక్ ప్రత్యక్షంగా బోధించాడు. సైకిల్‌పై పదివేల కిలోమీటర్లు ప్రయాణించి ఏడు దేశాలు చుట్టేశాడాయన. 'ఓల్గా టు బ్రహ్మపుత్ర సైక్లోథాన్-25' పేరిట రష్యాలో మొదలైన ఆయన సాహసయాత్ర ఇటీవలే గమ్యం చేరింది. ఇందులో విశేషం ఏముందంటారా... ఆయనకో కాలు లేదు మరి! ఆ లేకపోవడం ఆయనను ఏవిధంగానూ కుంగదీయలేదు. కాళ్లూ చేతులు బాగున్నవారికి ఇదో పాఠం అవునా కాదా?



నన్ను చూసి ఎవరైనా జాలిపడటం నాకు ఇష్టం లేదు. వాళ్లు నా వైకల్యాన్ని మర్చిపోవాలంటే అందరికన్నా భిన్నంగా గొప్ప పని ఏదన్నా చేయాలనిపించింది. అందుకే పర్వతారోహణని ఎంచుకున్నాను, కృత్రిమ కాలుతో ఎవరెస్ట్‌ని అధిరోహించాను.

– అరుణిమా సిన్హా

మన వెనక...

మంచు కురుస్తున్న చల్లని ఉదయం. తోటలోని ఒక గులాబీ మొగ్గ నెమ్మదిగా విచ్చుకుంది. మెరిసిపోతున్న రంగుతో, వ్యాపించిన పరిమళంతో... 'నన్ను చూడండహో' అంటూ దాని పుట్టుక తోటకో పొలికేక పెట్టింది. తన అందానికి తానే మురిసిపోయింది గులాబీ బాల. 'తోటకే వెలుగైన ఈ అందం నాదే కదా' అనుకుని గర్వంతో పొంగిపోయింది. అది చూసిన చెట్టు వేరు- 'ఈ అందమైన పువ్వు విరియడానికి కారణం నేనే. సమయానికి నీటిని, పోషకాలను అందించకపోతే ఇంత పెద్ద పువ్వు పూసేదా?' అనుకుంది. ఇంతలో తోటమాలి అటుగా వచ్చాడు. 'నా సంరక్షణ వల్లే కదా ఈ తోటలోని మొక్కలన్నీ అందమైన పూలు పూస్తున్నాయి' అని గర్వంగా చూసుకున్నాడు. ఇంతకీ ఆ గులాబీ అందానికి కారకులెవరు? పువ్వా? చెట్టు వేరా? లేక తోటమాలా?

నిజం చెప్పాలంటే, ఏ ఒక్కరూ కాదు... అందరూనూ! పువ్వు విరియడానికి- భూమి, నీరు, సూర్యకాంతి, చెట్టు వేరు... అన్నీ కావాలి. ఆపైన తోటమాలి శ్రద్ధగా సంరక్షించాలి. ఇవన్నీ కలిసినప్పుడే తోట అందమైన పూలతో కళకళలాడుతుంది. పువ్వులకే కాదు, అదే సిద్ధాంతం మనకీ వర్తిస్తుంది.



అంతర్యామి

మనం సాధించే విజయాలన్నిటికీ కారణం- కేవలం మనమే కాదు. కానీ, 'ఇది నేనే చేశాను', 'నా తెలివితేటలవల్లే సాధ్యమైంది' అని ప్రతి చిన్న విజయానికీ మనం గర్వపడిపోతుంటాం. జీవితంలో మనకు తెలిసీ తెలియకుండా ఎంతమంది వ్యక్తులు సహాయపడుతుంటారో ఆలోచించం. నా చదువు, నా తెలివి, నా ఉద్యోగం, నా సంపాదన, నా ఇల్లు, నా కారు... అన్నీ మన సొంతమేనని విర్రవీగుతాం. అమ్మానాన్నలు, గురువులు, పెద్దలు, బంధువులు... ఎంతమంది చేయూతనిస్తే పెరిగి మన కాళ్లమీద మనం నిలబడగలుగుతాం? రైతులు పండిస్తే, కార్మికులు కడితే, కర్మాగారాలు పనిచేస్తే... మనకు కూడూ గూడూ గుడ్డా అమరుతున్నాయి. పంచభూతాలూ పూనుకుని గాలీ నీరూ అందిస్తున్నాయి. బడులు, ఆస్పత్రులు, న్యాయస్థానాలు... ఎన్నెన్నో వ్యవస్థలు మన మనుగడకు ఊతమిస్తున్నాయి. ఇవేవీ లేకుండా... ఏ ఒక్కరి సాయమైనా లేకుండా మనం ఉంటామా? మరి ఎందుకు మనకీ అహం? అందుకే 'ఓ మూల కూర్చుని నాకోసం నేను ధ్యానం చేసుకుంటే ఉపయోగం లేదు. నేను అనే ఒంటరితనంలో లేదు నా అస్తిత్వం. చుట్టూ ఉండే మనుషులతో, భావనలతో నా సంబంధ బాంధవ్యాలే నా ఉనికికి గుర్తులు' అంటారు జిడ్డు కృష్ణమూర్తి.

'మా అమ్మ కొంది' అంటూ కొత్త దుస్తులను స్నేహితులకు గర్వంగా చూపిస్తాం. నాన్న బండి కొనిస్తే 'డాడ్స్ గిఫ్ట్' అని గొప్పగా ప్రకటించుకుంటాం. అవి కనిపించే బహుమతులు. వాటిని మనకివ్వడానికి వారు చేసిన త్యాగాలు కనపడవు. అంత మాత్రాన అవి లేవని కాదు కదా. అలాగే... కనిపించని మరెందరి కృషి ఫలితమో నేటి మనం. మన అలవాట్లు, అభిరుచులు, వ్యక్తిత్వం, మేధస్సు... వారందరి చలవే! అది గుర్తుపెట్టుకుంటే అన్నీ ఉన్న ఆకులా అణిగిమణిగి ఉంటాం. లేకపోతే ఏమీ లేని ఆకులా.. నేను నాది అంటూ ఎగిరెగిరి పడుతూనే ఉంటాం. అంతేకదా!

– కరణం హరికిషన్

పుస్తక నేస్తం

అడుగడుగునా తోడుగా!



పుస్తకం మంచి మిత్రుడు. జీవిత మార్గదర్శి. పుస్తక పఠనంతో విజ్ఞానం, వెలకట్టలేని మానసిక ఆనందం సొంతమవుతాయి. కొత్త విషయాలపై మక్కువ పెరుగుతుంది. గ్రంథాలయ సందర్శన ద్వారా విద్యార్థుల్లో వివిధ విషయాలపై అవగాహన వస్తుంది. అది జీవిత పయనంలో ప్రతి అడుగులోనూ తోడ్పడుతుంది. అందుకే చిన్నారులను పుస్తక పఠనం దిశగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.


ప్రస్తుత కాలంలో విద్యార్థులు ఇంటర్నెట్, టెలివిజన్, మొబైల్ వంటి ఉపకరణాల విషవలయంలో చిక్కుకుపోతున్నారు. పుస్తకాలు చదవడం, రాయడం, మననం చేసుకోవడం వంటి మంచి అలవాట్లను పూర్తిగా మరచిపోతున్నారు. పుస్తకాలు, పత్రికలు చదవడం వల్ల విషయ అవగాహన, భాషా పటిమ, విమర్శనాత్మక ఆలోచనా శక్తి పెరుగుతాయి. తద్వారా విద్యార్థి తన అకడమిక్ ప్రస్థానంలో మరింత పురోగతి సాధించే అవకాశాలు అధికమవుతాయి. బాల్యం నుంచే పుస్తక పఠనం వల్ల మేధో ప్రపంచం విస్తృతమవుతుంది. వ్యక్తిత్వం వృద్ధి చెందుతుంది. సమస్యా పరిష్కార నైపుణ్యాలు అలవడతాయి. సామాజిక, కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఇనుమడిస్తాయి. ఫలితంగా అర్థవంతమైన చర్చలు చేయడం, ఇతరులను మెప్పించడం, నొప్పించకుండా మాట్లాడటం, అవతలి వ్యక్తుల సంభాషణల్లోని ఆంతర్యాన్ని గ్రహించడం తేలికవుతుంది. ఎంత పెద్ద విషయమైనా క్లుప్తీకరించి వివరించడం వంటి ప్రత్యేక నైపుణ్యాలు ఒంటపడతాయి. విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవడాన్ని ప్రోత్సహిస్తే అభ్యసన సామర్థ్యాలు, జీవన నైపుణ్యాలను అందిపుచ్చుకోవడం తేలికవుతుంది. ఇది విద్యార్థులను మంచి ఆలోచనాపరులుగా తీర్చిదిద్దుతుంది. ఏకాగ్రత పెరిగి, చదివిన విషయాన్ని గుర్తుంచుకునే శక్తి పుంజుకుంటుంది. కొత్తగా ఆలోచించడం, సరైన అవగాహనను అలవరచుకోవడం, ఇతరులను ప్రేమించడం, తగిన సమయంలో చక్కటి నిర్ణయం తీసుకోవడం వంటి విశేష నైపుణ్యాలు సమకూరతాయి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, ప్రశాంతంగా ఆలోచించుకోవడానికి అవసరమైన శక్తి సామర్థ్యాల్ని పుస్తక పఠనం పరోక్షంగా అందిస్తుంది.

నూతన విద్యావిధానంలో...

బాలల్లో పఠనాసక్తిని బలోపేతం చేయడానికి, చదివించడం ద్వారా భాషా ప్రతిభను పెంపొందించడానికి, అభ్యసన సామర్థ్యాలను పెంచడానికి నూతన విద్యా విధానం-2020 కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలలో లైబ్రరీల ఏర్పాటుకు ప్రాధాన్యమిచ్చారు. క్లిష్టమైన విషయాలను ఆకళింపు చేసుకోవడం ద్వారా పిల్లలు తమ అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచుకోవడానికి వీలు చిక్కుతుందని అందుకు పుస్తక పఠనం దోహదపడుతుందని గుర్తించారు. అందుకోసం 2022లో ఎన్‌సీఈఆర్‌టీ రీడింగ్ క్యాంపెయిన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2025 నాటికి ఫౌండేషనల్ లిటరసీని పటిష్ఠం చేయడం ద్వారా స్థానిక, మాతృభాషల్లో ప్రత్యేకమైన రీడింగ్ సామగ్రిని సమకూర్చి, బాలల్లో పఠనాసక్తిని, లైబ్రరీల పట్ల ఆసక్తిని పెంపొందించడం కార్యక్రమ ముఖ్య భూమికగా నిర్దేశించింది. ఈ కార్యక్రమాన్ని అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను కొంత వరకు పుస్తక పఠనం వైపు మళ్లించారు. చాలా చోట్ల పాఠశాల గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలతో సరికొత్త కాంతులను తెచ్చారు. పిల్లలు చదవడానికి అనువైన వయసు, తరగతి, భాష వంటి విషయాలను పరిగణనలోకి తీసుకుని సరిపడినన్ని పుస్తకాలు సమకూర్చారు. ఆన్‌లైన్ ద్వారా సైతం చదవడానికి తగిన పుస్తకాలను అందుబాటులో తెచ్చారు. పాఠశాల లైబ్రరీల్లో ఎక్కువ మొత్తంలో పుస్తకాలను అందుబాటులోకి తెచ్చేందుకు అదనపు నిధులను అందించారు. ఆన్‌లైన్‌లో సైతం తగిన వనరులను అందుబాటులోకి తేవాలని ఎన్‌సీఈఆర్‌టీ సూచించింది. పుస్తక పఠనంతో పాటు, సంబంధిత చర్చల ద్వారా పిల్లలకు సంభాషణ నైపుణ్యాల్ని అలవరచడం, ఆలోచనలను పంచుకునేలా వారిని ప్రోత్సహించాలని చెప్పింది. పుస్తకాలు చదివే సంస్కృతిని పెంపొందించడాన్ని ప్రధాన ప్రణాళికగా రూపొందించి, శాశ్వత రీతిన కొనసాగించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర విద్యాశాఖ దిశానిర్దేశం చేసింది. పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు ముమ్మర ప్రణాళికలు చేపట్టడంతో చాలా పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే, ప్రత్యేకంగా లైబ్రరీ పీరియడ్‌ను కేటాయించినా- విద్యార్థులు నిరంతరం సిలబస్ ఆధారిత విషయాలపైనే నిమగ్నం కావాల్సి వస్తుండటంతో గ్రంథాలయాల వినియోగం అంతంతగానే ఉంది. రోజువారీ సిలబస్, హోంవర్క్, ప్రాజెక్ట్ పనుల ఒత్తిడిలో విద్యార్థులు లైబ్రరీని వాడుకునే పరిస్థితులు పెద్దగా మెరుగుపడలేదు. పుస్తకాల పంపిణీ జరిగినా ఇంటికి తీసుకెళ్లి చదువుకునే స్వేచ్ఛ కొరవడింది. పుస్తకాలకు పాఠశాల యాజమాన్యాలనే జవాబుదారీ చేయడం కూడా సమస్యగా మారినట్లు తెలుస్తోంది.

తక్షణ చర్యలు అనివార్యం


పుస్తక పఠన ఉద్యమం నిరంతరం కొనసాగితే ప్రస్తుతం అభ్యసన లేమితో ఇబ్బంది పడుతున్న సుమారు 35 శాతం విద్యార్థులకు చదువు సులభతరమవుతుంది. ఇదే దిశలో సేవ్ ది చిల్డ్రన్ సంస్థ చేపట్టిన పాఠశాల స్థాయి రీడింగ్ బడ్డీస్, కమ్యూనిటీ రీడింగ్ బడ్డీస్ వంటి వాటిని ప్రోత్సహించాలి. పెద్ద తరగతుల పిల్లలు, చిన్న తరగతుల చిన్నారులు జట్లుగా ఏర్పడి చదివితే మేలు. దీని వల్ల చదివిన విషయాల్ని సమీక్షించుకోవడమూ తేలికవుతుంది. పిల్లలూ ఉత్సాహంగా పాల్గొంటారు. కంప్యూటర్, ఫోన్, ఇంటర్నెట్, రీఛార్జి సౌకర్యాలు లేకపోవడం వల్ల ఆన్‌లైన్ లైబ్రరీలు, ఆన్‌లైన్ పుస్తక పఠనం వంటివి గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కొంత కష్టమే. అందుకని ప్రభుత్వమే తగినన్ని పుస్తకాలను కొనుగోలు చేసి పాఠశాలల్లో అందుబాటులో ఉంచడం మేలు. చిన్నారుల్లో లైబ్రరీల పట్ల అవగాహన, ఆసక్తిని పెంపొందించడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా తీసుకోవచ్చు. మంచి కథలు, చరిత్రలు, వీరగాథలు, ఆరోగ్య, సామాజిక అంశాలపై అవగాహన, జీవన నైపుణ్యాలను అందించే పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. వాటి ద్వారా పుస్తక పఠనాన్ని నిరంతరం కొనసాగించేలా ప్రోత్సహించాలి.



మల్లాడి శ్రీనగేష్
విద్యారంగ సాంకేతిక సలహాదారులు,
బాల రక్షా భారత్–సౌత్ ఇండియా

యువకుడు, కష్టజీవి, ముసలి తండ్రిని చూసుకుంటూ మట్టితో మమేకమయ్యే పేదరైతు వాంగ్‌లంగ్‌ని చూస్తే ముచ్చటేస్తుంది. బానిస యువతి ఓలాన్‌ను పెళ్లి చేసుకుని ఒద్దికగా కాపురం చేసుకుంటూ ఉంటాడు. పొలంలోనూ తనకు కుడిభుజంలా పనిచేసే భార్యను చూసి గర్వంతో పొంగిపోతాడు. పైసా పైసా కూడబెట్టి భూమి మీద పెట్టుబడి పెట్టే సగటు రైతుగా అతడి ప్రయత్నం మెప్పిస్తుంది. అంతలోనే వరసగా మూడేళ్లపాటు వానల్లేక పంటలు పండవు. తీవ్ర కరవు ముంచెత్తుతుంది. తిండిపెట్టలేమని పురిట్లోనే బిడ్డ పీకనొక్కే దుస్థితి. తప్పనిసరై ఊరందరితో కలిసి పట్టణానికి వలసపోతుంది వాంగ్‌లంగ్ కుటుంబం. నగరానికి బయట చెట్టుకింద సంసారం. పస్తులుంటాడు కానీ ఒకరి ముందు చేయి చాచనివ్వదు ఆత్మాభిమానం. రిక్షా తొక్కబోతాడు, కానీ ఎక్కేవారెవరు? ఇంతలో తిరుగుబాటు జరుగుతుంది. జమీందార్లంతా పారిపోతారు. వారి సంపదను ఎవరికి అందినంత వాళ్లు తీసుకుంటారు. ఆ క్రమంలో అనుకోకుండా వాంగ్‌లంగ్ భార్యకు వెలకట్టలేని వజ్రవైడూర్యాలు దొరుకుతాయి. దాంతో ఏకంగా జమీందారీనే కొనేస్తాడు. హమ్మయ్య కష్టాలు తీరాయని ఆ కుటుంబం పట్ల ఒకలాంటి ఆత్మీయభావన పెల్లుబుకుతుంది.

ఒక్కడే... ఎన్నో రూపాలు!



వాంగ్‌లంగ్... జమీందారయ్యాడు. పెద్ద ఇల్లు. విందులు వినోదాలు. అప్పుడు తీరిగ్గా భార్యను చూశాడు. ఇన్నాళ్లూ పనులు చేసీ చేసీ, సరైన తిండిలేక ముసలిదానిలా తయారైంది. అందుకని వేశ్యను తెచ్చుకుని ఇంట్లోనే పెట్టుకున్న వాంగ్‌లంగ్ మీద ఒక్కసారిగా పట్టలేని కోపం వస్తుంది. మౌనంగా భరించి నిష్క్రమించే ఓలాన్‌ని చూస్తే కడుపు తరుక్కుపోతుంది.

సూర్యకిరణాలు తాకి వీపు చురచురమంటుండగా తాను పొలం దున్నుతున్నట్లూ, భార్య విత్తనాలు చల్లుతున్నట్లూ కల కంటున్న వాంగ్‌లంగ్ ఇప్పుడు వృద్ధుడు. కొడుకులిద్దరూ పొలం అమ్మేస్తుంటే మట్టితో తెగిపోతున్న అనుబంధం వాంగ్‌లంగ్‌ని కుంగదీయడం చూసి గుండె బరువెక్కుతుంది. వాంగ్‌లంగ్ ఒక్కడే... అతడి నాలుగు దశాబ్దాల జీవితం పట్ల మనకెందుకిన్ని భావాలు?

డబ్బు మనుషులను ఎలా ప్రలోభపెడుతుందో, సమాజాన్ని ఎలా మార్చేస్తుందో చెబుతుంది అమెరికన్ రచయిత్రి పెరల్ ఎస్.బక్ రాసిన 'ద గుడ్ ఎర్త్' నవల. ఇందులోని పాత్రలు- సమాజానికి, కాలానికి పుట్టినవి. రచయిత్రి ఆ పాత్రలన్నిటినీ కూర్చి అల్లిన కథ ద్వారా నాటి చైనా సమాజాన్ని, సంస్కృతిని కళ్లకు కడతారు. నలభై ఏళ్లపాటు చైనాలో జీవించిన పెరల్‌బక్ తన రచనల ద్వారా ఆ దేశాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన తొలి రచయిత్రి. నోబెల్, పులిట్జర్ బహుమతులు అందుకుని ఎన్నో భాషల్లోకి అనువాదమైన 'ద గుడ్ ఎర్త్' నవలతో ఆసియాలో ఏ దేశ పాఠకులైనా మమేకమవుతారు. రైతు ఆశలు, మహిళల వెతలు ఎక్కడైనా అవే కదా. 'చైనాలో స్త్రీ జీవితమంతా నిరీక్షణలోనే గడుస్తుంది. మొదట భర్తకోసం, పెళ్లయ్యాక పిల్లలకోసం, వాళ్ల పెళ్లిళ్లు చేశాక మనవల కోసం... నిరీక్షిస్తారు. ఒకసారి మనవడు పుట్టాక ఇక తమ జన్మ ధన్యమైందని తృప్తిగా మరణం కోసం వేచి చూస్తారు' అంటారు రచయిత్రి ఒక సందర్భంలో. వందేళ్ల క్రితం... దాదాపుగా అన్ని దేశాల్లోనూ అదే పరిస్థితి కదా! ఆపకుండా చదివించే వాంగ్‌లంగ్- ఓలాన్‌ల కథ ఇప్పటికీ ఉత్తమ నవలల్లో ఒకటి.

– మిహిర

రివ్వున రోదసిలోకి...

జన జీవితాలను సులభతరం చేయడానికి, సాంకేతికత ఆవిష్కరణలను విస్తరించడానికి, శాస్త్ర విజ్ఞాన ఫలాలను మరింత అందిపుచ్చుకోవడానికి అంతరిక్ష పరిశోధనలు అత్యావశ్యకం. ఈ క్రమంలో ఆయా దేశాలు పెద్దసంఖ్యలో ఉపగ్రహాలు, పరిశోధన శాటిలైట్లు, ల్యాండర్లు, మానవ సహిత స్పేస్‌క్రాఫ్ట్‌లు, అంతరిక్ష కేంద్రం పరికరాలను తరలించే ప్రయోగాలను చేపడుతున్నాయి. గడిచిన ఆరు దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్తంగా అలాంటివన్నీ కలిపి రోదసిలోకి 20,300 చేరాయి. అందులో ఆయా దేశాల వాటా ఎంతంటే...

అమెరికా	11,969
రష్యా	3,825
చైనా	1,385
యూకే	793
జపాన్	352
ఫ్రాన్స్	175
ఇండియా	155
జర్మనీ	132
ఐరోపా స్పేస్ ఏజెన్సీ	109



(ఆధారం: ఔటర్ స్పేస్ అఫైర్స్‌కు సంబంధించి ఐరాస కార్యాలయ నివేదిక - 2025)

నైతికంగా పతనమై... నేరాలకు దగ్గరై!

అగ్గితెగులు సోకితే పచ్చని పంట నిలువునా మాడిపోతుంది. అలాగే, నైతిక విలువలు లోపించిన సమాజంలో మనిషి బతుకు అధోగతి పాలవుతుంది. మన దగ్గర ఇప్పుడదే చీకటి పరుచుకుంటుండటం బుద్ధిజీవులను భయాందోళనలకు గురిచేస్తోంది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని చెప్పి ఇటీవల సంగారెడ్డి జిల్లాలో ఓ ఇల్లాలు తన పేగు తెంచుకుని పుట్టిన ముగ్గురు పిల్లలను గొంతు నులిమి చంపేసింది. ప్రియుడి మీద మోజుతో అనంతపురం జిల్లాలో మరో మహిళ కట్టుకున్న వ్యక్తిని మట్టుబెట్టించింది. అనైతిక బంధం ఫలితంగానే జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన సర్వేయర్ తేజేశ్వర్ హత్య తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. అంతకు ముందు 'మేఘాలయ హనీమూన్ మర్డర్' దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పొలం తాకట్టు పెట్టి తెచ్చిన పైకాన్ని బెట్టింగ్‌లకు తగలేసి, ఆపై డబ్బు ఏదని అడిగినందుకు హైదరాబాద్‌లో ఓ కన్నతండ్రిని కత్తితో పొడిచి కడతేర్చాడో పుత్రరత్నం. ఆస్తికోసం నంద్యాల జిల్లాలో మరో ప్రబుద్ధుడు తల్లిని హతమార్చాడు. ఇక నాలుగు గోడల మధ్య భార్యలకు నరకం చూపిస్తూ- మానసిక భౌతిక దాడులతో వారిని బలితీసుకుంటున్న భర్తలకు లెక్క లేదు. రోజురోజుకూ మన కుటుంబ వ్యవస్థ ఎంతగా పతనమవుతోందో ఇలాంటివి ప్రత్యక్షంగా చూపిస్తున్నాయి. ప్రపంచానికి ఆదర్శ జీవన విలువలను ప్రబోధించిన భారతావని నేడు ఎంతటి సామాజిక కల్లోల కడలిలో కొట్టుమిట్టాడుతోందో కళ్లకుకడుతున్నాయి.

ధర్మబద్ధంగా నైతిక నిష్ఠతో బతకడమెలాగో మన పురాణాలూ ఇతిహాసాలన్నీ బోధిస్తున్నాయి. కోరికలను నియంత్రించుకోకుంటే చివరికి అవే యమపాశాలై జీవితాన్ని సర్వనాశనం చేస్తాయని హెచ్చరిస్తున్నాయి. కానీ, వాటిని బుర్రకెక్కించుకుంటున్న వారెందరు? అయినా, గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏరిన చందంగా ప్రస్తుతం మన చుట్టూ ఉన్న పరిస్థితులే మనుషుల మెదళ్లను కలుషితం చేస్తుంటే ఎన్ననుకుని ఏంటి ప్రయోజనం? ఇప్పుడు ఇంట్లో ప్రతి ఒక్కరికీ వేర్వేరుగా స్మార్ట్‌ఫోన్లు ఉంటున్నాయి. తక్కువ ధరకే నెట్ అందుబాటులోకి వచ్చింది. దాన్ని ఉపయోగించుకుని కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. పదుగురికీ పనికొచ్చే అంశాలు పంచుకోవచ్చు. తద్వారా జీవితంలో ఒక మెట్టు పైకి ఎదగవచ్చు. కానీ, జరుగుతున్నదేంటి? మొబైల్ ముట్టుకుంటే చాలు... సోషల్ మీడియాలో అశ్లీల అసభ్య దృశ్యాలు కట్టలుతెంచుకుని కళ్లముందు కొచ్చి పడుతున్నాయి. వెబ్‌సిరీస్‌లలోనూ అదే తంతు! ఇక హాస్యం పేరుతో అక్రమ సంబంధాలూ వెకిలి బాగోతాల ముచ్చట్లు సర్వసాధారణమవుతున్నాయి. ఎక్కడ



చూసినా డబుల్ మీనింగ్ డైలాగులు, అసహ్యకరమైన బూతులతో సినిమాలూ, దృశ్య మాధ్యమాలు రోత కంపు కొడుతున్నాయి. ఇంకోపక్క రకరకాల యాప్‌లు కొత్త 'స్నేహాలకు' ద్వారాలు తెరుస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో జీవితం మీద ఏదో తెలియని అసంతృప్తితో ఉన్నవారు, లేదా కొత్త అనుభూతి కావాలని ఉవ్విళ్లూరేవారు త్వరగా దారితప్పుతున్నారు. క్రమంగా ఆ ఊబిలో మరింతగా కూరుకుపోయి నిండు జీవితాలను దుంపనాశనం చేసుకుంటున్నారు.

పుణ్యభూమి


వాస్తవానికి వివక్ష, ఆంక్షలను ఎదిరించి జీవితానికి సంబంధించిన నిర్ణయాలు సొంతంగా తీసుకుని గౌరవప్రదమైన స్థాయికి చేరుకోవడమే నిజమైన స్వేచ్ఛ. దానికి భిన్నంగా అర్థంలేని ఆరాటాల్లో కొట్టుకుపోవడమే ఫ్రీడమ్ అని చాలామంది భావిస్తూ బతుకుల్లో చేజేతులా నిప్పులు గుమ్మరించుకుంటున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలకు అధికశాతం వివాహేతర సంబంధాలే కారణమని నిపుణులు చెబుతున్నారు. విశృంఖలత్వానికి అలవాటుపడినవారు కుటుంబ బంధాల్లో ఇమడలేక చివరికి నేరస్థులుగా తయారవుతున్నారు. మరోవైపు- పిల్లల ఇష్టాయిష్టాలను పట్టించుకోకుండా వారిని బలవంతంగా పెళ్లిపీటలు ఎక్కిస్తున్నారు కొందరు పెద్దలు. మనసుకు నచ్చని మనిషితో కాపురం చేయలేక ఆపై ఎంతోమంది విపరీత నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇంకోవైపు ఏమో మద్యం, మత్తుమందులు మంచినీళ్ల మాదిరిగా ఇప్పుడు ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. వాటికి బానిసలవుతున్న చాలామంది డబ్బులకోసం తల్లిదండ్రులను వేధిస్తున్నారు. ఆన్‌లైన్ పందేల్లో లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్న కుర్రాళ్లు- కాసులకోసం కన్నవారిపై దాడులకు తెగబడుతున్నారు. వ్యసనాల సుడిగుండంలో చిక్కుకుపోయి తమ గుండెలపై కుంపటిలా మారిన పిల్లలను కొన్నిచోట్ల తల్లిదండ్రులే చంపేస్తున్నారు. రాష్ట్రాలకతీతంగా వరసగా జరుగుతున్న ఇలాంటి ఘోరాలన్నీ మన బలమైన కుటుంబ వ్యవస్థ పునాదులనే పెళ్లగిస్తున్నాయి!

ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం 2022లో 1420 హత్యలకు అక్రమ సంబంధాలే కారణం. ప్రేమ వ్యవహారాల్లో మరో పద్నాలుగు వందల మంది బలైతే, ఆస్తి తగాదాలూ కుటుంబ కలహాల్లో మరో అయిదున్నర వేల మందికి పైగా హతులయ్యారు. మన సమాజాన్ని దావానలంలా చుట్టుముడుతున్న విలువల పతనాన్ని నివారించడానికి ఆలోచనాపరులందరూ ముందుకు రావాలి. ముఖ్యంగా నవతరానికి ఈ జాడ్యం అంటుకోకుండా చూసుకోవాలి. పాఠశాల దశ నుంచే నైతికవిద్యను బోధించాలి. పెంపకంలో లోపాల మూలంగానే పట్టుమని పదిహేనేళ్లు కూడా లేని బాలురు దారుణ నేరాలకు ఒడిగడుతున్నారు. కాబట్టి తల్లిదండ్రులు తమ సంతానంతో నిత్యం కొంత సమయం గడుపుతూ మంచి చెడులు తెలియజెప్పాలి. అమ్మానాన్నలు తమ బిడ్డలకు సరైన ప్రేమను పంచితే- దాన్ని బయటి వాళ్ల దగ్గర వెతుక్కోవాల్సిన అగత్యం పిల్లలకు తప్పుతుంది. దానివల్ల లేనిపోని మోహాలూ మోసాల్లో చిక్కుకోకుండా వారిని కాపాడుకోవడానికి వీలవుతుంది.

– వేణుబాబు మన్నం

దేశం కోసం... బోస్!

'పూజా! ఏంటమ్మా.. ఒక్కదానివే ఏదో ఆలోచిస్తున్నట్లున్నావు?' అని అడిగారు అప్పుడే ఇంట్లోకి వస్తున్న తాతయ్య. 'మరేం లేదు తాతయ్యా..! ఈరోజు హాలీడే కదా. హోంవర్క్ చేసేశాను. ఆడుకోవడానికి వెళ్దామంటే నా ఫ్రెండ్ సిరి ఊరెళ్లింది. అందుకే ఏం చేయాలా అని ఆలోచిస్తున్నా' అంది పూజ. 'అవునా. మరి నేనేమైనా కథలు చెప్పనా?' అడిగారు తాతయ్య. 'కథలు కాదు గానీ.. ఎలాగూ స్వాతంత్ర్య దినోత్సవం వస్తోంది కదా... దానికి సంబంధించి ఏవైనా ఆసక్తికరమైన విషయాలు చెబుతారా?' అంది పూజ. 'ఓ.. తప్పకుండా చెబుతాను తల్లీ!'



బదులిచ్చారు తాతయ్య. 'అయితే.. మీరు మనకు స్వాతంత్ర్యం రాకముందో, లేకపోతే వచ్చిన కొత్తలోనో పుట్టి ఉంటారు కదా! అప్పుడు విన్నవి, చూసినవి మీకేమైనా గుర్తున్నాయా?' అడిగిందా చిన్నారి. 'కొంతవరకు గుర్తున్నాయమ్మా! అప్పట్లో సుభాష్‌చంద్రబోస్ పేరు చాలా ఎక్కువగా వినిపించేది. విదేశాల్లో ఉన్నత విద్య చదువుకున్నా, మంచి ఉద్యోగం ఉన్నా.. అన్నీ వదిలేసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. దేశసేవ కోసం ఐ.సి.ఎస్. ఉద్యోగానికి రాజీనామా చేసిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. ఉద్యమంలో భాగంగా చాలాసార్లు జైలుకు కూడా వెళ్లారు. బ్రిటిష్ వాళ్లను ఎదిరించడానికి.. 'ఆజాద్ హింద్ ఫౌజ్' అదే.. ఇండియన్ నేషనల్ ఆర్మీని తయారు చేశారు. ఒక సంవత్సరంలోనే ఆ బృందంలో అనేక మంది చేరారట. సుభాష్ చంద్రబోస్ మొదట్లో కొన్నిరోజులు కళాశాల ప్రిన్సిపల్‌గా, ఒక పత్రిక సంపాదకుడిగా కూడా పని చేశారు తెలుసా! 1934లోనే భారత జాతీయ పోరాటం అనే పుస్తకాన్ని కూడా రాశారు. తర్వాత్తరవాత మన దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విదేశాల్లో కూడా ప్రచారం చేశారు. ఆరోగ్యం బాగోలేకపోయినా సరే.. ఆయన పోరాటాన్ని మాత్రం అస్సలు ఆపలేదు. అప్పట్లో ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలిచారు' అని చెప్పారు తాతయ్య.

హాయ్! బుజ్జీ!!

'అవునా! సుభాష్ చంద్రబోస్ విశేషాలు చాలా బాగున్నాయి తాతయ్య. రేపు స్కూల్‌కి వెళ్లగానే నా ఫ్రెండ్స్‌కి కూడా ఈ సంగతులన్నీ చెబుతాను' ఉత్సాహంగా అంది పూజ. ★

వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

బెయిల్ కోసం ఏపీ హైకోర్టుకు వెళ్లారు. అప్పటికి ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చలేదు. దీంతో పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన మిథున్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ కొనసాగుతున్నంత కాలం అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడంతో బయటకొచ్చారు.

■ ఏప్రిల్ 19న తొలిసారి సిట్ విచారణకు హాజరైనా దర్యాప్తు అధికారులకు సహకరించలేదు. వారి ప్రశ్నలకు సరైన సమాధానాలివ్వలేదు. దీంతో మిథున్‌రెడ్డిని నాలుగో నిందితుడు (ఏ4)గా చేర్చారు. వీటన్నింటిపై విచారించిన సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను పునఃపరిశీలన నిమిత్తం ఏపీ హైకోర్టుకు పంపించింది. ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేస్తూ ఈ నెల 15న ఏపీ హైకోర్టు ఆదేశాలిచ్చింది. అప్పటికే అజ్ఞాతంలో ఉన్న మిథున్‌రెడ్డి వెంటనే సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లారు. అక్కడా ఎదురుదెబ్బ తగలటంతో తప్పనిసరి పరిస్థితుల్లో సిట్ ముందుకొచ్చారు.

■ కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న మిథున్‌రెడ్డి శనివారం ఉదయం దిల్లీ నుంచి బయల్దేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12.40 గంటలకు సిట్ కార్యాలయానికి వెళ్లారు.

సొంత బ్రాండ్లతో దోచేసి..

'బిగ్‌బాస్ ఆదేశాల మేరకు మిథున్‌రెడ్డి.. నూతన మద్యం విధానం ముసుగులో ఘరానా దోపిడీకి తెరతీశారు. ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీగా, డిస్టిలరీస్, బ్రూవరీస్ కమిషనర్‌గా నియమించటంలో, ఎక్సైజ్ శాఖాధికారి డి.సత్యప్రసాద్‌కు కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి కల్పిస్తానని ప్రలోభపెట్టి.. ఆయన్ను పావుగా వాడుకుని దోపిడీ సాగించటంలో మిథున్‌రెడ్డిది ప్రధాన పాత్ర. ముడుపులు ఎలా వసూలు చేయొచ్చో ఆయనే మిగతా నిందితులతో కలిసి పన్నాగం పన్నారు. మద్యం బ్రాండ్ల మూల ధర ఆధారంగా కేసుకు రూ.150 నుంచి రూ.600 వరకు ముడుపులు వసూలు చేయొచ్చని, తద్వారా నెలకు రూ.50-60 కోట్ల మేర వస్తాయని మిథున్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి నాయకత్వంలోనే నిర్ణయించారు. మద్యం సరఫరా ఆర్డర్ల జారీలో పారదర్శకత కోసం ఆటోమేటెడ్ విధానం అమల్లో ఉండేది. మిథున్‌రెడ్డి ఆదేశాలతోనే దాన్ని రద్దు చేయించి, దోపిడీకి వీలుగా మాన్యువల్ విధానాన్ని తీసుకొచ్చారు. ముడుపులిచ్చిన కంపెనీలకే అత్యధికంగా సరఫరా ఆర్డర్లు ఇస్తూ, అందుకు అంగీకరించని సంస్థలను తరిమేశారు. వాటి స్థానంలో సొంత బ్రాండ్లు తెచ్చారు. బేసిక్ ప్రైస్ (మూల ధర) భారీగా పెంచుకుని ఖజానాను కొల్లగొట్టారు. తమ ప్రణాళిక మేరకు ముడుపులు వసూలవుతున్నాయా? లేదా అనేది పర్యవేక్షించేందుకు మిథున్‌రెడ్డి తరచూ సమావేశాలు నిర్వహించేవారు. తన బృందం వసూలు చేసిన ముడుపులను రాజ్ కసిరెడ్డి.. మిథున్‌రెడ్డితో పాటు నాటి ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితులైన మరికొందరికి చేర్చేవారు. దాన్ని మిథున్‌రెడ్డి బిగ్‌బాస్‌కు అందజేసేవారు. ఈ ముడుపుల్లో అత్యధిక శాతం బంగారం, నగదు రూపంలోనే తీసుకున్నారు. ముడుపుల వసూళ్లు, సొంత బ్రాండ్ల మద్యానికి ఎక్కువగా ఆర్డర్లు ఇచ్చుకోవటం ద్వారా మిథున్‌రెడ్డి రెండు విధాలా అనుచిత లబ్ధి పొందారు' అని సిట్ దర్యాప్తులో తేల్చింది.


ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ కార్యాలయంలోకి తీసుకెళ్తున్న పోలీసులు

మిథున్‌రెడ్డి కుటుంబ సంస్థ పీఎల్ఆర్ ఖాతాల్లోకి ముడుపుల సొమ్ము

'నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ (డిస్టిలరీ) వ్యాపార పునరుద్ధరణ, అభివృద్ధి కోసం అరబిందో గ్రూప్ ద్వారా రూ.45 కోట్ల రుణమిప్పించారు. ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు ఈ మద్యం ముఠాలో భాగస్వాములైన వారందరికీ నగదు రూపంలో ముడుపులు చెల్లించాలనేది దీని వెనుక ఉన్న ఒప్పందం. రుణంలో రూ.5 కోట్లను ఎంపీ మిథున్‌రెడ్డి ముడుపుల్లో తన వాటాగా.. తమ కుటుంబీకులు డైరెక్టర్లుగా ఉన్న పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాల్లో జమ చేయించుకున్నారు. మద్యం ముడుపులపై అప్పట్లో రచ్చ జరగటంతో. . ఆ రూ.5 కోట్లను తిరిగి హుడ్‌విన్క్ అనే సంస్థ ఖాతాకు బదిలీ చేయించేశారు. ఆ మొత్తాన్ని నగదు రూపంలో తీసుకున్నారు' అని దర్యాప్తులో తేలింది.


మిథున్‌రెడ్డి విచారణ నేపథ్యంలో సిట్ కార్యాలయం వద్ద వైకాపా నేతలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు తదితరులు


జడ్జి ఇంటి నుంచి ఛార్జిషీట్ పత్రాలను ఏసీబీ కోర్టుకు తీసుకెళుతున్న సిబ్బంది

రాజకీయ కక్షతో పెట్టిన కేసు.. ధైర్యంగా ఎదుర్కొంటా: మిథున్‌రెడ్డి



విమానాశ్రయంలో వైకాపా ఎంపీలు గురుమూర్తి, మిథున్‌రెడ్డి తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: 'మద్యం కుంభకోణం కేసు పూర్తిగా రాజకీయ కక్షతో పెట్టినది. ఇది నిలబడే కేసు కాదు. ప్రస్తుతానికి ఏదో వేధించి, అరెస్టు చేసి వాళ్లు ఆనందం పొందొచ్చు. దీన్ని ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను' అని వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. సిట్ ఎదుట విచారణకు హాజరయ్యేందుకు ఆయన శనివారం ఉదయం దిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గంలో విజయవాడ వెళ్లారు. మిథున్‌రెడ్డిని వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నేతలు తలశిల రఘురాం, సింహాద్రి రమేష్‌బాబు, అడపా శేషు తదితరులు కలిశారు. మరోపక్క, మిథున్‌రెడ్డిని అరెస్టు చేస్తున్నారన్న వార్తలతో కొందరు వైకాపా కార్యకర్తలు విమానాశ్రయానికి చేరుకున్నారు. వారిలో అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన వైకాపా రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి సుంకర చక్రధర్‌కు మూర్ఛ రావడంతో విమానాశ్రయం ఆవరణలో కుప్పకూలారు. ఆయనకు అక్కడి వైద్యబృందంతో ప్రాథమిక చికిత్స చేయించి, గన్నవరం ఆసుపత్రికి తరలించారు.

కోనసీమకూ.. కూ.. చుక్‌చుక్!

- కోటిపల్లి-నరసాపురం మధ్య రైల్వేలైను పనులకు కదలిక
- ఐదు నెలల్లో రెండోవిడత భూసేకరణ పూర్తి

ఈనాడు - రాజమహేంద్రవరం

కోనసీమ వాసులు కూ.. చుక్‌చుక్ అనే రైలుకూత కోసం కొన్ని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. ఇన్నాళ్లూ రైలు ఎక్కాలంటే రాజమహేంద్రవరమో, కాకినాడో వెళ్లాల్సి వచ్చేది. ఎట్టకేలకు వారి కల నెరవేరుతోంది. అన్నీ అనుకున్నట్లే అయితే మరో మూడేళ్లలో కోనసీమలో రైలు కూత వినిపిస్తుంది. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైను నిర్మాణ ఎలైన్‌మెంట్లపై కోర్టు స్టేలు ఎత్తేయడంతో రెండో విడత భూసేకరణకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఐదు నెలల్లో పూర్తిచేసి స్థలాన్ని రైల్వేకు అప్పగించాలనే లక్ష్యంతో ఉన్నారు.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోటిపల్లి నుంచి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వరకు 57.81 కి.మీ. మేర రైలుమార్గం నిర్మించాలన్నది లక్ష్యం. మొత్తం 8 మండలాలు, 25 గ్రామాల పరిధిలో ఏర్పాటుకానున్న రైల్వే ప్రాజెక్టుకు 846 ఎకరాలు అవసరం. తొలి విడతలో రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం మండలాల్లోని


బోడసకుర్రులోని వైనతేయ గోదావరిపై రైల్వే వంతెన స్తంభాలు

ఎనిమిది గ్రామాల్లో 13.45 కి.మీ. మేర రైల్వే లైను ఏర్పాటుకు 255.835 ఎకరాలు గుర్తించారు. 2003లోనే వీటిని సేకరించగా రైల్వేశాఖ ఇంకా స్వాధీనం చేసుకోలేదు. తమకు అదనపు పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు కోసం రైల్వేకు 279 ఎకరాలు అప్పగించినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

24.10 ఎకరాల్లో మూడు వంతెనలు

అమలాపురం మండలం పేరూరు, మామిడికుదురు మండలం పాశర్లపూడి, మలికిపురం మండలం గుడిమెల్లంక వద్ద వంతెనల నిర్మాణానికి 24 ఎకరాలను ఇప్పటికే రైల్వేకు అప్పగించగా పనులు ప్రారంభించారు. అయినవిల్లి మండలం శానపల్లిలంక వద్ద గోదావరిపై వంతెన నిర్మించేచోట సామగ్రి నిల్వకు అవకాశం లేకపోవడంతో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రైతులతో మాట్లాడి ఒప్పించారు.

రెండో విడత ఎక్కడెక్కడంటే..

అమలాపురం మండలం భట్నవిల్లి నుంచి మలికిపురం మండలం గుడిమెల్లంక వరకు 34.90 కి.మీ. మేర రైల్వే లైన్ నిర్మాణానికి 18 గ్రామాల పరిధిలో 590.348 ఎకరాలు సేకరించాలి. మామిడికుదురు, రాజోలు, మలికిపురం మండలాల్లోని 13 గ్రామాల్లో ఇప్పటికే రెవెన్యూ, రైల్వే సర్వే చేసి 402.637 ఎకరాలు గుర్తించారు. తొలుత ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసి, ఐదు నెలల్లో భూసేకరణ పూర్తిచేస్తామని కలెక్టర్ తెలిపారు. తర్వాత భట్నవిల్లి నుంచి బోడసకుర్రు వరకు సేకరించాల్సిన 188 ఎకరాలపై దృష్టి సారిస్తామన్నారు. ■ ఐదు గ్రామాల్లో 188 ఎకరాలకు సంయుక్త సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులకు లేఖ రాసినట్లు రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ తెలిపారు. మూడు వంతెనల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు.

మూడేళ్లలో సాకారమయ్యేలా చర్యలు

– గంటి హరీష్ మాథుర్, అమలాపురం ఎంపీ

కోనసీమలో వచ్చే మూడేళ్లలో రైలు కూత వినిపించే దిశగా చర్యలు చేపడుతున్నాం. చంద్రబాబు, రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మాట్లాడి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. వంతెనల సూపర్ స్ట్రక్చర్ల పనులు త్వరలోనే ప్రారంభమై రెండేళ్లలో పూర్తవుతాయని భావిస్తున్నాం. 2003లో భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని రైల్వేమంత్రికి వివరించాను.

పది లక్షల ఉద్యోగాలకు ఎంవోయూలు పూర్తి

- ఏపీకి భారీగా తరలివస్తున్న కంపెనీలు: మంత్రి లోకేశ్
- గన్నవరంలో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ ప్రారంభం

ఈనాడు డిజిటల్–మచిలీపట్నం, గన్నవరం, న్యూస్‌టుడే: 'రాష్ట్రంలో యువతకు ఉద్యోగాల కల్పనే ప్రధాన ధ్యేయంగా సాగుతున్నాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పటికే ఏడాదిలోనే 10 లక్షల ఉద్యోగాల కల్పనకు ఎంవోయూలు పూర్తిచేశాం' అని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. వైద్య సాంకేతికత, సేవల రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరున్న 'ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్' సంస్థ తమ నూతన కార్యాలయాన్ని కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని మేధా హైటెక్ సిటీ భవనంలో ఏర్పాటు చేసింది. దీనిని మంత్రి లోకేశ్ శనివారం ప్రారంభించి మాట్లాడారు. 'ఏపీకి అనేక కంపెనీలు వస్తున్నాయంటే చంద్రబాబు బ్రాండే కారణం. అందరూ మెగా నగరాలపై దృష్టిసారిస్తే ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ మాత్రం చిన్న నగరాలపై నమ్మకం ఉంచి గొప్ప విజయాలు సాధిస్తోంది. నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన వెంటనే 300 మందికి ఉద్యోగాలు ఇచ్చారు' అని లోకేశ్ పేర్కొన్నారు.

విశాఖను ప్రపంచస్థాయి ఐటీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి లోకేశ్ అన్నారు. 'తిరుపతి, కాకినాడ, అనంతపురం, రాజమహేంద్రవరం, కర్నూలు, నెల్లూరు వంటి నగరాలు కూడా డిజిటల్ వృద్ధికి హబ్‌లుగా మారాలి. ఉత్తరాంధ్రలో ఫార్మా, గోదావరి జిల్లాల్లో ఆక్వాను అభివృద్ధి చేస్తాం. దేశంలోనే అతి పెద్ద స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిత్తల్ ఉత్తరాంధ్రకు రానుంది' అని లోకేశ్ తెలిపారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం మానుకోవాలని.. అందుకు మన ఇంటి నుంచే మార్పు రావాలని లోకేశ్ సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వర్లకుమార్ రాజా, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు.


ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ సంస్థ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో సీఈవో కార్తీక్, సీవోవో స్నేహ

ఛార్జిషీట్‌లో జగన్ పేరు

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు కొనసాగుతున్నందున తదుపరి దశలో దాఖలు చేయబోయే అనుబంధ అభియోగపత్రాల్లో జగన్ ప్రమేయంపై స్పష్టత రానుంది. 305 పేజీల అభియోగపత్రాన్ని కోర్టులో వేశారు. 70 వాల్యూమ్‌లతో కూడిన వేల అనుబంధ పత్రాల్ని దానికి జతపరిచి న్యాయస్థానంలో సమర్పించారు. ఈ కేసులో ఇప్పటి వరకు 40 మంది వ్యక్తులు, సంస్థలను నిందితులుగా చేర్చగా.. తాజాగా మరో 8 మందిని నిందితులుగా పేర్కొన్నారు. మొత్తం 16 మందిపై అభియోగాలు మోపారు. ప్రధానంగా మనీ ట్రయల్‌కు సంబంధించిన వివరాల్ని సమగ్రంగా పొందుపరిచారు. విశ్వసనీయ సమాచారం మేరకు అభియోగపత్రంలోని ప్రధానాంశాలివీ..

కుట్ర నుంచి మనీ ట్రయల్ వరకు..

■ దోపిడీకి వీలుగా నూతన మద్యం విధానం రూపకల్పన కోసం ప్రైవేటు వ్యక్తుల నివాసాల్లో జరిగిన సమావేశాలు, అందులో పాల్గొన్న వ్యక్తులు, ముడుపుల వసూళ్లపై ఆయా భేటీల్లో జరిగిన నిర్ణయాలు, తదనుగుణంగా మద్యం సరఫరా ఆర్డర్ల జారీ వ్యవస్థలో పారదర్శకతకు తిలోదకాలివ్వటం తదితర అంశాలన్నింటినీ సిట్ ఈ అభియోగపత్రంలో పేర్కొంది.

■ మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న కంపెనీలు, డిస్టిలరీల నుంచి ప్రతి నెలా రూ.50-60 కోట్లు ఎలా వసూలు చేసేవారు? అందులో ఎవరెవరు భాగస్వాములయ్యారు? ఈ ముడుపుల సొమ్ము ఎక్కడ నిల్వ చేశారు? ఏయే డొల్ల కంపెనీల్లోకి మళ్లించారు అనే వివరాలు పొందుపరిచారు. బంగారం కొనుగోలు, డొల్ల కంపెనీలు, స్థిరాస్తి కంపెనీల ఖాతాల్ని అడ్డం పెట్టుకుని ముడుపులు తీసుకున్న తీరును అభియోగపత్రంలో వివరించారు. ముంబయి, దిల్లీ కేంద్రాలుగా ఉన్న కంపెనీల నుంచి జరిగిన లావాదేవీల్ని ప్రస్తావించారు.

■ ఈ కేసులో ఇప్పటి వరకు రూ.62 కోట్ల సొత్తు జప్తు చేశారు. అది ముడుపుల సొత్తేనని మనీ ట్రయల్‌లో తేలిందని అభియోగపత్రంలో పేర్కొన్నారు.

■ ఈ సొమ్మును ఎక్కడెక్కడ భద్రపరిచారు? ఆ డెన్‌ల వివరాలు, గత ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులకు పంపిణీ కోసం ఆ సొత్తు తరలింపు తదితర అంశాల్ని పూర్తి ఆధారాలతో అభియోగపత్రంలో వివరించారు. ముడుపులకు సంబంధించిన నోట్ల కట్టలతో నిందితులున్న వీడియోలనూ జత చేశారు.

■ కుట్ర రూపకల్పన, దాని అమలు, ప్రభుత్వ ఖజానాకు కలిగించిన నష్టం, డొల్ల కంపెనీలు, హవాలా లావాదేవీల ద్వారా ముడుపుల సొమ్ము తరలింపు సహా ఈ కుంభకోణం దశలన్నింటినీ అభియోగపత్రంలో ప్రస్తావించారు.

■ ఈ మొత్తం వ్యవహారంలో ఏ నిందితుడి పాత్ర, ప్రమేయం ఏంటి అనేది పూర్తిగా వివరిస్తూ అభియోగాలు మోపారు. ఆడియో, వీడియో రికార్డులు, ఫోరెన్సిక్ నివేదికలు, సీడీఆర్ వివరాలు పొందుపరిచారు.

5 నెలల్లో కేసు కొలిక్కి తెచ్చిన సిట్

■ మద్యం కుంభకోణంపై గతేడాది ఏపీ సీఐడీలో కేసు నమోదైంది.

■ దర్యాప్తు కోసం ఈ ఏడాది ఫిబ్రవరి 5న విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది.

■ వెంటనే రంగంలోకి దిగిన సిట్.. ఏప్రిల్ 22 నాటికి ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిని అరెస్టు చేసింది. తర్వాత ఈ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, వైకాపా నాయకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎస్పీవై డిస్టిలరీస్ పూర్వ డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి అనుచరులైన బూనేటి చాణక్య, పైలా దిలీప్, చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్నేహితుడు వెంకటేశ్‌నాయుడు, పీఏలు నవీన్ కృష్ణ, బాలాజీ యాదవ్‌లను అరెస్టు చేశారు.

■ శనివారం ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడంతో ఈ సంఖ్య 12కి చేరింది.

24న బంగాళాఖాతంలో అల్పపీడనం

- రాష్ట్రంలో విస్తారంగా వర్షాలకు అవకాశం

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారుతున్నాయి. బంగాళాఖాతంలో గురువారం (ఈ నెల 24) నాటికి అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీయొచ్చని పేర్కొంది. ఆదివారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో, సోమవారం అల్లూరి సీతారామరాజు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారుతుందనే అంచనాల నేపథ్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. పిడుగులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ సూచించారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో 95.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శనివారం నంద్యాల, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అనకాపల్లి, తూర్పుగోదావరి, కర్నూలు, విజయనగరం తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి.

రాష్ట్ర హక్కులపై నిలదీయండి

- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల


ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో తెదేపా, జనసేన, వైకాపా ఎంపీలు పేరుకేనని.. వీరంతా భాజపా కోసం పనిచేసే కీలుబొమ్మలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ప్రత్యేక హోదాపై, రాజధానికి నిధులపై అడిగే సత్తా లేదని, విభజన చట్టం ప్రకారం రాష్ట్ర హక్కులపై గళం విప్పడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం అనుకుంటే ఈ పార్లమెంట్ సమావేశాల్లో వాటిపై నిలదీయాలని కోరారు. పోలవరం ఎత్తు తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ ఉభయ సభలనూ స్తంభింపజేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉండదని ప్రధాని మోదీ చేత అధికారిక ప్రకటన చేయించాలని ఏపీసీసీ తరఫున తాము డిమాండ్ చేస్తున్నట్లుగా శనివారం ఎక్స్ వేదికగా ఆమె పోస్ట్ చేశారు.

మద్యం కుంభకోణంలో మరో 8 మంది

- వీరంతా ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్ సభ్యులే
- అభియోగపత్రంలో పేర్కొన్న సిట్

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి సిట్ దాఖలు చేసిన ప్రాథమిక అభియోగపత్రం (ప్రిలిమినరీ ఛార్జిషీట్)లో కొత్తగా మరో 8 మందిని నిందితులుగా చేర్చింది. వీరిలో ఎక్కువ మంది మద్యం ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్‌లో పాత్రధారులు, ముడుపుల సొమ్ము భద్రపరిచిన డెన్‌లలోని సొత్తు హ్యాండ్లర్లు. ప్రధాన నిందితుడు (ఏ1) రాజ్ కసిరెడ్డి, మరో నిందితుడు (ఏ8) ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డిల ప్రతినిధులుగా వీరు ఈ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించారు. వీరిలో కొంత మంది ఇప్పటికే విదేశాలకు పారిపోయారు. పలువురు దుబాయ్‌లో, ఒకరిద్దరు అమెరికాలో ఉన్నట్లు సిట్ గుర్తించింది. ఈ కుంభకోణంలో వీరి పాత్ర, ప్రమేయం గురించి ప్రాథమిక అభియోగపత్రంలో సమగ్రంగా ప్రస్తావించింది.

అదాన్ డిస్టిలరీస్ డైరెక్టర్లుగా దోపిడీ



1. ముప్పిడి అనిరుధ్ రెడ్డి: మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన (ఏ1) రాజ్ కసిరెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి (ఏ7)కి సోదరుడు అనిరుధ్. తన తరఫున అనిరుధ్‌రెడ్డిని డైరెక్టర్‌గా పెట్టి రాజ్ కసిరెడ్డి అదాన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ నెలకొల్పారు. వైకాపా హయాంలో అదాన్ డిస్టిలరీస్‌కు రూ.800 కోట్ల మద్యం సరఫరా ఆర్డర్లు దక్కాయి. సొంతంగా ఒక్క డిస్టిలరీ కూడా లేని అదాన్ భారీగా అనుచిత లబ్ధి పొందింది. ఈ డబ్బంతా రాజ్ కసిరెడ్డికి చేరేది. ఈ దోపిడీలో భాగమైనందుకు అనిరుధ్‌రెడ్డిని నిందితుడిగా చేర్చారు. అతను ఇప్పటికే విదేశాలకు పారిపోయాడు.



2. బొల్లారం శివకుమార్: రాజ్ కసిరెడ్డి 2020లో అదాన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి ముప్పిడి అనిరుధ్‌రెడ్డిని తప్పించారు. అతని స్థానంలో బొల్లారం శివకుమార్‌ను డైరెక్టర్‌గా చేర్చారు. డిస్టిలరీస్ యజమానుల నుంచి మద్యం ముడుపులు వసూలు చేయటం, అదాన్ డిస్టిలరీకి ఏపీఎస్‌బీసీఎల్ నుంచి వచ్చిన డబ్బును ఎప్పటికప్పుడు రాజ్ కసిరెడ్డికి మళ్లించటంలో ఇతనిది కీలకపాత్ర. శివకుమార్ ఇప్పటికే విదేశాలకు వెళ్లిపోయాడు.

ముడుపుల సొమ్ము వసూళ్లలో పాత్రధారి



3. సైమన్ ప్రసన్: రాజ్ కసిరెడ్డి ముఠాలో కీలక సభ్యుడు. ఐఐటీలో చదువుకున్న సైమన్ ప్రసన్.. డిస్టిలరీలు, మద్యం సరఫరా కంపెనీల ప్రతినిధుల నుంచి ముడుపుల వసూళ్లలో కీలకంగా వ్యవహరించేవాడు. ఆ తర్వాత రాజ్ కసిరెడ్డి ఆదేశాల మేరకు ఆ డబ్బును చేర్చాల్సిన చోటకు చేర్చేవాడు. వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పీఏలు, గన్‌మెన్‌కు హైదరాబాద్‌లో మద్యం ముడుపుల సొమ్ము అందించింది సైమనే. పలుమార్లు తాడేపల్లిలోని డెన్‌కు వచ్చి ఈ సొమ్ము అందజేసేవాడు. సైమన్ కూడా ప్రస్తుతం విదేశాల్లోనే ఉన్నాడు.

దుబాయ్ డెన్‌కు ఇన్‌ఛార్జ్...

4. రాజీవ్ ప్రతాప్: వైకాపా ముఠా దుబాయ్ కేంద్రంగా నడిపించిన డెన్‌కు రాజీవ్ ప్రతాప్ ఇన్‌ఛార్జ్. ఈ కేసులో ఎనిమిదో నిందితుడైన (ఏ8) తూతేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదువుకున్న రాజీవ్ ప్రతాప్ కూడా మద్యం కుంభకోణం ఉచ్చులోకి దిగాడు. ఏయే డిస్టిలరీలకు ఎంతెంత మద్యం సరఫరా ఆర్డర్లు దక్కాయి? వాటి నుంచి ఎంత ముడుపులు వసూలు చేయాలో రాజీవ్ ప్రతాపే లెక్కగట్టేవాడు. దుబాయ్‌లోని డెన్‌లో ఈ బ్యాకప్ అంతా నిర్వహిస్తూ.. ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ద్వారా కసిరెడ్డికి చేర్చేవాడు. డిస్టిలరీలకు నేరుగా దుబాయ్ నుంచే ఫోన్లు చేసి, ఎంత ముడుపులివ్వాలో లెక్కలు చెప్పేవాడు.

ఈ నలుగురూ.. ముడుపుల వసూళ్లలో భాగస్వాములే

5. మద్యం ముడుపుల సొమ్ము నిల్వకు తాడేపల్లిలో ఏర్పాటు చేసుకున్న డెన్‌కు ప్రణోయ్ ప్రకాశ్‌తో కలిసి హ్యాండ్లర్‌గా వ్యవహరించిన కొమ్మారెడ్డి అవినాష్‌రెడ్డి
6. సైమన్ ప్రసన్ బావమరిది మోహన్‌కుమార్
7. ముప్పిడి అనిరుధ్‌రెడ్డి బావమరిది అనిల్‌కుమార్‌రెడ్డి
8. ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి స్నేహితుడు, ఐఐటీ పూర్వ విద్యార్థి సుజల్ బెహరూన్‌లనూ ఈ కేసులో సిట్ నిందితులుగా చేర్చింది. వీరంతా మద్యం ముడుపుల సొమ్ము వసూళ్లు, తరలింపు, డొల్ల కంపెనీల ద్వారా మళ్లింపులో కీలకంగా వ్యవహరించారు.

వీధి దీపాల సమస్య పరిష్కారానికి
పుణె నమూనా

- నెల్లూరులోని ఒక రోడ్డులో విజయవంతమైన ప్రయోగం
- అన్ని నగరాలు, పట్టణాల్లో దశల వారీగా అమలు

ఈనాడు, అమరావతి: నగరాలు, పట్టణాల్లో వీధి దీపాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పుణెలో విజయవంతమైన స్మార్ట్ స్ట్రీట్ లైటింగ్ మోడల్‌ను రాష్ట్రంలోనూ అమలు చేయనుంది. నెల్లూరులో 174 ఎల్‌ఈడీ వీధి దీపాలుగల స్టోన్‌హౌస్‌పేట రోడ్డులో చేసిన ప్రయోగం విజయవంతం కావడంతో ఆ నగర వ్యాప్తంగా అమలు చేసి దశల వారీగా మిగతా నగరాలు, పట్టణాలకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాష్ట్రంలో 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో 10.27 లక్షల ఎల్‌ఈడీ వీధి దీపాల్లో రోజూ 75 శాతానికి మించి వెలగడం లేదు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, రాజమహేంద్రవరం, తదితర ప్రధాన నగరాల్లోనూ వీధి దీపాల సమస్య తీవ్రంగా ఉంది. 2014-19 మధ్య కాలంలో నాటి తెదేపా ప్రభుత్వం వీటి నిర్వహణను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇంధన సామర్థ్య సేవల సంస్థ (ఈఈఎస్ఎల్)కు అప్పగించింది. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈఈఎస్ఎల్‌కు సరిగ్గా బిల్లులు చెల్లించని కారణంగా నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణ స్థానిక సంస్థలే ప్రస్తుతం వీధి దీపాల నిర్వహణ చూస్తున్నా సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపం తదితర కారణాలతో వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదు.


నెల్లూరులో స్టోన్‌హౌస్‌పేటలో వీధి దీపాలు

కమిషనర్ల బృందం పరిశీలన

రాష్ట్రం నుంచి పలువురు మున్సిపల్ కమిషనర్లు నాలుగు నెలల క్రితం పుణె వెళ్లి అక్కడి విధానాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. జియో, అగమై సంస్థలు సంయుక్తంగా ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేసుకొని పుణెలో అమలు చేస్తున్నాయి. విద్యుత్ ఆదా అయింది. వీధి దీపాలు వెలగడం లేదన్న ఫిర్యాదులు సున్నా శాతానికి తగ్గాయి. పుణె మోడల్‌ను నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట వీధిలో పాత ఎల్‌ఈడీల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి రెండు నెలలపాటు అమలు చేసిన ప్రయోగం ఫలించింది. ఈ ప్రాంతంలో ఫిర్యాదులు సున్నా శాతానికి తగ్గాయి. విద్యుత్తు 35 శాతం ఆదా అయింది.

పుణె మోడల్‌లో ఏం చేస్తారు?

- ఎల్‌ఈడీ వీధి దీపాల స్థానంలో 70 వాట్ల కొత్తవి అమరుస్తారు. తాజా టెక్నాలజీ ప్రకారం ఒక్కో వాట్ విద్యుత్‌కు ఎల్‌ఈడీ వెలుతురు 145 నుంచి 170 ల్యూమెన్స్‌లో ఉంటోంది. ఇప్పటివరకు వినియోగిస్తున్న ఎల్‌ఈడీలపై వాట్‌కు వెలుతురు 85-120 ల్యూమెన్స్ ఉంటోంది. ఈ కారణంగా తక్కువ విద్యుత్తు వినియోగంతో ఎక్కువ వెలుతురు వచ్చి విద్యుత్ ఆదా అవుతుంది.
- సెన్సర్ సిస్టం ద్వారా అవసరం లేని చోట ఎల్‌ఈడీల వెలుతురు రాత్రి 12 గంటల తర్వాత తగ్గిస్తుంటారు (డిమ్మింగ్).
- వీధుల్లో వెలగని ఎల్‌ఈడీల సమాచారం కార్యాలయంలో నుంచే సాంకేతికతను ఉపయోగించి తెలుసుకుంటారు. ఈ మేరకు సిబ్బందిని అప్రమత్తం చేసి సమస్యను సరి చేస్తారు.
- విద్యుత్ ఆదాతో మిగిలిన డబ్బును నిర్వహణ సంస్థలకు పుణెలో బిల్లులు చెల్లిస్తున్నారు.

రాజకీయాల్లో మలినాలు తొలగించాలి

- నేరపూరిత నేతలను మనం అడ్డుకోలేమా?
- తిరుపతి 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, తిరుపతి: నేరచరితులు రాజకీయాల్లోకి వచ్చి కలుషితం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ఇంట్లోని చెత్తను శుభ్రం చేస్తున్నట్లే రాజకీయాల్లోని మలినాలనూ తొలగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నేరపూరిత నేతలు అవసరమా? మనం అడ్డుకోలేమా అని ప్రశ్నించారు. హత్యా రాజకీయాలు చేసే వ్యక్తుల గుండెల్లో నిద్రపోతానని హెచ్చరించారు. 2019 ఎన్నికల సమయంలో వివేకానందరెడ్డిని చంపి ఆ నెపాన్ని 'సాక్షి' మీడియా ద్వారా నాపై నెట్టేందుకు, బాబాయిని పోగొట్టుకున్నారనే సానుభూతితో వారిని (జగన్‌ను) గెలిపించారని గుర్తుచేశారు. ఎన్నికల్లో వైకాపా గెలిచిన తర్వాత ప్రజలందరూ మోసపోయారన్నారు. సీఎం చంద్రబాబు శనివారం తిరుపతి జిల్లాలో పర్యటించారు. తొలుత రేణిగుంట మండలం తూకివాకంలోని సమీకృత వ్యర్థాల నిర్వహణ ప్లాంటును పరిశీలించారు. అనంతరం తిరుపతి కపిలతీర్థంలోని శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. తర్వాత పోలీస్ పరేడ్ మైదానంలో 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. చివరగా కంచి మఠానికి చేరుకుని శ్రీవిజయేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకున్నారు. వర్షం పడినా పర్యటనకు అంతరాయం కలగలేదు. 'స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వచ్చిన ఐదు పురస్కారాలతో దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచింది. ప్లాస్టిక్ బ్యాగులు, కప్పులు, ఫ్లెక్సీలు నిలిపేద్దాం. బదులుగా వస్త్రసంచులు, కంపోస్టబుల్ ప్లేట్లు వాడాలి. ఆగస్టు 15 నాటికి రాష్ట్ర సచివాలయాన్ని ప్లాస్టిక్‌రహితంగా మారుస్తాం. అక్టోబరు నాటికి అన్ని మున్సిపాలిటీల్లో, డిసెంబరు నాటికి రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో నిషేధిస్తాం. స్వర్ణాంధ్ర సాకారం కావాలంటే ముందు స్వచ్ఛాంధ్రను సాధించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. '300 ఎకరాల్లో ఉన్న తూకివాకంలోని వ్యర్థాల కేంద్రం నమూనాగా ఉంది. సింగపూర్‌లో మరుగుదొడ్లలో వాడిన నీటిని పరిశుభ్రం చేసి తాగే స్థాయికి తీసుకొస్తున్నారు. తిరుపతి నగరం ఈ అంశంలో దేశానికే ఆదర్శంగా నిలవాలి. పారిశుద్ధ్య కార్మికులే నిజమైన సమాజసేవకులు' అని ముఖ్యమంత్రి అభినందించారు.


వినుతకు మార్గదర్శి రాజేంద్రశెట్టిని పరిచయం చేస్తున్న సీఎం చంద్రబాబు


శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని కార్మికులతో కలిసి శుభ్రం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రోడ్లు, డంప్ యార్డుల్లో చెత్త లేకుండా చూస్తాం

'వైకాపా హయాంలో పన్ను వేసినా చెత్త తొలగించలేదు. మేం అధికారంలోకి వచ్చేనాటికి 86 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయింది. అక్టోబరు 2 నాటికి మొత్తం తొలగిస్తున్నాం. ఇప్పుడు మరో 20 లక్షల టన్నులు వచ్చింది. డిసెంబరు నాటికి రోడ్లు, డంప్ యార్డుల్లో లేకుండా వాటిని తీసేస్తాం. డ్రోన్లతో దోమలమందు పిచికారీ చేయిస్తున్నాం. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ తీసుకొస్తున్నాం. ఎక్కడ వర్షాలు పడుతున్నాయి? ఎక్కడ ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయో తెలుసుకుని ప్రజలకు సమాచారం ఇస్తున్నాం' అని సీఎం పేర్కొన్నారు.

ముందు చూపే తప్ప.. దొంగ చూపు లేదు

'చిత్తూరు జిల్లాలో మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటే.. జగన్ తమ నాయకులతో మామిడిని లాక్కుని రోడ్డుపై పోయించారు. ఇలాంటి రౌడీయిజం మనకు కావాలా? వైకాపా హయాంలో ఐదేళ్లు ప్రజలు నవ్వుముఖంతో ఉన్నారా? రాయలసీమకు నీళ్లు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం. ఆగస్టు 20 నాటికి డీఎస్సీ పూర్తి చేసి ఖాళీలు భర్తీచేస్తాం. త్వరలోనే నిరుద్యోగ భృతి ఇస్తాం. నాకు ముందుచూపే తప్ప.. దొంగచూపు లేదు. ప్రజాహితం కోసం ఎన్ని దాడులు చేసినా సహిస్తా. ప్రజల జీవితాల్లో వెలుగులు తెస్తా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి సత్యప్రసాద్, పురపాలకశాఖ మంత్రి నారాయణ, కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, సుధీర్‌రెడ్డి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.


ఈశ్వరికి మార్గదర్శి శ్రీనివాస్‌ను పరిచయం చేస్తున్న సీఎం చంద్రబాబు

బంగారు కుటుంబాల్లోని చిన్నారులను మీ పిల్లల్లాగే చదివించాలి

'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం చివర్లో సీఎం చంద్రబాబు.. రెండు బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో మాట్లాడారు. తల్లిదండ్రులను కోల్పోయి అవ్వాతాతల అండతో చదువుతున్న వినుత, అనిత, గణేష్‌లతో సంభాషించారు. తనకు ఇంటర్ బైపీసీలో 986 మార్కులు వచ్చాయని, ఎంబీబీఎస్ చదవాలని ఉందని వినుత చెప్పారు. తన చెల్లెలు, తమ్ముడు సివిల్స్‌కు వెళ్లాలనుకుంటున్నారని తెలిపారు. పక్కనే ఉన్న మార్గదర్శి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజేంద్రశెట్టి.. వారి విద్యాభ్యాసం బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ శుక్రవారం ఉండవల్లిలో మార్గదర్శులతో మాట్లాడానని.. కొందరు 5-6వేల కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చారన్నారు.

■ ఈశ్వరి అనే మహిళ.. తన కుమారులు రాహుల్, చైతన్యసాయి ఉన్నత చదువులకు అండగా ఉండాలని కోరారు. వారిని 'రాష్ట్రీయ సేవాసమితి (రాస్)' ద్వారా చదివిస్తానని ఆ సంస్థ సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాస్ హామీ ఇచ్చారు. చిన్నారుల తల్లికి బ్యుటీషియన్ శిక్షణ ఇస్తామని చెప్పారు. మీ పిల్లలను ఎలా చదివిస్తావో.. బంగారు కుటుంబాల్లోని పిల్లలనూ అలాగే చదివించాలని ముఖ్యమంత్రి సూచించారు.

మొరాయించిన కారవాన్

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు అలిపిరిలోని కంచి పీఠంలో ఉండగా బయట వైద్య సదుపాయాలున్న కారవాన్.. ఇంజిన్ వేడెక్కి మొరాయించింది. పోలీసులు పరుగున రుయా ఆసుపత్రిలోని అంబులెన్స్ తీసుకొచ్చి కాన్వాయ్‌లో ఉంచారు.

'సూపర్ హీరోస్' బొమ్మల్లో..
రూ.40 కోట్ల విలువైన కొకైన్

- బెంగళూరు విమానాశ్రయంలో పట్టివేత

బెంగళూరు(యలహంక), న్యూస్‌టుడే: బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం రూ.40 కోట్ల విలువైన కొకైన్ పట్టుబడింది. కచ్చితమైన సమాచారం అందడంతో దోహా నుంచి వచ్చిన ఓ వ్యక్తిని విమానాశ్రయ ప్రవేశమార్గంలో కేంద్ర రెవెన్యూ నిఘా సంస్థ (డీఆర్ఐ)కు చెందిన అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడు తీసుకొచ్చిన రెండు 'సూపర్ హీరోస్ కామిక్స్' బొమ్మలు సాధారణం కన్నా ఎక్కువ బరువు ఉండటంతో తనిఖీలు చేశారు. అందులో రూ.40 కోట్ల విలువైన 4 కిలోల కొకైన్ దొరికింది. దాంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అధికారంలోకి రాగానే.. తెదేపా నాయకులను
పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పిస్తాం

- వైఎస్సార్ జిల్లా వైకాపా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి

కడప నగరపాలక, న్యూస్‌టుడే: అధికారంలోకి రాగానే తెదేపా నాయకులకు సినిమా చూపిస్తామని వైఎస్సార్ జిల్లా వైకాపా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి వ్యాఖ్యానించారు. కడపలో శనివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయింది. వచ్చే ఎన్నికల్లో వైకాపా విజయం సాధిస్తుంది. అప్పుడు తెదేపాలోని అన్ని స్థాయిల్లోని నాయకులకు సినిమా చూపిస్తాం. ఆ పార్టీ నేతలు ఇప్పుడెంత చేస్తున్నారో దానికి రెట్టింపు చేస్తాం. రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేయించి, స్టేషన్ల చుట్టూ తిరిగేలా చేస్తాం. అధికారులకు ఇంకా సర్వీసు ఉందని గుర్తుంచుకోవాలి. ఎవ్వరినీ వదిలిపెట్టం' అని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

ఈనాడు ప్రతిభ

https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net

విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

జనరల్ స్టడీస్ – ఇండియన్ హిస్టరీ

సమున్నత హైందవ సంస్కృతికి సాక్ష్యాలు!

ప్రాచీన, మధ్యయుగ భారతదేశంలో దేవాలయ వాస్తు - పరిణామం

భారతీయ సంస్కృతి, జీవన విధానంలో దేవాలయాలు ప్రధాన అంతర్భాగాలు. ప్రాచీన యుగం నుంచే హిందువులకు అత్యంత పవిత్ర స్థలాలు. వైదిక మతాన్ని సుస్థిరం చేసిన ఈ కళాఖండాలు ఆరాధనకు, ఆధ్యాత్మికతకు కేంద్ర స్థానాలుగా, మనిషిని దైవంతో అనుసంధానించే మార్గాలుగా విరాజిల్లుతున్నాయి. మొదట సాధారణంగానే ప్రారంభమైన ఆలయ నిర్మాణం క్రమంగా అభివృద్ధి చెందుతూ వాస్తు కళను, నిర్మాణ కౌశలాలను శిఖర స్థాయికి చేర్చాయి. ఉత్తరాదిన నగరశైలిలో, దక్షిణాదిన ద్రావిడశైలిలో అద్భుత ఆలయాలు వెలిశాయి. గుప్తులు మొదలు విజయనగర పాలకుల వరకు ఉజ్వలంగా కొనసాగిన ఈ పరిణామక్రమంపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఆలయ నిర్మాణంలో వివిధ శైలులు, వాటి లక్షణాలు, విశిష్టతలు, వాటి ప్రతీకలుగా నిలుస్తున్న ఆలయాల గురించి తెలుసుకోవాలి.

గుప్తుల ఆలయ వాస్తు: ప్రాచీన భారతదేశంలో హైందవ దేవాలయ వాస్తు గుప్తులకాలం (క్రీ.శ.నాలుగో శతాబ్దం) నుంచే ఒక నిర్దిష్ట రూపం సంతరించుకున్నట్లు సాహిత్య, పురావస్తు ఆధారాలు ఉన్నాయి. గుప్తుల కాలంలోనే మొదటిసారిగా వైదిక దేవతలకు ఆలయ నిర్మాణం జరిగింది. బహుశా అవే ఆలయ వాస్తుకు చెందిన తొలి ప్రాథమిక నిర్మాణాలు కావచ్చు. గుప్త సార్వభౌముల నిర్మాణాలు వాస్తుకళపై వారికి ఉన్న అభిరుచి, అనురక్తికి నిదర్శనాలు. వినూత్న సృష్టి చేయాలన్న ఆసక్తి, మతపరమైన అవసరాలు, సౌందర్య పిపాస దానికి తోడయ్యాయి. గుప్తులు దేవాలయ వాస్తుకళ మీద ప్రత్యేక శ్రద్ధ చూపి ఎన్నో నిర్మాణాలు చేశారు. ఆనాటి నిర్మాణాల్లో ఇప్పటికి దక్కినవి అతి స్వల్పం. అయితే పురావస్తుశాఖ పరిశోధనల్లో వెలుగు చూసిన సాంచిలోని పదిహేడో నంబరు ఆలయాలు, మధ్యప్రదేశ్‌లోని - నాచన కుటీరలోని పార్వతి దేవాలయం, భూమారాలోని శివాలయం, దేవగఢ్‌లోని దశావతార ఆలయం ఆనాటి ఆలయ వాస్తుకు అత్యుతమ ఉదాహరణలు.

గుప్తుల కాలపు ఆలయాలు భారీ నిర్మాణాలు కావు. ఆలయ నిర్మాణంలో రాళ్లు, ఇటుకలను ఉపయోగించారు. సాధారణంగా చతురస్ర ఆకారపు గర్భగుడిపై (ప్రధాన దేవత విగ్రహం ఉండే గది) అంతస్తు నిర్మించారు. గర్భగుడికి ముందు స్తంభాలతో కూడిన మండప నిర్మాణం ఉంది. స్తంభాలు చతురస్రాకారంగా లేదా గుండ్రంగా ఉండడంతోపాటు వాటి మీద రకరకాల చిత్రాలు, లతలు చెక్కారు. కొన్ని నిర్మాణాల్లో పైఅంతస్తు లేదు. ఈ ఆలయాలు.. ఆ తర్వాత నిర్మించిన నగర, ద్రావిడ, వేసర ఆలయ శైలులకు మాతృకలని చరిత్రకారుల అభిప్రాయం. అతి సామాన్యంగా, నిరాడంబరంగా ప్రారంభమైన గుప్తుల వాస్తుకళ తర్వాత కాలంలో గంభీరమై ఆనందదాయకంగా రూపొందింది. గుప్తుల కాలంలో భారతదేశ దేవాలయ వాస్తు కళా చరిత్రలో కొత్తశకం మొదలైంది.


గుప్తుల అనంతర యుగంలో భారతీయ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. మధ్యయుగంలోనూ అవి కొనసాగి పరిణతి చెందాయి. భారతదేశ మధ్యయుగ చరిత్రను రెండు భాగాలుగా అధ్యయనం చేస్తారు. మొదటిది రాజపుత్ర యుగం (క్రీ.శ.7-13 శతాబ్దాలు), రెండోది మలిమధ్య యుగం (18వ శతాబ్ది ప్రథమార్ధం వరకు). మధ్యయుగంలో అనేక సామాజిక, సాంస్కృతిక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇందులో గొప్ప చారిత్రాత్మక పరిణామం లలిత కళలు, వాస్తుశిల్పం అభివృద్ధి.


పదిహేడో నంబరు ఆలయం (సాంచి)

ఖజురహో (చందేలా) శైలి

బుందేల్‌ఖండ్ రాజపుత్రులైన చందేలాల తొలి రాజధాని ఖజురహోలోని దేవాలయ సముదాయంలో హిందూ, జైన దేవాలయాలు లభించాయి. ఖజురహో (ఖర్జుర వాహక) ఝాన్సీ దగ్గర ఉంది. ఇక్కడ వివిధ మత శాఖలకు చెందిన దేవాలయాలు 30 పైగా ఉన్నాయి. కళింగ దేవాలయాలు ఉన్నత శిఖరాలు అయితే, ఇక్కడి ఆలయాలు ఎత్తయిన వేదిక మీద నిర్మించడం వల్ల శిఖరాలు సమున్నతంగా దర్శనమిస్తాయి. కళింగలో దేవాలయాల మాదిరిగా విడి అంగాలు ఒకచోట వరుసగా కూర్చినట్లుగా కాకుండా, ఖజురహో కట్టడంలో అంతర్భాగాలుగా ఇమిడి ఉంటాయి. ఆలయం చుట్టూ, శిఖర మూలాల మధ్యభాగంలోని శిల్పసంపద చూపరులను అలరిస్తూ ఉంది. ఇక్కడి నిర్మాణ సమూహాలను యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. ఖజురహోలోని మలిదశ ఆలయాలను ఇసుకరాతితో నిర్మించారు.

ముఖ్య దేవాలయాలు: లక్ష్మణ పార్శ్వనాథ, విశ్వనాథ, చిత్రగుప్త, ఖండరీయా మహాదేవాలయాలు.





ద్రావిడ శైలి దేవాలయ వాస్తు

ఈ శైలి ప్రధానంగా దక్షిణ భారతదేశంలో వ్యాప్తి చెందింది. దక్షిణాదిన ఆలయ వాస్తు చరిత్ర పల్లవుల కాలం నుంచే ప్రారంభమైందని చెబుతారు. పల్లవ వాస్తు, శిల్పకళా రీతులను తీర్చిదిద్దినవారు మొదటి మహేంద్రవర్మ. మొదటి నరసింహవర్మ కాలంలోనే మహాబలిపురంలో ఏకశిలా రాతిరథాలను (పంచపాండవ రథాలు) తొలిపించారు. రెండో నరసింహవర్మ(రాజసింహ), మహాబలిపురం, కంచిలో కైలాసనాథ దేవాలయాలను నిర్మించాడు. పల్లవ వాస్తుకళలో మహోన్నతమైన సృష్టి కైలాసనాథ దేవాలయం. నందివర్మ - ముక్తేశ్వర, వైకుంఠ పెరుమాళ్ ఆలయాలు నిర్మించాడు. పల్లవుల ఆలయ నిర్మాణం ద్రావిడ శైలిగా ప్రసిద్ధి చెందింది.

ద్రావిడ శైలి వాస్తు లక్షణాలు: ఆలయ గర్భగృహం (ప్రధాన దేవత విగ్రహం ఉన్న గది) చతురస్రాకారంగా ఉండి, దానిపై పిరమిడ్ ఆకారంలో అనేక అంతస్తులతో కూడిన నిర్మాణం ఉంటుంది. దీనిని 'విమానం' అంటారు. విమానం శిల్పసంపదతో అలరారుతుంది. గర్భగృహం ముందు మండపం ఉంటుంది. ఆలయం చుట్టూ ప్రాకారాలు (ప్రహరీ గోడ) ఉండి, ఆలయం ఎదురుగా ప్రాకార ప్రధాన ద్వారంపై ఒక పిరమిడ్ ఆకారపు నిర్మాణం ఉంటుంది దానినే 'గోపురం' అంటారు. ఆలయ ప్రాంగణంలో మతపరమైన అవసరాల కోసం నీటి కొలనులు కూడా ఉంటాయి. చోళులు, పాండ్యులు, విజయనగర చక్రవర్తులు దీనిని పతాకస్థాయికి తీసుకెళ్లారు. చోళ దేవాలయాలు ఎత్తయిన విమానాలతో పరిమాణంలో పెద్దవిగా ఉంటాయి. ఉదా: తంజావూర్‌లో బృహదీశ్వరాలయం, గంగైకొండ చోళపురంలో శివాలయం. విజయనగర ఆలయ వాస్తులో విశాలమైన ఆలయ ప్రాంగణం, చుట్టూ ఎత్తయిన ప్రాకారం, ఉన్నతమైన గోపుర ద్వారాలు, కల్యాణ మండపం, దేవీ దేవతల ఆలయాలు, ఉపాలయాలు, ఆలయ స్తంభాలపై శిల్పకళ, స్తంభాలకు అనుస్తంభాలు ముఖ్య లక్షణాలు. ఉదా: హంపిలోని విఠలేశ్వర ఆలయం, హజరారామాలయం, లేపాక్షి ఆలయం, కదిరిలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం. ఎల్లోరాలోని రాష్ట్రకూటుల కైలాసనాథ దేవాలయం ద్రావిడ శైలి ఆలయమే. కాకతీయులు కొన్ని ఆలయాలను ప్రత్యేక త్రికూట విధానంలో నిర్మించారు. అంటే విష్ణు, సూర్య, శివాలయాలకు ఒకే ఉమ్మడి మండపం ఉంటుంది. ఉదా: హనుమకొండలో వేయిస్తంభాల గుడి.



గుజరాత్ శైలి ఆలయాలు

ఈ శైలిలో ఆలయ నిర్మాణం 10 - 13 శతాబ్దాల మధ్య సోలంకి రాజులు (గుజరాత్ చాళుక్యులు), వారి సామంతుల ఆధ్వర్యంలో సాగింది. గుజరాత్ శైలి ఆలయాలు అంత పెద్దవిగా ఉండవు. కానీ సుందరంగా ఉంటాయి. ఈ ఆలయాల్లో గర్భగృహం, మండపం అనే రెండు ప్రధాన అంగాలు ఉంటాయి. గొప్ప శిల్పసంపదతో అలరారే స్తంభాల సౌందర్యం ప్రత్యేక ఆకర్షణ. ఈ శైలిలోని ప్రధాన ఆలయాలు ప్రభాస్ పటాన్‌లోని రుద్రేశ్వర ఆలయం, సోమనాథ్ దేవాలయం, మొధేరాలోని సూర్య దేవాలయం మొదలైనవి. గుజరాత్‌లోని మలియుగం దేవాలయాలు ఎక్కువగా జైన దేవాలయాలు.



వేసర శైలి ఆలయ నిర్మాణం

ఈ శైలి ప్రధానంగా దక్కన్ ప్రాంతంలో అభివృద్ధి చెందింది. బాదామి చాళుక్యులు నిర్మించిన పట్టడికల్, ఐహోల్ దేవాలయాలు నగర, ద్రావిడ శైలి లక్షణాలతో ఉన్నాయి. ఈ నిర్మాణాలు వేసర శైలిగా ప్రసిద్ధి చెందాయి. ఇక హళిబేడు, సోమనాథపురంలో హోయసాల రాజులు నిర్మించిన ఆలయాలు పరిమాణంలో చిన్నవిగా ఉండి, నక్షత్రాకార ప్రణాళిక, కళాత్మకంగా చెక్కిన ద్వారాలు, రంధ్రాలు ఉన్న గవాక్షాలు లాంటివి సౌందర్యాన్ని, ఆధ్యాత్మికతను ప్రతిబింబించే శిల్పకళ లక్షణాలుగా ఉన్నాయి.


రచయిత: వి.వి.ఎస్.రామావతారం

మాదిరి ప్రశ్నలు



కరెంట్ అఫైర్స్

- భారత సీనియర్ దౌత్యవేత్త అనురాగ్ భూషణ్ ఇటీవల ఏ దేశంలో భారత రాయబారిగా నియమితులయ్యారు? **జ:** స్వీడన్
- జాతీయ భద్రతా, ఉగ్రవాద నిరోధక ప్రయత్నాలను బలోపేతం చేయడంలో భాగంగా పునరుద్ధరించిన మల్టీ ఏజెన్సీ సెంటర్ (ఎంఏసీ)ను న్యూదిల్లీలో ఇటీవల ఎవరు ప్రారంభించారు? (రూ.500 కోట్ల వ్యయంతో దీన్ని అభివృద్ధి చేశారు.) **జ:** కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- అంతర్జాతీయ కాంతి దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (యునెస్కో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ డే ఆఫ్ లైట్.. 1960లో థియోడర్ మైమాన్ చేసిన మొదటి విజయవంతమైన లేజర్ ఆపరేషన్ వార్షికోత్సవాన్ని సూచిస్తుంది.) **జ:** మే 16
- సముద్ర కాలుష్య నియంత్రణ, వ్యర్థాల నుంచి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై దృష్టి సారించిన రెండు ఉమ్మడి పరిశోధనా ప్రాజెక్టులను ఇటీవల భారతదేశం ఏ అంతర్జాతీయ సంస్థతో కలసి ప్రారంభించింది? **జ:** యూరోపియన్ యూనియన్
- ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ గణాంకాల ప్రకారం ఏ సంవత్సరం నాటికి భారత్.. చైనాను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద బంగాళదుంపల ఉత్పత్తిదారుగా అవతరించనుంది? **జ:** 2050

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?

- ఎస్ఎస్‌సీ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టులు (1075) చివరి తేదీ: 24.07.2025
- ఇండియన్ కోస్ట్ గార్డ్ ఉద్యోగాలు (170) చివరి తేదీ: 23.07.2025

దారులు... ఏరులై...


బందరు రోడ్డు జలమయం

పటమట, న్యూస్‌టుడే: ఎండ ఉక్కతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది వేసవిలోనూ ఇటువంటి వేడిని ప్రజలు చూడలేదు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడ్డారు. అధిక ఉష్ణోగ్రతతో ఇబ్బంది పడుతున్న నగర ప్రజలు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. ఎక్కడికక్కడ రోడ్ల మీద నీరు నిలిచిపోయింది. వాహనదారులు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడ్డారు. గంటకుపైగా వర్షంతో పాటు గాలులు వీచిన నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్తు తీగల మీద పడ్డాయి. సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్తు సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి 10 గంటల వరకు ఎక్కడ చూసినా భారీగా ట్రాఫిక్ నిలిచిన దృశ్యాలే కన్పించాయి.

నవ మేధస్సు.. యువ ఉషస్సు!

■ 25 వేల చదరపు అడుగుల్లో కొలువైన ఎక్లాట్ ■ 300 మందికి కొలువులు.. మరో వెయ్యి లక్ష్యం

ఈనాడు – అమరావతి

గన్నవరం విమానాశ్రయానికి సమీపంలో కోస్తా హైటెక్ సిటీగా పిలిచే.. మేధ టవర్స్‌కు మళ్లీ కళొచ్చింది. ఒక్కొక్కటిగా కంపెనీలు కొలువుదీరుతున్నాయి. తాజాగా ప్రముఖ మెడికల్ కోడింగ్ కంపెనీ ఎక్లాట్ తన నూతన శాఖను మేధ టవర్స్‌లో ఏర్పాటు చేసింది. వైద్య సాంకేతికత, సేవల రంగంలో ఈ సంస్థకు మంచి గుర్తింపు ఉంది. మెడికల్ కోడింగ్, బిల్లింగ్, ఆడిటింగ్, క్లినికల్ డాక్యుమెంటేషన్, హెచ్‌సీసీ కోడింగ్, సాఫ్ట్‌వేర్ ఆధారిత పరిష్కారాలను చూపిస్తూ.. ఎక్లాట్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా సేవలందిస్తోంది. రెవెన్యూ, డేటా అనలటిక్స్, ఏఐ ఆధారిత క్లినికల్ డాక్యుమెంటేషన్ సొల్యూషన్స్‌లో ఎక్లాట్‌కు మంచి పేరు, నెట్‌వర్క్ ఉన్నాయి. ఇంత పెద్ద మెడికల్ కోడింగ్ సంస్థ మేధ టవర్స్‌లో తన శాఖను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని.. తాజాగా ప్రారంభోత్సవం వేళ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

దేశంలో చిన్న నగరాలు, పట్టణాల్లో తమ కార్యకలాపాలను ఆరంభిస్తూ.. విజయవంతంగా కొనసాగించడంలో.. ఎక్లాట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇప్పటికే తెలంగాణలోని కరీంనగర్‌లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసి విజయవంతంగా నడుపుతోంది. హైదరాబాద్, లఖ్‌నవూ, ముంబయిల్లోనూ ఈ సంస్థ శాఖలు ఉన్నాయి. ప్రస్తుతం గన్నవరంలోని కార్యాలయంలో ఇప్పటికే 300 మందికి ఉపాధి అవకాశాలను కల్పించింది. వచ్చే ఏడాదిలోగా మరో వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించాలనేది లక్ష్యం. మేధ టవర్స్‌లో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో.. తన నూతన కార్యాలయాన్ని తాజాగా ఆరంభించింది.


కార్యక్రమానికి హాజరైన యువత


ఎక్లాట్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్ పక్కన విప్ యార్లగడ్డ, కలెక్టర్ బాలాజీ

గత తెదేపా ప్రభుత్వంలోనే కంపెనీలు..

గన్నవరం విమానాశ్రయానికి సమీపంలో 30 ఎకరాల్లో మేధ టవర్స్‌ను 14 ఏళ్ల కిందటే 2005లో అప్పటి ప్రభుత్వం నిర్మించినా.. చాలాకాలం ఖాళీగా ఉంది. 2014లో తెదేపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఐటీ కంపెనీలను తీసుకొచ్చి ఇక్కడ స్థలం కేటాయించారు. గతంలో ఐటీ మంత్రిగా ఉన్న సమయంలోనే నారా లోకేశ్ ఒకేసారి ఏడు కంపెనీలను తీసుకొచ్చి ఏర్పాటు చేయించారు. గ్రూపో యాంటోలిన్, ఐఈఎస్, రోటోమేకర్ వీఎఫ్‌ఎక్స్, మీస్లోవా, యమేహా, చందు సాఫ్ట్, ఈపీ సాఫ్ట్, హాలీవుడ్, ఇన్ఫో పూరిస్, ఫస్ట్‌సోర్స్, టెక్ మహేంద్ర.. సహా 20 సంస్థలు క్రమంగా ఇక్కడ ఏర్పాటయ్యాయి. వేల మంది ఉద్యోగులు తరలివచ్చారు. వైకాపా ప్రభుత్వం గద్దెనెక్కాక.. ఐటీ సంస్థలకు ప్రోత్సాహకాలను ఆపేసింది. అంతే.. ఒక్కొక్కటిగా సంస్థలన్నీ వెళ్లిపోయి.. ఓ నాలుగు మాత్రమే మిగిలాయి.

రెండు లక్షల చదరపు అడుగుల్లో..

నాలుగు అంతస్తుల మేధ టవర్స్‌లో ఒక్కో ఫ్లోర్‌కు 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులో ఉంది. మొత్తంగా నాలుగు అంతస్తుల్లో కలిపి రెండు లక్షల చదరపు అడుగుల స్థలం కార్యాలయాల కోసం ఇక్కడ సిద్ధం చేశారు. అదంతా గత తెదేపా హయాంలో నిండిపోవడంతో.. తర్వాత పక్కనే మరో టవర్ నిర్మాణం ఆరంభించారు. ఈ టవర్ కూడా చాలా వేగంగానే నాలుగు అంతస్తుల నిర్మాణం పూర్తిచేసుకుంది. జగన్ జమానాలో కొత్త టవర్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. పాత భవనంలో ఉన్న కంపెనీలను కూడా పొగబెట్టి పారిపోయేలా చేశారు. ప్రస్తుతం మళ్లీ ఒక్కొక్కటిగా కంపెనీలను తీసుకొస్తున్నారు.


ఎక్లాట్ కార్యాలయ సముదాయం

నేడు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : సెలవు దినమైనప్పటికీ ఆదివారం జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లు వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని విద్యుత్తు సంస్థ ఎస్‌ఈ తోట శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఏపీ సీపీడీసీఎల్ కస్టమర్ యాప్, గూగుల్‌పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్ డెస్క్ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చని ఆయన చెప్పారు.

విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దండి

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విద్యార్థుల్లో సృజన, నైపుణ్యాలను పెంపొందించి వారిని ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దాలని జిల్లా సైన్స్ అధికారి కె.పిచ్చేశ్వరరావు, రిసోర్స్‌పర్సన్ శామ్యూల్ అన్నారు. జిల్లాలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల రిసోర్స్‌పర్సన్లకు నగరంలోని మేరీస్ స్టెల్లా కళాశాలలో శనివారం కార్యశాల నిర్వహించారు. డిజైన్ థింకింగ్, ఏఐ టూల్స్, ఎలక్ట్రానిక్స్, సోలార్ పవర్ రోబోటిక్స్, కోడింగ్, అటల్ డాష్ బోర్డు గురించి తెలియజేశారు. దేశం గర్వించే ఆవిష్కరణలు విద్యార్థులు చేసేలా ప్రోత్సహించాలని కోరారు. సైన్స్ ప్రాజెక్టులకు సంబంధించి బ్రోచర్ ఆవిష్కరించారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పిచ్చేశ్వరరావు, శామ్యూల్ తదితరులు



అంకురాలు అదుర్స్..

హైడ్రో జల విద్యుత్తు కేంద్రం

నంద్యాల జిల్లా పిన్నాపురంలో రూ.28 వేల కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తోన్న ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పంప్డ్ పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ నమూనాలను గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులు ప్రదర్శించారు. ఎత్తైన ప్రాంతంలో రిజర్వాయర్‌ను నిర్మించి అక్కడి నుంచి తక్కువ ఎత్తులో ఉన్న రిజర్వాయర్‌కు నీటి ప్రవాహాన్ని ఏర్పాటు చేసి.. మధ్యలో హైడ్రో జల విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. సౌర, పవన విద్యుత్తును వాడనున్నారు. ప్రస్తుతం 99 శాతం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయిందని సంస్థ ప్రతినిధులు వివరించారు.
★ కాకినాడలో ఏఎం గ్రీన్‌కో సంస్థ గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని చేపట్టింది. దీనికి సంబంధించిన నమూనా ప్లాంట్‌ను సంస్థ ప్రతినిధులు ప్రదర్శించారు.

హరిత ఇంధనం.. భవిత నందనం

'గ్రీన్ హైడ్రోజన్' ఆవశ్యకతపై నిపుణుల విస్తృత చర్చ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తుళ్లూరు

గ్రీన్ హైడ్రోజన్ రెండు రోజుల సమిట్‌లో ఎన్నో ఆలోచనలకు బీజం పడింది. పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, నిపుణుల విస్తృత చర్చల్లో అనేక కీలకాంశాలు వెల్లడయ్యాయి. ముఖ్య నిర్ణయాల దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధాని అమరావతిలోని ఏపీ-ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమిట్ రెండో రోజు పలు ప్లీనరీ సెషన్లు జరిగాయి. హైడ్రోజన్ ఉత్పత్తిలో టెక్నాలజీల పాత్రపై ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్.విజయ్, హైడ్రోజన్ ప్రస్తుత నిల్వల పరిస్థితి, భవిష్యత్తు అవసరాలపై పీడీఈయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ గూడూరు, టెక్నాలజీస్ ఫర్ క్లీన్ హైడ్రోజన్ అడ్వాన్సెస్, ఛాలెంజెస్ మీద టీపీసీఎల్ రాజన్‌నాయర్, పెట్టుబడి అవకాశాలపై ఆర్‌ఈపీఏ ప్రొఫెసర్ గోపాలకృష్ణన్ అయ్యర్, హైడ్రోజన్ నిల్వలపరంగా సవాళ్లపై ఐఐటీ ప్రొఫెసర్ పి.ముత్తుకుమార్ తదితరులు ప్యానలిస్టులతో సుదీర్ఘంగా చర్చించారు. గ్రీన్ హైడ్రోజన్‌ను తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయడం, నిల్వ, రవాణాపరంగా అవకాశాలను ఎలా మెరుగుపరచుకోవాలో విస్తృతంగా మాట్లాడారు.


సమిట్‌లో పాల్గొన్న ఆహ్వానితులు, ప్రముఖులు

విదేశీ ప్రతినిధుల సందడి..

రెండు రోజుల సమిట్‌లో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఆఫ్రికా తదితర దేశాలకు చెందిన వివిధ పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధనారంగ నిపుణులు ప్రసంగించారు. 29 మంది ముఖ్యులు హాజరైనట్టు ఎస్‌ఆర్‌ఎం వర్గాలు తెలిపాయి. చర్చల సారాంశాన్ని తెలుసుకునేందుకు పరిసర విద్యాలయాలకు చెందిన విద్యార్థులు కూడా రావడం విశేషం.

పైపులైన్ల పనితీరును విశ్లేషించే సాఫ్ట్‌వేర్

గ్రీన్ హైడ్రోజన్ పైపులైన్ల పనితీరును విశ్లేషించి వాటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అందజేసే సాఫ్ట్‌వేర్‌ను ఎస్‌ఆర్‌ఎంకు చెందిన విద్యార్థులు అభివృద్ధి చేశారు. ఈ సాఫ్ట్‌వేర్ క్లౌడ్ కంప్యూటింగ్ విధానంలో అనుసంధానమై ఎక్కడ పైపులైన్‌లు లీకేజీలు ఉన్నాయో పసిగడుతుంది. ఎస్‌ఆర్‌ఎం ప్రొఫెసర్ డా.కె.గురుమూర్తి పర్యవేక్షణలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న చరణ్ తదితర విద్యార్థులు దీన్ని రూపొందించారు.

నేడు లిఫ్టు వినియోగంపై ఆంక్షలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఈనెల 20న భక్తుల రద్దీ దృష్ట్యా వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లులకు మాత్రమే లిఫ్టు సౌకర్యం కల్పిస్తున్న దుర్గగుడి ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కావడంతో ఆషాఢ సారె బృందాలతోపాటు సామాన్య భక్తులు కూడా పెద్ద సంఖ్యలో దుర్గమ్మ దర్శనానికి తరలి వచ్చే అవకాశం ఉండడంతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని దర్శన టిక్కెట్లు రద్దు చేసినట్లు తెలిపారు. అన్ని లైన్లు ఉచితంగానే భక్తులకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్, దేవస్థానం బస్సులు, బ్యాటరీ వాహనాలు, వీల్‌ఛైర్ల నిర్వహణ విషయంపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు.

ప్రభుత్వ బడి.. వసతుల ఒడి

పిల్లలను చదివించండి.. తల్లిదండ్రులకు అవగాహన
డ్రాపౌట్స్‌ని చేర్పించేందుకు గురువుల చొరవ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలే ఎక్కువగా చదువుకుంటున్నారు. విద్యార్థులు చక్కగా చదువుకునేలా ఆయా విద్యాలయాల్లో కూటమి ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తోంది. గత వైకాపా ప్రభుత్వంతో పోల్చుకుంటే ప్రస్తుతం పిల్లల ప్రవేశాల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా విద్యా సంవత్సరం పూర్తికాకుండానే చాలా మంది విద్యార్థులు చదువు మానేశారు. వివిధ పనులు చేసుకుంటున్నారు. కొంత మంది ఖాళీగా ఇంటి వద్ద ఉంటున్నారు. అటువంటి వారిని బడిబాట పట్టించేందుకు జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు నేతృత్వంలో డివిజన్, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు చొరవ చూపారు. డ్రాపౌట్ అయిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పిల్లలను చదివిస్తే కలిగే ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. వారిని ఒప్పించి బడుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.


తిరువూరులో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఇప్పటివరకు 13,389 మంది చేరిక

జిల్లాలోని 20 మండలాల్లో 937 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదకొండో తరగతి వరకు 15,450 మంది విద్యార్థులు గత విద్యాసంవత్సరంలో డ్రాపౌట్ అయినట్లు గుర్తించారు. వారందరికీ ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక తయారు చేసింది. ముందుగా విద్యార్థుల చిరునామాలు సేకరించారు. వేసవి సెలవుల నుంచి అధికారులు, ఉపాధ్యాయులు డ్రాపౌట్ పిల్లల ఇళ్లకు వెళ్లారు. ప్రభుత్వ పాఠశాలలో చదివితే అందించే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్, మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం వినియోగం, పదో తరగతిలో సాధించిన ఉత్తమ ఫలితాలు, ఆధునిక వసతులు, శిక్షణ పొందిన గురువులు తదితర వసతుల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారిలో మార్పు తీసుకొచ్చి 13,389 మందిని మళ్లీ చేర్పించారు.

నిరంతర ప్రక్రియతో సత్ఫలితాలు

చదువుతూ మానేసిన వారిని, బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పాలనేది లక్ష్యం. వేసవి సెలవులు ఇచ్చినప్పటి నుంచి బడులు పునః ప్రారంభమయ్యే వరకు అన్ని మండలాల్లో ఉపాధ్యాయులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి డ్రాపౌట్ అయిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. తమ పిల్లలను తల్లిదండ్రులు చదివిస్తే ఎటువంటి ఖర్చు లేకుండా అన్ని ప్రభుత్వమే సమకూరుస్తుంది.
– యు.వి.సుబ్బారావు, జిల్లా విద్యాశాఖాధికారి

పగలు కన్నేసి.. రేతిరి కన్నమేసి!

● నేర చరిత్ర ఉన్నా పట్టకనే.. ఉపాధి కల్పన
● నగరంలో పనిచేసే వారిపై నిఘా కరవు...

ఈనాడు – అమరావతి

"వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి.. పలువురు నగరంలో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ వ్యాపారాలు నిర్వహిస్తున్న వేరే రాష్ట్రాల వారు.. తమ ప్రాంతాల వారికే పనిలో ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే.. వీరి వివరాలేవీ యజమానుల వద్ద ఉండడం లేదు. వెరసి వీరిలో చాలా మంది నేరాలకు పాల్పడి పరారవుతున్నారు. వీరిని పట్టుకోవడం పోలీసులకు కష్టంగా మారుతోంది. పశ్చిమ బెంగాల్ నుంచి ఎక్కువ మంది నకిలీ గుర్తింపు కార్డులతో నగరంలో వాలిపోతున్నారు. వీరిలో అత్యధికులు బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా సరిహద్దు దాటొచ్చి ఇక్కడ నేరాలకు పాల్పడి పారిపోతున్నారు."

అన్ని రంగాల్లో పొరుగు వారే..

విజయవాడలో నిర్మాణ రంగం, బంగారు నగల తయారీ, ఫ్యాన్సీ దుకాణాలు, విద్యుత్తు ఉపకరణాలు, హోటళ్లు, ఆటోమొబైల్, గృహాలంకరణ, మగ్గాలు, తదితర వృత్తుల్లో స్థానికేతరులు 50 వేల మంది పని చేస్తున్నారు. నగల వ్యాపారం బాగా సాగుతోంది. పశ్చిమ బెంగాల్ వ్యాపారులే బంగారం కార్ఖానాలు నడుపుతున్నారు. వీటిల్లో బెంగాలీలనే నియమించుకుంటున్నారు. తర్వాత మహారాష్ట్ర వారూ ఉన్నారు.
★ మగ్గాలపై డిజైన్లు వేసే పనుల్లో బెంగాల్ వారు.. హోటళ్లలో కర్ణాటక వారు ఉపాధి పొందుతున్నారు. నగరం, సమీప ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, భవనాల నిర్మాణాల్లోనూ ఛత్తీస్‌గఢ్, బీహార్ కూలీలే ఎక్కువ. తక్కువ వేతనాలకు వీరు వస్తుండడమే కారణం.
★ ప్లైవుడ్, వడ్రంగి, ఇళ్లల్లో ఇంటీరియర్, చలువరాతి పరిచే పనులు, మరుగుదొడ్లలో బిగింపు పనులలో రాజస్థాన్, మహారాష్ట్ర కార్మికులు పనిచేస్తున్నారు.



★ ఫ్యాన్సీ, ఎలక్ట్రికల్ దుకాణాలు.. మహారాష్ట్ర, రాజస్థాన్ వారే నిర్వహిస్తూ.. పనికి ఆయా రాష్ట్రాల వారినే పెట్టుకుంటున్నారు.
★ ఆటోనగర్‌లో వాహనాల బాడీ బిల్డింగ్ యూనిట్లు, మరమ్మతుల్లో ఇతర రాష్ట్రాల వారు ఉపాధి పొందుతున్నారు.
★ ఆటోనగర్‌లో ఓ మురికివాడలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఉపాధి పొందే వారి కాలనీ ఉంది. ఎక్కువ మంది కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల వారే ఉన్నారు.

డబ్బు కోసం చోరీలు...

వివిధ పనులు చేస్తున్న వారిలో ఎక్కువ మంది నేరాలకు పాల్పడుతున్నారు. పగటి పూట పనులు చేస్తూ.. రాత్రుళ్లు డబ్బుల కోసం చోరీలు చేస్తున్నారు. మహిళల మెడల్లో గొలుసులు తెంచుకెళ్లడం, తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నారు. వీరు ఎక్కువగా మురికివాడల్లో ఉంటున్నారు. ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నారు. వీరి వివరాలేవీ తీసుకోకుండా పనిలో పెట్టుకుంటున్నారు. కేవలం వేతనాలు చెల్లించి చేతులు దులుపుకొంటున్నారు. ఇతర రాష్ట్రాల వారి ఆధార్ లేదా ఓటరు కార్డులు తీసుకోవడం లేదు. వారి సమాచారాన్ని దాచడం లేదు. ప్రత్యేక గుర్తింపు కార్డుల జారీ ప్రతిపాదన అమలుకు నోచలేదు.
★ వన్‌టౌన్‌లో ఓ నగల దుకాణంలో పనిచేసే కార్మికుడు మూడు కిలోల బంగారం తీసుకుని కార్ఖానాకు బయలుదేరాడు. కార్ఖానాకు వెళ్లకుండా బంగారంతో స్వస్థలానికి ఉడాయించాడు. నెల కిందట వన్‌టౌన్‌లోనే ఇదే రీతిలో మరో కార్మికుడు రెండు కిలోల బంగారంతో పారిపోయాడు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు ఇవ్వలేదు. దీంతో కేసు కూడా నమోదు కాలేదు.

యాజమాన్య హక్కులు కల్పించడమే లక్ష్యం

పొన్నవరం(వీరులపాడు), న్యూస్‌టుడే : గ్రామీణ పౌరులకు గ్రామ కంఠాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలపై యాజమాన్య హక్కులు కల్పించేందుకే స్వమిత్వ సర్వే చేపడుతున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ అన్నారు. పొన్నవరంలో స్వమిత్వ సర్వే చేస్తున్న తీరును శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ కంఠంలోని ఆస్తుల డిజిటలైజేషన్‌లో భాగంగా చేపట్టిన స్వమిత్వ సర్వేని రాష్ట్రంలోనే మొదటిసారిగా పొన్నవరంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించినట్లు తెలిపారు. సర్వే చేస్తున్న సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకొన్నారు. సర్వేలో ఎంతమంది పాల్గొంటున్నారు... సరాసరి రోజుకు ఎన్ని ఆస్తుల కొలతలు తీస్తున్నారు.. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. సర్వే పూర్తి చేసిన గృహాలు, స్థలాల వద్దకు ఆయన స్వయంగా వెళ్లి సిబ్బంది నమోదు చేసిన కొలతలను సరిచూశారు. క్యూజీఐఎస్ వెబ్‌సైట్‌లో ప్రోపర్టీస్ వెర్టిలైజేషన్ ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అడిషనల్ కమిషనర్ (పీఆర్‌అండ్‌ఆర్డీ) ఎమ్. సుధాకర్, స్వమిత్వ డైరెక్టర్ ఎ.నిశాంత్ రెడ్డి, డీపీవో లావణ్య, డీఎల్‌పీవో రాఘవన్, తహసీల్దార్ రవికుమార్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో బి.రాజు, సర్పంచి షోడగిరి రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.
★ తమ సమస్యలు పరిష్కరించాలని ఉపాధి హామీ పథకం ఎన్టీఆర్ జిల్లా క్షేత్ర సహాయకుల సంఘం అధ్యక్షుడు కటారపు శ్రీనివాసరావు కృష్ణతేజకు అర్జీ అందజేశారు. మూడు నెలలుగా జీతాలు రావడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచాలని కోరారు.


సర్వే పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, అధికారులు

ఎన్టీఆర్ కమిషనరేట్‌కు ముగ్గురు ఏసీపీలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు ముగ్గురు ఏసీపీలను బదిలీ చేశారు. శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ బి.రాజశేఖర్‌ను సైబర్ క్రైం ఏసీపీగా నియమించారు. గ్రేహౌండ్స్‌లో ప్రొబేషనరీ డీఎస్పీ ఎన్.భానుప్రకాశ్‌రెడ్డిని స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా, వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ టి.దైవప్రసాద్‌ను విజయవాడ మహిళా పీఎస్ ఏసీపీగా కేటాయించారు. కాగా మహిళా పీఎస్ ఏసీపీ కె.లతాకుమారి ఇక్కడి నుంచి బదిలీ చేశారు.

కాలువలకు సాగునీరు విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు శనివారం 11,569 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 8,063 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,506 క్యూసెక్కులు ఇచ్చారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 3,819, ఏలూరు 1,302, బందరు 1,499, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,443 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు.

ఈ-లాటరీలో రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన 12 గ్రామాలకు చెందిన 59 మంది రైతులకు శనివారం గవర్నర్‌పేటలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ నిర్వహించారు. రైతులకు 91 నివాస ప్లాట్లు, 47 వాణిజ్య ప్లాట్లు కేటాయించారు. నవులూరు 2, నిడమర్రు 1, 2, అబ్బరాజుపాలెం, అనంతవరం, రాయపూడి 1, 2, తుళ్లూరు 1, 2, లింగాయపాలెం, బోరుపాలెం, నెక్కల్లు, ఉద్దండరాయునిపాలెం, ఉండవల్లి రైతులు, భూ యజమానులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా లాటరీ తీసి ప్లాట్లు కేటాయించారు. వాటిని పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందించారు. ల్యాండ్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డేవిడ్ రాజు మాట్లాడుతూ.. ఆయా ప్లాట్లు చూపించేందుకు ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బందిని, గ్రామ సర్వేయర్లను నియమించినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని.. దీనికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, ఎం.శేషిరెడ్డి, ఎ.జి.చిన్ని కృష్ణ, పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న డేవిడ్ రాజు





విజయవాడ నగరంలో.. వర్షంలో ప్రజల ఇక్కట్లు



సన్‌రైజ్ హాస్పటల్ వద్ద వర్షపు నీటిలో నిలిచిపోయిన అంబులెన్స్



అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్‌లో నిలిచిన ట్రాఫిక్

ఉదయం ఉక్కపోత.. రాత్రి కుండపోత!

పగలంతా విపరీతమైన ఎండ, ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. వేసవిని తలపిస్తున్న ఉష్ణోగ్రతల వేడిమికి ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అయితే.. శనివారం రాత్రికి ఒక్కసారిగా వాతావరణం మారింది. మేఘాలు వర్షించాయి. నగరంలో కుండపోతగా వాన కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్ స్తంభించడంతో బాటసారులు, ప్రయాణికులు, చోదకులు ఇబ్బందిపడ్డారు. **- ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, సీతారాంపురం, అజిత్‌సింగ్‌నగర్**



విజయా టాకీస్ కూడలిలో ఇలా..

మార్కెట్ యార్డుల బలోపేతానికి చర్యలు

గొల్లపూడి, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్ యార్డుల బలోపేతానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. శనివారం గొల్లపూడిలో విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీలు నిర్వీర్యమయ్యాయన్నారు. పంజాబ్ రాష్ట్రంలో మార్కెట్ కమిటీలు బలోపేతంగా ఉన్నాయని, అక్కడకు వెళ్లి వాటి పనితీరును పరిశీలించాలని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయాన్ని త్వరలో అందిస్తామన్నారు. మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ..రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని..వారు పండించిన ధాన్యం సొమ్మును సకాలంలో వాళ్ల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. అనంతరం మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసుని సన్మానించారు. వైస్ ఛైర్మన్ పాలమాధవ్, జేడీ కె.శ్రీనివాసరావు, డీడీ పాపారావు, మార్కెట్‌కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, శాసనసభ్యుడు కృష్ణప్రసాద్

బ్రాయిలర్ ధరలు (కిలో ఇక రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -107 రిటైల్ ధర 129 చికెన్ విత్ స్కిన్ -187, చికెన్ స్కిన్‌లెస్ - 213.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, 123, 134 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 230.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

పెద్దవరం(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టరు జి.లక్ష్మీశ కోరారు. శనివారం పెద్దవరంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా కార్మికులకు ఇస్తున్న పది మంది మహిళలకు ప్రశంసాపత్రాలు, మొక్కలు పంపిణీ చేశారు. హరితరాయబారులను సన్మానించారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో కలిసి అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించవద్దని చెప్పారు. మైక్రో ప్లాస్టిక్ వల్ల తల్లిపాలు కూడా కలుషితం అవుతున్నాయని తెలిపారు. మహిళల్లో సంతాన లేమి, పీసీవోడీ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రతి ఊరిని స్వచ్ఛతగా మార్చడానికి అందరూ కృషి చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసప్రసాద్ స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆశాకార్యకర్తను నియమించాలని, తాగునీరు సక్రమంగా రావడం లేదని, ఏపీఐఐసీకి గతంలో భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ద్వారా రూ.12 కోట్లు పరిహారం మంజూరు చేయించాలని తెదేపా నాయకుడు ఇంటూరి సీతారామయ్య, వైకాపా నాయకుడు ఎం.కొండారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రాలిచ్చారు. డీపీవో లావణ్యకుమారి, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, ఆర్డీవో బాలకృష్ణ, డీఎల్‌పీవో కేవీ రాఘవన్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి.శ్రీనివాసరావు, సర్పంచి బి.చినదేవిలి తదితరులు పాల్గొన్నారు.



పెద్దవరంలో మొక్కనాటి నీరుపోస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

స్మార్ట్ మీటర్లు సాధారణ మీటర్ల వలే పనిచేస్తాయి

ఎస్ఈ శ్రీనివాసరావు వెల్లడి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : స్మార్ట్ మీటర్లు ప్రస్తుతం ఉన్న సాధారణ మీటర్ల మాదిరిగానే కచ్చితత్వంతో పని చేస్తాయని విద్యుత్తు సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్మార్ట్ మీటర్లలో అధునాతన కమ్యూనికేషన్ సదుపాయం ఉంటుందని చెప్పారు. వినియోగదారులు రీడింగుల కచ్చితత్వం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లతో అధిక బిల్లింగ్ వస్తుందనే వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న మీటర్ రీడింగ్‌లు కొనసాగిస్తున్నట్లు కచ్చితమైన తేదీలో రీడింగ్ తీసుకుంటారని చెప్పారు. స్మార్ట్ మీటర్లతో కచ్చితమైన తేదీల్లో రీడింగ్‌లు ఆన్‌లైన్‌లో నమోదవుతాయని వివరించారు. మీటర్ రీడర్లు ఇళ్లకు వెళ్లాల్సిన పని ఉండదన్నారు. ముందుగా రీఛార్జి చేసుకునే (ప్రీపెయిడ్) విద్యుత్తు వినియోగించే విధానం ప్రస్తుతం అమలులో లేదని స్పష్టం చేశారు. పీక్ సమయంలో ఎక్కువ ధరలు ఉంటాయన్నది అపోహ మాత్రమేనని పేర్కొన్నారు. అన్ని టారిఫ్ శ్లాబులు 24 గంటలూ ఒకే విధంగా ఉంటాయని వివరించారు. స్మార్ట్ మీటర్ల ఖర్చు వినియోగదారులపై వేస్తారని, దాని ఖర్చును నెల వారీ బిల్లుల్లో వాయిదా పద్ధతిలో వసూలు చేస్తారన్నది నిజం లేదన్నారు. ఆ ఖర్చును విద్యుత్తు సంస్థలు, విద్యుత్తు మంత్రిత్వశాఖ, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా భరిస్తాయని ఎస్ఈ వెల్లడించారు.

'భీష్మ్' కార్యశాలకు హాజరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వరదలు, తుపాన్లు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించిన తరుణంలో అప్పటికప్పుడు ప్రాణాలు కాపాడేందుకు భారత్ హెల్త్ ఇనిషియేటివ్ ఫర్ సహయోగ్, హిత అండ్ మైత్రి (బీహెచ్ఐఎస్‌హెచ్ఎం/భీష్మ్) కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి మూడు భీష్మ్ క్యూబ్‌లు కేంద్రం నుంచి వచ్చాయి. ఈక్రమంలో ఆసుపత్రిలో శనివారం వాటి ప్రదర్శన, కార్యశాలను నిర్వహించగా.. కలెక్టర్ హాజరయ్యారు.



ఎయిమ్స్ ఆసుపత్రిలో పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

పెట్టుబడుల పేరుతో రూ.17.3 లక్షలు దోచేశారు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీరామచంద్రనగర్‌కు చెందిన ఓ వృద్ధుడు (61).. పెట్టుబడులు పెట్టి నిలువునా మోసపోయారు. ఆయన వాట్సప్‌కు వచ్చిన సమాచారం మేరకు 'ఆనంద్ రాఠీ' పేరుతో ఉన్న ట్రేడింగ్ అప్లికేషన్ యాప్‌లో పేరు రిజిస్టర్ చేసుకున్నారు. అందులో చెప్పినట్లుగా రెండు ప్రైవేటు బ్యాంకుల్లో విడతల వారీగా రూ.4.63 లక్షలు పెట్టుబడులు పెట్టారు. తర్వాత పెట్టుబడులను విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా రాలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించారు. మరో యాప్‌లో కూడా రూ.12.67లక్షలు పెట్టుబడులు పెట్టి మోసపోయారు. వృద్ధుడు పెట్టుబడులు పెట్టిన రూ.4.63లక్షలు పశ్చిమ బెంగాల్‌లోని రెండు ప్రైవేట్ బ్యాంకులకు వెళ్లినట్లు గుర్తించారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

వాహన యజమానులకు జరిమానా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : చౌక ధరల దుకాణాలకు చెందిన రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణాకు వినియోగించిన వాహన యజమానులకు రూ.1.47 లక్షల జరిమానా విధిస్తూ జేసీ ఎస్.ఇలక్కియా ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖకు సంబంధించిన 6ఎ కేసుల కోర్టును శనివారం నిర్వహించారు. అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.28,30,967ల విలువ కలిగిన 1,399.51 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించారు.

నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రగతి సూచికల లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. వీటి పురోగతి వివరాలు ఎప్పటికప్పుడు స్వర్ణాంధ్ర వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్- కీలక ప్రగతి సూచికలు (కేపీఐ)పై గ్రామీణ నీటి సరఫరా, భూగర్భ జలాలు, జలవనరులు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), వ్యవసాయ మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. భూగర్భ జలాలను విచ్చలవిడిగా వినియోగించకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన కింద స్వయం సహాయక సంఘాలకు సకాలంలో బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక సాధికారిత దిశగా ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. సీపీవో వై.శ్రీలత, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, ఏడీఎం రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.



కొత్త మలుపులు తిరుగుతున్న అదృశ్యం కేసు

వైజాగ్‌లో తిరువూరు ఏఈఈ చరవాణి సిగ్నల్స్

మైలవరం, న్యూస్‌టుడే: సంచలనం కలిగించిన జలవనరులశాఖ తిరువూరు ఏఈఈ వి.కిశోర్ అదృశ్యం కేసు కొత్త మలుపులు తిరుగుతోంది. తనకు బదిలీ జరిగినా స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడితో తమ శాఖ ఉన్నతాధికారులు రిలీవ్ చేయడంలేదని ఆరోపిస్తూ, ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ శుక్రవారం లేఖ రాసి అదృశ్యమవడం తెలిసిందే. ఆ లేఖ ఆధారంగా పోలీసులు గాలింపు ప్రారంభించారు. అతని సెల్‌ఫోన్ ట్రాక్ చేసే క్రమంలో జిల్లా వీఎం బంజరులో సిగ్నల్ చివరిసారి ఆగినట్లు గుర్తించారు. ప్రత్యేక బృందాలతో రాత్రి పొద్దుపోయే వరకు ఆ పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ దొరకలేదు. ఒకవైపు సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తూనే సెల్‌ఫోన్ సిగ్నల్స్‌పై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 7.02 గంటల సమయంలో కొన్ని నిమిషాల పాటు సెల్‌ఫోన్ ఆన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ సమయంలో ఏఈఈ భార్య ఫోన్ మాట్లాడేందుకు ప్రయత్నించినా స్పందించలేదని తెలిసింది. అంతలోనే మళ్లీ ఫోన్ ఆగిపోయింది. దాంతో చివరిసారి సిగ్నల్ ఆధారంగా గాలించడానికి తిరువూరు ఎస్సై సత్యనారాయణ నేతృత్వంలోని పోలీసు బృందం, ఏఈఈ మామయ్య ఆనందరావులతో కలిసి బయలుదేరి సాయంత్రానికి విశాఖపట్నం చేరుకున్నారు. శుక్రవారం తిరువూరు నుంచి బస్సులో బంజరు చేరుకుని, అక్కడి నుంచి రాజమండ్రికి వెళ్లి, ఏటీఎం నుంచి రూ.500 నగదు డ్రా చేయడాన్ని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అక్కడి నుంచి వైజాగ్ వెళ్లి ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు. వైజాగ్‌లో ఉదయం ఫోన్ ఆన్ కావడంతో, ఆత్మహత్యకు పాల్పడి ఉండబోరని భావిస్తున్నారు. ఒకవేళ ఫోన్ ఎవరికైనా దొరికింది అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సెల్ సిగ్నల్ ఆధారంగా తమ పోలీసు బృందాలు విశాఖ వెళ్లాయని, రాత్రి వరకు అతని జాడ దొరకలేదని ఎస్సై సత్యనారాయణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మరోవైపు ఆచూకీ దొరకపోవడంతో అతని భార్య కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

రిలీవ్ ఉత్తర్వులు: నెల రోజుల కిందట కంచికచర్ల డివిజన్ పరిధిలోని గౌరవరం సెక్షన్‌కు బదిలీ అయినా, అప్పటి నుంచి రిలీవ్ ఉత్తర్వులు ఇవ్వని ఆ శాఖ అధికారులు, అదృశ్యం నేపథ్యంలో ఈఎన్‌సీ ఆదేశాలతో వెంటనే రిలీవ్ చేస్తూ శనివారం డీఈఈ లిఖిత పూర్వక ఆదేశాలిచ్చారు. తిరువూరుకు సంబంధించిన బాధ్యతలు స్పెషల్ డివిజన్ అధికారులకు అప్పగించి, కంచికచర్ల డివిజన్‌లో బాధ్యతలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

కిశోర్ కుటుంబ సభ్యుల ఆందోళన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: బదిలీ అయినా రిలీవ్ చేయలేదనే మనస్తాపంతో ఆత్మహత్య లేఖ రాసి అదృశ్యమైన ఇరిగేషన్ ఏఈ కిశోర్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అదృశ్యమైన విషయం తెలిసి కిశోర్ స్వగ్రామం అనిగండ్లపాడుకు బంధువులు తరలివచ్చి తల్లి అనసూర్య, సోదరి శిరీషను ఓదార్చారు. తల్లి, సోదరి మాట్లాడుతూ అధికారులు తమ కుమారుడి పట్ల కర్కశంగా వ్యవహరించారని వాపోయారు. అతనికి ఏం జరిగినా వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కిశోర్ భార్య అనూష ఆమె తల్లిదండ్రుల ఊరైన నవాబుపేటలో ఉన్నారు. భర్త అదృశ్యం కావటం పట్ల ఆమె తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు.



బంధువుల ఆవేదన..

వీరులపాడులో 60.2 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో పలు మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. వీరులపాడు 60.2 మి.మీ., ఇబ్రహీంపట్నం 55.8, చందర్లపాడు 48.4, మైలవరం 40, జి.కొండూరు 34.2, విస్సన్నపేట 32.4, వత్సవాయి 24.2, రెడ్డిగూడెం 12.4, కంచికచర్ల 8.4, నందిగామ 5.8, ఎ.కొండూరు 4, జగ్గయ్యపేట 2.8, పెనుగంచిప్రోలులో 2.2 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 16.54 మి.మీ. ఉంది.



వంకాయలు-20, టమాటా-33, బెండ-18, పచ్చిమిర్చి-74, కాకర-30, బీర-24/20, క్యాబేజి-22, క్యారెట్-30/42, దొండ-24, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరుచిక్కుళ్లు-30, దోస-15, సొర-8/10, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-28, అల్లం-60, మునగ-7/6, ఆకు కూరలు (కట్ట)-3/8, కంద-58, బీట్ రూట్-30, కీర దోస-48, బీన్స్-84, క్యాప్సికమ్-86, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/14, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/10 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించండి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : విద్యుత్తు సంస్థలో 2019 సంవత్సరం నుంచి పని చేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2 (ఎనర్జీ అసిస్టెంట్లు) సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ విషయమై శనివారం విద్యుత్తు సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ రీజనల్ అధ్యక్షుడు ఎల్.రాజు మాట్లాడుతూ.. సంస్థలో నిరంతరం సేవలు అందిస్తూ రెవెన్యూ వసూళ్లలో ముఖ్య భూమిక పోషిస్తున్న జేఎల్ఎంల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. విధుల్లో చేరి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా ప్రొబేషన్ డిక్లేర్ చేయలేదని విమర్శించారు. కొత్త సర్వీస్ రెగ్యులైజేషన్స్ అమలు చేయడం లేదని వాపోయారు. రీజనల్ కార్యదర్శి కనక లింగేశ్వరరావు మాట్లాడుతూ.. సెలవులకు సంబంధించి ఉన్నత స్థాయి అధికారుల ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు జరగడం లేదని విమర్శించారు. సీనియారిటీ జాబితా ప్రకటించాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎన్.సి.హెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని కోరారు. ఎనర్జీ అసిస్టెంట్లను సంస్థలో విలీనం చేసి, సచివాలయ విధులకు పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని కోరారు. కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.వెంకటేశ్వరరావు, కె.దుర్గారావు, పి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సర్కిల్ కార్యాలయంలో విద్యుత్తు ఉద్యోగుల ధర్నా

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గా నరేష్ కోరారు. ఈ నెల 23, 24 తేదీల్లో తలపెట్టిన చలో దిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు బీసీ కుల గణన, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, రాబోయే ఎన్నికల్లో బీసీల వాటా తేల్చాలనే ప్రధాన లక్ష్యాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో తీసుకునే నిర్ణయాలను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. సంఘీయులపై దాడులు అరికట్టడంతో పాటు తమకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఎంపీలు, వివిధ రాష్ట్రాలకు చెందిన నేతలు సమావేశాలకు హాజరవుతారని తెలిపారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు భీమవరపు హేమ మాట్లాడుతూ.. జనాభాలో అత్యధిక శాతం బీసీలు ఉన్నా.. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీలు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రంగు విక్రమ్, పోతిన వరప్రకాష్, పిల్లా దినేష్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న దుర్గానరేష్, హేమ, విక్రమ్, వరప్రకాష్, దినేష్ తదితరులు

నూతన డిపో మేనేజరుకు అభినందన

విజయవాడ బస్ స్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ డిపో నూతన మేనేజరుగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను ఏపీపీటీడీ కార్మిక పరిషత్తు ఆధ్వర్యంలో విజయవాడ డిపోలోని ఆయన కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక పరిషత్తు జిల్లా కార్యదర్శి యార్లగడ్డ రమేష్, జిల్లా అధ్యక్షుడు కలపాల నారాయణ కెనడీ, ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి కె.శివశంకర్, విజయవాడ డిపో కార్యదర్శి సగ్గుర్తి ప్రభాకర్, పీఎన్‌బీఎస్ యూనిట్ అధ్యక్షుడు యార్లగడ్డ విష్ణు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.చినబాబురావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్మిక పరిషత్తు నాయకులు

ఆదిత్య ఫార్మసీ యజమాని ఆత్మహత్య కేసులో కీలక మలుపు

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే : ఆదిత్య ఫార్మసీ యజమాని సాగి వెంకట నరసింహరాజు విజయవాడ, అయోధ్యనగర్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కేసులో పోలీసులు కీలకమైన ఆధారాలు సేకరించారు. విజయవాడకు చెందిన పిన్నమనేని పరంధామయ్య, విశాఖపట్నంకు చెందిన బుద్ధంరాజు శివాజీలే ఆయన బలవన్మరణానికి కారణమంటూ మృతుడి భార్య శాంతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తీసుకున్న అప్పు తీర్చమంటూ పలు మార్లు ఫోన్లు చేసి తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చారని ఆమె పేర్కొన్నారు.

పోలీసులకు చేరిన సీడీఆర్ నివేదిక..

తన భర్తకు వారు ఫోన్ చేసి బెదిరించడం వల్లే ఈ నెల 5న విజయవాడలో ఆత్మహత్యకు పాల్పడ్డారని భార్య చెప్పడంతో.. అందులో నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. పరంధామయ్య, శివాజీలు.. వెంకట నరసింహరాజును బెదిరించారా? ఎన్నిసార్లు ఫోన్ చేశారు? తదితర విషయాలు తెలుసుకునేందుకు ఫోన్ కాల్ జాబితా (సీడీఆర్ : కాల్ డిటైల్ రికార్డ్) సేకరించారు. దీనిని పూర్తిస్థాయిలో విశ్లేషిస్తున్నారు. ఆయా వివరాలు బయటకు వస్తే. . వాస్తవాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు. వెంకట నరసింహరాజు ఆత్మహత్య చేసుకున్న తర్వాత నుంచి వారిద్దరూ పోలీసులకు కనిపించకుండా మాయమయ్యారు. వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులపై బీఎన్ఎస్ 306 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

రెడ్డిగూడెం: 80085 74707 జి.కొండూరు 9063144762

? ఇబ్రహీంపట్నం రైతు బజార్ తూర్పు గేటు వద్ద బురదమయంగా మారింది. గేదెలు, వాటి వ్యర్థాలతో రాకపోకలకు వీలు లేకుండా ఉంది. **- షరీఫ్, ఇబ్రహీంపట్నం**
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- వెంకటరత్నం, పారిశుద్ధ్య అధికారి** - న్యూస్‌టుడే, కొండపల్లి

? ఓబులాపురం శివారులో విద్యుత్తు లైన్లు కిందకు వేలాడుతూ ప్రమాదభరితంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. **- నాగేంద్ర కుమార్, స్థానికుడు**
✔ స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్తు తీగలు ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకుంటాం. **- కిరణ్ ఏఈ, రెడ్డిగూడెం.** - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

రూ 1.30 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు

ఈనాడు కథనానికి స్పందన



వెట్‌మిక్స్ పరిచిన కుంటముక్కల మార్గం

జాతీయరహదారి-30 నుంచి కుంటముక్కల గ్రామంలోకి వెళ్లే ప్రధాన అనుసంధాన రహదారి గుంతలు పడి ప్రయాణానికి నరకయాతన పడుతున్నామని స్థానికులు న్యూస్‌టుడే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యపై ఈ నెల 9వ తేదీన 'గుంతల దారి..నరకంగా మారి..' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు ఎట్టకేలకు రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించి వెట్‌మిక్స్ పరిచారు. దాదాపు కిలోమీటర్ పైగా ఈ రహదారి రూ.1.30 కోట్లతో తారురోడ్డుగా నిర్మించనున్నారు. వాహనదారులు అవస్థలు తొలగడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు **.- న్యూస్‌టుడే, జి.కొండూరు**

ఏకరూప దుస్తుల పంపిణీ



దుస్తులు అందుకున్న విద్యార్థులతో తహసీల్దార్ అబ్దుల్ దరియా తదితరులు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లీలావతి పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఏకరూప దుస్తులను శనివారం తహసీల్దార్ అబ్దుల్ దరియా అందజేశారు. మూడు జతల దుస్తులతో పాటు టై, బెల్టు, బ్యాడ్జీలను అందించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బి.మోత్యా, ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ, కార్యదర్శి రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్లేట్ల వితరణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కాచవరం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విజయవాడ మొగల్రాజపురం ప్రాంతానికి చెందిన ఎంజీ ప్లానర్స్ మేనేజరు అరుణకుమార్ శనివారం స్టీల్ భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 వీరాస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని భవాని, ఉపాధ్యాయులు మహమ్మద్ ఇర్ఫాన్ పాషా, సీఆర్‌పీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం సహాయనిధి

జి.కొండూరు, న్యూస్‌టుడే: కుంటముక్కలకు చెందిన లింగాల ప్రియదర్శిని అనే మహిళ అనారోగ్యంతో ఆసుపత్రి పాలవగా.. శస్త్రచికిత్స నిమిత్తం సీఎం సహాయనిధికి అర్జీ పెట్టుకోగా రూ.లక్ష మంజూరయ్యాయి. దీంతో విజయవాడ ఎంపీ చిన్ని, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లు గొల్లపూడిలో ఆమె కుటుంబ సభ్యులకు సీఎం సహాయనిధి ఎల్వోసీను శనివారం అందజేశారు. కార్యక్రమంలో కుంటముక్కల సొసైటీ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ఊతం.. ప్రతిభకు రూపం

మైలవరం, న్యూస్‌టుడే

కార్పొరేట్ సౌకర్యాలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల



కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు

ప్రభుత్వ కళాశాలలంటే అరకొర సౌకర్యాలు, అత్తెసరు చదువులన్న భావనను ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రూపుమాపింది. దాతల సాయం, కావాల్సిన మేరకు సౌకర్యాలు అందించే ప్రభుత్వ ప్రోత్సాహంతో కార్పొరేట్ హంగులను అద్దుకుంది. సువిశాల ప్రాంగణంలో అన్ని వనరులను సమకూర్చుకోగా.. మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సరికొత్త ఆవిష్కరణలకు దిక్సూచిగా మారింది. రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలల్లో అగ్రశ్రేణి వరుసలో చేరి, వరుసగా ఐఎస్‌ఓ ధ్రువీకరణను సాధిస్తోంది. ☛ 2009లో మైలవరానికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మూడేళ్ల అనంతరం దాత హనిమిరెడ్డి సొంత భూమిలో విశాల ప్రాంగణంలో అధునాతన భవనాలను నిర్మించారు. ఏయేటి కాయేడు ప్రభుత్వ సహకారం తోడవడంతో.. సౌకర్యాలను మెరుగు పరుచుకుంటూ వస్తున్నారు.

తరగతుల్లో డిజిటల్ బోధన.. ప్రస్తుతం కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ కంప్యూటర్స్ కోర్సులున్నాయి. వాటిల్లో చాలా వరకు తరగతి గదుల్లో డిజిటల్ బోధనకు వీలుగా ఏర్పాట్లు చేశారు. గడిచిన నాలుగేళ్లలో అధునాతన సౌకర్యాలతో డిజిటల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకుని బోధన సాగిస్తున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు శారీరక దృఢత్వం, ప్రతిభను ప్రోత్సహించేందుకు క్రీడలపైనా పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. కళాశాల ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుతో నిత్యం వ్యాయామానికి అవసరమైన సామగ్రిని అందుబాటులోకి తెచ్చారు. శిక్షణలో భాగంగా ప్రతిభ చాటిన విద్యార్థులు కొందరు జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్, నెట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. చదువుతో పాటు ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, యూత్ రెడ్‌క్రాస్ వంటి వాటిలో కూడా విద్యార్థులు ముందున్నారు.



ఐఎస్‌ఓ ధ్రువీకరణ పత్రాలతో దాత హనిమిరెడ్డి, ప్రిన్సిపల్ ఇళ్లా రవి, అధ్యాపకులు

వెయ్యి మందికి పైగా ఉద్యోగావకాశాలు

తూర్పు కనుమల్లో ఆర్కిడ్ మొక్కల గుర్తింపు పరిశోధనలకు సంబంధించి వృక్షశాస్త్ర అధ్యాపకుడు జె.రాముడు రూసా ప్రాజెక్టుకి ఎంపికవగా, భారీగా నిధులు మంజూరు చేశారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అంతరించిన తాళపత్ర గ్రంథాలపై తెలుగు అధ్యాపకుడు ఎం.దేవానందకుమార్ శిక్షణ ఇచ్చి, అవార్డులు సాధించారు. మరోవైపు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలతో పాటు, జవహర్ నాలెడ్జి కేంద్రం సహకారంతో పెద్ద ఎత్తున జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారు. గడిచిన రెండేళ్లలో నిర్వహించిన 10 మేళాల ద్వారా సుమారు వెయ్యి మంది వరకు విద్యార్థులకు ఉద్యోగావకాశాలను కల్పించారు.

రూ.5 కోట్లతో అదనపు భవనాలు : ఇళ్లా రవి, ప్రిన్సిపల్

కళాశాలలో ప్రతి ఏటా 450 మంది వరకు విద్యార్థులు చదువుతుండగా, వారికి ఎప్పటికప్పుడు విభిన్న అంశాలపై బోధన కోసం కృషి చేస్తున్నాం. దాత సహకారంతో పూర్తి సౌకర్యాలు ఏర్పడగా, ప్రభుత్వం అదనపు భవనాల కోసం మంజూరు చేసిన రూ.5 కోట్లతో పనులు సాగుతున్నాయి.

పూజలందుకున్న వేంకటాచలుడు



తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటాచలస్వామి ఆలయంలో శనివారం అర్చకులు డి.వేణుగోపాలకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం దేవతామూర్తుల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

శోభాయమానం.. శ్రీనివాసుడి అలంకరణ



పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్టలోని గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో మూలవిరాట్‌ను శనివారం ప్రధానార్చకులు శ్యామ్‌సుందరశ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో శోభాయమానంగా అలంకరించారు. వివిధ గ్రామాల భక్తులు దర్శించుకుని పాలపొంగళ్లతో మొక్కులు చెల్లించారు. కమిటీ అధ్యక్షుడు వెంకట్రావు, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సమన్వయంతోనే పురపాలిక అభివృద్ధి



ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌తో కొండపల్లి ఛైర్మన్, కౌన్సిలర్లు

కొండపల్లి, న్యూస్‌టుడే: సమన్వయంతో కొండపల్లి పురపాలికను అభివృద్ధి చేస్తామని ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. పురపాలిక ఛైర్మన్, కౌన్సిలర్లతో పుర కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సమావేశమయ్యారు. పురపాలికలో నెలకొన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తామని చెప్పారు. తాగునీటికి సంబంధించి ఇప్పటికే అమృత్ 2.0 పథకంపై అంచనాలు వచ్చాయన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు సమాలోచన చేసి అధికారుల సమన్వయంతో సమస్యలను తొలగించాలన్నారు. ప్రాచీన వారసత్వం కలిగిన కొండపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సంయుక్త నిధులను ఉపయోగిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పుర కార్యాలయంలో ఆధునికీకరించిన నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఛైర్మన్ చిట్టిబాబును సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



గంపలగూడెం : కనుమూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు



తిరువూరు 1వ వార్డులో..

గంపలగూడెం, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం గత ఏడాదిగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలపై తెదేపా నాయకులు ఆధ్వర్యంలో శనివారం కరపత్రాలను పలు గ్రామాల్లో పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నిత్యం కృషి చేస్తున్నారని గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట మండలాల్లోని నాయకులు పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల నిరసనపై నిర్లక్ష్యం వద్దు

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె 7వ రోజైన శనివారం కొనసాగింది. తమ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు నినాదాలు చేశారు. ఇంజినీరింగ్ కార్మికుల నిరసనపై పాలకులు వివక్ష, నిర్లక్ష్యం చూపొద్దని కోరారు. సీఐటీయూ, సీపీఎం, ఇంజినీరింగ్ కార్మికుల సంఘాల నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎం.నాగేంద్రప్రసాద్, బాజీ, శ్రీనివాసరావు, సుజాత, పావని, ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో నినాదాలు చేస్తూ..

విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థినికి జ్ఞాపిక అందిస్తున్న దాతలు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాజ్యలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వాహకులు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. శనివారం స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో, మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని నందిని సహా 11 మందికి రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో దాతలు నారికిమిల్లి గాంధీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు జూలకంటి ప్రసాద్, బయన శ్రీనివాసరావు, కాజా మహేష్, ఆంజనేయులు, ఎం.ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలు మునుగుతున్నాయ్..!



గొల్లపూడి రైల్వే ట్రాక్ సమీపంలోని పంట పొలాలు, స్థలాలు ముంపునకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచిపోయి ఎటూ వెళ్లే పరిస్థితి నెలకొంది. గొల్లపూడి రైల్వేగేటు వద్ద రైల్వే అధికారులు ఆర్‌ఓఆర్ నిర్మాణాన్ని చేపట్టారు. ఆ నిర్మాణం కారణంగా పంట పొలాల్లోని నీరు వెళ్లే కాలువలు, పైపులను పూడ్చేయడంతో ఈ దుస్థితికి కారణమైంది. సమస్యను రైల్వే అధికారుల దృష్టికి రైతులు తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదని వాపోతున్నారు. నిత్యం నీరు నిలిచి ఉండడంతో పంటలు పండించుకునే వీలులేకుండా పోతోందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు అక్కడ డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

రైతన్నా.. రోడ్డు గుల్లవుతోందన్నా

వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో మాగాణి భూములు దమ్ము చేసేందుకు ఇనుప చక్రాలతో తిరుగుతున్న ట్రాక్టర్లతో తారు రోడ్లు ధ్వంసమవుతున్నాయి. తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో రూ.కోట్లు ప్రజాధనం వ్యయం చేసి రోడ్లు నిర్మించారు. ఈ ట్రాక్టర్లతో తారు రోడ్డుపై పడుతున్న చీలికల్లో వర్షపు నీరు చేరి అనతికాలంలోనే పాడైపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ రెవెన్యూ, పోలీస్ అధికారులు చొరవ చూపితే వీటిని నియంత్రించి కొంత కాలం రహదారులు మన్నికగా ఉండేలా కాపాడవచ్చు. ట్రాక్టర్ల యజమానులు, రైతులు కూడా తమ వంతు సహకారం అందించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, ఎ.కొండూరు, గంపలగూడెం**



చిన్నపాటి వానకే మునక



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

మేజరు పంచాయతీ మైలవరంలో మురుగు కాలువల పరిస్థితి దుర్భరంగా మారింది. కొద్దిపాటి వర్షానికే ప్రవహించే అవకాశం లేక మురుగంతా రహదారులపై చేరుతోంది. ఇటీవల పంచాయతీలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న కాలువల్లో పూడికతీతకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అయితే చాలాచోట్ల కాలువల ఆక్రమణలకు గురవడం, పూడ్చడం వంటి చర్యలతో మురుగు ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి పక్కనున్న కాలువలతో పాటు, అంతర్గత రహదారుల్లోనూ పొంగి పొర్లాయి. వరదంతా రహదారులపైనే ప్రవహించడంతో గంటలకొద్దీ ఇబ్బందులు తప్పలేదు.**- న్యూస్‌టుడే, మైలవరం**

దారి దారుణం..అటుగా నడవలేం

మండలంలోని ఆర్లపాడు నుంచి మేడూరు వచ్చే రహదారి అధ్వానంగా ఉంది. జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి కొత్త ఆర్లపాడు వరకు రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు రోడ్డుపై ఉన్న గుంతలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఏళ్ల తరబడి అధికారులు రహదారులకు మరమ్మతులు చేయడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆ గుంతలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆర్లపాడు (గంపలగూడెం)**



వక్ఫ్ బోర్డు ఆస్తులపై విచారణ



కొండపల్లి ముస్లిం మత పెద్దలతో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్ తదితరులు

కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తులను కాపాడడంతో పాటు ఎన్టీటీపీఎస్ పరిధిలో ఉన్న వక్ఫ్ ఆస్తులను పూర్తి స్థాయిలో విచారణ చేసి రాబట్టేందుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. కొండపల్లి పురపాలికలోని వక్ఫ్ ఆస్తులను శనివారం ఆయన పరిశీలించారు. కొండపల్లికి చెందిన ముస్లింలను కలిసి ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆస్తులన్నిటినీ రాబట్టి పేద ముస్లింల సంక్షేమానికి ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఆక్రమణ జరిగిన ఆస్తుల జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. తద్వారా అధికారికంగా వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో అక్రమ్, మహమ్మద్ అలీ, ముస్లిం మత పెద్దలు అల్తాఫ్ రజా, ఫతావుల్లా, జిన్నా తదితరులు పాల్గొన్నారు.

జూపూడి నుంచి కిలేశపురాన్ని వేరుచేయండి



ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న జూపూడి గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడి గ్రామపంచాయతీ నుంచి కిలేశపురాన్ని వేరుచేయాలని జూపూడి గ్రామస్థులు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. జూపూడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పటికీ పంచాయతీ కార్యాలయం, రైతు భరోసా కేంద్రంతోపాటు అన్ని ప్రభుత్వం కార్యాలయాలు కిలేశపురంలోనే ఉండడం వల్ల శివారు కిలేశపురం అభివృద్ధి చెందుతుందని వివరించారు. జూపూడి సమీపంలోని భీమేశ్వరకాలనీ, బీసీ, ఎస్సీ కాలనీల్లో మూడు వేలకు పైగా జనాభా, 1200 మంది వరకు ఓటర్లు ఉన్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం జూపూడి నుంచి కిలేశపురంను వేరుచేసి నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. భీమేశ్వర కాలనీకి వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. జూపూడి గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయంతో మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలని కోరారు. ప్రస్తుతం అభివృద్ధి అంతా శివారు కిలేశపురంలోనే కేంద్రీకరించి జరుగుతుందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గౌరవరం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగ్గయ్యపేటకు చెందిన మహిళ మృతి చెందారు. ఎస్సై సూర్యశ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగ్గయ్యపేట తొర్రగుంటపాలెంకు చెందిన ఉగారపు నాగమణి(45) తల్లికి ఆరోగ్యం బాగోకపోవడంతో పలకరించడానికి రెండు రోజుల కిందట గౌరవరం వెళ్లారు. శనివారం ఆమె తిరిగి జగ్గయ్యపేట రావడానికి గౌరవరంలో జాతీయ రహదారి దాటుతుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

దాడిపై ఫిర్యాదు... భవానీపురం: ఇద్దరు యువకులు తనను కొట్టారని మహిళ భవానీపురం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. భవానీపురం ఔట్ ఏజెన్సీ ప్రాంతంలో జొన్నకూటి విజయ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈనెల 17వ తేదీ రాత్రి పిల్లలను ట్యూషన్‌లో దింపి తిరిగి ఇంటికి వస్తుండగా షేక్.రజాక్, చాంద్‌బాషాలు అకారణంగా ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి కొట్టారు. దీంతో గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మకు బంగారు ఆభరణం బహూకరణ



ఆశీర్వచన మండపంలో దాతలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు రూ.1.5 లక్షల బంగారు కంఠాభరణాన్ని హైదరాబాద్‌కు చెందిన అడ్డగట్ల ప్రశాంత్ సంతోషిణి దంపతులు శనివారం సమర్పించారు. 114 గ్రాముల బరువు ఉన్న కంఠాభరణానికి తొలుత దుర్గమ్మ చెంత ఉంచి దాతతోపాటు కుటుంబ సభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి బి.వి.రమణకుమార్ ఉదయలక్ష్మి దంపతులతో స్థానాచార్య శివప్రసాద శర్మ పూజ చేయించారు. అనంతరం ఏఈవో రమేష్ బాబు వారికి విరాళం రశీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ.3,20,000 విరాళం శనివారం అందజేశారు. విజయవాడ నివాసి ఎన్.వి.రమణయ్య రూ.1.2 లక్షలు, సత్యనారాయణపురానికి చెందిన ఎం.శ్రీనివాస్ రూ.2 లక్షలు విరాళాన్ని ఇచ్చారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఏఈవో రమేష్ వారికి విరాళం రశీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పర్యావరణ శుభ్రతే.. ప్రాణాలకు రక్షణ



మైలవరం: ఎల్బీఆర్‌సీఈ విద్యార్థుల ప్రదర్శన



రెడ్డిగూడెంలో...



కట్టుబడిపాలెంలో మొక్క నాటుతున్న సర్పంచి సత్యవతి



తిరువూరు పురపాలిక కార్యాలయం వద్ద...

మైలవరం, న్యూస్‌టుడే బృందం : పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు సూచించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, ప్రకృతి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలు వివరిస్తూ ప్రదర్శన చేశారు. జూట్, గుడ్డతో తయారు చేసిన సంచులనే వాడాలని సూచించారు. ◆ జి కొండూరు ఎంపీడీవో బీవీ రామకృష్ణనాయక్ ఆధ్వర్యంలో కట్టుబడిపాలెంలో మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు. సర్పంచి దంతాల సత్యవతి, కార్యదర్శి రామచంద్రరావు పాల్గొన్నారు. ◆ రెడ్డిగూడెం ఎంపీడీవో టి.కె.వి.రమణ, సర్పంచి ఎం.రాణి, డిప్యూటీ ఎంపీడీవో పి.ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ప్రదర్శన చేశారు. ◆ స్వచ్ఛ ఆంధ్రా పిలుపునకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా స్పందించాలని కొండపల్లి డీఏవీ(దయానంద ఆంగ్లో వేదిక్) పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీర్ పి.శివరామాంజనేయులు సూచించారు. ◆ తిరువూరు నియోజకవర్గంలో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొని స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ప్రతిజ్ఞ, ప్రదర్శనలు నిర్వహించారు.



విస్సన్నపేటలో అవగాహన కల్పిస్తూ..



కొండపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్టీటీపీఎస్ ఇంజినీర్లు

వృద్ధురాలి బలవన్మరణం

వామకుంట్ల(తిరువూరు), న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఓ వృద్ధురాలు గడ్డి మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని వామకుంట్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన పున్నం శేషమ్మ(87) తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 17వ తేదీన ఇంటి వద్ద గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం తొలుత తిరువూరుకు తదుపరి విజయవాడ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు ఆమె కుమారుడు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

AGRI BUSINESS

చిలుకూరు గ్రామం దుగ్గిరాల మండలంలో 30 సం॥ వయస్సు గల 3 ఎకరాల సపోటా తోట కర్ర అమ్మకానికి కలదు. సంప్ర: ఎడ్లభోగి భాస్కరరావు, ✆ 83745 58369.

AUTO

VEHICLES FOR SALE

For Sale: Millers (Swing setter) Body type concrete mixer Cubic capacity - 7, 1 Lakh KM on road Ashok Leyland Ltd., Model - 2019. Ph: 94401 72901.

TS29 TA 9523 AL Dost Plus Model 2021 ★ TS29 TB 4766 AL Bada Dost Model 2022 ★ TS29 TB 4817 Tata Ace Gold Model 2022 ★ TS04 UE 6153 Tata Intra V30 Model 2023 ★ TG29 A 6342 Maruti WagonR VXI CNG Model 2024 ★ TS29 TB 3836 AL 2825 Model 2022 ★ AP39 UF 3202 AL 2825 Model 2022 ★ AP39 UF 3203 AL 2825 Model 2022 ★ TS29 TB 8942 AL 2825 Model 2023 ★ TG29 T 1231 A L2825 Model 2023 ★ SNO NDN633HE0005797 Sany Excavator Sy210C Model 2023, SNO 23SY210C001813 Hyundai Excavator R210 Model 2022 ★ TS29 TB 7860 VE CV Eicher Pro 2080XP Model 2023 ★ TS05 UF 3780 Maruti Super Carry Model 2022 ★ For Sale in as is Where is Condition. Cont: Sundaram Finance Ltd. Kodad. ✆ 94409 09771, 85006 67229.

BUSINESS SERVICES

EYE HOSPITAL FOR LEASE
మొగల్‌రాజపురంలో మంచి సెంటర్‌లో, రన్నింగ్‌లో ఉన్న, అన్ని వసతులు కలిగిన కంటి హాస్పిటల్ ఆపరేషన్ థియేటర్ సౌకర్యంతో లీజుకు ఇవ్వబడును
✆ 99514 76302, 99122 74799

FOR SALE

Interior & Furniture For Sale Manufacturing in Sofas, Dining Table, Cots & Mattress.. Experts in Aluminium, Plywood & Iron Cupboards at low Price. Ph: 9391277720

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified Co. House hold Goods Shifting any Time any Where. ✆ 97043 64389, 92900 87673.

SOLAR PRODUCTS

PM సూర్యఘర్ ద్వారా 3.3కి సోలార్ సిస్టం రూ. 2,10,000/-కి 78,000/- రూ. సబ్సిడీతో, ఉచిత రిజిస్ట్రేషన్ & 90% బ్యాంక్ లోన్ ఈఎంఐ పద్ధతిలో పనిచేయుటకు కావలెను. ✆ 98667 28063/ 92908 32313.

BUILDING CONSTRUCTION

Raghava Constructions. We do Building Contracts on Turn key Basis for VMC/ APCRDA Approvals, Vasthu plans Elevations & Structural Designs. ✆ 98851 12999.

20 సం॥ల కన్‌స్ట్రక్షన్స్ అనుభవంతో 100% క్వాలిటీ మెటీరియల్స్‌తో అతి తక్కువ S.Ft. రేటుకు మీ ఆలోచనకు తగ్గట్టుగా కాంట్రాక్ట్ పద్ధతిలో బిల్డింగ్స్ కట్టించి ఇవ్వబడును. KSB Constructions, VJA. ✆ 95531 31548.

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 Yrs. Exp. ★ 5 Yrs. Warranty ★ Bathroom Leakage, Grouting Epoxy Works. ✆ 94940 02285, 99516 07504.

101% వాటర్ ప్రూఫింగ్ సీనియర్ సివిల్ ఇంజినీర్ పర్యవేక్షణలో అత్యాధునిక పవర్ మెషిన్ ద్వారా ఇంటి కప్పులు, ఫ్లోరింగ్, బాత్‌రూమ్ (పగలకొట్టకుండా) 30 సం॥ అనుభవం. Hyd, వైజాగ్: 80967 22999/ విజయవాడ, గుంటూరు: 99124 71999. www.water-proofing.in

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిం దిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EDUCATION

ఆంధ్రా, నాగార్జున యూనివర్సిటీల ద్వారా Degree, P.G, MBA, MCA, డైరెక్ట్ 10th, ఒకే సం॥లో ఇంటర్. భవ్య అకాడమి (Since: 2001). ✆ 97053 35678.

పారా మెడికల్ Diploma in Medical Laboratory Technology, Diploma in Operation Theater Technology, Diploma in Anaesthesia Technology, Diploma in Cardiology, MPHA కోర్సు, Inter, MLT. Inter MPHW (F) అడ్మిషన్లు జరుగుచున్నవి. తమ్మినేని ఇనిస్టిట్యూట్, విజయవాడ. డా॥ టి.రామకృష్ణ. ✆ 98482 42880.

HOME TUITIONS

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG, NEET, IIT, EAMCET, B.Tech. CA-CPT, BITSAT ఆల్ ట్యూటర్స్ కావాలన్నా ✆ 92900 05677, 74165 35749.

FINANCIAL SERVICES

పర్సనల్/హోమ్ లోన్/మార్టిగేజ్
లోన్ల మేళా!
10 లక్షలు నుండి 100 కోట్ల వరకు అతి సులభంగా
అన్నిరకముల లోన్స్ ఈజీగా ఇవ్వబడును
PMAY పథకం ద్వారా 2.67 లక్షలు వరకు లోన్ సబ్సిడీ ఫ్రీ గా పొందండి
9390115508, 9390115509
BHARAT BANK

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు సులభ వాయిదా పద్ధతిలో 5 లక్షలు లోపు ఫైనాన్స్ చేయబడును (సిబిల్ చూడబడదు). JK అసోసియేట్స్, ✆ 96665 47338.

మీ ఇళ్ళు, బిల్డింగ్స్, కాంప్లెక్స్‌ల మీద తనఖా పద్ధతిలో రూ. 1 వడ్డీకి ఫైనాన్స్ ఇప్పించబడును. వేరే ఏ బ్యాంకులో ఉన్ననూ విడిపించబడును. ✆ 83099 11995, 93904 35013.

HEALTH & CARE

50 Bed Hospital for Sale (or) Lease in Secunderabad Area, Hyd. (For Interested Doctors Investment Arranged). Ph: 9966505506, 9030374343.

HOME NEEDS

MOSQUITO SCREENS

మెష్‌డోర్స్, కర్టెన్ రాడ్స్, కర్టెన్స్, కపోర్డ్స్, UPVC విండోస్ బ్లైండ్స్, వాల్‌పేపర్, Anti Bird మెష్, Invisible Grills... Durga Prasad. 98495 69111.

PEST CONTROL

Priyanka Pest ★25 Yrs. Exp. 5 Yrs. Warranty. Smell Less Bayer Chemicals (Pest & Other Insects Control). ✆ 94924 82494, 93932 30136.

Tarun Pest ★ 25 Yrs. Exp., 5 Yrs. Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest and Other Insects Control). ✆ 94940 02285, 99516 07504.

PERSONAL CLASSIFIEDS

LOST

Passport Lost I, Putta Lalitha Varshith Chowdary, S/o Putta Srinivasa Rao, resident of Vijayawada, have lost my Indian Passport No. M9190861 near PB Siddhartha Circle, Vijayawada. If found, please contact: 9108282079

PERSONAL INTEREST COURSES

EMBROIDERY

మా వద్ద 3 కంప్యూటర్ ఎంబ్రాయిడరీ జాకెట్ వర్క్స్ - 1200/- మాత్రమే ★ 1 జాకెట్ స్టిచ్చింగ్ ఫ్రీ ★ ట్రైనింగ్ మరియు మగ్గం వర్క్ చేయుటకు వర్కర్స్ కావలెను. లబ్బీపేట. ✆ 93937 66668.

PEOPLE CARE

OLD AGE HOME

నెస్ట్ కేర్ హోమ్ వృద్ధాశ్రమం, కానూరు: వృద్ధులకు, బెడ్ పేషెంట్‌లకు ఆహ్లాదకరమైన ఇంటి వాతావరణంతో, మంచి ఆహారంతో & అన్ని సౌకర్యములతో సేవలు కలవు. ✆ 98483 40496/ 73866 20496.

స్వామి వివేకానంద గ్రూప్, VJA, శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99590 21122, 99590 31122.

మాతృశ్రీ హోమ్‌కేర్ సర్వీస్: మంచంపై ఉన్న వృద్ధులకు, పేషెంట్లకు, బేబీకేర్, ఇంటి/ వంటపని చేయుటకు అనుభవం గల ఆయాలు, అటెండర్లు, నర్సులు 24 గం॥ మీ ఇంటికి పంపగలము. ✆ 99895 58736, 83176 01335.

రామకృష్ణ గ్రూప్ (AP No.1) VJA. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 97044 21122, 92814 52754.

మదర్‌థెరిస్సా హోమ్‌కేర్ సర్వీస్: మంచాన ఉన్నవారికి, వృద్ధులకు, ఇంటిపని, వంటపని చేయుటకు అనుభవం గల అటెండర్లను పంపబడును. సంప్ర: 97055 44168.

REAL ESTATE

TDR Bonds for Sale or Purchase in entire A.P. Contact No.8861738550. Genuine Buyer's Only.

గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, రెడ్డిపాలెం అగతవరప్పాడు, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కొప్పురావూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్లు అ/కొ సంప్ర॥ జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. A1 రియల్‌ఎస్టేట్, 73823 96677.

గుంటూరు సిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్డు, ఇన్నర్ రింగ్‌రోడ్, వెనిగండ్ల పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండ, రాజధానిలోని ప్లాట్లు అమ్మదలచినవారు, జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. ✆ 93999 55545.

బందరు రోడ్‌లో CRDA Layout గేటెడ్ కమ్యూనిటీనందు 220 గజాల ఇండిపెండెంట్ హౌస్ 49 లక్షలు. ★ 183 గజాలు 68 లక్షలు ★ గజం 12,900/- గజం 20,500/- అమ్మకమునకు కలవు. ✆ 92460 30956, 90596 30956.

FLAT FOR SALE

KANURU

2400 Sft, 3 BHK Dulexe Flats for Sale with all facilities near Ratnadeep Super Market, Kanuru, ✆ 89196 79256, 99898 55219.

Occupancyకి సిద్ధముగా E/F, W/F 3 BHK లగ్జరీ ఫ్లాట్, ★ కబోర్డ్స్ 1700 Sft, లిఫ్ట్ కార్ పార్కింగ్, 100% బ్యాంక్ లోన్‌తో కానూరు మురళీనగర్‌లో ✆ 81214 07585.

2&3 BHK డీలక్స్ అపార్ట్‌మెంట్స్ E/F ఫ్లాట్స్ 1362 Sft నుండి 2114 Sft వరకు, అన్ని సౌకర్యాలతో కలవు. గౌరీశంకర్‌నగర్, కానూరు. ✆ 97017 98726, 89196 79256.

కానూరు కెనడీ స్కూల్ అతిదగ్గరలో 3 BHK ఫ్లోర్ వైజ్ ఫ్లాట్ మరియు తాడిగడప మనోజ్‌నగర్‌లో 155 గజాలలో G+1 ఇండిపెండెంట్ హౌస్‌లు అమ్మకానికి కలవు. ✆ 70750 17255.

TADIGADAPA

Poranki, Prabhu Nagar: Premium Individual, E/F, New 3 BHK (Total 2500 S.Ft. & Plinth 1850 S.Ft.) Flats Sale, All facilities. UD 77 Yards. ✆ 89789 14242

విజయవాడ తాడిగడప టీచర్స్ కాలనీ 1st రోడ్డులో MCM నందనం అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ నెం. 203 2BHK, Car పార్కింగ్‌తో అద్దెకు కలదు. Ph: ✆ 94939 81866, 94911 10102.

3bhk flat for sale in 2.5 acre gated community of Greenfields apartments in Tadigadapa. Ph: 7997295289

CURRENCY NAGAR

VJA, కరెన్సీనగర్, డైమండ్ వ్యాలీ లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో 2& 3& 4BHK లగ్జరీ ఫ్లాట్స్ అమ్మబడును. ఏసీలు ఫ్రీ ఆఫర్. ✆ 86884 66789.

Ready to Occupy Furnished 3 BHK Flats 1420 చ॥అ॥ కార్ పార్కింగ్, కామన్ ఏరియాలతో సహ విజయవాడ, కరెన్సీనగర్, నారాయణ స్కూలు దగ్గర అమ్మకం. ✆ 93941 11044.

RAMAVARAPPADU

Vijayawada, Ramavarappadu: N/F, Luxury, New 4 BHK (2,500 S.Ft) Flats Sale @ 4,500/- per S.Ft. ✆ 87121 23344.

GANNAVARAM

2 & 3 Premium BHK Ready to Occupy Flats for Sale at Vijaya Meadows, Gannavaram Very near to HCL. ✆ 94945 30066.

విజయవాడ ఎయిర్‌పోర్ట్, HCL, NHకి దగ్గర్లో క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్, సూపర్ మార్కెట్, జిమ్, బేబీ డేకేర్, RO వాటర్ మొ॥ సౌకర్యాలతో 2 & 3 BHK లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ ఫ్లాట్స్ గృహప్రవేశానికి రెడీగా కలవు. బ్యాంక్ లోన్ Upto 90%, No GST. ✆ 91000 83333.

41 లక్షలకే.. HCL, IT పార్క్‌కి అతి దగ్గర్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో 2 BHK ఫ్లాట్స్ RO వాటర్‌తో మరియు అన్ని సౌకర్యాలతో & బ్యాంక్‌లోన్ Upto 90%తో కలవు. No GST. ✆ 88856 81199.

TADEPALLI

గృహప్రవేశమునకు సిద్ధముగా విజయవాడ-గుంటూరు హైవేకి దగ్గరలో తాడేపల్లి టౌన్‌లో, రెయిన్‌బో విల్లాస్ సమీపంలో, నవోదయ కాలనీనందు 25 ఫ్లాట్స్‌తో, తూర్పు, పడమర ఫేసింగ్‌తో 3 BHK లగ్జరీ ఫ్లాట్స్ (1750 S.Ft.) అన్ని సౌకర్యాలతో అమ్మకమునకు కలవు. ✆ 99088 45511.

EENADU e Classifieds

GENERAL

Newly 3 B/R Flat 1786 S.Ft, North Face, Sree Chaitris Land Mark, UDS 79.6 Sq.yards, Full Furnished. Beside Siddhartha Engg. College Flyover, Kanuru. ✆ 99497 45000.

గుడివాడ- టీచర్స్ కాలనీలోని వినాయక హోమ్స్ అపార్ట్‌మెంటులోగల 3 బెడ్‌రూమ్ ఫ్లాట్ అమ్మకమునకు కలదు. Contact: 77299 58988.

2 BHK అమ్మకం
బెంజిసర్కిల్‌కు 10Km దూరంలో అవనిగడ్డ హైవే ఫేసింగ్, మద్దూరులో 2BHK ఫ్లాట్ అమ్మకం. రేటు 23 లక్షలు. S.Ft.1250, 32 లక్షలు బ్యాంక్‌లోన్ వస్తుంది.
✆ 90529 57220

2 BHK, 1400 Sft. ఇండివిడ్యువల్ ఫ్లోర్, తూర్పు ఫేస్‌తో గృహ ప్రవేశమునకు సిద్ధంగా ఉన్నవి. న్యూ ఆర్.టి.సి. కాలనీ, పటమట. ✆ 88825 79999.

విజయవాడ Old 5 రూట్ మెట్రోపాలిటన్ హోటల్ రోడ్‌లో, M.S.N. Sunshine అను నూతన అపార్ట్‌మెంట్‌లో E/F, N/F, 3BHK లగ్జరీ ఫ్లాట్స్, 1684 S.Ft.,తో ఫుల్లీ ఫర్నిష్డ్ కార్ పార్కింగ్‌తో అమ్మకం. ✆ 89774 77477/ 89778 99899.

LAND OWNER'S SHARE
2 BHK, 3 BHK, Deluxe Flats
Ready to Occupy
Poranki to Nidamanuru Main Road East Facing Apartment
✆ 98481 45800, 76708 81144

పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని లలిత జ్యూయలరీ దగ్గర 160 చ॥గ॥ స్థలంలో ఉన్న బిల్డింగ్‌లో పై ఫ్లోర్‌లోని 2 BHK ఫ్లాట్ అమ్మకం. (80 చ॥గ॥ UD షేర్). ✆ 80742 21509, 72074 08106.

విజయవాడలో, బందరురోడ్‌కి, కామినేనిరోడ్‌కి దగ్గరలో పంటకాలువ 80 అ॥రోడ్‌కి 3వ బిట్ పార్కింగ్+5 Nos New 3 BHK తూర్పు ఫేస్ ఫ్లాట్స్ మొత్తం బిల్డింగ్ అమ్మకు. ✆ 98851 56973.

2 BHK ఫ్లాట్స్ (700 S.Ft, 50 Sq.yards), గోపాల్ అపార్ట్‌మెంట్, 1st ఫ్లోర్ Resale - లబ్బీపేట, బందరురోడ్, కళానికేతన్ వెనుక, సిద్ధార్థ స్కూల్ ప్రక్కన. సెల్: 94412 96513.

3 BHK Flats for Sale
Luxury 3 BHK Flat with 2350 sq. ft. for sale in Prime Locality near Novotel Hotel Bharathi Nagar Vijayawada - 8
Cell : 8309110962

అమ్మకం: అతి తక్కువ ధరకే గృహప్రవేశానికి అనువైన 2 బెడ్‌రూం ఫ్లాట్. నాణ్యమైన కట్టుబడితో రాజీవ్‌నగర్, ఉడా కాలనీ, విజయవాడ. ఫోన్: 98488 64220.

VJA LIC కాలనీ జయప్రకాష్‌నగర్ 1st లైన్ లగ్జరీ 3 BHK ఫ్లాట్స్, ఏలూరు రోడ్, సీతారామపురం, చాపరాలవారి వీధి, AXIS బ్యాంక్ ATM రోడ్‌లో 3 BHK ఫ్లాట్స్ అమ్మకం. ✆ 90305 06249.

భవానీపురం టెలిఫోన్ కాలనీ, బ్రహ్మానందవీధి, M.S.N.Sunrise-2 న్యూ అపార్ట్‌మెంట్ 5th ఫ్లోర్ E/F, 3BHK ఫ్లాట్, 1753 S.Ft.,తో ఫుల్లీ ఫర్నిష్డ్ కార్ పార్కింగ్‌తో అమ్మకం. ✆ 89774 77477/ 89778 99899.

పటమట పంటకాలువ రోడ్డుకి దగ్గరగా మేరిస్టెల్లా ఇండోర్ స్టేడియం ఎదురుగా మరీదు పుల్లారావు వీధిలో 3 BHK ఫ్లాట్ 2nd ఫ్లోర్‌లో అమ్మకమునకు కలదు. ✆ 98483 54049.

VJA, బల్లెంవారి స్ట్రీట్ గౌరీశంకర్ నగర్‌లో అతి తక్కువ బడ్జెట్‌లో 3 BHK ఫుల్లీ ఫర్నిష్డ్ ఫ్లాట్ అమ్మకం. బ్యాంకు లోన్ సౌకర్యం కలదు. ✆ 80742 43368.

VJA శ్రీ రామచంద్ర నగర్‌లో శ్రీ వర్ధిని రెసిడెన్సీలో సుమారు 2000 S.Ft. గల 3 BHK East Facing 5th ఫ్లోర్ లిఫ్ట్, కారు పార్కింగ్‌తో అమ్మకం. ✆ 94404 44336, 94402 00007.

2 BHK Srilakshmi Apts Eluru Road Vijayawada 40 Sq.Yds UDS 960 Sq.Ft 680 Sq.Ft Carpet Lift 2 Wheeler parking. Ph: 9989650137.

2BHK Flat 1628 Sft East Facing With Interiors For Sale At Midvalley City, Vijayawada. Rs: 1.45 Cr. Ph: 9500057987.

New 3 BHK East Face, 1800 Sq.Ft., 2nd & 3rd Floors with full wood work ready to occupy in Marvel Heights, 2 flats/ floor, Mahanadu road, VJA. ✆ 94405 28023.

3 BHK లగ్జరీ ఫ్లాట్స్ ఫర్ సేల్
విజయవాడ, కరెన్సీనగర్‌లో క్వాలిటి కన్‌స్ట్రక్షన్ కలిగి ఇండిపెండెంట్‌గా ఫ్లోర్‌కి ఒకఫ్లాట్ కలిగిన గృహప్రవేశనముకు సిద్ధంగా ఉన్న ఫ్లాట్ అమ్మకమునకు కలదు.
9492916277

గృహప్రవేశమునకు సిద్ధంగా 2 BHK & 3 BHK ఫ్లాట్స్ ప్రసాదంపాడు వివేకానంద స్కూల్ రోడ్‌లో నేషనల్ హైవేకి 100 మీ॥ దూరంలో ఎకరం స్థలం 75 ఫ్లాట్స్‌తో బొప్పన వారి సంకల్ప్ కాసా అపార్ట్‌మెంట్‌నందు A/C, జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, పార్క్ మొ॥ సౌకర్యములతో అమ్మకమునకు కలవు. ✆ 99088 45111.

VJA ఎనికేపాడు NH ఫేస్ SBI దగ్గర Jeep షోరూమ్ ప్రక్కన రిలయన్స్ కృష్ణ గ్రాండియర్ 4వ ఫ్లోర్ 3BHK (2376 చ॥అ॥) ఫ్లాట్ Ready to Occupy. ✆ 81422 24444.

FLAT FOR SALE
విజయవాడ, మహానాడు రోడ్డు, రామచంద్రనగర్‌లో 1950 S.Ft. గల 3 BHK ఫ్లాట్ కబోర్డ్స్, కార్ పార్కింగ్‌తో అమ్మకానికి కలదు.
✆ 99497 88497

సింగ్‌నగర్, ఆంధ్రప్రభకాలనీ, మారుతీ కార్ల షోరూం వెనుక, షిర్డీసాయి హైట్స్ నందు 4th ఫ్లోర్, టాప్ ఫ్లోర్ W/F ఫుల్లీఫర్నిష్డ్ 3 BHK ఫ్లాట్ టోటల్ ఫ్లింత్ 1,431 S.Ft. గృహప్రవేశానికి సిద్ధంగా కలదు. ✆ 98492 42413.

విజయవాడ, సీతారామపురం, ఏలూరు రోడ్డు Icon Public School ప్రక్కన సాయి కార్తీక్ హైట్స్ నందు Flat 104, 3 BHK కారు పార్కింగ్‌తో అమ్మబడును. Contact: 94411 95221.

పటమటలంకలో 4 బెడ్‌రూమ్ ఫుల్లీఫర్నిష్డ్ అపార్ట్‌మెంట్ సేల్ (బెడ్స్, సోఫా, డైనింగ్ టేబుల్, ఎయిర్‌కండీషన్, రిఫ్రిజిరేటర్, డిష్‌వాష్, వాషింగ్ మెషిన్, హీటర్). కాంటాక్ట్: 7095345999.

FLATS for SALE (2 Car Parking)
4BHK 3150 Sft, floor wise 5 Flats in Bharathi Nagar
4BHK 2850 Sft, 10 Flats in Kanuru
✆ 9989855219

రాజధాని అమరావతికి దగ్గరగా తాడేపల్లిలో NH-16 ప్రక్కన క్యాపిటల్ జయభేరి బ్రాండ్ న్యూ అపార్ట్‌మెంట్స్‌లో E-బ్లాక్, 7th ఫ్లోర్‌లో (705) 3735 Sft. విస్తీర్ణం గల 4 BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు. Ph: 98481 27300.

VJA సింగ్‌నగర్ ఇందిరానాయక్ నగర్‌నందు వానపాలవారివీధిలో అమ్మన్న నిలయం New 2 BHK ఫ్లాట్స్ (1190 S.Ft) Ready to Occupy. ✆ 91777 47788.

2350 S.Ft. గల న్యూ 3 BHK లగ్జరీ ఫ్లోర్ వైజ్ ఫ్లాట్స్ అన్ని సౌకర్యాలతో అమ్మకానికి కలవు. ★ ప్రియ పిల్లల హాస్పిటల్ దగ్గర, పటమట, VJA. ✆ 97017 98726, 93931 88388.

2 BHK ఫ్లాట్ అమ్మకం
పటమట పంటకాలువ రోడ్డుకి 2వ బిల్డింగ్, విశాల్ సూపర్ మార్ట్‌కు అతి దగ్గరగా 2 BHK ఫ్లాట్ అమ్మకం (2 వీలర్ పార్కింగ్ మాత్రమే) UDA షేర్ 50 గజాలు
✆ 94911 23645

2&3 BHK డీలక్స్ ఫ్లాట్స్, పోరంకిలో 2 BHK @ 36L & 3 BHK @ 55L గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నవి. CRDA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్స్ M.P.Developers, ✆ 89856 50007.

VJA, కానూరు, పవర్ వన్ మాల్ వెనుక, సిరినగర్ 2 BHK (970 S.Ft) కబోర్డ్స్, టూవీలర్ పార్కింగ్‌తో అమ్మబడును. ధర: 37 లక్షలు. ✆ 98489 92238.

విజయవాడలోని సత్యనారాయణపురం చుట్టుప్రక్కల కాలనీలతో పాటు మధురానగర్, మొగల్‌రాజపురం, గొల్లపూడిలో 4/3/2 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు వున్నాయి. ✆ 94901 98654 విజయవాడ.

విజయవాడ సిరీస్‌రాజు వీధి బృందావన్ కాలనీలో ఫస్ట్‌ఫ్లోర్ 3BHK ఫ్లాట్ (1800 Sft) అమ్మబడును. ✆ 98481 13509, 92464 74685.

విజయవాడ కానూరు బల్లెంవారివీధి పార్థసారధిరోడ్డు శ్రీలలిత రెసిడెన్సీ నందు 2BHK, 3BHK డీలక్స్ ఫ్లాట్స్ కబోర్డ్స్‌తో సహా గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి. ✆ 98485 42997.

కాస TVS ప్రక్కన, అశోక్‌నగర్, బందరురోడ్‌కి అతి సమీపమున నిర్మించిన 3BHK (2 ఫ్లాట్స్ పర్ ఫ్లోర్) గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. ✆ 94940 51157.

కానూరు PVP సిద్ధార్థ రోడ్డుకి 2వ బిట్ కృష్ణతేజ ఎవెన్యూలో 2వ ఫ్లోర్, ఫ్లోర్ వైజ్ 1751చ॥అ॥ ల 3BHK ఫ్లాట్లు అమ్మకము కబోర్డ్స్ లేకుండా ఫైనల్ రేటు 78లక్షలకే. ✆ 83099 70218.

14లక్షలకే మురళీనగర్‌లో 1బెడ్‌రూమ్ పెంట్ హౌస్, గొల్లపూడిలో 22లక్షలకే 2 B/R ఫ్లాట్, కేదారేశ్వరపేటలో 25లక్షలకే 2B/R ఫ్లాట్ అమ్మకం ✆ 93810 60509.

విజయవాడ రామవరప్పాడు శ్రీవైష్ణవి అపార్ట్‌మెంట్ 2nd ఫ్లోర్‌లో, ఈస్ట్ ఫేస్, 3 B/R ఫ్లాట్ లిఫ్ట్, కార్ పార్కింగ్ సౌకర్యంతో అమ్మబడును. ✆ 94401 58658, వాట్సప్: 94406 38431.

4 BHK Luxury Flat
4200 Sq.Ft.
PREMIUM FLAT in 5th Floor at ANURAJ ARCADE
Ready to Occupy
Near Vijayawada Club, Tadepalli
✆ 73374 29299, 81212 74448

విజయవాడ పడమట D-మార్ట్ దగ్గర పుట్ట రోడ్డులో శ్రీనివాస ఎవెన్యూ అపార్ట్‌మెంట్ నందు 1st ఫ్లోర్‌లో W/F 2BHK ఫ్లాట్ అమ్మకానికి కలదు. ✆ 6302942347

కానూరు శ్రీరామ్‌నగర్, సిద్ధార్థ కాలేజీ రోడ్, Opp. శ్యామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్, 2145 S.Ft. డీలక్స్ 3 BHK విత్ కబోర్డ్స్, ఫ్లోర్‌కి ఒక ఫ్లాట్‌తో, 2nd ఫ్లోర్ అమ్మకం. ✆ 98481 23235.

రామవరప్పాడులో N/E 2BHK 28 ల॥ ★ ప్రసాదంపాడులో E/F 3 BHK 1756 S.Ft, బల్లెంవారి వీధికి 3 Bit 68 ల॥, మారుతీనగర్‌లో సౌత్‌ఫేస్ కమర్షియల్ ప్లాటు గజం: 55వేలు. ✆ 98661 38032.

HOUSE FOR SALE

KANURU

విజయవాడ కానూరు కెనడీ స్కూల్ ప్రక్కన SBI కాలనీ నందు తూర్పుఫేస్ 150 చ॥గ॥లలో G+1 ఇండివిడ్యువల్ బిల్డింగ్ గృహ ప్రవేశమునకు సిద్ధంగా ఉంది. ✆ 99498 68286, 85558 65222.

TADIGADAPA

150 చ॥గ॥లో G+1 ఇండిపెండెంట్ హౌస్‌లు (E/F) తాడిగడప మనోజ్‌నగర్‌లో అమ్మకానికి కలవు. ★ కబోర్డ్స్ & కార్ పార్కింగ్ సౌకర్యం. ✆ 98851 22909.

RAMAVARAPPADU

విజయవాడ ప్రసాదంపాడు కొమ్మా రాము స్ట్రీట్‌లో పడమర ఫేసింగ్‌తో 195చ॥గ॥ల్లో G+1 ఇండివిడ్యువల్ బిల్డింగ్ అమ్మబడును. సంప్ర: ✆ 93984 81243.

GANNAVARAM

పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ & హాస్పటల్‌కి అతి దగ్గర్లో Elite బృందావన్, గేటెడ్ కమ్యూనిటీ నందు 165 చ.గ.లో 2 BHK ఇండిపెండెంట్ హౌసెస్ పూర్తి డెవలప్‌మెంట్స్‌తో, బ్యాంక్ లోన్ సౌకర్యంతో కలవు. ✆ 91000 71111.

విజయవాడ ఎయిర్‌పోర్ట్, HCL, మేధా IT పార్క్, NHకి దగ్గర్లో Elite Vistas గేటెడ్ కమ్యూనిటీ నందు 444 చ॥గ॥లో 5 BHK Triplex Villa మరియు 267 చ॥గ॥ల్లో 3 BHK ఇండిపెండెంట్ హౌస్ ఫ్రీ క్లబ్ మెంబర్‌షిప్‌తో, బ్యాంక్ లోన్ సౌకర్యంతో కలవు. ✆ 88856 85599.

GENERAL

గుడివాడ - గుడ్లవల్లేరు రోడ్డులో లక్ష్మీనగర్ కాలనీలో G+2 ఇండివిడ్యువల్ హౌస్ 200 చ॥గ॥ తూర్పు ఫేసింగ్ అమ్మకంనకు కలదు. నో బ్రోకర్స్. ✆ 94403 73206.

నున్నలో SBI సెంటర్‌కి దగ్గర, న్యూ ఇండివిడ్యువల్ హౌసెస్ 143 చ॥గ॥, 124 చ॥గ॥, 72 చ॥గ॥, 84 చ॥గ॥లలో హౌసెస్ కలవు. బ్యాంక్‌లోన్ సౌకర్యం కలదు. బిల్డర్. ✆ 93474 47565.

కృష్ణలంక, బాలాజీనగర్, పాత ఆంజనేయ స్వామి గుడి రోడ్, హైవేకి ప్రక్కన షాప్ కమ్ హౌస్ (G+1), 48గ॥లో ఈస్ట్ ఫేస్ బిల్డింగ్ అమ్మబడును. ✆ 94415 45769.

విజయవాడ, రాజరాజేశ్వరిపేట పోలీసుస్టేషన్ వెనుక ఉత్తరంఫేస్ 44 చ॥గ॥ల్లో G+1 బిల్డింగ్ తక్కువ ధరకే అమ్మకమునకు కలదు. ✆ 99899 04998.

విజయవాడ పటమటలంక రామాలయం వీధిలో Dr. No: 63-2-31 నందు సుమారు 260 చ॥గ॥లలో ఇండివిడ్యువల్ హౌస్ అమ్మబడును. ✆ 94913 38124.

పటమట ఫన్‌టైమ్స్ క్లబ్ ఎదురుగా RTC కాలనీ 4th రోడ్డులో N/E 102 చ॥గ॥లలో G+1 బిల్డింగ్ అమ్మకమునకు కలదు. సంప్ర ✆ 95504 07897.

Poranki House 5000 sft 2F W/F 40ft road, 20ft road, near Priya pickles factory. Rs 2.3cr (neg). Ph: 9440229588.

విజయవాడ మధురానగర్ పప్పులమిల్లు ఎదురుగా ఉత్తరం రోడ్డు నందు 21x60 కొలతలు గల140 గజాల రేకుల షెడ్ అమ్మకమునకు కలదు. సంప్ర: 98661 21779.

ఏలూరు రోడ్, చుట్టుగుంట, గీతామందిరం దగ్గర మేదర బజారులో 135చ॥గ॥లలో గ్రౌండ్, 1st, 2nd ఫ్లోర్ గల బిల్డింగ్ వెంటనే అమ్మబడును. సంప్ర: ✆ 94938 00120

హనుమాన్‌జంక్షన్ నూజివీడు రోడ్డులో ఫ్లైఓవర్ ప్రక్కన ఏపూరు పరిధిలో 195 చ॥గ॥లలో G+3 కమర్షియల్ బిల్డింగ్ నెలకి 50 వేలు అద్దె వచ్చే భవనం అమ్మకం. ✆ 89256 79999, 99512 28999.

విజయవాడ సూర్యారావుపేట రామానాయుడువీధి ఇండో అమెరికన్ డెంటల్ వెనుక Dr.No: 33-3-30 నందు తూర్పు ఫేస్ 203చ॥గ॥లో G+1 బిల్డింగ్ అమ్మకు (నో బ్రోకర్స్) ✆ 99081 88188/ 94915 45104.

విజయవాడ మధురానగర్ పుట్టగుడి రోడ్డు నందు 151 గజాల వెస్ట్‌ఫేసింగ్ ఇల్లు అమ్మకానికి కలదు. సంప్రదించవలసిన నెంబరు 99082 50143.

VJA కస్తూరిబాయిపేటలో గ్రూప్‌హౌస్ G+3 బిల్డింగ్ (2 BHK x 4, 1BHK x 1) అమ్మకంనకు కలవు. సంప్రదించండి. ✆ 94932 56507.

LAND FOR SALE

3 Acres of Land for Sale Situated at Kotturu, Mudunuru, Krishna, AP. Contact No: ✆ 75877 24186.

కాకినాడ అచ్చంపేట జంక్షన్, 100అ. బైపాసు రోడ్డు, నార్త్ ఫేసింగ్, 310/ 500/ 535 చ॥ గ॥ విడిగా లేక కలిపి, మంచి కమర్షియల్ ల్యాండ్ అమ్మబడును. ✆ 9347073899.

LAND FOR SALE
ప్రపంచం వ్యాప్తంగా ఆదరణ పొందుతున్న "మెగా అవకాడో" ఫామ్ ల్యాండ్
★ 11 సెంట్లు 5 లక్షలు మాత్రమే
★ 5 నుండి 60 సం॥ల వరకు ప్రతి ఏటా 2 లక్షల నుండి 5 లక్షల ఆదాయం పొందవచ్చు
✆ 9133574455

కంపెనీస్, గోడౌన్స్, ఇతర వ్యాపారములు చేయుటకు, పామర్రు, వల్లపల్లి NH-216 రోడ్ నందు పామర్రుకి 4 Km దూరములో తూర్పు ఫేస్ డ్రైన్ కాలువకు ఆనుకొని 7 ఎకరాలు ప్రైవేటు ల్యాండ్ అమ్మబడును. 11 KVA పవర్ లైన్ సౌకర్యము వున్నది. కావలసిన వారు Call చేయవచ్చు. ✆ 85559 86137, 99498 29921.

5 Acres Land for Sale. 5 KM from capital Amaravathi, Beside Nimra Medical College, Zupudi, Ibrahimpatnam, VJA. ✆ 82470 94663.

కృష్ణా జిల్లా కూడేరు (కూచిపూడి దగ్గర)లో ఏ.03-30 సెంట్లు వ్యవసాయభూమి అమ్మకమునకు కలదు. 6 అంగుళాల బోర్, డొంకదారి కలవు. ✆ 9000528407.

పొలం అమ్మకము
కృష్ణాజిల్లా, పామర్రు మండలం పెదమద్దాలి గ్రామము నందు NH 165 మరియు NH 65దగ్గర్లో, అరవిందోస్కూల్ ఎదురురోడ్డులో 5 ఎకరాల మాగాణి పొలం అమ్మకము
9494648998

ప్రకాశం జిల్లా, కురిచేడు (మం)లో NSP మేజర్ కాల్వకు ఆనుకొని 45 ఎకరాల మంచి సాగుబడి కల్గిన వ్యవసాయ భూమి మొత్తం పైపు లైనులతో సహా అమ్మబడును. వివరాలకు Ph: 78425 99975.

ఫామ్ హౌస్‌తో ఎ. 16.47 సెంట్ల భూమి తూర్పు తారు రోడ్డు ఉత్తరం మెటల్ రోడ్డు 3 మంచినీటి బోర్లు, 2 చెరువులు, పొలం చుట్టూ ప్రహరీతో, కౌంటుతో రావినూతల గ్రామంలో అమ్మకు. 94901 22145.

ఒక చిన్న వ్యవసాయ భూమి రూ.4,56,000/-లు. తక్షణ రిజిస్ట్రేషన్ పొంది, Corporate వ్యవసాయం ద్వారా తరతరాలకు ఆదాయం పొందండి. Cell: 789 539 1234.

అతి తక్కువ బడ్జెట్ అవకాడో ఫామ్ ల్యాండ్ కేవలం 11 సెంట్లు 4,99,999/- లకే. 5వ సంవత్సరం నుండి 60 సంవత్సరాల వరకు 2,50,000/- పైబడి ఆదాయం పొందగలరు. ఫోన్: 9951123379/ 9100235956.

గుండిమెడ దగ్గర 3 ఎకరములు & పరిసర ప్రాంతాలలో పొలములు మరియు జగ్గయ్యపేట దగ్గర 17 ఎకరములు, లయోలా కాలేజ్ దగ్గర 267 గ॥లలో ఇల్లు అమ్మకమునకు కలవు. ✆ 98496 33982.

PLOT FOR SALE

KANURU

కానూరు షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూల్ దగ్గర పడమర/ దక్షిణం కార్నర్ రెడీ టు కన్‌స్ట్రక్షన్ 360 చ॥గ॥ల లేఅవుట్ ప్లాటు అమ్మకం. ✆ 93966 16555

PENAMALURU

బందరురోడ్డు గంగూరు ధనేకుల Eng. కాలేజ్ ఎదురుగా వెంటనే ఇంటి నిర్మాణమునకు అనువైన వెస్ట్‌ఫేస్ 209, 418 చ॥గ॥ల స్థలములు అమ్మకం. ✆ 93966 16555

200 అ॥ బందరు రోడ్డుకి దగ్గరగా ఈడుపుగల్లు శ్రీ భ్రమరవారి ప్యారడైజ్ ఫేస్-I వెంచర్‌లో 200 చ॥గ॥ లేఅవుట్ ప్లాటు అమ్మకం. సంప్ర ✆ 86881 88809.

CURRENCY NAGAR

విజయవాడ ఆయుష్ హాస్పిటల్ 100 అ॥ రోడ్డు ఫేస్ 700 చ॥గ॥ కమర్షియల్ ప్లాటు అమ్మకమునకు కలదు. ✆ 93966 16555

GANNAVARAM

కేసరపల్లి IT పార్క్, ఎలైట్ విస్టాస్ దగ్గర N/E 320గ॥ W/F 220గ॥, న్యూ 2BHK ఫ్లాట్స్, మంతాడ దగ్గర N/E 240గ॥ వెస్ట్ బైపాస్ దగ్గర 2 1/2 ఎ॥ అమ్మకం. ✆ 86397 97570.

గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కి ఎదురుగా HCL ప్రక్కన UDA Layout Plots లోను సౌకర్యంతో అమ్మకమునకు కలవు. సంప్ర: ✆ 94401 20033.

TADEPALLI

300 EF, 1000 WF sq.yd plots road facing approved layout chinakakani for sale. Contact: 9014458976

GOLLAPUDI

గొల్లపూడి A1 సెంటర్‌కు దగ్గరగా శ్రీ జగన్నాథ మందిర్ రోడ్, కరకట్ట దిగువ 166.66 గజాలు (30x50) E/F రిజిస్టర్డ్ ప్లాట్ అమ్మకానికి కలదు. గజం: 20,000/- ✆ 8919522403.

గొల్లపూడి శ్రీకర 200 గ॥, లక్ష్మీ 400 గ॥, SP-2లో 300 గ॥, సాయిపురం 200 గ॥, రవికృత్తరు 200 గ॥, సాయిబాల 200 గ॥, సాయిశంకర్ 200 గ॥. ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన ✆ 99080 75269.

GENERAL

Plot for Sale 300/600 Sq.Yards Rs. 6000/Sq.Yard. G.Kondur (M) Kattubadipalem (V) Panchayathi L Out East Face. 300 Mtrs. from NH. ✆ 97002 82822.

కానూరు, పోరంకి, గంగూరు, ఈడుపుగల్లు, కంకిపాడు ఏరియాలో మీ ప్లాట్ అమ్మాలన్నా కొనాలన్నా (సంప్ర) ఖచ్చితమైన ధర ఇప్పించగలము. మీ RK Ph: 94942 87778/ 73824 22777.

387 చ॥గ స్థలం అమ్మకమునకు కలదు
విజయవాడ, సీతారామపురం రామానాయుడు వీధిలో స్వాతి ఆఫీస్ దగ్గర, పడమర ఫేస్ స్థలం
387 చ॥గలు స్థలం అమ్మకమునకు కలదు
Cell : 8309110962

హరివిల్లు వారి ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీ High రిటర్న్స్ ప్లాట్స్ @ పెనమలూరు, ఆకునూరు, మచిలీపట్నం, అగిరిపల్లిలో చ॥గ॥ 11 వేల నుండి 23,500/- మాత్రమే. డైరెక్ట్ కంపెనీ సేల్. ✆ 78937 66996.

311 & 623 Sq.Yds, 40 Ft., రోడ్డు, తూర్పు ఫేసు, IRR రోడ్డు, యాంబిటస్ వరల్డ్ స్కూలు వద్ద ప్లాట్లు అమ్మబడును. విజయవాడ. ✆ 88825 79999.

యనమలకుదురు కరకట్ట ప్రక్కన ఖాళీ ప్లాట్లు అమ్మకానికి కలవు. ✆ 92464 65225.

1258 S.YDS East Facing (3 adjacent plots) for Sale in Golden Sands Beach Resorts, Bapatla @ Rs 16K/SYd. ✆ 96189 48457/ 90140 36760.

Vijayawada Opp Novotel. veternery colony, road no.3, 350 Sq yards plot no 64, opp to srihomes #33, size: 45x70, clear title ph: 9848183322

బందరు రోడ్డు ఫేసింగ్ ఉత్తరం వైపు కంకిపాడు దగ్గరలో 388 చ॥గ॥ ప్లాట్ అమ్మకమునకు కలదు. సంప్రదించగలరు. ✆ 98483 43355.

PLOT FOR SALE
Opposite Vijayawada - Gannavaram Airport at Kesarapalli, Near Medha IT Park
R.S. No.119/3, (900+900) 1800 sq. yards.
Contact : 9849400700

VJA, బందరు రోడ్డు, తాడిగడప CRDA LP No: 29/2025 గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్ లోన్ ★ స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 97054 33765, 95502 12110.

బందరు రోడ్డు, ఆకునూరులో 25 ఎ॥ ఓపెన్ ప్లాట్స్ ఇండిపెండెంట్ హౌసెస్ & వినుకొండ బొల్లపల్లి దగ్గర ఫామ్ ల్యాండ్ 20, 25, 60, 100 సెంట్లు అమ్మకం. ✆ 97012 84449.

విజయవాడ సింగ్‌నగర్ తోటావారివీధి 10వ రోడ్ ఈస్ట్‌ఫేస్ విత్ కాంపౌండ్ వాల్ & గేట్స్‌తో 324 చ॥గ॥ల ఖాళీ స్థలము అమ్మబడును. ✆ 94416 38762, 94418 28762.

చతుర్భుజ ప్రాపర్టీస్ & ఇన్‌ఫ్రా
వారి పరిటాల, పెనమలూరు & పామర్రు వెంచర్లలో హైవేని ఆనుకొని CRDA & RERA అప్రూవ్డ్ ప్లాట్స్ అమ్మకం. బ్యాంకు లోను సదుపాయం కలదు. రిజిస్ట్రేషన్ మొదలైనవి.
✆ 96664 62777

రూ.5 లక్షలపై రూ.2 లక్షలు - 38 లక్షలపై రూ.12 లక్షలు సం॥పు ఆదాయం 5వ సం॥ నుంచి 50 ఏళ్ల వరకు ★ వినుకొండలో అవకాడో ఫాం ల్యాండ్ కొనుగోలు ద్వారా సంప్ర: 93900 60136.

హైదరాబాద్ జనచైతన్య, శ్రీమిత్ర సాయిలీల, సాయివిజేత, సుప్రభాత్, స్వగృహ మొదలగు వెంచర్లు మరియు కోహెడ ORR సమీపంలో ప్లాట్లు కొనబడును. ✆ 9542264446.

మచిలీపట్నం వర్రెగూడెం వినాయకుడి గుడి దగ్గర 200 చ॥గ॥ ఖాళీ స్థలం అమ్మబడును. గజం 6000/ సంప్ర Ph: 79893 28417.

PLOT FOR SALE
244 Sq. Yards (40x55) E/F 40 Ft. Road, LP No: 51/2006 (ROWFIN Real Estate Pvt. Ltd.,) NEAR: AIRPORT, GANNAVARAM. @ 24K/Sq Yard.
Cont: 99661 95222, 81421 95222

ఖాళీ స్థలం - 242 గ.లు (5 సెంట్లు) పడమర ఫేసింగ్ పాత భానుప్రసాద్ (హోమియో) ఆసుపత్రి ఎదురు, రైతుపేట, నందిగామ, NTR జిల్లా, అమ్మకమునకు కలదు. 99498 33105, 83090 25675.

మైలవరం రామకృష్ణా కాలనీలో సాయిదుర్గా వెంచర్‌లో 2వైపులా ఈస్ట్ & సౌత్ 33అడుగుల రోడ్లుతో గల 369చ॥గ॥ స్థలం అమ్మకం. ✆ 99899 67891.

అగిరిపల్లి ఊర్లో కొన్నంగుంట రోడ్ గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా తారురోడ్‌కి 50మీటర్ల దూరంలో పడమర, దక్షిణం కార్నర్ బిట్ 26సెంట్ల స్థలం అమ్మకునకు కలదు. ✆ 92464 72653.

విజయవాడ కొండపల్లి మున్సిపాలిటీ ఖిల్లా రోడ్ ప్రముఖ పర్యాటక రాజధానికి 6KM దూరం, వివిధ చెట్లు, ఇల్లు ఉన్న 410చ॥గ॥ ప్లాటు, 33అ॥ రోడ్ అమ్మకం. ✆ 98491 52902.

CRDA అప్రూవ్డ్ లేఔట్ కంచికచర్లలో ప్లాట్స్ అమ్మబడును. Contact: ✆ 96666 85111, 94946 85111.

మైలవరం బాలిరెడ్డి ఇంజినీరింగ్ కాలేజి దగ్గర E/F 123గ॥ W/F 105 గ॥తో నాన్ లేఅవుట్ Plots అమ్మకానికి కలవు. గజం: 4,500/- Ph.No: ✆ 98661 49659.

విజయవాడ ప్రైమ్ ఏరియా లబ్బీపేటలో 300, 400 గ॥ స్థలాలు, రెంటెడ్ బిల్డింగ్స్ మరియు గాయత్రీనగర్, వెటర్నరీ కాలనీ, గురునానక్ కాలనీ ఏరియాలలో స్థలాలు అమ్మకానికి కలవు. ✆ 95420 50403.

బెంజిసర్కిల్‌కి 5KM దూరంలో తక్షణం గృహనిర్మాణానికి అనువైన CRDA, రెరా గేటెడ్ కమ్యూనిటీలో ప్లాట్స్ ★ హౌసెస్ ★ విల్లాలు ★ బ్యాంక్ లోన్ ★స్పాట్ రిజి. ✆ 95531 29369/ 94404 83810.

విజయవాడ దగ్గర ఇబ్రహీంపట్నంలోని మండల ఆఫీస్ ఎదురు సందు నందు 480చ॥గ॥ల స్థలం, తూర్పు ఫేస్ (కొలతలు 66x66) అమ్మకానికి కలదు. సెల్: ✆ 93999 37666, 97042 49555.

అమరావతి రాజధాని కంతేరు గ్రామంలో శ్రీ భ్రమరా టౌన్‌షిప్ ఆనందవిహార్ ఫేజ్-II CRDA Approved Layout 50x62 కొలతలు 344 గజాల పడమర ఫేస్‌తో ఉన్న స్థలం అమ్మకు. ✆ 96763 58196.

బందరు రోడ్డు ఉయ్యూరు మున్సిపాలిటీ ఏరియాలో LP No. వున్న Plot 220 గ॥లు స్పాట్ రిజిస్ట్రేషన్‌కు అమ్మబడును. మార్కెటింగ్ మిత్రులకు ఆహ్వానం. బ్యాంక్ లోన్ కలదు. ✆ 83418 15371.

విజయవాడ మధురానగర్, పాయకాపురం, నున్నలలో ఇళ్ళస్థలములు మరియు విస్సన్నపేట గ్రామంలో వ్యవసాయ భూమి అమ్మకమునకు కలదు. ఫోన్ నెం: 99666 99555.

గుడివాడ బైపాస్ రోడ్డులో స్కంద అపార్ట్‌మెంట్ వద్ద తూ/ద రోడ్డు గల 264 గజాల స్థలం, గురజలో 3 ఎకరాల పొలం అమ్మకమునకు కలవు. ✆ 99663 60356.

పటమట బందరురోడ్డు అతిదగ్గరలో న్యూ RTC కాలనీలో E/F, 200, 300 గ॥ టైమ్ హాస్పిటల్ దగ్గర E/F, 160 గ॥లు G+1, RRగార్డెన్స్ 250 గ॥. ✆ 94406 72474.

ఇది నిజం, ఇది నిజం, ఇది నిజం. వసుధ ఇన్‌ఫ్రా హౌసింగ్ వారి బంపర్ ఆఫర్ శ్రీహరి క్యాపిటల్ సిటీలో 1 ప్లాట్ కొన్నవారికి దర్శిలో 100 గ॥ ఫ్రీగా రెడ్ Sandal ప్లాట్ ఇవ్వబడును. ✆ 95334 62279, 96427 52728.

VJA ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు రోడ్ ఫేస్ 245 గ॥ కమర్షియల్ & నున్న డి-మార్ట్ వెనుక ACC వెంచర్‌లో 210 గ॥ స్థలములు అమ్మకమునకు కలవు. ✆ 75691 80855.

COMMERCIAL SPACE FOR SALE

గూడవల్లిలో నెలకు 5 లక్షలు అద్దెలు వచ్చు రన్నింగ్ కాలేజీ బిల్డింగ్ అమ్మకం. ✆ 93946 26067/ 94903 53541.

సైటు రేటుకే కమర్షియల్ ఫ్లోర్ అమ్మకం
విజయవాడ మహానాడు 100 అ॥ రోడ్డు & 40 అ॥ రోడ్డు, 2 రోడ్ల కార్నర్, G స్క్వేర్ ప్రక్కన సాయి సాధ కాంప్లెక్స్ 5150 S.Ft. 4th ఫ్లోర్ అమ్మకం.
✆ 98482 57552

SHOP FOR SALE

Sale 08 Commercial shop 22 Sq Yards at # 11-52-79, Gudivadavari Street, 1 Town, Vijayawada-520 001. ✆ 98664 54895.

విజయవాడ బెంజ్‌సర్కిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఆంజనేయస్వామి గుడి వద్ద 262 గజముల షాప్‌లు అమ్మకమునకు కలదు. ✆ 94934 74646, 78938 37878.

అమ్మకము
విజయవాడ, గవర్నరుపేటలో ఒక్కొక్క షాపుకు నెలకు 40,000/-లు అద్దె వచ్చు ఐదు గోల్డ్ షాపులు (2వ ఫ్లోర్‌లో) అమ్మకమునకు కలవు. మరియు 3rd ఫ్లోర్‌లో 2,500 చ॥అ॥లు బ్యాంకులకు, ఆఫీసులకు అద్దెకు / అమ్మకముకు కలవు.
7396192198

విజయవాడ, M.G. రోడ్‌లో కంట్రోల్‌రూమ్ ప్రక్కన గాయత్రి టవర్స్‌లో (గ్లోబల్ హాస్పిటల్ బిల్డింగ్) లోయర్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో షాపు నెం. 17లో, వ.అ. 255లు (17X15) (W/F) అమ్మకమునకు కలదు. ఫోన్: 99482 27060, 92919 08888.

LEASE/ SALE

13,000/- అద్దెవచ్చు 500 S.Ft. న్యూ RTC కాలనీ, బందరు రోడ్డులో షాపు అమ్మకం/ గొల్లపూడిలో 4000 S.Ft. కమర్షియల్ షాపు అద్దెకు కలదు. ✆ 90144 47273.

TO LET

Kesarapalli 3 BHK Flats 2,600 S.Ft. Furnished, All Facilities, Gated Community Sai Krishna Town Ship, Buddavaram Rd. ✆ 094251 55225.

పటమట శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ స్కూల్ దగ్గరలో 1400 S.Ft., 3 BHK, గ్రాండ్ ఫ్లోర్, కారు పార్కింగ్‌తో అద్దెకు కలదు. ✆ 87900 85830.

Flat for rent Two BHK B S S Residency Flat No: 501 1146 sft; including car parking; Opp Zion High School Near Gunadala E S I; Very near to Eluru Road; Vijayawada -4 Contact: 9848183677

TOLET
కొణతనపాడు గ్రామంలో ఒక ఎకరం స్థలంలో బందరు రోడ్డుకు అతి దగ్గర పార్కింగ్ కోసం చుట్టూ ఫెన్సింగ్ తో ఫైనాన్స్ కంపెనీలకు, హెవీ వాహనాలకు మరియు వాహనాల కోసం అద్దెకు ఇవ్వబడును. టాయిలెట్ సౌకర్యం కలదు. పూర్తి వివరాలకు సంప్రదించండి.
8309327118

2BHK Independent House for Rent at Maruthinagar Elur Road, Vijayawada. Cont: 9581577799.

At Kanuru Tolet For Offices & / Banks 1900 Sft Centralized AC. Contact: 9848953880 / 7997295291

3 BHK 1650 sft House Second Floor Ramavarappadu Near Zph School Vijayawada Ph: 9440988881.

New 3BHK DP Independent House for Rent (2000 S.Ft.) 2nd fl, Close to Eluru Rd. for Govt./ Corporate Officials. ✆ 94410 72460.

3 BHK Apartment for Rent at 4th Floor, NVKR Towers, Opp. Siddhartha Acadamy, Mogalrajpuram, VJA. No Car Parking. Contact: ✆ 99481 02799.

3 BHK flat with Car parking in ECO Space, Siva Shankar Nagar, Patamata, Vijayawada available rent for 1 year only. ✆ 98663 60763.

గుంటూరు- విజయవాడ హైవే, నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా, LJM రెయిన్ ట్రీ పార్క్‌లో తూర్పు ఫేసింగ్ C-52, 3BHK డ్యూప్లెక్స్ విల్లా అద్దెకు కలదు. Ph : 83319 34548 & 79970 81125.

కామయ్యతోపు సెంటర్, చర్చి ఎదురు రోడ్డు, చలసాని నగర్, 4th లైన్, తారా కృష్ణ రెసిడెన్సీ, 5th ఫ్లోర్, 2 B/R ఫ్లాట్, కబోర్డ్స్, లిఫ్ట్, కార్ పార్కింగ్ విత్ ఫర్నీచర్‌తో అద్దెకు కలదు. ✆ 73860 96534.

విజయవాడ, పటమట రైతుబజార్ ప్రక్కన మారుతి కాలనీలో ఈస్ట్ ఫేసింగ్ 3 BHK, AC మరియు గీజర్, 2 కార్ల పార్కింగ్‌తో పాటు అన్ని సదుపాయాలతో అద్దెకు కలదు. ✆ 95532 25557, 96765 24422.

ఏలూరు రోడ్డు రామమందిరం ఎదురుగా చింతావారివీధి (అరండల్‌పేటలో) గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్ ఆఫీసులకు / రెసిడెన్సీలకు అనువైనది అద్దెకు కలదు. ✆ 98493 87162.

MORE CLASSIFIEDS ON PAGES 11

విధులు బారెడు.. వేతనాలు మూరెడు!

ఉద్యోగాల క్రమబద్ధీకరణకు నోచుకోని ఎంపీఈఏలు

కంకిపాడు, న్యూస్‌టుడే

రాష్ట్ర వ్యాప్తంగా అగ్రి, ఆక్వా ల్యాబ్‌ల్లో మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ సహాయకులు(ఎంపీఈఏ)గా 37 మంది గత పదేళ్లుగా నెలకు రూ.12వేల వేతనానికి పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నారు. 2015లో తెదేపా ప్రభుత్వ హయాంలో కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా ఎంపిక కమిటీలు వారిని ప్రతిభ ప్రాతిపదికన ఎంపిక చేశారు. ఒప్పంద విధానంలో మూడేళ్ల పాటు పనిచేశాక వారి సేవలను క్రమబద్ధీకరించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనావళి అమల్లోకి రావడంతో.. 2019లో ఎన్నికల నిబంధనావళి అమల్లోకి రావడంతో ఎంపీఈఏల కల సాకారం కాలేదు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వ పెద్దలకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా.. తెదేపా హయాంలో నియమితులయ్యారనే అక్కసుతో క్రమబద్ధీకరణ అంశాన్ని పెడచెవిన పెట్టారు.



కంకిపాడులోని ఆక్వా ల్యాబ్‌లో ఆధునిక పరీక్ష పరికరాలు

అంత ఎంఎస్సీ పట్టభద్రులే.. కూటమి ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లడానికి తగిన మార్గం కోసం ఎదురుచూస్తున్నామని ఎంపీఈఏలు చెబుతున్నారు. వారంతా ఎంఎస్సీ పట్టభద్రులు కాగా ఆక్వా ల్యాబ్‌ల్లో గత నాలుగేళ్లుగా చెరువుల్లో నీరు, మట్టి, చేపలు, రొయ్యలకు వచ్చే వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. అవసరం మేరకు క్షేత్రస్థాయిలోనూ ఆక్వా రైతులకు సాయపడుతున్నారు. అలాగే చేప పిల్లల (సంతతి) వృద్ధి (సీడింగ్)లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇతర ఉద్యోగుల్లానే రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తున్నారు. ఉన్నత విద్య, వృత్తి నైపుణ్యంతో పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నా ఈ ఉద్యోగుల కుటుంబాలకు పూట గడవడం కష్టంగా ఉంది. ఎప్పటికైనా మంచి రోజులు వస్తాయనే ఆశతో విధులు నిర్వర్తిస్తున్నారు.

న్యాయం చేస్తారనే నమ్మకంతో ఉన్నాం



మాకు నెలకు రూ.12వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇంటి అద్దె, పెట్రోలు ఖర్చులు పోగా మిగతా సొమ్ము నిత్యావసరాలకే సరిపోవడం లేదు. ఇక పిల్లల చదువు, వైద్యానికి అప్పులు చేయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందనే నమ్మకంతో ఉన్నాం. **-బెజ్జం సుబ్బారావు, ఎంపీఈఏల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు**

మానసిక సమస్యలు ఆరంభంలో గుర్తిస్తే మేలు

- త్వరగా చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేయొచ్చు
- మనోబంధు ఫౌండేషన్ వార్షికోత్సవంలో డాక్టర్ రాధికారెడ్డి



జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ రాధికారెడ్డి, చిత్రంలో రామకృష్ణంరాజు, భాస్కరరావు, రామసుబ్బారెడ్డి, చక్రపాణి, భాస్కరరావు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ప్రస్తుతం మానసిక అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, ఆరంభంలోనే వాటిని గుర్తించి వైద్యులను సంప్రదిస్తే వ్యాధి తీవ్రత పెరగకుండా పూర్తిగా నివారించొచ్చని ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి పేర్కొన్నారు. మానసిక సమస్యలతో బాధ పడుతూ ఇళ్ల నుంచి తప్పిపోయి బయటకొచ్చేసిన అభాగ్యులను అక్కున చేర్చుకుని, వారికి వ్యాధి నయం చేసి.. కుటుంబ సభ్యుల వద్దకు చేర్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్న 'మనోబంధు ఫౌండేషన్' నాలుగో వార్షికోత్సవాన్ని విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాధికారెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. 'మానసిక అనారోగ్యంతో బాధ పడే వారిని సమాజం చిన్నచూపు చూసే భావన తొలుత పోవాలి. ఈ అనారోగ్య సమస్య కూడా శరీరం నుంచే వస్తుందనే విషయం తెలుసుకోవాలి. మన మానసిక ప్రవర్తన గురించి ఏమాత్రం అనుమానం కలిగినా.. వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. పూర్తిగా వ్యాధి నుంచి బయటపడొచ్చు. మానసిక సమస్యలను చూసి.. కొంతమంది మూఢనమ్మకాలను ప్రచారం చేస్తున్నారు. చేతబడి వల్లే ఇలా అయింది అంటూ.. వైద్యం అందించకుండా జాప్యం చేస్తున్నారు. దీనివల్ల వ్యాధి తీవ్రత పెరిగిపోతోంది.' అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ మానసిక సమస్యలకు చికిత్స, మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విశాఖలో 350, కడపలో 100 పడకల మానసిక వైద్యశాలలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 35 వైద్య కళాశాలల్లోనూ 30 పడకల ఆసుపత్రులున్నాయని ఆమె తెలిపారు.

ఇప్పటికి 250 మందిని ఇళ్లకు చేర్చాం

మనోబంధు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ బి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ.. 'గత నాలుగేళ్లలో మానసిక సమస్యలతో బాధ పడుతున్న 250 మందిని గుర్తించాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందించడంతో అందరూ వ్యాధి నుంచి బయటపడ్డారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారందరినీ.. వాళ్ల ఇళ్లకు చేర్చాం. తెలుగు రాష్ట్రాల్లో ఫౌండేషన్ తరఫున ప్రతినిధులు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నారు. ఎక్కడ మానసిక రోగులు కనిపించినా.. వెంటనే వారిని చేరదీసి, ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స అందించడమే మా తొలి ప్రాధాన్యం' అని వివరించారు.

వారిని చిన్నచూపు చూడొద్దు..

రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ విద్యాసంస్థల ఛైర్మన్, లయోల కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ.. మానసిక రోగులను చిన్నచూపు చూడొద్దన్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న మనోబంధు సంస్థకు తాము అండగా నిలుస్తామని చెప్పారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. మానసిక రోగులకు మేమున్నామంటూ భరోసా అవసరమన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 8, 9, 10 తేదీల్లో పవిత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆగస్టు 8, 9, 0 తేదీల్లో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం 3 గంటలకు మూలవిరాట్ దుర్గమ్మకు సుప్రభాత సేవ అనంతరం స్నపనాభిషేకం, పవిత్రమాల ధారణ, 9.30 గంటలకు సర్వ దర్శనం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 10 గంటలకు గణపతి పూజ, మండపారాధన, 4 నుంచి 6 గంటల వరకు మూల మంత్ర హవనాలు, వేదపారాయణ, 9న ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మండపారాధన, సర్వదేవతారాధన, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మూలమంత్ర హవనాలు, 10న 8 నుంచి 10 గంటల వరకు మండపారాధన, శాంతి హోమాలు, ఉదయం 10.30 గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన నిర్వహిస్తారని తెలిపారు. * ఆగస్టు 22న మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో ఉదయం 10 నుంచి 11.30 గంటలకు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఆర్జిత సేవగా వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారని తెలిపారు. టిక్కెట్ రుసుము రూ.1500 చెల్లించి వ్రతంలో పాల్గొన్న వారికి పెద్దలడ్డు, రెండు పూర్ణాలు, రవిక ముక్క, శేషవస్త్రాలు, శక్తి కంకణం, కుంకుమ ప్రసాదం అందజేస్తారని తెలిపారు. ఆగస్టు 18న సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనదలచిన వారు దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. ఆగస్టు 8న దుర్గమ్మను వరలక్ష్మీదేవిగా అలంకరిస్తారని తెలిపారు.

శతకంతో చెలరేగిన నాగూర్‌బాషా



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గుంటూరు జట్టుకు చెందిన బ్యాటర్ **నాగూర్ బాషా** శతకంతో చెలరేగాడు. ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-16 అంతర్ జిల్లాల మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా.. పేరేచర్ల మైదానంలో రెండో రోజైన శనివారం '0' పరుగుతో తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన గుంటూరు జట్టు 81 ఓవర్లలో 304 పరుగులకు ఆలౌటైంది. నాగూర్‌బాషా (125) రాణించగా.. ప్రత్యర్థి బౌలర్లు సీహెచ్ పరంధామ (3/53), ఎం.ధన్విన్ (3/71) మెరిశారు. రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు ఆట నిలిపే సమయానికి 18 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 47 పరుగులతో కొనసాగుతోంది. కృష్ణా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 182 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ☛ మంగళగిరి స్టేడియంలో జరుగుతున్న మరో మ్యాచ్‌లో శనివారం 353 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ప్రకాశం జట్టు 105.1 ఓవర్లలో 493 పరుగులకు ఆలౌటైంది. కె.రాంచరణ్ (75) రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ కేపీ నారాయణ (6/106) మెరిశాడు. తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు 52.4 ఓవర్లలో 90 పరుగులకే కుప్పకూలింది. ప్రత్యర్థి బౌలర్లు జె.దినేష్ (4/23), సీహెచ్ భావేష్ (3/7) విరుచుకుపడ్డారు. ఫాలోఆన్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు రెండో ఇన్నింగ్స్ ఆట నిలిపే సమయానికి తొమ్మిది ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 16 పరుగులతో కొనసాగుతోంది.

ఎంపీ మిథున్‌రెడ్డి రాకతో పటిష్ఠ బందోబస్తు


విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : మద్యం కుంభకోణం కేసులో ఏ4గా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి శనివారం సిట్ కార్యాలయానికి [illegible] వచ్చారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడలోని పోలీస్ కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు ఆంక్షలు విధించారు. కార్యాలయం ముందు రహదారిని బారికేడ్లతో మూసివేశారు. రోప్ పార్టీ, క్విక్ రియాక్షన్ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. వైకాపా నాయకులు అంబటి రాంబాబు, దేవినేని అవినాష్, మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, తలశిల రఘురాం, [illegible] మిథున్‌రెడ్డికి సంఘీభావంగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో భాగంగా మద్యం కుంభకోణం కేసు పెట్టిందని ఆరోపించారు. దీనిపై న్యాయస్థానంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

రాత్రి వరకు ఉత్కంఠ

మిథున్‌రెడ్డి శనివారం రాత్రి వరకు సిట్ కార్యాలయంలోనే ఉన్నారు. పోలీసు జీపుల్లో ట్రంక్ పెట్టెలో ఛార్జిషీట్‌ను న్యాయమూర్తి వద్దకు తీసుకువెళ్లారు. ఆయన్ని అరెస్టు చేస్తా[illegible] ఉత్కంఠ నెలకొంది. ఆ పార్టీ నాయకులు ఇక్కడకు తరలివచ్చారు. భారీగా వర్షం కురవడంతో వెనక్కి వెళ్లిపోయారు. రాత్రి 8 గంటల సమయంలో క్విక్ రియాక్షన్ పోలీసులను సైతం వెనక్కి పంపేశారు. ఆ తర్వాత ఎంపీని అరెస్టు చేశారు.


బ్యాడ్మింటన్ ఛాంప్స్ హిమదీప్, నేహ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పటమటలోని సీహెచ్ ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో శనివారం రాత్రి ముగిసింది. సీనియర్ పురుషుల విభాగంలో ఏవీఎస్ హిమదీప్, మహిళల విభాగంలో కె.నేహ ఛాంపియన్లుగా నిలిచారు. జి.పూజిత్‌రెడ్డి, ఆర్.యశ్విత సాయి ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. డబుల్స్ విభాగంలో ఏవీఎస్ హిమదీప్/బి.కిరణ్ మౌళి జోడీ, మహిళల డబుల్స్‌లో బి.కార్తీష/కె.సాయి శ్రావ్య జోడీ విజేతలుగా నిలిచారు. అండర్-11 బాలుర విభాగంలో ఎం.ప్రజ్వల్ (మచిలీపట్నం), బాలికల విభాగంలో ఎం.అద్వైత, అండర్-13లో కార్తీక్ శ్రీరామ్, కె.ఆద్య, అండర్-15లో మోక్షజ్ఞ సాయి కోనేరు, ఐ.తన్వీ, అండర్-17లో షోయబ్‌ఖాన్, కె.రుతిక, అండర్-19లో డీఎస్ శతమన్యు, డి.తేజస్విని బాలబాలికల వ్యక్తిగత విభాగాల్లో బహుమతులు సాధించారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పి.అంకమ్మచౌదరి విజేతలకు బహుమతులు అందించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఎంఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ముఖ్యఅతిథి అంకమ్మచౌదరి, ప్రసాద్ తదితరులు

దుర్గమ్మ దర్శనానికి వచ్చిన వ్యక్తి మృతి



ప్రాణాలు కోల్పోయిన హరీష్

విజయవాడ బస్‌స్టేషన్: విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి ఉదయం వచ్చిన వ్యక్తి సాయంత్రం గుండెపోటుతో మరణించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బంది ఔట్‌పోస్ట్ పోలీసు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన జి.హరీష్(28) అవివాహితుడు కర్ణాటకలోని కార్లహల్లెలో ఫ్యాన్ల కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దుర్గమ్మను దర్శించుకునేందుకు శనివారం ఉదయం విజయవాడకు చేరుకున్నారు. దర్శనం అనంతరం స్వగ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సర్వీసు నంబరు 6996లో సీటు రిజర్వేషన్ చేసుకున్నారు. సాయంత్రం 7.30 గంటలకు బస్సు బయలుదేరడానికి ముందుగా 6.30 గంటల సమయంలో బస్ స్టేషన్‌కు చేరుకున్న సమయంలో ఒంట్లో కొంచెం నలతగా ఉందని డిపాశ్చర్ బ్లాక్‌లోని మందుల దుకాణం వద్దకు వెళ్లి మాత్రలు అడిగాడని.. ఇచ్చేలోపే కింద పడిపోయాడని మూర్ఛ వచ్చిందేమో అనుకుని సపర్యలు చేసినట్లు తెలిపారు. చలనం లేకపోవడంతో 108కు సమాచారం ఇచ్చామని సిబ్బంది వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారన్నారు. అనంతరం ఉరవకొండలోని అతని కుటుంబసభ్యులకు మృతుడి చరవాణి ద్వారా సమాచారం అందించామన్నారు. అతని తండ్రి ఆర్టీసీలో మెకానిక్‌గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయినట్లు తెలిపారు.

యోగాసన పోటీలు నేడు


విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆటోనగర్ బస్ టెర్మినల్ ఎదురుగా ఉన్న సాయిబాబా కల్యాణ మండపంలో ఈ నెల 20వ తేదీన జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తామని జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షుడు కొంగర సాయి తెలిపారు. పదేళ్ల నుంచి 55 సంవత్సరాల్లోపు గల బాలబాలికలు, స్త్రీ, పురుషులకు ఆరు కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఒక్కో అథ్లెట్ వారి వయసు విభాగంలో రెండు ఈవెంట్లలో మాత్రమే పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పారు. పది ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తామని వివరించారు. విజేతలను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు.

చీటీ పాటల పేరుతో టోకరా

సుమారు 200 మంది నుంచి రూ.6 కోట్లు వసూలు




కోటేశ్వరమ్మ ఇంటి వద్ద బాధితులు



పరారైన కోటేశ్వరమ్మ


పటమట, న్యూస్‌టుడే: పిల్లల చదువు కోసం ఒకరు... ఇల్లు కొందామని మరొకరు.. కూతురు పెళ్లి చేద్దామని ఇంకొకరు ఓ మహిళ వద్ద చీటీ పాటలు కట్టారు. సుమారు 200 మంది నుంచి దాదాపు రూ.6 కోట్లు ఆమె కట్టించుకుంది. ఆ సొమ్ముతో ఆమె పరారైన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం.. విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన యామలమండ కోటేశ్వరమ్మ భర్త ఆర్టీసీ డ్రైవర్. వారికి ఇద్దరు సంతానం. స్థానికులతో ఆమె పరిచయాలు పెంచుకుని కొన్నేళ్లుగా చీటీలు వేస్తోంది. రూ.లక్ష నుంచి రూ.5 లక్షల దాకా చీటీ పాటలు నిర్వహించేది. చీటీ పాడుకుని తన దగ్గరే నగదు ఉంచితే రూ.5 వడ్డీ ఇచ్చేది. కొంతకాలం నమ్మకంగానే సొమ్ము చెల్లించడంతో ఒక్కొక్కరు రెండు, మూడు చీటీలు కట్టారు. తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కూడా కట్టించారు. చీటీల గడువు ముగిసినా గత మూడు నెలలుగా ఎవరికీ నగదు ఇవ్వడం లేదు. రేపు... మాపు అంటూ తిప్పుతోంది. శనివారం ఉదయం ఆమె ఇంటి వద్ద ఎవరూ కనిపించలేదు. శుక్రవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులతో పాటు కోటేశ్వరమ్మ పరారైనట్లు బాధితులు గుర్తించి గగ్గోలు పెట్టారు. ఆమె ఇంటి వద్దకు సుమారు 80 మంది బాధితులు వచ్చి న్యాయం చేయాలని ఆందోళన చేశారు. పటమట పోలీసులు వచ్చి బాధితులకు సర్ది చెప్పారు. బాధితులు పటమట స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కుటుంబ సభ్యులంతా కట్టాం




మొదట్లో రూ.లక్ష చీటీ వేశా. నమ్మకంగా నగదు చెల్లించడంతో నాతో పాటు మా కుటుంబ సభ్యులు, బంధువులతో కూడా కట్టించా. మూడు నెలల కిందట పాట గడువు ముగిసినా నగదు ఇవ్వకుండా రోజుల గడిపింది. ఇప్పుడు ఊరు వదిలి వెళ్లిపోయింది. మాకు రూ.24.5 లక్షలు రావాలి. **- యార్లగడ్డ నాగమణి, రామలింగేశ్వరనగర్**

ఇల్లు కొనుక్కుందామని...



మా మామయ్య చెబితే నేను రూ.5 లక్షల చీటీ పాట కట్టా. గడువు ముగిసి మూడు నెలల అవుతోంది. ఈ వారం ఇస్తా... ఆ వారం ఇస్తానని నమ్మించి కుటుంబంతో పాటు పరారైంది. నేను సిమెంట్ పనులకు వెళ్తుంటారు. ఇల్లు కొనుక్కుందామని ప్రతి నెల కూలి డబ్బులో నుంచి కొంత తీసి చీటీ కట్టా **- నాగరాజు, పోరంకి**

పిల్లల చదువుల కోసమని..



పిల్లల చదువుల కోసమని ప్రతి నెల జీతంలో వచ్చే డబ్బుని కోటేశ్వరమ్మ వద్ద చీటీ వేశా. నమ్మకంగా ఉంటుందని రెండు పాటలు కట్టాం. అందరితో డబ్బులు కట్టించుకుని పారిపోయింది. పోలీసులు ఆమెను పట్టుకుని మాకు న్యాయం చేయాలి. **- మహ్మద్ అజంతుల్లా, గాయత్రి రోడ్డు**

చాంపియన్

ఫిడే మహిళల ప్రపంచకప్

సెమీస్ చేరువలో హంపి



హంపి

బాటుమి (జార్జియా)

ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్‌లో భారత గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి సెమీఫైనల్‌కు చేరువైంది. శనివారం క్వార్టర్‌ఫైనల్ తొలి గేమ్‌లో ఆమె.. చైనాకు చెందిన యుక్సిన్ సాంగ్‌పై విజయం సాధించింది. నల్లపావులతో ఆడిన ప్రత్యర్థిపై హంపి మొదటి నుంచి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. హంపి 53 ఎత్తుల్లో గేమ్‌ను ముగించింది. రెండో గేమ్‌ను కనీసం డ్రాగా ముగించినా ఆమె సెమీఫైనల్లోకి ప్రవేశిస్తుంది. ఇద్దరు భారత క్రీడాకారిణులు ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్ మధ్య జరిగిన క్వార్టర్స్ తొలి గేమ్ 31 ఎత్తుల్లో డ్రాగా ముగిసింది. మరో భారత అమ్మాయి వైశాలి కూడా తన గేమ్‌ను డ్రాగా ముగించింది. మహిళల మాజీ ప్రపంచ ఛాంపియన్ జోంగ్యి తాన్ (చైనా)ను ఆమె 73 ఎత్తుల్లో నిలువరించింది. టాప్ సీడ్ టింజీ లీ (చైనా) విజయాన్నందుకుంది. నల్లపావులతో ఆడిన ఆమె.. జార్జియాకు చెందిన నన జాగ్నిజెను ఓడించింది. ఈ టోర్నమెంట్లో టాప్-3లో నిలిచిన అమ్మాయిలు మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తారు. ఆ టోర్నీ విజేత వచ్చే మహిళల ప్రపంచ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ వెంజున్ జున్ (చైనా)ను ఢీకొంటుంది.

మాంచెస్టర్‌లో టీమ్ ఇండియా



మాంచెస్టర్: ఇంగ్లాండ్‌తో మూడో టెస్టుకు సన్నద్ధం కావడం కోసం టీమ్‌ఇండియా ఆటగాళ్లు శనివారం మాంచెస్టర్ స్టేడియానికి చేరుకున్నారు. ఇందు కోసం వాళ్లు రైల్లో ప్రయాణం చేశారు. సాధారణంగా నగరాల్లో బస్సులోనే ఆటగాళ్ల ప్రయాణాలుంటాయి. కానీ మాంచెస్టర్‌లో వర్షం, ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా ఆటగాళ్లు రైల్లో వెళ్లారు. అయితే ఆటగాళ్ల పూర్తి ప్రయాణం రైల్లోనే సాగలేదు. దిగాల్సిన స్టాప్ కంటే కొంచెం ముందే దిగిన శుభ్‌మన్ బృందం.. వర్షంలో తడుస్తూ 300 మీటర్ల దూరం నడిచి స్టేడియానికి చేరుకుంది. అండర్సన్-తెందుల్కర్ ట్రోఫీలో ప్రస్తుతం భారత్ 1-2తో వెనుకబడి ఉంది. తొలి టెస్టులో ఓడిన అనంతరం రెండో టెస్టులో ఘనవిజయం సాధించిన భారత్.. మూడో టెస్టులో త్రుటిలో ఓడింది. నాలుగో టెస్టు బుధవారం మొదలవుతుంది.

అర్జున్ పరాజయం



అర్జున్

లాస్ వెగాస్: ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్‌స్లామ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి పోరాటం ముగిసింది. సెమీఫైనల్లో అతడు 0-2తో లెవాన్ అరోనియన్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. తొలి గేమ్‌లో అరోనియన్ క్లిష్ట స్థితిలో నిలిచినా.. ఆఖరికి పైచేయి సాధించాడు. రెండో గేమ్‌లో అరోనియన్‌కు డ్రా చేసుకున్నా సరిపోయేది. గేమ్ ఓ దశలో డ్రా దిశగా సాగింది కూడా. కానీ పోటీలో నిలవాలంటే తనకు గెలుపు తప్పనిసరైన నేపథ్యంలో అర్జున్ సాహసాలు చేసి దెబ్బతిన్నాడు. అరోనియన్ ఫైనల్లో హాన్స్ నీమన్ (అమెరికా)తో తలపడతాడు. మరో సెమీఫైనల్లో నీమన్ 2.5-1.5తో ఫాబియానో కరువానా (అమెరికా)ను ఓడించాడు. టైటిల్ రేసుకు దూరమైన ప్రజ్ఞానంద 3వ-8వ స్థానం ప్లేఆఫ్‌లో 1.5-0.5 విన్సెంట్ కేమర్ (జర్మనీ)పై గెలిచాడు.

అంబుడ్స్‌మన్, ఎథిక్స్ అధికారి నియామకం

- హడావుడిగా ముగిసిన హెచ్‌సీఏ ఏజీఎం
- నిరసనలతో ఉప్పల్ స్టేడియం వద్ద ఉద్రిక్తత

ఈనాడు, హైదరాబాద్: వరుస వివాదాలతో సతమతం అవుతున్న హైదరాబాద్ క్రికెట్ సంఘం.. నిరసనల మధ్య సర్వసభ్య సమావేశాన్ని హడావుడిగా ముగించింది. గత నెల 29న జరిగిన ఏజీఎంకు కొనసాగింపుగా శనివారం సమావేశాన్ని నిర్వహించిన హెచ్‌సీఏ.. రెండు కీలక నియామకాలు చేపట్టింది. ఎథిక్స్ కమిటీ ఛైర్మన్‌గా రిటైర్డ్ జడ్జి జస్టిస్ కేసీ భాను, అంబుడ్స్‌మన్‌గా సురేశ్ కుమార్‌లను ఎన్నుకున్నారు. హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు శివలాల్ యాదవ్ వీళ్లిద్దరి పేర్లను ప్రతిపాదించగా.. మూజువాణి ఓటుతో వీరి ఎన్నికను పూర్తి చేశారు. అయితే అంబుడ్స్‌మన్, ఎథిక్స్ కమిటీ ఛైర్మన్ నియామకాల కోసం బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించకపోవడం, ఏజీఎంను తక్కువ సమయంలో ముగించడం పట్ల కొందరు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు జస్టిస్ లావు నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మూడేళ్ల పాటు నిషేధం పడ్డ 57 క్లబ్‌ల ప్రతినిధులను ఈ సమావేశానికి అనుమతించలేదు. హెచ్‌సీఏ చివరి రెండు సమావేశాల్లో ఈ క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొనడం గమనార్హం. హెచ్‌సీఏ ఏజీఎం జరుగుతున్న సమయంలోనే తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) మాజీ ఛైర్మన్, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఉప్పల్ స్టేడియం వద్ద నిరసన చేపట్టారు. హెచ్‌సీఏ దృష్టంతా హైదరాబాద్ పరిధిలోని క్రికెట్ క్లబ్బుల మీదే ఉందని.. జిల్లాల్లోని క్లబ్బులను పట్టించుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి మీద దృష్టిసారించాలని, 300 క్లబ్‌లకు సభ్యత్వం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్టేడియం వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు.. వెంకటేశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. కొన్ని గంటల తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడిచిపెట్టారు.



వెంకటేశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

శుభ్‌మన్ ప్రశాంతంగా ఉండాలి



సునీల్ గావస్కర్

అండర్సన్-తెందుల్కర్ ట్రోఫీ రోజు రోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. రెండు జట్లకూ గెలిచే అవకాశాలతో ఇటీవల ఎన్ని టెస్టులు అయిదో రోజు వరకు వెళ్లాయి? కీలక సమయాల్లో రాణించడం వల్లే సిరీస్‌లో ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో ఉంది. వచ్చే రెండు మ్యాచ్‌ల్లో ఈ పరిస్థితి మారుతుందని, యువ ప్రతిభావంతులతో కూడిన భారత జట్టు సిరీస్ గెలుస్తుందని ఆశిస్తున్నా. ఈ భారత జట్టులో ఎంతో ప్రతిభ ఉంది. కానీ అనుభవం లేకపోవడం వల్ల మ్యాచ్ గమనాన్ని మార్చి, పట్టుబిగించగలిగే సందర్భాలను గుర్తించలేకపోయింది. ప్రయత్నం గొప్పగా ఉంది. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లు అద్భుతంగా పోరాడారు. మొండి భాగస్వామ్యాలను విడదీసి, జట్టును ముందంజలో నిలపడానికి ఎంతో కష్టపడ్డారు. కానీ ఫీల్డర్ల నుంచి వారికి సరైన సహకారం లభించలేదు. దాంతో వాళ్ల పని మరింత క్లిష్టమైంది. మూడు మ్యాచ్‌ల్లోనూ పిచ్‌లు చాలా సాధారణంగా ఉన్నాయి. తొలి రోజు తాజా పిచ్‌ల నుంచి మాత్రమే బౌలర్లకు సహకారం లభించింది. ఆ తర్వాత ఏమీ లేదు. బౌలర్లు చాలా కష్టపడాల్సి వచ్చింది.

ఆరున్నర వారాల్లోనే అయిదు టెస్టులను ఇరికించడంతో సేద తీరడానికి, పరిస్థితిని అంచనా వేసి.. పరిష్కారాలను వెతుక్కోవడానికి భారత్‌కు తగినంత సమయమే లేకపోయింది. మ్యాచ్‌ల మధ్య విరామాల్లో ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడడానికి విముఖత కూడా ప్రతికూలంగా మారింది. ఈ సిరీస్‌లో తమకు ఆడే అవకాశం రాదని రెండు మ్యాచ్‌లయ్యే సరికి నలుగురైదుగురు ఆటగాళ్లకు అర్థమై ఉంటుంది. సీనియర్లు ఈ విరామాల్లో క్రికెట్‌కు దూరంగా ఉండి.. మానసికంగా, శారీరకంగా సేద తీరాలనుకోవడంలో తప్పులేదు. కానీ విదేశాల్లో పెద్దగా ఆడిన అనుభవం లేని కుర్రాళ్లు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడడం ద్వారా తుది జట్టులో స్థానం కోసం ప్రయత్నించవచ్చు. ఫామ్‌లో, లయలో లేని వాళ్లు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని జోరందుకోవచ్చు. సరిగా రాణించని ఆటగాళ్లను మ్యాచ్ ప్రాక్టీస్ లేమి మరింత ఆందోళన కలిగిస్తుంది. ఓ సాధారణ జట్టుతోనైనా సరే, మాంచెస్టర్ టెస్టుకు ముందు 8 రోజుల విరామంలో ప్రాక్టీస్ మ్యాచ్ ఉండి ఉంటే జైస్వాల్, కరుణ్ నాయర్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్ వంటి ఆటగాళ్ల బ్యాటింగ్ ప్రాక్టీస్‌కు బాగా ఉపయోగపడేది. అర్ష్‌దీప్, కుల్‌దీప్, ప్రసిద్ధ్ వంటి బౌలర్లకు కూడా మేలు జరిగేది. ఈ యువ క్రికెటర్లు నేరుగా మ్యాచ్‌లో బరిలోకి దిగాలనుకోవడం అన్యాయం. నాలుగో టెస్టు టీమ్‌ఇండియాకు అసలైన పరీక్ష. అక్కడ తడి, చల్లని వాతావరణం ఉంటుంది. అది భారత్‌కు ఇష్టం ఉండదు. కానీ అదృష్టం కలిసొస్తే పైచేయి సాధించవచ్చు.

ఇంగ్లాండ్‌లో భారత్ ఇప్పటివరకు మూడుసార్లు టెస్టు సిరీస్‌లో గెలిచింది. 1971లో వాడేకర్, 1986లో కపిల్‌దేవ్, 2007లో రాహుల్ ద్రవిడ్ కెప్టెన్లుగా జట్లను విజయపథంలో నడిపించారు. వీళ్లెప్పుడూ ఆవేశపడేవాళ్లు కాదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రశాంతంగా ఉండేవాళ్లు. బర్మింగ్‌హామ్‌లో గిల్.. ఈ ముగ్గురి కలయికలా కనిపించాడు. అతడు మళ్లీ అలా ఉండగలిగితే తొలి అండర్సన్-తెందుల్కర్ ట్రోఫీ భారత్ సొంతమవుతుంది.

క్వార్టర్స్‌లో భారత్

ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్

సోలో (ఇండోనేసియా): బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన గ్రూప్-డి మ్యాచ్‌లో భారత్ 110-83తో యూఏఈపై విజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో రుజుల 11-5తో మిషా ఖాన్‌ను ఓడించడంతో మ్యాచ్‌ను భారత్ ఘనంగా ఆరంభించింది. ఆ తర్వాత మిక్స్‌డ్ డబుల్స్ జంట లాల్రామ్‌సంగా, తారిని భారత్ ఆధిక్యాన్ని 22-11కు పెంచారు. కొన్ని మ్యాచ్‌ల్లో యూఏఈ గట్టిగా ప్రతిఘటించినప్పటికీ పోరు ఆసాంతం భారత్ ఆధిక్యాన్ని కొనసాగించింది. పోరు సగం పూర్తయ్యేసరికి 55-41తో ఉన్న భారత్.. యుఎస్ ఓపెన్ ఫైనలిస్టు తన్వీ శర్మ విజయంతో 66-46తో నిలిచింది. ఈ పోరులో రెండు జట్లు మొత్తం 10 పది మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. టోర్నీ నిబంధనల ప్రకారం మొదట 110 పాయింట్లకు చేరుకున్న జట్టు విజేతగా నిలుస్తుంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత్.. క్వార్టర్స్‌లో స్థానాన్ని ఖాయం చేసుకుంది. భారత్ జట్టు శుక్రవారం శ్రీలంకపై నెగ్గింది. హాంకాంగ్ కూడా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి నాకౌట్స్‌కు అర్హత సాధించింది. ఆదివారం హాంకాంగ్, భారత్ మధ్య జరిగే మ్యాచ్ గ్రూప్ టాపర్‌ను నిర్ణయిస్తుంది.



షమి

షమి దేశవాళీ బాట

కోల్‌కతా: ఎన్నో ఏళ్ల పాటు టీమ్‌ఇండియా ప్రధాన పేసర్లలో ఒకడిగా ఉన్న మహ్మద్ షమి.. ఇప్పుడు జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. వయసు పెరగడం, ఫిట్‌నెస్ సమస్యలు తలెత్తడం, ఫామ్ కూడా అంత బాగా లేకపోవడమే ఇందుక్కారణం. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత గాయం కారణంగా షమి ఏడాదికి పైగా ఆటకు దూరమయ్యాడు. నిరుడు పునరాగమనం చేసినప్పటికీ.. మునుపటిలా సత్తా చాటలేకపోయాడు. దీనికి తోడు ఫిట్‌నెస్ సమస్యలు పూర్తిగా సమసిపోకపోవడంతో షమిని ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేయలేదు. ప్రస్తుత ఇంగ్లాండ్ సిరీస్‌కూ అతను జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరపున ఘోరంగా విఫలమైన అతను నెల రోజులకు పైగా మైదానంలోకే రాలేదు. ఇప్పుడు తిరిగి దేశవాళీల్లో ఆడబోతున్న షమి.. అక్కడ సత్తా చాటి టీమ్‌ఇండియాలోకి పునరాగమనం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. రాబోయే దేశవాళీ సీజన్ కోసం బెంగాల్ జట్టు ప్రకటించిన 50 మంది ప్రాబబుల్స్‌లో షమికి చోటు దక్కింది. తాను బెంగాల్ జట్టుకు అందుబాటులో ఉంటానని షమి ఇచ్చిన సమాచారం మేరకే అతణ్ని ప్రాబబుల్స్‌లో చేర్చినట్లు సమాచారం. ప్రస్తుతం టెస్టు జట్టులో సభ్యులైన ఆకాశ్ దీప్, అభిమన్యు ఈశ్వరన్ కూడా ఈ ప్రాబబుల్స్‌లో ఉన్నారు.



ఎకిల్‌స్టోన్ 3/27

లార్డ్స్‌లో అమ్మాయిలకూ పంచ్

రెండో వన్డేలో భారత్‌పై ఇంగ్లాండ్ విజయం

లండన్

ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో ఇటీవలే భారత పురుషుల జట్టు టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ చేతిలో ఓడింది. ఇప్పుడు అదే మైదానంలో భారత మహిళల జట్టు కూడా ఇంగ్లాండ్‌కు తల వంచింది. అయితే శుభ్‌మన్ సేనలా హర్మన్‌ప్రీత్ బృందం పోరాడి ఓడలేదు. ఇటు బ్యాటింగ్‌లో, అటు బౌలింగ్‌లో ఘోరంగా విఫలమై చిత్తుగా ఓటమి పాలైంది. మూడు వన్డేల సిరీస్‌ను విజయంతో ఆరంభించిన భారత్.. శనివారం వర్షం దోబూచులాడిన రెండో వన్డేలో 8 వికెట్ల తేడాతో పరాజయం చవిచూసింది. 29 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో మొదట భారత్ 8 వికెట్లకు 143 పరుగులే చేసింది. స్మృతి మంధాన (42; 51 బంతుల్లో 5×4), దీప్తి శర్మ (30; 34 బంతుల్లో 2×4) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. సోఫీ ఎకిల్‌స్టోన్ (3/27), లిన్సీ స్మిత్ (2/28), ఎమ్ అర్లాట్ (2/26) భారత్‌ను దెబ్బ తీశారు. అనంతరం ఓపెనర్లు ఎమీ జోన్స్ (46 నాటౌట్; 57 బంతుల్లో 5×4), టామీ బ్యూమాంట్ (34; 35 బంతుల్లో 5×4)లతో పాటు కెప్టెన్ నాట్ సీవర్ (21) కూడా రాణించడంతో ఇంగ్లాండ్ 21 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 18.4 ఓవర్లలో ఇంగ్లాండ్ 102/1తో ఉన్న దశలో వర్షం వల్ల మ్యాచ్ ఆగగా.. తిరిగి ఆట ఆరంభమయ్యాక లక్ష్యాన్ని 24 ఓవర్లలో 115కు సవరించారు. వెంటనే నాట్ సీవర్‌ను క్రాంతి గౌడ్ బౌల్డ్ చేసినా.. అమీ, సోఫియా డంక్లీ (9 నాటౌట్) కలిసి మిగతా పని పూర్తి చేశారు. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే మూడో వన్డే మంగళవారం జరుగుతుంది. పర్యటనలో అదే చివరి మ్యాచ్. వన్డేల కంటే ముందు జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ గెలిచిన సంగతి తెలిసిందే. ఇంగ్లాండ్‌పై ఈ ఫార్మాట్లో భారత్‌కు అదే తొలి సిరీస్ విజయం.



స్మృతి మంధాన 42

భారత్ ఇన్నింగ్స్: ప్రతీక (బి) అర్లాట్ 3; స్మృతి (సి) చార్లీ డీన్ (బి) లిన్సీ స్మిత్ 42; హర్లీన్ (సి) అండ్ (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 16; హర్మన్‌ప్రీత్ (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 7; జెమీమా (సి) అండ్ (బి) చార్లీ డీన్ 3; రిచా ఘోష్ ఎల్బీ (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 2; దీప్తి శర్మ నాటౌట్ 30; అరుంధతి ఎల్బీ (బి) లిన్సీ స్మిత్ 14; స్నేహ్ రాణా (బి) అర్లాట్ 6; క్రాంతి గౌడ్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 16 **మొత్తం:** (29 ఓవర్లలో 8 వికెట్లకు) **143; వికెట్ల పతనం:** 1-6, 2-46, 3-57, 4-69, 5-72, 6-98, 7-124, 8-135; **బౌలింగ్:** లారెన్ బెల్ 6-0-29-0; ఎమ్ అర్లాట్ 6-1-26-2; చార్లీ డీన్ 6-0-31-1; సోఫీ ఎకిల్‌స్టోన్ 6-0-27-3; లిన్సీ స్మిత్ 5-0-28-2


ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: ఎమీ జోన్స్ నాటౌట్ 46; టామీ బ్యూమాంట్ ఎల్బీ (బి) స్నేహ్ 34; నాట్ సీవర్ (బి) క్రాంతి గౌడ్ 21; సోఫియా డంక్లీ నాటౌట్ 9; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (21 ఓవర్లలో 2 వికెట్లకు) **116; వికెట్ల పతనం:** 1-54, 2-102; **బౌలింగ్:** అరుంధతి రెడ్డి 5-0-21-0; క్రాంతి గౌడ్ 3-0-29-1; శ్రీ చరణి 5-0-28-0; దీప్తి శర్మ 5-0-23-0, స్నేహ్ రాణా 3-0-12-1

సమాఖ్యలన్నీ క్రీడా బోర్డు పరిధిలోకి

కీలక బిల్లును ప్రవేశపెట్టనున్న కేంద్ర ప్రభుత్వం

దిల్లీ: దేశంలో క్రీడా సమాఖ్యల్లో జవాబుదారీతనం పెంచి, వాటి పనితీరును మెరుగుపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ క్రీడా బోర్డు (ఎన్‌ఎస్‌బీ)ను ఏర్పాటు చేయనుంది. జాతీయ క్రీడా పాలన బిల్లులో కేంద్రం ఈ బోర్డు విధివిధానాలను పేర్కొంది. సోమవారం మొదలయ్యే వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే.. దేశ క్రీడా పరిపాలనలో గొప్ప మార్పు వస్తుందని భావిస్తున్నారు. ఇప్పటిదాకా భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) పరిధిలో క్రీడా సమాఖ్యలు పని చేస్తున్నాయి. అయితే తరచూ వివాదాలు, అంతర్గత కుమ్ములాటలతో ఐఓఏ తీవ్ర విమర్శల పాలవుతోంది. సమాఖ్యలను కూడా అది అదుపు చేసే స్థితిలో లేదు. అవినీతి సహా సమాఖ్యలపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. వీటన్నింటినీ సరిదిద్దడానికి జాతీయ క్రీడా బోర్డే పరిష్కారమని కేంద్రం భావిస్తోంది. ఈ బోర్డులో ఒక ఛైర్‌పర్సన్, ఇతర సభ్యులు ఉంటారు. క్రీడలతో సంబంధం ఉన్న, అత్యున్నత అర్హతలు ఉన్న వారిని కేంద్ర ప్రభుత్వమే ఈ పదవుల్లో నియమిస్తుంది. దేశంలోని క్రీడా సమాఖ్యలన్నీ.. ఈ బోర్డుకు జవాబుదారీగా ఉంటాయి. దీంతో ఐఓఏ ప్రాధాన్యం తగ్గుతుందని, క్రీడా పాలన గాడిన పడుతుందని అంచనా వేస్తున్నారు.

గిల్‌కు అసలు పరీక్ష ఇప్పుడు



గ్రెగ్ చాపెల్

దిల్లీ: సిరీస్‌లో భారత్ 1-2తో వెనుకబడ్డ నేపథ్యంలో కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు అసలు పరీక్ష ఇప్పుడు మొదలవుతుందని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ గ్రెగ్ చాపెల్ అభిప్రాయపడ్డాడు. "ఇంగ్లాండ్‌తో ఆఖరి రెండు టెస్టులకు భారత్ సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇప్పుడు దృష్టంతా యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పైనే. అతడు ప్రతిభావంతుడు. ఇప్పటికే బ్యాటుతో గొప్పగా రాణించాడు. మంచి నాయకుడయ్యే లక్షణాలూ అతడిలో కనిపించాయి. అయితే మిగిలిన రెండు టెస్టులు కెప్టెన్‌గా అతడి గమనాన్ని నిర్దేశించనున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎదగడం అంత తేలిక కాదు" అని చాపెల్ అన్నాడు. గిల్ తనకు కావాల్సిన జట్టును ఎంచుకోవడంలో దృఢంగా వ్యవహరించాలని అన్నాడు. గిల్ గొప్ప కెప్టెన్ కావాలనుకుంటే.. తనదైన ముద్రను వేయడానికి ఇది సరైన సందర్భమని చాపెల్ చెప్పాడు.

కమల్ చావ్లా శుభారంభం

మనామా (బహ్రెయిన్): ప్రపంచ 6-రెడ్ స్నూకర్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కమల్ చావ్లా శుభారంభం చేశాడు. శనివారం గ్రూప్-ఎ మ్యాచ్‌లో అతడు 4-2తో జాఫర్ (బహ్రెయిన్)పై గెలిచాడు. అండర్-21 విభాగంలో మయాంక్ కార్తీక్ ఆరవ్ సంచేటి, మయూర్ గార్గ్ తమ తమ గ్రూపుల్లో విజయాలు సాధించారు.

ప్రియకు రజతం

బుడాపెస్ట్: యూడబ్ల్యూడబ్ల్యూ ర్యాంకింగ్ సిరీస్ ఈవెంట్లో ప్రియ రజతం గెలుచుకుంది. మహిళల ఫ్రీస్టైల్ 76 కిలోల విభాగం ఫైనల్లో ఆమె 3-4తో బ్రెజిల్‌కు చెందిన తమ్రీస్ మార్టిన్స్ మచాదో చేతిలో పరాజయం పాలైంది. 62 కిలోల విభాగంలో మనీషా కాంస్య పతకం సాధించింది. రెపిచేజ్ రౌండ్లో ఆమె క్రిస్టినా సజికినాపై విజయం సాధించింది. భారత మహిళా రెజ్లర్లు ఈ టోర్నీలో ఇంతకుముందే నాలుగు పతకాలు గెలిచారు. అంతిమ్ పంఘాల్ (53కేజీ), హర్షిత్ (72కేజీ) స్వర్ణాలు నెగ్గగా.. నేహా (57కేజీ) రజతం, నీలమ్ (50కేజీ) కాంస్యం గెలుచుకున్నారు. పురుషుల ఫ్రీస్టైల్‌లో సుజీత్ (65కేజీ) స్వర్ణం, రాహుల్ (57కేజీ) కాంస్యం సాధించారు.

ఏసీసీ సమావేశానికి బీసీసీఐ దూరం

ముంబయి: ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సర్వసభ్య సమావేశానికి దూరంగా ఉండాలని బీసీసీఐ నిర్ణయించినట్లు సమాచారం. ఈ నెల 24న బంగ్లాదేశ్‌లోని ఢాకాలో ఈ సమావేశం జరగాల్సి ఉంది. అయితే బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ సమావేశం మరోచోట నిర్వహించాలని బీసీసీఐ కోరింది. కానీ ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నక్వీ ఈ విజ్ఞప్తిని పట్టించుకోలేదు. దీంతో ఈ సమావేశానికి తమ ప్రతినిధులను పంపకూడదని భారత బోర్డు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అంతే కాక ఈ సమావేశంలో ఏ తీర్మానం చేసినా.. దానికి కట్టుబడకూడదని కూడా బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది సెప్టెంబరు-అక్టోబరు మధ్య జరగాల్సిన ఆసియా కప్ టీ20 టోర్నీకి సంబంధించి వేదికలు, తేదీలను ఈ సమావేశంలోనే ఖరారు చేయాలని ఏసీసీ భావిస్తోంది. కానీ ఈ టోర్నీకి ఆతిథ్యమివ్వాల్సిన బీసీసీఐ లేకుండా సమావేశంలో ఏం నిర్ణయిస్తారన్నది ప్రశ్న. తమ అభీష్టానికి వ్యతిరేకంగా ఢాకాలోనే ఏసీసీ సమావేశాన్ని నిర్వహిస్తే.. ఆసియా కప్‌ను బహిష్కరించడానికి కూడా బీసీసీఐ సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

కోహ్లి జట్టు గెలిచింది



కోహ్లి

మొనాకో: టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి జట్టు విజయాన్ని అందుకుంది. అది క్రికెట్లో కాదు. ఎలక్ట్రిక్ పవర్ బోట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో విరాట్ కోహ్లికి చెందిన టీమ్ బ్లూ రైజింగ్ జట్టు తొలి విజయం సాధించింది. మొనాకోలో జరిగిన ఈ1 ప్రపంచ ఛాంపియన్‌షిప్ రేసులో 38 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. టీమ్ బ్రాడీ రెండో స్థానంలో, టీమ్ బ్రెజిల్ మూడో స్థానంలో నిలిచాయి. క్రీడా దిగ్గజాలు లెబ్రాన్ జేమ్స్, రఫెల్ నాదల్‌ల జట్లు కూడా ఈ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడుతున్నాయి.

వసుంధర

vasundhara@eenadu.in

జలుబూ దగ్గూ తగ్గేదెలా?

మాకు ఇద్దరు పిల్లలు... వర్షాలు మొదలైన నాటి నుంచి ఇద్దరికీ జలుబూ, దగ్గూ తగ్గడం లేదు. ఆయుర్వేదం ప్రకారం వీటికి పరిష్కారం ఏమైనా చెప్పగలరా? - మంజు, హైదరాబాద్

వానల్లో తడిసినా, వాతావరణ పరిస్థితులు మారినా మొదట ఇబ్బంది పెట్టేవి జలుబూ, దగ్గూనే. అందులోనూ పిల్లల్లో వ్యాధినిరోధకశక్తి బలంగా లేకపోవడం వల్ల వారు తరచూ వీటి బారిన పడుతుంటారు. సాధారణంగానే చిన్నారుల్లో కఫ దోషం ఎక్కువగా ఉంటుంది. అటువంటి సమయంలో ఆహారంలో, వాతావరణంలో కఫాన్ని పెంచే మార్పులు జరిగితే అది మరింత పెరిగి జలుబూ, దగ్గూ వస్తాయి. ఇలాంటప్పుడు అరచెంచా తులసి రసాన్ని, పావు స్పూను తేనె కలిపి నాకించాలి. లేదా తమలపాకు రసం, తేనె కూడా ఇవ్వొచ్చు. పసుపు కొమ్ముని వేయించి పొడి చేసి గ్లాసు గోరువెచ్చని నీళ్లలో మూడు చిటికెల పొడిని కలిపి తాగించాలి. ఎండు ద్రాక్షను నీళ్లలో నానబెట్టి దాన్ని ముద్దగా చేసి... సమానంగా పంచదార కలిపి ఉడికించాలి. ఆ పైన చల్లార్చి రోజూ క్రమం తప్పకుండా కొన్నాళ్లు ఇవ్వండి. సమస్యా తగ్గుతుంది. రోగనిరోధక శక్తీ పెరుగుతుంది. వీటితోపాటు ఆహారంలో పెరుగూ, ఐస్‌క్రీమ్, స్వీట్లు బాగా తగ్గించాలి.

డియర్ వసుంధర



డాక్టర్ గాయత్రీదేవి, ఆయుర్వేద నిపుణురాలు



సామాజిక నేపథ్యం, మతం, ప్రాంతం లాంటి భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా అమ్మాయిలు స్టెమ్ రంగాల్లో రాణించగలరు. పేదరికాన్ని జయించి జీవితంలో ఆర్థికంగా నిలవడానికి ఇదో అద్భుత అవకాశం.

- సంధ్యా గుప్తా, స్టెమ్ ఎడ్యుకేటర్, వ్యవస్థాపకురాలు, ఆవిష్కార్ ఎన్జీవో

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

సిల్వర్ రెవల్యూషన్... ఇదో ఫిట్‌నెస్ ట్రెండ్!



శరీరం దృఢంగా, మనసు ప్రశాంతంగా ఉండాలి. ఈ రెండు ప్రయోజనాలూ అందాలంటే మాత్రం వ్యాయామం చేయాలంటారు ఫిట్‌నెస్ నిపుణులు. అందుకు తగ్గట్టుగానే ఫిట్‌నెస్ ఔత్సాహికులూ కొత్త మార్గాలను అన్వేషిస్తుంటారు. వీటిలో భాగంగానే ఇప్పుడు 'సిల్వర్ రెవల్యూషన్' అంటూ మరో ట్రెండ్ పుట్టుకొచ్చింది. పేరులో ఉన్నట్లే 50-60ఏళ్ల మధ్య వారు దీన్ని అనుసరిస్తున్నారు. అంతేనా జిమ్ సెంటర్లలో యువత కంటే వీరే ఎక్కువగా కనిపిస్తున్నారట. ఈ వయసులో వ్యాయామాలు ఏంటి? చక్కగా ఏ వాకింగో, జాగింగో చేసుకోక అనుకుంటే పొరపాటే. కరోనా తర్వాత అందరికీ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిన విషయం తెలిసిందే కదా! అయితే ఈ కసరత్తులు ఆరోగ్యం కోసం మాత్రమే కాదట. వయసు మీదపడినా ఆత్మవిశ్వాసంతో జీవించడానికీ ఉపయోగపడుతుందని అంటున్నారట బామ్మలు. ఇటీవల ఎనీటైమ్ ఫిట్‌నెస్ బ్రాండ్ నిర్వహించిన ఓ సర్వేలో ఇది వెల్లడయ్యింది. దీనికోసం వారు 2019 నుంచీ వ్యాయామ సభ్యత్వాల కోసం నమోదు చేసుకున్న రికార్డులను పరిశీలించారు. వాటిలో 50-60 మధ్య వయసు ఉన్నవారే దాదాపు 5.6శాతం మంది ఉన్నారని తేలింది. అందులోనూ మహిళలదే పైచేయి. అంతేకాదు, 'నాట్ జస్ట్ ఏ గ్రాండ్ మా', 'ఆఫ్టర్ ఏ లాంగ్ టైమ్', 'గ్యాప్ తర్వాత మళ్లీ' అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ తమ ఉత్సాహాన్ని పంచుకుంటున్నారు.

బంగారం - వెండి



19న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,01,290	92,100	1,15,874
విజయవాడ	98,330	91,700	1,15,800
ప్రొద్దుటూరు	98,200	90,390	1,14,500
రాజమహేంద్రవరం	1,00,040	91,700	1,26,000
విశాఖపట్నం	99,680	91,700	1,20,000
తమిళనాడు	-----	91,700	1,26,000



శ్రావణ లక్ష్మి

ఆ ఇంట్లోవాళ్లు కోడికూతతో నిద్రలేస్తారు. లేగదూడలతో దోస్తీ చేస్తారు. ఉడుతలతో ఊసులాడుతారు. వీళ్లుండేది ఏదో మారుమూల ప్రాంతంలో కాదు, ఆధునికత అందినంత దూరంలోనే ఉన్నా, వద్దనుకుని ప్రకృతి జీవనాన్ని ఎంచుకుంది శ్రావణ లక్ష్మి కుటుంబం! ఆ ప్రయాణం గురించి అడిగితే, 'చిన్న కథ కాద'ంటూ చెప్పారిలా...

మా పిల్లల్ని రైతుల్ని చేయాలనుకుంటున్నా!

మేం ఉంటున్నది బాపట్ల జిల్లా, మార్టూరు దగ్గర్లోని బొబ్బేపల్లిలో. ఇరుగుపొరుగు ఎవరూ లేరు. ఎందుకంటే మేం ఇల్లు కట్టుకున్నది పొలాల మధ్యలో. కాలుష్యానికీ, రణగొణ ధ్వనులకు దూరంగా ప్రకృతి ఒడిలో బతకాలన్న ఉద్దేశంతో ఈ స్థలాన్ని ఎంచుకున్నాం. మా సొంతూరు గుంటూరు దగ్గర్లోని కాకుమాను. ఎంబీఏ పూర్తయ్యాక హైదరాబాద్‌లో ఉద్యోగం చేశా. 2016లో పెళ్లైంది. మావారు జీవీ చౌదరి ప్రభుత్వోద్యోగి. ఆయన ఉద్యోగరీత్యా అప్పట్లో ప్రకాశం జిల్లాలో ఉండేవాళ్లం. మా పెద్దబ్బాయికి ఏడు నెలలప్పుడు ఫిట్స్ వచ్చాయి. హాస్పిటల్‌లో ఉండడం, విపరీతంగా మందులు వాడటం, బాబు చేతికి సూదులు... ఆ అనుభవం నా ఆలోచనల్ని మార్చేసింది. ఉన్నది ఒకటే జీవితం... బతకాల్సిన విధానం ఇది కాదనిపించింది. పిల్లలకు ఆరోగ్యకరమైన పాలైనా ఇవ్వలేకపోతున్నామని... పుంగనూరు ఆవు ఒకటి కొన్నాను. ఆ తర్వాత నా ఆలోచనలకు కొత్త రెక్కలు వచ్చాయి. రెండోవాడు పుట్టాక జీవన విధానమే మారిపోవాలనుకున్నా. మరో 20 ఏళ్లకూ కాలుష్యం చేరని ప్రాంతంలో నివాసం ఏర్పాటుచేసుకోవాలనుకున్నా. మావారు పెద్దగా అభ్యంతరం చెప్పలేదు కానీ, అమ్మానాన్న, అత్తామామ... వ్యతిరేకించారు. మొండి పట్టు వీడితేగా! ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో స్థలం తీసుకుని, ఇల్లు కట్టుకున్నాం. ముగ్గురు పిల్లలతోపాటు నాలుగేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. మొదట్లో కనీస సౌకర్యాలకూ ఇబ్బందే. క్రమంగా ఒక్కోటీ సమకూర్చుకుంటూ వచ్చాం.

పండ్లూ, కూరగాయలూ ఇక్కడే...

ప్రకృతిలో బతకడం అంటే కిటికీ దగ్గరో, బాల్కనీలోనో కూర్చొని పరిసరాల్ని చూడటం కాదు, ఆ జీవనశైలినీ భాగం చేసుకోవాలి. సూర్యోదయానికి ముందే మొదలై, సూర్యాస్తమయంతో మా రోజు ముగుస్తుంది. ప్రకృతితోనే చుట్టరికం, మూగజీవాలతోనే నేస్తరికం. రసాయనాలుండే టూత్‌పేస్ట్‌ని పొద్దున్నే నోట్లో పెట్టడం ఎందుకు? బదులుగా ఆవు కచ్చిక, వేప పుల్లని ఉపయోగిస్తాం. సబ్బులూ, షాంపూలూ నిషేధమే. నేనే రోజూ వాకిలి ఊడ్చి, కళ్లాపి చల్లి, ముగ్గు పెడతా. పేడ తీస్తా, పశువులకు దాణా పెడతా, పాలు పితుకుతా, వంట చేస్తా. దీన్లో శారీరక శ్రమ ఉంటుంది. అయినా భయపడను. మొదట్లో ప్రకృతి నన్ను పరీక్షించింది. దాన్లో నిలిచి, గెలిచాను. పిల్లల్ని ఈ ఊళ్లోనే ప్రభుత్వ స్కూల్లో చదివిస్తున్నా. వాళ్లూ చేతనైన పనులు చేస్తుంటారు. వాళ్లకు జంక్ ఫుడ్ ఇవ్వను. మేం పండించిన, ఇంట్లో వండిన వాటినే ఇస్తాను. అందుకు ఆహార వనం సృష్టించుకుంటున్నాం. మామిడి, అరటి, జామ, సపోటా, ఈత సహా 20 రకాల పండ్ల చెట్లు ఉన్నాయి. పది రకాల కూరగాయల్నీ పండిస్తాం. మొక్కలంటే మావారికీ ఇష్టం. భిన్న రకాలివి తెస్తుంటారు. 100 వరకూ నాటుకోళ్లు, పది ఆవులు, ఆరు ఎద్దులు, బాతులు, కుందేళ్లు ఉన్నాయి. వీటికితోడు వందల పక్షులు అతిథులుగా వస్తాయి. బియ్యం, పప్పులు మాత్రం బయట కొంటాం. వాటినీ పండించాలనేది నా లక్ష్యం. ఆహారంలో నూనెకూ ప్రాధాన్యం ఉంది. అందుకే ఎద్దుగానుగ ఏర్పాటుచేసుకుని సొంత తయారీని మొదలుపెట్టా. మా పిల్లలకు 20 ఏళ్లు వచ్చేంతవరకైనా ఈ వాతావరణంలోనే పెంచుతా. తర్వాత ఏం చేయాలి, ఎక్కడ ఉండాలన్నది వాళ్ల ఇష్టం. నేనైతే వాళ్లని రైతుల్ని చేయాలనుకుంటున్నా!



ఆర్థిక స్థిరత్వం ముఖ్యం...

ఈ ధైర్యం, పట్టుదల ఎక్కణ్నుంచి వచ్చాయని అడుగుతుంటారు చాలామంది. అమ్మానాన్న, అమ్మమ్మల నుంచే. వాళ్లు ఏరోజూ కష్టపడ్డానికి వెనకాడలేదు. అమ్మమ్మకు కూర్చుని తినే అవకాశం ఉన్నా. అందరితో పాటు కష్టపడేది. ప్రకృతి ఒడిలో జీవించాలన్న ఆలోచన చాలామందికి ఉంటుంది. అలాంటివారికి ఈ జీవనవిధానంలో ఉండే సంతృప్తినీ, సాధకబాధకాల్నీ 'శ్రావణ మేఘం' యూట్యూబ్ ఛానెల్‌ద్వారా తెలియజేస్తున్నా. ఇలా ఉండాలనుకునేవాళ్లు... ఒకరిపైన ఆధారపడకుండా పనులన్నీ చేయడానికి సిద్ధపడాలి. మూగజీవాలకు ఏలోటూ రాకుండా చూడాలి. ఆర్థిక స్థిరత్వమూ చాలా ముఖ్యం.

ప్రయోగాల 'షైనింగ్ టీచర్'



దుర్గాభవాని

పిల్లలకు పాఠాలు సరిగ్గా బోధించేలా చూస్తే చాలు అనుకోలేదామె. వాళ్ల లోని నైపుణ్యాలకు సానబెట్టాలనుకున్నారు. చదివింది నిత్యజీవితంలో ఉపయోగించుకునేలా చూశారు. కాబట్టే, ఆ విద్యార్థులు చదువుల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచి ఇలా మెరికలను తయారు చేసిన ఆ టీచరమ్మే యలమంచిలి దుర్గాభవాని. తన కృషితో షైనింగ్ టీచర్‌గా ప్రభుత్వ గుర్తింపునీ సాధించారు.

మంచి చేయాలన్న సంకల్పం ఉంటే ఏదీ అసాధ్యం కాదని నమ్ముతారు దుర్గా భవాని. అయిదేళ్ల పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. ఇప్పుడు ప్రైవేటు స్కూళ్లలోనే ఉత్తమ విద్య దొరుకుతుందన్న నమ్మకం అందరిదీ. ఆ అభిప్రాయాన్ని మార్చడానికి తల్లిదండ్రులు, విద్యార్థులకు నిరంతరం కౌన్సెలింగ్ నిర్వహించేవారామె. అలా వారి నమ్మకాన్ని సాధించారు. కేవలం పాఠాలకే పరిమితం కాలేదు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు వారే పరిష్కారాలు కనుక్కునేలా ప్రోత్సహించారు. ఫలితమే తడిచిన ధాన్యం ఆరబోసే యంత్రం, పాఠశాలలో చెత్తను శుభ్రం చేసేందుకు పాత వస్తువుల నుంచి బ్లోయర్, ఆల్కహాల్ సెన్సింగ్ హెల్మెట్... ఇలా ఎన్నో ఆవిష్కరణలు ఇక్కడ రూపొందాయి. దీనికోసం రోజూ సాయంత్రం రెండు గంటల సమయాన్ని కేటాయించారు. విద్యార్థులకు సాయం చేయడానికి స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీనీ ఏర్పాటు చేశారు దుర్గా భవాని. కమ్యూనిటీ మొబిలైజేషన్ ద్వారా వాల్ ఆర్ట్, డ్యాన్స్, మ్యూజిక్ తరగతులు, కంప్యూటర్ శిక్షణ వంటివీ అందించారు. దుస్తులు కుట్టడంలోనూ శిక్షణివ్వడంతో విద్యార్థులే వాళ్ల యూనిఫామ్‌లు కుట్టుకుంటున్నారు. విద్యార్థులు తయారుచేసిన వస్తువులను పేరెంట్-టీచర్ మీటింగ్ సమయంలో అమ్మకానికి ఉంచేవారు. వాటిని మెచ్చి తల్లిదండ్రులే కొనడానికి ఆసక్తి చూపించేవారు.

సదుపాయాల కొరతకు దాతల సాయం కోరారు. అలా ఆ కొరతనీ తీర్చారు. ఇవన్నీ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ఫలితమే... ఈ ఏడాది పదోతరగతిలో 54 మంది విద్యార్థులు.. 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు పొందారు. రాష్ట్రంలోనే తొలిసారిగా తమ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేనీ నిర్వహించారామె. 'పేదవాళ్లే ప్రభుత్వ పాఠశాలలకు వస్తారన్న భావన మారాలి. విద్యార్థులు నేర్చుకున్నది పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోగలగాలి. ఆచరణలో పెట్టాలి. అప్పుడే ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ విధానాన్నే అనుసరించాం. ఫలితాలూ రాబట్టగలిగాం' అంటారు దుర్గాభవాని. తాజాగా ఈమెని పమిడిముక్కలకి బదిలీ చేశారు. అయినా ఈమె చర్యలు విద్యార్థుల్లో ప్రభుత్వ విద్యాలయాలపై నమ్మకాన్ని పెంచాయి. దీంతో ఈ పాఠశాలలోనే ఇంటర్ చదివే అవకాశం ఉండటంతో 96మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. దుర్గాభవాని సేవలు, తన ఆధ్వర్యంలో సాధించిన ఫలితాలను గుర్తించిన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆమెను అభినందించారు. 'షైనింగ్ టీచర్' అంటూ సన్మానించారు.

- వై.సురేష్, మచిలీపట్నం

ఆ డిస్పెన్సరీలో అంతా మహిళలే!



ఎటుచూసినా దుమ్మూధూళీ... లోపలికి వెళితే చిమ్మచీకటి... అయితేనేం, అమ్మాయిలు ఏమాత్రం వెనకడుగేయకుండా బొగ్గు గనుల్లోకి చొచ్చుకుపోతున్నారు. రెస్క్యూ విభాగంలోనూ అడుగుపెట్టారు. ఇప్పుడు ఓ ఆసుపత్రినే నిర్వహిస్తూ బొగ్గు పరిశ్రమలో లింగ సమానత్వం, మహిళా సాధికారత దిశగా మరో అడుగు ముందుకేశారు. ఇంతకీ అదెక్కడంటే...

సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎస్‌ఈసీఎల్)... ఛత్తీస్‌గఢ్, బిలాస్‌పూర్‌లోని వసంత్‌విహార్‌లో ఉన్న తమ ప్రధాన కార్యాలయంలో తాజాగా ఓ డిస్పెన్సరీని ప్రారంభించింది. అక్కడ వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, సహాయక సిబ్బంది... ఇలా మొత్తం 14 మంది ఉన్నారు. వీరంతా మహిళలే కావడం విశేషం. ఓపీడీ, క్యాజువాలిటీ అండ్ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసులతోపాటు డ్రెస్సింగ్ అండ్ ఇంజెక్షన్ రూమ్, ఈసీజీ, పాథాలజీ పరీక్షలు, ఫార్మసీ... వంటి సదుపాయాలన్నీ ఈ డిస్పెన్సరీలో ఉన్నాయి. వీటన్నింటినీ పూర్తిగా మహిళలే నిర్వహించబోతున్నారు. 'ఆరోగ్య రంగంలో సమర్థంగా సేవలు అందించడమే కాదు, వాళ్లలోని నాయకత్వ లక్షణాలకు ఇదో వేదికగా మారుతుంద'నే ఈ ప్రయత్నం అంటోన్న కోల్ ఇండియా నిర్ణయం అభినందనీయమే కదూ!

ఈ డైట్‌లు మనకెందుకు?



వయసును బట్టి మన శరీరంలో మార్పులు వస్తాయన్నది అందరికీ తెలిసిన విషయమే. కానీ ప్రీ మెనోపాజ్, మెనోపాజ్ దశకి వచ్చేసరికి చాలామంది మహిళలు తికమకపడతారట. కొత్తగా పరిచయమయ్యే లక్షణాలతో ఏం జరుగుతోందో, ఎందుకిలా జరుగుతోందో తెలియక కంగారుపడతారు. దీంతో సోషల్‌మీడియాలో కనిపించిన డైట్లన్నీ పాటించేస్తున్నారట. అవన్నీ అవసరం లేదు... పైగా కొత్తవి, అందుబాటులో లేనివి ప్రయత్నించడం వల్ల సమస్యలే తప్ప లాభాలేమీ ఉండవంటున్నారు నిపుణులు. బదులుగా మూడు అంశాలపై దృష్టిపెడితే చాలంటున్నారు. అవేంటంటే...

1. ఉదయం ఆహారాన్ని మానేయొద్దు. ఇది మేలు చేయకపోగా హానే చేస్తుంది. అలాగని దానికోసం స్మూతీలు, కొత్త వెరైటీలు ప్రయత్నించాల్సిన పనిలేదు. మనకంటూ సంప్రదాయ ఆహారాలు బోలెడు ఉన్నాయి కదా! వాటినే తీసుకుంటే సరిపోతుంది.

2. సాయంత్రం విశ్రాంతిగా కూర్చొని కప్పు కాఫీగానీ టీగానీ ఆస్వాదిస్తారా? ఆ సమయంలో గుప్పెడు పల్లీలనీ తినండి. ఇవి గ్లూకోజు స్థాయులను సమన్వయం చేయడమే కాదు, జీర్ణవ్యవస్థకీ మేలు చేస్తాయి. అంతేకాదు, చర్మం, కురులనూ ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్మోనుల్లో మార్పుల కారణంగా వీటన్నింటిపై ప్రభావం పడుతుంది. పల్లీలు దానికి అడ్డుకట్ట వేస్తాయి.

3. రాత్రి భోజనం త్వరగా అరిగేలా ఉండాలి. అన్నం, పప్పుధాన్యాలను కలిపి తీసుకోండి. భోజనం ఎంత త్వరగా ముగిస్తే అంత మేలు. ఆహారమూ త్వరగా అరుగుతుంది, కడుపుబ్బరం, గ్యాస్, వేడి ఆవిర్లు వంటి వాటికీ అడ్డుకట్ట వేసినట్లు అవుతుంది. దాంతోపాటు ఒక గ్లాసు మజ్జిగ కాస్త ఉప్పు, జీలకర్ర పొడి చేర్చుకుని తాగితే... ప్రొబయాటిక్స్, కాల్షియం వంటివీ అందుతాయి.

జొన్న పొట్టుతో బొమ్మలు!



మనసు పెట్టాలే కానీ... మన చుట్టూ ఉన్న వ్యర్థాలతోనూ అద్భుతాలు చేయొచ్చు. అలాంటి ప్రయత్నంలోనే నెల్లీ చాచేయా... మొక్కజొన్న పొట్టుతో అందమైన బొమ్మల్ని రూపొందిస్తుంది. దీంతో తాను ఉపాధి పొందడంతో పాటు మరికొందరికీ ఆర్థిక భరోసా కల్పిస్తోంది. మరి ఈ పర్యావరణహిత ప్రయాణాన్ని మనమూ తెలుసుకుందామా!




నెల్లీ చాచేయాది మణిపూర్‌లోని సేనాపతి జిల్లాలోని ఓ మారుమూల గ్రామం. ఆమె జీవనోపాధికోసం పూలను సేకరించి అమ్మేది. అయితే, ఓ రోజు కూరగాయల వ్యర్థాలు పారేస్తున్నప్పుడు... మెత్తగా ఉండే మొక్కజొన్న పొట్టు ఆమెను ఆకర్షించింది. చక్కటి టెక్స్చర్, ఆకృతితో ఉన్న దాంతో ఏదైనా చేయొచ్చా అన్న ఆలోచన చేసిందట. వాటిని అందంగా తీర్చిదిద్దేందుకు ప్రయోగాలెన్నో చేసింది. చివరికి పీచు, పొట్టు, పొత్తు... అన్నీ ఉపయోగించి అందమైన అమ్మాయి బొమ్మను రూపొందించింది. దానికి అక్కడక్కడా రంగులద్దింది. ఆపై ఆ బొమ్మను తన పూల దుకాణంలో పెట్టిందట. మొదట్లో ఎవరూ అది వ్యర్థాలతో చేసిందని అనుకోలేదట. ఖాతాదారు ఒకరు దాన్ని కొలుగోలు చేయడానికి ముందుకు రావడంతో... దాన్ని వ్యాపారంగా మలచుకోవాలనుకుంది. ఇందుకోసం మొక్కజొన్న పొట్టు, పీచు సేకరించి ఎండబెట్టి వాటిని బొమ్మల్లా మార్చడం ఆరంభించింది. వాటికి సహజ రంగులద్ది తీర్చిదిద్దింది. సహజపదార్థాలతో చేసిన ఈ బొమ్మ బయోడిగ్రేడబుల్ కూడా కావడంతో అమ్మకాలు పెరిగాయి. లక్షల రూపాయల ఆదాయమూ అందుకుంటోంది. అంతా చేత్తోనే చేయడం, ఇందుకు ఎక్కువ సమయం పట్టడం వంటి కారణాలతో మరికొంతమంది మహిళలకూ ఈ కళను నేర్పించింది. వారూ దీన్ని వ్యాపారంగా మలచుకుని ఇంటి నుంచే స్వయం ఉపాధిని అందుకుంటున్నారు. మంచి ఆలోచన కదూ!

ఎక్కడంటే అక్కడ... ఎప్పుడంటే అప్పుడు!

కిడ్స్ కార్నర్










పిల్లల అల్లరి తగ్గించాలన్నా... ఓచోట కుదురుగా ఉండని గడుగ్గాయుల్ని ఇంట్లోనే కూర్చోబెట్టాలన్నా... అమ్మల చేతిలో ఉండే పరిష్కారం బోర్డ్ గేమ్స్. గెలుపోటములు లెక్కచేయకుండా ఎంతసేపయినా వీటితో ఆడుతుంటారు పిల్లలు. బోర్డ్ గేమ్స్ వల్ల ప్రయోజనాలు బోలెడు. కాగ్నిటివ్ బిహేవియర్‌కూ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు బలపడటానికీ ఇవి సహకరిస్తాయి. డిజిటల్ తెరల నుంచి పిల్లల్ని దూరంగా ఉంచడంలోనూ, ఏకాగ్రతను పెంచడంలోనూ ఈ ఆటలు ముందుంటాయి. వీటివల్ల అమ్మలకూ కాస్త సాంత్వన కలుగుతుంది. మరి ఇన్ని ఉపయోగాలున్న ఈ ఆటల్ని వాళ్లకు ఇస్తే... ఆడినంత సేపు ఆడి, ఎక్కడికక్కడ చిందరవందరగా పడేస్తుంటారు. ఓ పావు కనిపిస్తే ఇంకో పావు కనిపించకుండా చేస్తారు. ఒకటికి రెండు పనులు పెడతారు. అందుకే గతంలో ఈ ఆటల్ని గోడెక్కించారు డిజైనర్లు. పావుల్ని కూడా అతికించి వినూత్నంగా తీసుకువచ్చారు. ఇలా ఇంట్లోనే వాటిని ఉంచేస్తే పిల్లల్ని ప్రకృతితో మమేకం చేయడం కష్టం అనుకున్నారో... ఏమో! ఇప్పుడు వీటిలోనే మూవబుల్ బోర్డ్ గేమ్స్‌నూ తీసుకువచ్చారు. ఆరుబయట, మీరు పనిచేసుకునే చోట, పిల్లల గదుల్లో ఇలా ఎక్కడ కావాలంటే అక్కడ వాటిని ఉంచుకోవచ్చు. మీ పర్యవేక్షణలో పిల్లలు ఆడుకునేలా చేయొచ్చు. వీటిలో చెక్కతో చేసినవే ఎక్కువ. కాబట్టి మైక్రోప్లాస్టిక్స్ భయం కూడా లేదు. పర్యావరణహితంగానూ ఉంటాయి. ఒకటా రెండా చాలా రకాలున్నాయి. ఆన్‌లైన్ వేదికల్లో దొరుకుతున్నాయి. మీకూ నచ్చాయా! ఓసారి ప్రయత్నించి చూడండి.









వాల్‌స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు నోటీసులు

- విమాన ప్రమాదంపై ఊహాజనిత కథనాలు రాశాయన్న పైలట్ల సంఘం
- క్షమాపణకు డిమాండ్

దిల్లీ: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై ఊహాజనిత కథనాలను ప్రచురించాయని పేర్కొంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌లకు భారత పైలట్ల సమాఖ్య (ఎఫ్ఐపీ) లీగల్ నోటీసులు జారీ చేసింది. ఈ మీడియా సంస్థలు ప్రచురించిన వార్తలు తమను వ్యథకు గురిచేశాయని [illegible] కలిగించిందనేగాక.. భారత పౌర విమానయాన రంగ ప్రతిష్ఠను దెబ్బతీశాయని పేర్కొంది. నిజానిజాలు నిర్ధారించుకోకుండా ప్రమాదంపై వార్తలు ప్రచురించినందుకు మీడియా సంస్థలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి పైలట్ తప్పిదం, విమాన కాక్‌పిట్‌లో నెలకొన్న అయోమయం కారణాలంటూ రాయిటర్స్, వాల్‌స్ట్రీట్ జర్నల్‌లు ప్రచురించిన కథనాలకు స్పందనగా పైలట్ల సమాఖ్య ఈ చర్య తీసుకుంది.



మరోవైపు విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు పూర్తికాక ముందే వస్తున్న మీడియా కథనాలను అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు (ఎన్‌టీఎస్‌బీ) తీవ్రంగా ఖండించింది. మీడియా సంస్థలు ప్రచురిస్తున్న వార్తలు అపరిపక్వంగా, ఊహాగానాలతో కూడి ఉన్నాయని ఎన్టీఎస్‌బీ చైర్మన్ జెన్నిఫర్ హమెండీ వివరించారు. విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్న విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) వెలువరించనున్న తుది నివేదిక కోసం వేచి చూడాలని ప్రజలను, మీడియాను కోరారు.

ఖండించిన ఏఏఐబీ

అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదంతోపాటు ఆ ఘటనకు సంబంధించిన ప్రాథమిక దర్యాప్తులోని అంశాలపై వస్తున్న ఊహాజనిత వార్తలపై ఏఏఐబీ మండిపడింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్న దశలో ముందే ఒక నిర్ధారణకు రావడం తొందరపాటే అవుతుందని స్పష్టం చేసింది.



23 ఏళ్లుగా చెట్టు కిందే తరగతులు

దర్భంగా: పాఠశాల అనగానే అందరికీ సాధారణంగా ఓ భవనం, తరగతి గదులు, బ్లాక్ బోర్డు, బెంచీలు గుర్తుకువస్తాయి. బిహార్‌లోని [illegible] పాఠశాల మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. రావి చెట్టు కింద పాఠశాలలోని 267 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ దుస్థితి ఏకంగా 23 ఏళ్ల నుంచీ కొనసాగుతోంది. ప్రధానోపాధ్యాయులు మారినప్పటికీ భవనం కోసం ప్రతిపాదనలు, జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా [illegible] మారలేదని గ్రామస్థులు చెబుతున్నారు. 2025 మే 19న పాఠశాల నిర్మాణానికి భూమి కేటాయించాలని సర్కిల్ అధికారికి విద్యాధికారి లేఖ రాశారు. దీనిపై కూడా ఇంకా స్పష్టత రాలేదు.

మెడలో చైన్‌తో వెళ్లిన వ్యక్తిని లాగేసిన ఎమ్మారై యంత్రం

భార్య కోసం వెళ్లి దుర్మరణం

వెస్ట్‌బరీ: అమెరికాలోని న్యూయార్క్‌లో ఒక వ్యక్తి ఎమ్మారై యంత్రంలో చిక్కుకుని మరణించారు. భార్యకు ఎమ్మారై తీస్తుండగా లోపలికి వెళ్లిన 61 ఏళ్ల ఆ వ్యక్తిని యంత్రం లాగేసింది. మెడలో ఉన్న చైన్ దీనికి కారణం. బుధవారం నాస్సా ఓపెన్ ఎమ్మారై కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. యంత్రానికున్న బలమైన అయస్కాంతం.. ఆ వ్యక్తి మెడలోని గొలుసును లాగేసింది. దీంతో ఆయన అందులో ఇరుక్కుపోయారు. చికిత్స పొందుతూ గురువారం ఆయన మరణించారు. చనిపోయిన వ్యక్తి పేరును పోలీసులు వెల్లడించలేదు. మోకాలుకు ఎమ్మారై తీస్తుండగా సహాయం కోసం తన భర్తను పిలవాలని మహిళ కోరారు. దీంతో ఆమె భర్త లోపలికి వచ్చారు. దగ్గరికి రాగా యంత్రం లాగేసింది. దీంతో ఆయన బలంగా వెళ్లి దానిని ఢీకొన్నారు. ఆమె యంత్రాన్ని ఆపేయాలని కోరినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఇండియా కూటమి అష్టదిగ్బంధ వ్యూహం

- పహల్గాం ఉగ్రదాడి, ట్రంప్ మధ్యవర్తిత్వంపై కేంద్రాన్ని నిలదీయాలని నిర్ణయం

దిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 8 అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని ఇండియా కూటమి పక్షాలు నిర్ణయించాయి. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు కూటమికి చెందిన 24 పార్టీల నేతలు శనివారం వర్చువల్‌గా భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి నిందితులను ఇంతవరకు పట్టుకోకపోవడం, తన మధ్యవర్తిత్వంతోనే భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ జరిగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నా మౌనం వహించడం, బిహార్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, విదేశాంగ విధానంలో వైఫల్యం, గాజాలో దురాగతాలు, నియోజకవర్గాల పునర్విభజన, దేశంలో ఎస్సీలు, ఎస్టీలు, మహిళలు, మైనారిటీలపై దాడులు తదితర అంశాలను పార్లమెంటులో ప్రస్తావించాలన్న ఏకాభిప్రాయానికి కూటమి నేతలు వచ్చారు. వర్చువల్ సమావేశం వివరాలను రాజ్యసభలో కాంగ్రెస్‌పార్టీ ఉపనేత ప్రమోద్ తివారీ విలేకరులకు వెల్లడించారు. పార్లమెంటు సమావేశాలకు ప్రధాని మోదీ హాజరవుతారని కూటమి పక్షాలు భావిస్తున్నాయన్నారు. విదేశీ యాత్రల కన్నా పార్లమెంటు అత్యంత ముఖ్యమైనదని ప్రమోద్ తివారీ పేర్కొన్నారు. త్వరలో ఇండియా కూటమి పక్షాల నేతల ముఖాముఖీ సమావేశాన్నీ నిర్వహిస్తామని తెలిపారు. శనివారం నాటి భేటీకి కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో పాటు జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్, శరద్ పవార్(ఎన్సీపీ-ఎస్పీ), ఉద్ధవ్ ఠాక్రే (శివసేన-యూబీటీ), అభిషేక్ బెనర్జీ (టీఎంసీ), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), ఎస్పీ, డీఎంకే, సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎం-ఎల్), ఫార్వర్డ్ బ్లాక్, కేరళ కాంగ్రెస్ తదితర పార్టీల నేతలు హాజరయ్యారు.



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ఒమర్ అబ్దుల్లా, డి.రాజా తదితరులు

నిద్రమాత్రలతో చావలేదని భర్తకు కరెంట్ షాక్

- ప్రియుడితో కలిసి అంతమొందించిన భార్య

దిల్లీ: ఇష్టం లేని పెళ్లిళ్లు, వివాహేతర సంబంధాల వంటి కారణాలతో భర్తలను భార్యలు అడ్డు తొలగించుకొంటున్న ఘటనలు ఇటీవలి కాలంలో వరుసగా వెలుగు చూస్తున్నాయి. తాజాగా దిల్లీలోని ఉత్తమ్‌నగర్‌లో మరో ఉదంతం బయటపడింది. నగరానికి చెందిన సుస్మిత తన భర్త కరణ్‌దేవ్ (36) విద్యుదాఘాతానికి గురైనట్లు ఈ నెల 13న ఆసుపత్రికి తీసుకొచ్చింది. పరిశీలించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఆమె మాట నమ్మి, ప్రమాదమే అని భావించిన కరణ్ కుటుంబసభ్యులు పోస్టుమార్టం అవసరం లేదని చెప్పారు. కానీ.. ఈ కేసులో సుస్మిత, కరణ్‌కు వరుసకు సోదరుడైన రాహుల్(24) తీరుపై అనుమానం వచ్చిన పోలీసులు శవపరీక్షకు మొగ్గుచూపారు. దీంతో కరణ్ తమ్ముడు కునాల్‌కు కూడా అనుమానం వచ్చి సుస్మిత ఇన్‌స్టా ఛాటింగును పరిశీలించాడు. అందులో ఆమె రాహుల్‌తో హత్య ప్రణాళిక గురించి చర్చించినట్లు గుర్తించిన అతడు ఈ నెల 16న పోలీసులకు సమాచారమిచ్చాడు. కరణ్ అడ్డు తొలగించుకునేందుకు నిందితులు తొలుత భోజనంలో 15 నిద్రమాత్రలు కలిపి ఇచ్చారు. అయినా ఊపిరి ఆగకపోవడంతో.. కరెంట్ షాక్ ఇచ్చారు. పోలీసులు నిందితులను కస్టడీలోకి తీసుకున్నారు.



మృతుడు కరణ్‌దేవ్



రాహుల్‌తో సుస్మిత



ఒకరికొకరు అండగా నిలబడితే మార్పు తథ్యం

ఒక్కరికి సాయం చేసినంత మాత్రాన ఈ ప్రపంచమేమీ మారకపోవచ్చు. కానీ సాయం పొందిన ఆ ఒక్కరి వ్యక్తిగత ప్రపంచం మారొచ్చు కదా! అందుకే కనీసం ఒక్కరికైనా మీ శక్తి మేరకు సాయం చేయండి. వారి నుంచి తిరిగి ఏమీ ఆశించకండి. వీలైతే ఇంకొకరికి సాయం చేయమని చెప్పండి. అలా ఒకరికొకరు అండగా నిలబడితే కచ్చితంగా ప్రపంచం మారుతుంది.

– వి.మోహన్, డయాబెటాలజిస్ట్

కుండపోత వర్షాలతో గుండెకోత

- బిహార్‌లో 34 మంది, యూపీలో 18 మంది మృతి

దిల్లీ: రుతు పవనాల ప్రభావంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో రెండురోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే మూడు రోజుల్లోనూ భారీ నుంచి అతి భారీ స్థాయి వానలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. శుక్ర, శనివారాల్లో కురిసిన కుండపోత వర్షాలతో ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్‌లోని పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. మిజోరం, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాల వల్ల అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

బిహార్‌లో పిడుగులుపడి 34 మంది ప్రాణాలు కోల్పోయారు. భారీ వర్షాలు, వరదలు, పాముకాటు తదితర కారణాల వల్ల ఉత్తర్‌ప్రదేశ్‌లో 18 మంది మృతి చెందారు. హిమాచల్‌ప్రదేశ్‌లో 250కిపైగా మార్గాల్లో రోడ్లు మూసివేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి.

అజ్‌మేర్ దర్గా చుట్టూ ఆకస్మిక వరద



రాజస్థాన్‌లోని పుణ్య క్షేత్రం అజ్‌మేర్‌ను ఆకస్మిక వరద చుట్టుముట్టింది. ఖాజా గరీబున్ నవాజ్ దర్గా పరిసరాలను వరదనీరు ముంచెత్తింది. దుకాణాలు ఉన్న ఇరుకు సందుల్లోకి వరదనీరు పోటెత్తడంతో దర్గాకు వచ్చిన ఓ యాత్రికుడు కొట్టుకుపోతున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. సమీప హోటళ్లలోని సిబ్బంది అతణ్ని కాపాడారు.

టిబెట్‌లో బ్రహ్మపుత్రపై ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు

నిర్మాణ పనులకు చైనా శ్రీకారం

బీజింగ్: టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతిపెద్దదిగా ప్రసిద్ధి పొందనున్న భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు పనులను చైనా శనివారం లాంఛనంగా ప్రారంభించింది. 16,708 కోట్ల డాలర్ల (సుమారు రూ. 14 లక్షల కోట్ల) వ్యయంతో దీనిని భారత సరిహద్దుకు అతి సమీపంలో నిర్మిస్తున్నారు. టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదీ తీరం వద్ద చైనా ప్రధాని లీ కియాంగ్ ఈ పనులను ప్రారంభించారని ప్రభుత్వ వార్తాసంస్థ వెల్లడించింది. బ్రహ్మపుత్ర నది దిగువ పరీవాహక ప్రాంతంలో ఉన్న భారత్, బంగ్లాదేశ్‌లలో ఈ ప్రాజెక్టుపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఐదు జలవిద్యుత్ కేంద్రాలు నిర్మించనున్నారు. ఏటా 30 కోట్ల మంది అవసరాలు తీర్చేందుకు సరిపడే 30,000 కోట్ల కిలోవాట్ గంటల విద్యుత్తును ఈ ప్రాజెక్టు ఉత్పత్తి చేస్తుందని అంచనా.

నైట్‌క్లబ్ వద్ద ప్రజలపైకి దూసుకొచ్చిన వాహనం

- అమెరికాలో 30 మందికి గాయాలు

లాస్ ఏంజెలెస్: అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో ఉన్న ఒక నైట్‌క్లబ్‌లోకి వెళ్లేందుకు బారులు తీరి ఉన్న జన సమూహంపైకి వాహనం దూసుకెళ్లిన ఘటనలో 30 మంది గాయపడ్డారు. ఇందులో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జనంపై వాహనం నడిపిన డ్రైవర్ తుపాకీ గుళ్ల గాయాలతో ఉన్నట్లు లాస్‌ఏంజెలెస్ పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌పై కాల్పులు జరిపి పరారైనట్టుగా అనుమానిస్తున్న వ్యక్తి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. డ్రైవర్‌పై కాల్పులు ఘటనకు ముందే జరిగాయా లేక తరువాతా, అసలెందుకు వాహనం దూసుకొచ్చింది అన్నది ఇంకా ఇదమిద్ధంగా తేల లేదు. పోలీసులు వాహన చోదకుని పేరు ఇతర వివరాలను బహిర్గతం చేయలేదు.



అతడు నీలి రంగు జెర్సీ ధరించి ఉన్నాడని, చేతిలో తుపాకీ కలిగివున్నాడని మాత్రమే తెలిసింది. ఈ సంఘటనలో గాయాలపాలైన బాధితులను వెంటనే స్థానిక ఆసుపత్రులకు తరలించారు. తూర్పు హాలీవుడ్‌లోని శాంటా మోనికా బూలవార్డ్ (విశాలమైన వృక్ష సహిత రహదారి)లో శనివారం తెల్లవారు జామున ఘటన జరిగింది.

తయారీ కాకుండా కూర్పుతో సరి: రాహుల్

దిల్లీ: 'భారత్‌లో తయారు చేయండి' అంటూ కేంద్రం ఆర్భాటంగా చేపట్టిన మేకిన్ ఇండియా పథకాన్ని నిజానికి 'భారత్‌లో కూర్పు చేయండి' (అసెంబుల్ ఇన్ ఇండియా) పథకంగా పరిగణించాలని లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీ శనివారం విమర్శించారు. భారతదేశంలో తయారవుతున్న టెలివిజన్ సెట్లలో 80 శాతం విడిభాగాలు చైనా నుంచే దిగుమతి అవుతున్నాయని ఆయన వెల్లడించారు. ఐ ఫోన్ల నుంచి టీవీ సెట్ల వరకు అన్నింటికీ విడిభాగాలు విదేశాల నుంచి రావాల్సిందేనన్నారు. గ్రేటర్ నొయిడాలోని ఒక టెలివిజన్ కూర్పు యూనిట్‌ను సందర్శించిన రాహుల్, అక్కడి పరిస్థితిని చూపెట్టే 7 నిమిషాల వీడియోను విడుదల చేశారు. భారతదేశం పారిశ్రామిక ఉత్పత్తిలో స్వయంసమృద్ధమైనప్పుడే ఉద్యోగాలు, ఆర్థికాభివృద్ధి సాధ్యపడతాయన్నారు. భారతదేశంలో చిన్న యూనిట్లు పారిశ్రామిక ఉత్పత్తిని చేపట్టాలనుకుంటున్నా వాటికి ప్రభుత్వ విధానపరంగా కానీ, ఆర్థికంగా కానీ మద్దతు లభించడం లేదన్నారు. భారీ పన్నులు, కొన్ని కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యం చిన్న యూనిట్ల ఎదుగుదలను అడ్డుకుంటున్నాయని విమర్శించారు.



నొయిడాలోని ఓ ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

రాహుల్ వ్యాఖ్యలపై సీపీఎం అభ్యంతరం

దిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీ దేశంలోని లౌకిక శక్తులను ఏకం చేయడానికి కృషి చేయాలే తప్ప, చీలికలు.. అయోమయం సృష్టించరాదని సీపీఎం రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిటాస్ శనివారం హితవు చెప్పారు. "రాహుల్ కేరళలోని కొట్టాయంలో ప్రసంగిస్తూ మార్క్సిస్టు పార్టీనీ, ఆరెస్సెస్‌ను ఒకే గాటన కట్టారు. ఉభయులతో సైద్ధాంతికంగా పోరాడతానన్నారు. రాహుల్ మాటలు హాస్యాస్పదంగా, విడ్డూరంగా ఉన్నాయ"ని బ్రిటాస్ వ్యాఖ్యానించారు. కేరళ కాంగ్రెస్ విభాగం ప్రేరేపించడం వల్లనే ఆయన పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్‌కు వయనాడ్ పట్టున్న ప్రాంతమని, ఆ పార్టీని సంతృప్తిపరచడానికే రాహుల్, ప్రియాంక అక్కడి నుంచి ఆరెస్సెస్‌పై దాడికి దిగారన్నారు. ఈ పొరపొచ్చాలు పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాల ఐక్యతకు భంగం కలిగించబోవని ఆశాభావం వ్యక్తం చేశారు.

గరీబ్‌రథ్ ఇంజిన్‌లో చెలరేగిన మంటలు

- లోకోపైలట్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం


జైపుర్: రాజస్థాన్‌లోని బీవర్ జిల్లాలో ఓ రైలు అగ్ని ప్రమాదానికి గురైంది. అప్రమత్తమైన లోకో పైలట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. అజ్‌మేర్ రైల్వే డివిజన్‌లోని సెంద్రా రైల్వే స్టేషన్ సమీపంలో ముంబయి నుంచి దిల్లీకి వెళ్లే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో శనివారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మొదట చక్రాల నుంచి పొగలు రావడం గమనించిన పైలట్.. రైలును నిలిపివేసి, కంట్రోల్ రూమ్‌కు సమాచారమిచ్చారు. వెంటనే స్పందించి ఘటనాస్థలికి చేరుకున్న సిబ్బంది.. ఇంజిన్ కింది నుంచి వస్తున్న మంటలను నియంత్రించారు. కానీ కొద్దిసేపటికే ఇంజిన్ లోపల మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక దళాలకు సమాచారం ఇవ్వగా వారు సకాలంలో అక్కడికి చేరుకొని మంటల్ని అదుపుచేశారు. దీంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బోగీల్లో దట్టమైన పొగ వ్యాపించడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. మంటలు కేవలం ఇంజిన్‌కే పరిమితమయ్యాయని, బోగీల్లో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదు.



కశ్మీర్ సమస్యకు 'చినాబ్ సూత్రం'

- జమ్మూ-కశ్మీర్‌ను మతపరంగా విభజించాలన్న పాక్
- కార్గిల్ పోరుకు ముందు దిల్లీ హోటల్లో చర్చలు
- 'బిలీవర్స్ డైలమా' పుస్తకం వెల్లడి

దిల్లీ: జమ్మూ-కశ్మీర్ సమస్యకు పరిష్కారంగా దానిని మతపరంగా విభజించడంపై భారత్-పాక్ మధ్య 1999లో చర్చ జరిగింది. కార్గిల్ యుద్ధానికి కొన్ని వారాల ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. అప్పటి ప్రధాని వాజ్‌పేయీ పాకిస్థాన్‌లో చేపట్టిన చరిత్రాత్మక పర్యటన, లాహోర్ డిక్లరేషన్ తర్వాత కశ్మీర్ సమస్యపై రెండు దేశాల ప్రతినిధులు దిల్లీలో చర్చించారు. చినాబ్ నదికి పశ్చిమ భాగాన ఉన్న ముస్లిం ఆధిపత్య జిల్లాలను తమకు ఇవ్వాలని, తూర్పు వైపున్న హిందూ ఆధిపత్య జిల్లాలను భారత్ అట్టిపెట్టుకోవాలని పాక్ ఆనాడు ప్రతిపాదించింది. అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ తరఫున దూతగా మాజీ హైకమిషనర్ నియాజ్ నాయక్ దిల్లీకి రహస్యంగా వచ్చి ఓ హోటల్లో బసచేశారు. భారత్ తరఫున ఆర్.కె.మిశ్ర ఆయనతో చర్చలు జరిపారు. ఐదురోజులపాటు చర్చించినా ఆమోదయోగ్యమైన, ఆచరణసాధ్యమైన పరిష్కారం లభించలేదు. అభిషేక్ చౌధరీ రచించిన కొత్త పుస్తకం "బిలీవర్స్ డైలమా: వాజ్‌పేయీ అండ్ ది హిందూ రైట్స్ పాత్ టు పవర్" ఈ విషయాన్ని వెల్లడించింది. ఇదివరకు రచించిన "వాజ్‌పేయీ: ద అసెంట్ ఆఫ్ ది హిందూ రైట్"కు కొనసాగింపుగా ఆయన దీన్ని రాశారు. నియంత్రణ రేఖను (ఎల్‌వోసీ) అంతర్జాతీయ సరిహద్దుగా గుర్తించడం, కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి ఇవ్వడం అనే ప్రతిపాదనల్ని నాయక్ తిరస్కరించారు.



భారత్‌లో.. మారువేషంలో ఇజ్రాయెల్ మంత్రి!

ఇజ్రాయెల్‌కు విదేశాంగమంత్రిగా పనిచేసిన మోషే దయాన్ 1977లో అత్యంత రహస్యంగా వచ్చి అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్, ఆనాటి విదేశీ వ్యవహారాల మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీలతో భేటీ అయిన విషయాన్నీ ఈ పుస్తకం బయటపెట్టింది. రెండు దేశాల మధ్య దౌత్యసంబంధాలు నెలకొల్పేందుకు ఆయన ఇలా వచ్చారని, ఆ ప్రయత్నం మాత్రం విఫలమైందని పేర్కొంది. "మోషే దయాన్ 1977 ఆగస్టు 14న దిల్లీకి వచ్చారు. ఓ ప్రైవేటు నివాసంలో ఆయనకు వసతి కల్పించారు. మొరార్జీ, వాజ్‌పేయీలకు తప్ప దీని గురించి ఎవరికీ తెలియదు. తెలిస్తే తమ సంకీర్ణ ప్రభుత్వం పడిపోతుందని మొరార్జీ భావించారు. విషయాన్ని నెల తర్వాత అప్పటి సోవియెట్ యూనియన్ దౌత్యవేత్త ఐ.కె.గుజ్రాల్‌కు ఆయన వెల్లడించారు" అని రచయిత పేర్కొన్నారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొన్న తర్వాతే ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను పరిగణనలోకి తీసుకుంటామని దయాన్‌తో అప్పటి ప్రధాని తేల్చిచెప్పారు. లక్ష్యం నెరవేరకపోవడంతో దయాన్ తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. వెండి జ్ఞాపిక తీసుకోవడానికీ నిరాకరించారు. భారత్ పేదరికాన్ని, మన నాయకులను అపహాస్యం చేస్తూ అక్కసు వెళ్లగక్కారు.



మోషే దయాన్



ఉక్రెయిన్‌లోని ఒడెసాలో ఓ భవనంలో చెలరేగిన మంటలు

300కు పైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై రష్యా దాడులు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. శుక్రవారం రాత్రి నుంచి కీవ్‌పై 300కి పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో మాస్కో విరుచుకుపడినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. నల్లసముద్రంలోని ఒడెసా ఓడరేవుపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయారని, చిన్నారి సహా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయని ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు.

గాజాలో కాల్పులు.. 32 మంది మృతి

డెయిర్- అల్ బలా: గాజాలో ఆహార కేంద్రాల దగ్గర ఇజ్రాయెలీ దళాలు జరిపిన కాల్పుల్లో శనివారం 32 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. ఖాన్ యూనిస్‌లో ఆహార కేంద్రం దగ్గర భారీగా సాయం కోసం జనం గుమిగూడిన సమయంలో కాల్పులు జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఐక్యరాజ్యసమితి, ఇతర స్వచ్ఛంద సంస్థలను తప్పించి అమెరికా, ఇజ్రాయెలీ మద్దతుతో గాజా హ్యుమానిటేరియన్ ఫౌండేషన్ (జీహెచ్ఎఫ్).. ఈ ఆహార కేంద్రాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ కేంద్రాల దగ్గర తరచూ కాల్పులు జరుగుతున్నాయి.

వర్షాలకు పాకిస్థాన్‌లో 11 మంది దుర్మరణం

లాహోర్: భారీ వర్షాల కారణంగా పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో శనివారం ఒక్కరోజే 11 మంది మృతి చెందారని అధికారులు వెల్లడించారు. ఇదే ప్రావిన్స్‌లో గత మూడు వారాల్లో 120 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రుతుపవనాలు ప్రారంభమైన జూన్ 26 నుంచి ఇప్పటి వరకు 180 మందికి పైగా చనిపోయారని తెలిపారు.

నైగర్‌లో ఉగ్రదాడి.. ఇద్దరు భారతీయుల మృతి

నియామీ: ఆఫ్రికాలోని నైగర్‌లో ఈ నెల 15న జరిగిన ఉగ్రదాడిలో ఇద్దరు భారతీయులు మృతి చెందారు. ఒకరు అపహరణకు గురయ్యారు. ఈ విషయాన్ని నైగర్‌లోని భారత రాయబార కార్యాలయం శనివారం తెలిపింది. రాజధాని నియామీకి 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న డోసోలోని ఓ నిర్మాణ ప్రాంతానికి కాపలా ఉన్న సైనిక బృందంపై గుర్తుతెలియని దుండగులు చేసిన దాడిలో వీరు మృతి చెందారని పేర్కొంది.

మైనారిటీలకు భారత్ అత్యంత సురక్షిత ప్రదేశం

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్య

దిల్లీ: భారత్ లౌకికవాద దేశమని, హిందూ మెజారిటీల కారణంగా మైనారిటీలు సురక్షితంగా ఉన్నారని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. వసతులు అందలేదని, స్వేచ్ఛ దొరకలేదని దేశం నుంచి వెళ్లాలనుకునే ఒక్క మైనారిటీ వ్యక్తిని కూడా తాను చూడలేదన్నారు. "కాంగ్రెస్ మద్దతునిస్తున్న వామపక్ష వ్యవస్థలోని కొందరు మైనారిటీలను హింసిస్తున్నారు, చంపుతున్నారు, చిత్రవధ చేస్తున్నారు. పైగా మైనారిటీలు భారత్‌లో సురక్షితంగా లేరని ప్రచారం చేస్తున్నారు. మైనారిటీలు, మెజారిటీలు ఎవరైనా సరే చట్టం ముందు అందరూ సమానమే. చైనా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లలో ఉన్న పలు సమస్యల కారణంగా ఆ దేశ మైనారిటీలు భారత్‌కు వచ్చి ఇక్కడే ఉండాలనుకుంటున్నారు. ఎందుకంటే వారికి మన రాజ్యాంగం, పౌరుల రక్షణ పట్ల పూర్తి నమ్మకం ఉంది. గత 11 ఏళ్లుగా భారత్‌లో మైనారిటీలు సురక్షితంగా లేరని కొందరు ప్రచారం చేస్తున్నారు. నేనూ మైనారిటీ వర్గానికి చెందినవాడినే. విభజన సమయంలో మనం పాకిస్థాన్, బంగాదేశ్‌ల్లో భాగమైతే ఇప్పుడు శరణార్థులుగా ఉండేవాళ్లం. భారత్‌లో ఉంటూ సురక్షితంగా లేమని చెప్పడం అంటే దేశానికి ద్రోహం చేయడమే" అని శనివారం ఆయన వ్యాఖ్యానించారు.

లక్షదీవుల్లో రక్షణ ప్రాజెక్టు వద్దు: ఎంపీ

కొచ్చిన్: లక్షదీవుల్లో మానవ నివాసాలున్న బిత్రా దీవిని దేశ రక్షణ కోసం ఉపయోగించాలని కేంద్రం నిర్ణయించడాన్ని ఆ ప్రాంత ఎంపీ హమ్దుల్లా సయీద్ తీవ్రంగా నిరసించారు. ఈ సమస్యను పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో లేవనెత్తుతానని దీవివాసులకు భరోసా ఇచ్చారు. బిత్రా దీవిని రెవెన్యూశాఖ స్వాధీనం చేసుకొని రక్షణ ప్రాజెక్టుకు అప్పగించేలా ఈ నెల 11న నోటిఫికేషను జారీ అయింది. దీవి సర్వేను రెండు నెలల్లో పూర్తిచేస్తామని తెలిపింది. దీవి సేకరణ పారదర్శకంగా చేస్తామనీ, స్థానికులకు తగిన పరిహారం చెల్లిస్తామని తెలిపింది. ఈ అంశంపై గ్రామసభతోసహా సంబంధిత పక్షాలన్నింటితో చర్చిస్తామని నోటిఫికేషను వివరించింది. బిత్రాలో ప్రస్తుతం గ్రామ పంచాయతీ లేదని ఎంపీ సయీద్ తెలిపారు. లక్షదీవుల్లో అన్నింటి కన్నా చిన్నదీవి బిత్రా. దేశ రక్షణ కోసం ఇతర దీవుల్లో ఇప్పటికే భూముల సేకరణ జరిగిందనీ, ఇప్పుడు బిత్రాను కూడా స్వాధీనం చేసుకోవడం సరికాదని ఎంపీ సయీద్ వాదిస్తున్నారు.

వర్సిటీలో ప్రొఫెసర్ల వేధింపులు.. బీడీఎస్ విద్యార్థిని ఆత్మహత్య


నొయిడా: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నొయిడాలో ప్రొఫెసర్లు మానసికంగా వేధిస్తున్నారంటూ శారదా యూనివర్సిటీ బీడీఎస్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన జ్యోతిశర్మ (20) దంత వైద్యం రెండో సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి క్యాంపస్‌లోని బాలికల హాస్టలులో ఈమె ఉరి వేసుకొంది. సహ విద్యార్థుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. హాస్టలు గదిలో ఒక సూసైడ్ నోట్ దొరికింది. అందులో డెంటల్ విభాగంలోని ఒక మహిళా అధ్యాపకురాలు, మరో ప్రొఫెసర్ కలిసి తనను మానసికంగా వేధించారని, వారిని శిక్షించాలని జ్యోతి పేర్కొంది. పోలీసులు ఆ ఇద్దరినీ అరెస్టు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన యూనివర్సిటీలో కలకలం రేపడంతో విద్యార్థులు నిరసనకు దిగారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వారికి హామీ ఇచ్చి శాంతింపజేశారు.



జ్యోతిశర్మ

18 రోజుల్లో 50 లక్షల కుటుంబాల చెంతకు..

- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో తెదేపా ఇంటింటి ప్రచారం
- ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తున్న నాయకులు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు తెదేపా శ్రేణులు 50 లక్షల కుటుంబాల్ని వ్యక్తిగతంగా కలిశాయి. జులై 2న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో 18 రోజుల్లోనే ఈ ఘనత సాధించినట్లు పార్టీ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'తమ పరిధిలోని కుటుంబాల్ని తెదేపా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కలుస్తున్నారు. ఆయా కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని వారికి వివరిస్తున్నారు. రాబోయే నాలుగేళ్లలో చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని తెలియజేస్తున్నారు. ప్రజల ఆకాంక్షలు, వారి అభిప్రాయాల్ని నమోదు చేసుకుంటున్నారు. పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, తల్లికి వందనం, అన్న క్యాంటీన్లు, దీపం-2, ఎస్సీ వర్గీకరణ సహా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, వస్తున్న పెట్టుబడులపై రూపొందించిన కరపత్రాల్ని ప్రజలకు అందజేస్తున్నారు. ఉత్తరాంధ్ర, మధ్య ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనుల్ని అందులోనే పొందుపరిచారు' అని పార్టీ తెలిపింది.

అధినేత నుంచి కార్యకర్త వరకు..

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో అధినేత చంద్రబాబు నుంచి సాధారణ కార్యకర్త వరకూ అందరూ భాగస్వాములవుతున్నట్లు పార్టీ తెలిపింది. 'చంద్రబాబు కుప్పంలో, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళగిరిలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ పరిధిలోని నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. కార్యకర్తల్ని ఉత్తేజపరుస్తున్నారు' అని వివరించారు. ఎన్ని ఇళ్లకు వెళ్లారు, ఎంతమందిని కలిశారనే వివరాలు బూత్, క్లస్టర్, యూనిట్, సాధికార సారథి వరకు అందరూ ఏరోజుకారోజు నమోదు చేయిస్తున్నారు. డ్యాష్ బోర్డు ద్వారా అంతర్గతంగా వీటిని పర్యవేక్షిస్తున్నారు. 'ఉత్సాహంగా పనిచేస్తున్న వారిని లోకేశ్ అభినందిస్తున్నారు. ఎక్కడైనా తక్కువగా జరుగుతుంటే అక్కడి నాయకులతో మాట్లాడి స్ఫూర్తి నింపుతున్నారు' అని తెదేపా పేర్కొంది.

ఏపీలో పెట్టుబడులపై చర్చలు జరుపుతున్నాం

మహీంద్రా (గ్రూపు) సంస్థల ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా



ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనేక అవకాశాలున్నాయని మహీంద్రా గ్రూపు సంస్థల ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు. రాష్ట్రంలో మహీంద్రా ట్రక్కుల తయారీ యూనిట్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ చేసిన విజ్ఞప్తిపై శనివారం ఆయన 'ఎక్స్'లో స్పందించారు. "ఏపీలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. సౌరశక్తి, మైక్రో ఇరిగేషన్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులు పెట్టే అంశంపై మా బృందం ఇప్పటికే చర్చలు జరుపుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రయాణంలో భాగస్వామ్యం అవుతున్నందుకు గర్వంగా ఉంది" అని ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు.

ఆనంద్ మహీంద్రాకు కృతజ్ఞతలు: లోకేశ్



ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆనంద్ మహీంద్రా సంసిద్ధత వ్యక్తం చేయడంపై విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. 'మనం కలిసి పనిచేద్దాం. ఈవీ వాహనాలు, రక్షణ, ఏరోస్పేస్ తయారీ రంగాల్లోకి మీ సంస్థను విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే వాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం గరిష్ఠ రాయితీలు ఇవ్వనుంది. మీరు వీటి తయారీకి ఏపీని పరిగణనలోకి తీసుకుంటే సంతోషిస్తాం' అని లోకేశ్ పేర్కొన్నారు.

'ఆరోగ్యాంధ్ర'లో వైద్యులు భాగస్వాములు కావాలి

- ప్రైవేటు వైద్యులు 15 రోజులకోసారి ప్రభుత్వాస్పత్రుల్లో శస్త్రచికిత్సలు చేయాలి
- మంత్రి సత్యకుమార్



సదస్సు సావనీర్ ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్, వైద్యులు

మంగళగిరి, న్యూస్‌టుడే: 'దేశవ్యాప్తంగా గుండెపోటు మరణాలు 33% ఉంటే.. రాష్ట్రంలో అది 32% నమోదవుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఈ పరిస్థితిని వైద్యులు సవాలుగా తీసుకోవాలి. మెరుగైన వైద్యంతో మరణాల సంఖ్య తగ్గించాలి. ప్రభుత్వ వైద్యశాలల్లోనూ అధునాతన గుండెవైద్యం అందించేలా చర్యలు తీసుకుంటాం' అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై వైద్యశాలలో శనివారం నిర్వహించిన కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ (ఏపీసీఎస్ఐ) సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యాంధ్ర నిర్మాణంలో వైద్యులందరూ భాగస్వాములు కావాలని, ప్రైవేటు వైద్యులు 15 రోజులకోసారి ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయాలని కోరారు. గుంటూరు జీజీహెచ్‌లో 110 ఓపెన్ హార్ట్, మూడు గుండెమార్పిడి శస్త్రచికిత్సలు చేయడం అభినందనీయమన్నారు. గోదావరి జిల్లాల్లో మధుమేహం, రాయలసీమ జిల్లాల్లో బీపీ బాధితులు పెరుగుతున్నారని చెప్పారు. క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు అమలుచేయాలని సంకల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలల్లో 8% ఓపీ, 17% ఐపీ సేవలు పెరగడం అభినందనీయమని తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.పి.చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఆఫ్ కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డా.పి.జాన్‌సతీష్, నిర్వాహక కార్యదర్శి డా.పి.ఎస్.శ్రీనివాస్ చౌదరి, ఎన్నారై అకాడమీ అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ రావు, సుమారు 400 మంది కార్డియాలజిస్టులు పాల్గొన్నారు.

రప్పా.. రప్పా భాషను సమర్థించుకోవడం ఎంతవరకు సమంజసం

రప్పా.. రప్పా భాషను జగన్ సమర్థించుకోవడం ఎంతవరకు సమంజసమని మంత్రి సత్యకుమార్ ప్రశ్నించారు. తప్పొప్పుల్ని తెలుసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి సమర్థించుకోవడం మూర్ఖత్వం అవుతుందన్నారు.

తితిదేలో నలుగురు అన్యమత ఉద్యోగుల సస్పెన్షన్

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: అన్యమత ఉద్యోగులపై తితిదే కొరడా ఝుళిపించింది. దేవస్థానం చరిత్రలో ఒకేసారి నలుగురిపై వేటు వేసింది. అన్యమత ప్రార్థనల్లో పాల్గొన్న తితిదే ఏఈవో రాజశేఖర్‌బాబును ఈ నెల 8న విధుల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. తాజాగా శనివారం తితిదే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (క్వాలిటీ కంట్రోల్) బి.ఎలిజర్, బర్డ్ ఆసుపత్రి స్టాఫ్‌నర్స్ ఎస్.రోసి, బర్డ్ ఆసుపత్రి గ్రేడ్-1 ఫార్మసిస్ట్ ఎం.ప్రేమావతి, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీలో పనిచేస్తున్న డా.జి.అసుంతను సస్పెండ్ చేసింది. ఈ నలుగురు ఉద్యోగులు క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో వీరిపై తితిదే విజిలెన్స్ విభాగం నివేదిక సమర్పించింది. ఆ నివేదికను పరిశీలించి, నిబంధనల ప్రకారం వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. అధికారిక రికార్డుల ప్రకారం 47 మంది అన్యమతస్థులు తితిదేలో పనిచేస్తున్నారు. వీరుకాక అన్యమతంలోకి మారి ప్రార్థన స్థలాలకు వెళుతున్న వారు 412 మందికిపైగా ఉద్యోగులు ఉన్నట్లు విజిలెన్స్ నివేదిక చెబుతోంది. వీరిపై కూడా త్వరలో చర్యలు తీసుకోనున్నారు.



ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి తదితరులు

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి శ్రీవారి పుష్కరిణి మరమ్మతులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని శ్రీవారి ఆలయ పుష్కరిణి మరమ్మతులు ఆదివారం నుంచి ఆగస్టు 19 వరకు నిర్వహించనున్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముందు ఏటా పుష్కరిణికి మరమ్మతులు చేపడతారు. ఈ ఏడాది సెప్టెంబర్ 24 నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నందున తితిదే వాటర్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో నెల రోజుల ముందుగానే ఈ పనులు ప్రారంభిస్తున్నారు. నెల రోజులు భక్తులను పుష్కరిణిలోకి అనుమతించకపోవడంతో పాటు హారతి క్రతువును సైతం నిలిపివేయనున్నారు.



జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప దంపతులను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

లక్ష్యం, గమ్యంపై స్పష్టతతో విజయం సొంతం


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప వ్యాఖ్య

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: లక్ష్యం, గమ్యం స్పష్టంగా ఉంటే విజయం సొంతమవుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప అన్నారు. మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలిలో స్థానిక 'తెనాలి రామకృష్ణ కవి' కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో 'విద్యార్థులు-భవిష్యత్తు సవాళ్లు' అనే అంశంపై ఆమె మాట్లాడారు. యుక్త వయసులో తాత్కాలిక ఆకర్షణలకు లోనుకాకుండా చక్కటి వ్యక్తిత్వంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. మనలోని భయం వల్ల ఓటమి ఎదురవుతుందని, దానిని జయించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. కాకినాడ జేఎన్టీయూ ఉపకులపతి డాక్టర్ చేకూరి శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంటర్ పూర్తి చేసిన యువతులు 80 శాతం మంది డిగ్రీ చదువుతున్నారని, మన దేశంలో 30 శాతం కూడా దాటడం లేదని, ఆ సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సేవా సమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ మాట్లాడుతూ.. జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప.. స్థానిక పురపాలక బాలికోన్నత పాఠశాల్లో పదో తరగతి వరకు చదువుకున్నారని చెప్పారు. ప్రణాళిక ప్రకారం ముందుకు సాగి హైకోర్టు న్యాయమూర్తిగా ఎదిగి నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో భాగంగా మొవ్వా విజయలక్ష్మి స్మారక పురస్కారాన్ని జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయి ప్రతాపకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, డాక్టర్ కొలసాని రాంచంద్, తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అంటే ప్రకృతితో అనుబంధం!

- 'ఈటీవీ భారత్'తో రామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేశ్ డి.పటేల్

ధ్యానం (మెడిటేషన్), ఆధ్యాత్మికత (స్పిరిచ్యువాలిటీ), పూర్ణ హృదయం (హార్ట్‌ఫుల్‌నెస్) అనగానే రామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేశ్ డి.పటేల్ గుర్తుకొస్తారు. హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా పచ్చదనం పెంచేందుకు ఆయన కృషి చేస్తున్నారు. ఇప్పటికే 10 లక్షల మొక్కలు నాటారు. వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 3 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ధ్యానం, ఆధ్యాత్మికత, ప్రకృతి మధ్య అనుబంధం ఉందంటున్న ఆయన.. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ భవిష్యత్తు లక్ష్యాలను 'ఈటీవీ భారత్'తో పంచుకున్నారు.





అడవుల పెంపకం, పర్యావరణ అంశాల్లో ఏం చేయాలో యువతరానికి తెలుసని అనుకుంటున్నారా?

నవతరానికి శక్తియుక్తులు, ఉత్సాహం ఉన్నాయి. అభిరుచీ ఉంది. వాళ్లకు మార్గదర్శనం అవసరం. పెద్దవాళ్లు సరైన మార్గంలో నడుస్తూ పిల్లలకు ఆదర్శంగా ఉండాలి. ఇక ప్రభుత్వం విద్యార్థుల్ని ప్రోత్సహించాలి. హార్ట్‌ఫుల్‌నెస్‌తో కలిసి దిల్లీ ప్రభుత్వం.. పచ్చదనం ఎలా పెంచాలో పిల్లలకు నేర్పిస్తోంది. కళాశాలలో ఉండగా 5 మొక్కలు పెంచితేనే సర్టిఫికెట్ ఇస్తామనే నిబంధన పెట్టాలి.

పర్యావరణానికి, ఆధ్యాత్మికతకు సంబంధమేంటి?

ఈ రెండింటినీ వేరు చేయలేం. ఆధ్యాత్మిక భావనలు ఉన్న వ్యక్తి జీవితం అన్ని అంశాల చుట్టూ తిరుగుతుంటుంది. దేని నుంచీ తప్పించుకోలేం. ఒకప్పుడు ఆధ్యాత్మికత అంటే సన్యాసిగా మారాలి అనేవారు. అది సరికాదు. ఆధ్యాత్మిక భావన ఉన్న వ్యక్తి సమాజంలోని అన్నింటితో కలిసిమెలిసి ఉంటాడు. విద్య, పర్యావరణం, ప్రకృతి... ఇలా అన్నింటితో అనుబంధం ఉంటుంది.

ఇప్పటికే ప్రకృతి వినాశనం జరిగింది. శరవేగంగా జరుగుతోంది. ఆ పరిస్థితిని సరిదిద్దడానికి ఒక తరం సరిపోతుందా?

అంచనా వేయడం కష్టం. నేను చేయగలిగింది నేను చేయాలి. నువ్వు చేసేది నువ్వు చేయాలి. వాళ్లకు చేతనైంది ప్రజలు చేయాలి. ఒక తరంతో అవుతుందా.. పది తరాలు పడుతుందా అనేది మనకు తెలియదు.

నవతరం రోజువారీ జీవితంలో అనుసరించడానికి ఒక సులువైన మంత్ర, టెక్నిక్ చెప్పమంటే ఏం చెబుతారు?

నేను చెప్పడం కాదు... భగవాన్ శ్రీకృష్ణుడే చెప్పారు. ధ్యానం ఎలా చేయాలో శివుడు, రాముడు, హనుమంతుడు పరోక్షంగా చెప్పారు. రాముడు, హనుమంతుడి ఫొటోలు చూస్తే కళ్లు మూసుకుని అడవిలో ధ్యానం చేస్తున్న విషయం అర్థమవుతుంది. ధ్యానంతో నిర్భయమైన వాతావరణం, ప్రశాంతత లభిస్తాయి.



సంప్రదాయ మొక్కలు నాటే పద్ధతికి, హార్ట్‌ఫుల్‌నెస్ విధానానికి తేడా ఏంటి?

సహజంగా చిన్న గుంత తవ్వేసి అందులో మొక్క నాటుతుంటారు. నీళ్లు, పోషకాలు అందించడం మరిచిపోతుంటారు. మా పద్ధతి వేరుగా ఉంటుంది. సూర్యుడు, గాలి దిశ చూస్తాం. చిన్న మొక్కలకు ఉత్తరాన పెద్ద చెట్లు పెడతాం. నీటి సౌకర్యం చూస్తాం. మూడు నాలుగు అడుగుల పెద్ద గొయ్యి తవ్వుతాం. జీవ బొగ్గు, వర్మీ కంపోస్టు, పోషకాలు అందిస్తాం. కన్హా శాంతివనంలో రెయిన్ ఫారెస్టును సృష్టించాం. రెయిన్ గన్‌లతో కృత్రిమంగా వర్షం కురిపిస్తున్నాం. గుజరాత్‌లోని జైన్ తీర్థధాం తరంగ హిల్స్‌లో విజయవంతంగా దీనిని చేశాం. ప్రపంచంలోనే రెయిన్ గన్‌లతో నీళ్లు పోసి సృష్టించిన అడవి.. తరంగ హిల్స్‌లోనే ఉంది.

హార్ట్‌ఫుల్‌నెస్ మిషన్ కింద 2030 నాటికి 3 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అది ఎంతవరకు సాధ్యం? మీ ప్రణాళికలేంటి?

తొలుత 10 లక్షలు అనుకున్నాం. సాధించాం. తర్వాతేంటి అనుకున్నప్పుడు మరింత ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటడం అనిపించింది. అయితే పట్టణీకరణతో తగినంత ఖాళీ స్థలం లేకపోవడంతో అది కష్టంగా తోచింది. కానీ హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా విజయవంతంగా అడవులు పెంచినట్లు తెలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించేందుకు ముందుకొస్తున్నాయి. రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, తెలంగాణల్లో మొక్కలు పెంచుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లోనూ మొక్కల పెంపకానికి సిద్ధమవుతున్నాం.

ఇంత పెద్ద కార్యక్రమంలో ప్రభుత్వం, ప్రజల్ని ఏ విధంగా భాగస్వాముల్ని చేస్తున్నారు?

ప్రభుత్వ తోడ్పాటు లేకుండా ఇలాంటి కార్యక్రమాలు చేయలేం. అడవుల సంరక్షణలో ఒక రాష్ట్రం అని కాకుండా దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు విఫలమయ్యాయి. కొన్నిచోట్ల చాలా బాగా చేస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ఏమీ ఉండటం లేదు. అడవులు కేంద్రం పరిధిలోకి వస్తాయి. కేంద్ర ప్రభుత్వ పటిష్ఠ విధానాలతోనే అడవులు వృద్ధి చెందుతాయి.

మూసేసిన గనుల చుట్టుపక్కల మొక్కల పెంపకంపై కోల్ ఇండియా, సింగరేణితో హార్ట్‌ఫుల్‌నెస్ ఒప్పందం చేసుకుంది. మీ ఆలోచనేంటి?

గనుల కోసం తవ్వినచోట పెద్ద గుంతలుంటాయి. వాటిని నీటి నిల్వ కేంద్రాలుగా వాడుకోవచ్చు. భూమి స్థితిగతులపై అధ్యయనం చేసి.. చుట్టుపక్కల అడవులు అభివృద్ధి చేయవచ్చు. తిరుమల కొండలపై నాణ్యమైన ఎర్రచందనం చెట్లున్నాయి. అలాంటివే ఏపీ, తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో ఎక్కడైనా పెంచవచ్చు. కానీ అలాంటి నాణ్యత కష్టం. తిరుమల అడవుల మట్టిపై అధ్యయనం చేస్తే... యురేనియం ఉపఉత్పత్తులు అందులో కలిసి ఉన్నట్లు తేలింది. దాన్ని తీసుకెళ్లి ఇతర ప్రాంతాల మట్టిలో కలిపితే.. తిరుమల కంటే నాణ్యమైన ఎర్రచందనం మొక్కలు పెంచవచ్చు. హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో అలాంటి ప్రయోగం చేశాం.



ఈటీవీ భారత్

హోలీ తీర్థంకర్స్ పుస్తకం రాయడానికి మీకు స్ఫూర్తినిచ్చిన అంశాలేంటి?

అడవులు, మొక్కలు, చెట్ల గురించి ప్రధాని మోదీతో చర్చిస్తున్నప్పుడు... తీర్థంకరులతో అనుసంధానమైన 16 చెట్ల గురించి నాకు తెలుసని ఆయన చెప్పారు. ప్రతి తీర్థంకరుడికి ఇష్టమైన చెట్టు ఉండేదని, అక్కడే ధ్యానం చేసేవారని తెలిపారు. 24 మంది తీర్థంకరులు ఉండగా... ఆయన 16 రకాల చెట్లు సేకరించారు. మిగిలినవి మీరెందుకు సేకరించకూడదని అడిగారు. నేను లోతైన అధ్యయనం చేసి దానిపై పుస్తకం రాశాను. ఏ తీర్థంకరుడు ఏ చెట్టు కింద ధ్యానం చేసేవారనేది తెలుసుకున్నా. ఒక్కొక్కరికి ఒక్కో జంతువు, పక్షులతో అనుబంధం ఉండేదని తెలిసింది.

అంత ఖర్చు చేస్తున్నారు... అసలైనవేనా..?



ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు రిజిస్ట్రేషన్...

మార్కెట్‌ను నకిలీ వస్తువులు ముంచెత్తుతున్నాయి. అసలు వస్తువులను మరిపించేలా ఉండే వీటి వల్ల వినియోగదారులు డబ్బే కాదు.. చాలా రూపాల్లో నష్టపోవాల్సి వస్తోంది. ముఖ్యంగా నాసిరకం ఎలక్ట్రికల్ ఉత్పత్తులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏ వస్తువునైనా అసలుదేనా అన్నది నిర్ధారించుకున్నాకే కొనాలి.

బీఐఎస్ గుర్తింపు ఉందా..?

- మన దేశంలో వస్తువులకు నాణ్యత ప్రమాణాలను నిర్దేశించి..అవి ఉండేలా పర్యవేక్షించి... నకిలీలకు అడ్డుకట్ట వేసే కీలక బాధ్యత బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్)ది.
- దేశంలో బీఐఎస్ గుర్తించిన 769 ఉత్పత్తులకు తప్పనిసరిగా ఐఎస్ఐ మార్క్ ఉండాలన్న నిబంధన ఉంది.
- ఐఎస్ఐ గుర్తింపు పొందిన వస్తువుల నాణ్యతను రెండు, మూడు నెలలకోసారి బీఐఎస్ అధికారులు తనిఖీచేస్తారు. పరిశ్రమల్లోనూ ఆకస్మిక తనిఖీలు చేస్తారు.
- ప్రమాణాలు పాటించకపోతే ఐఎస్ఐ మార్క్, లైసెన్స్ రద్దు చేస్తారు.

ముద్ర ఉంటే సరిపోదు...

- ఏ వస్తువు పైనయినా ఐఎస్ఐ మార్క్ ఉంటే సరిపోదు. దాని కింద ఏడు లేదా పది అంకెల్లో సర్టిఫైడ్ మ్యానుఫ్యాక్చరింగ్ నంబరు తప్పనిసరిగా ఉండాలి.
- ఐఎస్ఐ సర్టిఫికేషన్ కోసం బీఐఎస్‌కు దరఖాస్తు చేసుకుంటే... అన్ని పరీక్షలూ చేసి సంస్థకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇస్తారు.
- కొన్ని వస్తువులకు ఐఎస్ఐ గుర్తింపు లేకపోయినా నకిలీ మార్క్, నంబరు ముద్రిస్తున్నారు.
- ఈ మోసాలను గుర్తించేందుకు బీఐఎస్ కేర్ యాప్ అందుబాటులో ఉంది.
- వస్తువుపై ముద్రించిన ఐఎస్ఐ నంబర్‌ను యాప్‌లో నమోదు చేస్తే సంస్థ లైసెన్స్ వివరాలు, వ్యాలిడిటీ సమాచారం తెలుస్తుంది.

ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు రిజిస్ట్రేషన్...

- ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, టీవీలు, మైక్రోవోవెన్లు, ప్రింటర్లు, స్కానర్లు, కీబోర్డుల వంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి.
- వీటి వెనక వైపు లేదా లోపల ప్రత్యేక సింబల్‌తో రిజిస్ట్రేషన్ వివరాలు ఉంటేనే బీఐఎస్ గుర్తింపు ఉన్నట్లు పరిగణించాలి.
- ఈ గుర్తు ఉంటే మరో సౌలభ్యం కూడా ఉంటుంది. మొబైల్స్ వంటివి ఉపయోగించినప్పుడు సందేశాలు అన్ని భారతీయ భాషల్లో కూడా వచ్చేలా సాఫ్ట్‌వేర్ ఉంటుంది.

గుర్తించడం ఇలా...

లోగోను సరిచూడాలి: ప్రముఖ సంస్థల ఉత్పత్తుల లోగోను పోల్చి చూడాలి. నకిలీ వాటిలో స్వల్ప మార్పులు ఉంటాయి. రంగు, డిజైన్‌లలో తేడాలు గుర్తించవచ్చు.

స్పెల్లింగ్‌లో తేడాలు: నకిలీ ఉత్పత్తి పేరులో గుర్తించలేని విధంగా కొన్ని అక్షరాలు మారుస్తారు. వాటిని పసిగట్టాలి.

చౌక ధర: నకిలీ వస్తువుల ధరలు చాలా తక్కువగా ఉంటాయి. ఎంత తక్కువ ధరకు అడిగినా వ్యాపారులు ఇచ్చేస్తారు.

ప్యాకింగ్‌లో తేడాలు: బ్రాండెడ్ వస్తువులు ఏవైనా పక్కా ప్యాకింగ్‌లో ఉంటాయి. నకిలీ వస్తువుల ప్యాకింగ్‌లో తేడాలు ఉంటాయి.

తయారీదారుల వివరాలు: నకిలీ వస్తువుల తయారీదారుల వివరాలు పక్కాగా ఉండవు. అరకొర సమాచారమే ఉంటుంది.

ఎక్కడ కొనాలి: అథరైజ్డ్ డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి. కంపెనీ అవుట్‌లెట్లు ఉంటే వాటిలో కొనేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. బ్రాండెడ్ వస్తువులు ఈ-కామర్స్ సైట్లు, ఆయా సంస్థల వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయి.

దుర్వినియోగం చేస్తే...

- నకిలీ ఉత్పత్తుల తయారీదారులకు బీఐఎస్ చట్టం సెక్షన్ 16 ప్రకారం రూ.2లక్షల జరిమానా, రెండేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు.
- అదే సంస్థ రెండోసారి కూడా ఐఎస్ఐ మార్క్ దుర్వినియోగం చేస్తే ఐదు రెట్లు జరిమానా, పదేళ్ల జైలుశిక్ష విధిస్తారు.

విధిగా ఐఎస్ఐ మార్క్ ఉండాల్సిన వాటిలో కొన్ని

గ్యాస్ సిలిండర్లు, హెల్మెట్లు, అన్ని ఎలక్ట్రికల్ ఉత్పత్తులు, పిల్లల ఆట వస్తువులు, స్టీలు, సిమెంట్, కుక్కర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, టైర్లు, మిక్సీలు, గ్యాస్‌స్టవ్‌లు, చెప్పులు, ఏసీలు.

- ఈనాడు, హైదరాబాద్

ఏ నగరంలోనూ లేదేమో.. ఈ మండల కేంద్రంలో ఉంది



మనకు నాలుగు రహదారుల కూడళ్లు తెలుసు. దాదాపు అన్ని గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలు, నగరాల్లో కనిపిస్తుంటాయి. ఏపీలోని కడప, శ్రీకాకుళంలో ఏడు రోడ్ల కూడళ్లు ఉన్నాయి. ఇది అంత కుమించి అన్నట్లు.. 8 రోడ్ల కూడలి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండల కేంద్రం ఈ ప్రత్యేకతను సొంతం చేసుకుంది. విద్య, వైద్యం, వాణిజ్యం, టెలికాం, తపాలా, పోలీసు, అటవీశాఖ, గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ), మందిరం, మసీదు, చర్చి.. తదితరాలను ఈ రోడ్లు చుట్టేస్తుంటాయి. ఏటా ఇక్కడ పెద్దఎత్తున వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తారు. దీంతో వినాయకచౌక్‌గానూ పిలుస్తుంటారు. ఉమ్మడి రాష్ట్రంలోని అరుదైన సర్కిళ్లలో ఇదొకటని చరిత్రకారులు గుర్తించినట్లు స్థానికులు చెబుతుంటారు. – న్యూస్‌టుడే, ఉట్నూరు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, బహూకరించడానికి తెచ్చిన బంగారు నాణేలు

తల వెలకట్టలేనిదని చాటేందుకే..

హెల్మెట్ ధరించి వచ్చిన మహిళలను బంగారం వరించింది. చీర కూడా లభించింది. ఇంతకీ ఎక్కడంటారా? తమిళనాడు రాష్ట్రం తంజావూర్‌లో పట్టణంలోని రాజా మిరాసుధార్ ఆసుపత్రి రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ ధరించి వచ్చిన కొందరు మహిళలను ఆపారు. తాము నిబంధనల ప్రకారం హెల్మెట్‌తో వచ్చామని, ఎందుకు ఆపారని వారు ప్రశ్నించారు. ఇంతలో అమ్మవారి వేషం ధరించి, చేతిలో హెల్మెట్ పట్టుకొని ఉన్న పాఠశాల విద్యార్థినితో కలిసి తంజావూర్ జ్యోతి ఫౌండేషన్ కార్యదర్శి ప్రభురాజ్‌కుమార్, నగర ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రన్ అక్కడికి వచ్చారు. ఆ మహిళలకు అర గ్రాము బంగారు నాణెం, చీర అందించారు. తోటి వారికి కూడా హెల్మెట్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఊహించని కానుకలకు వారంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. ఆడిమాసం తొలి శుక్రవారం సందర్భంగా హెల్మెట్ ధరించి వాహనాలపై వెళ్తున్న 50 మంది మహిళలకు బంగారు నాణేలు, చీరలు ఇచ్చినట్లు ప్రభు రాజ్‌కుమార్ తెలిపారు.

–న్యూస్‌టుడే, చెన్నై(అర్కే నగర్)

ఇంటి భోజనాన్ని మైమరిపిస్తున్నారు!

విస్తరిస్తున్న క్లౌడ్ కిచెన్స్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కొన్నేళ్ల క్రితం వరకు భోజనం చేయాలంటే ఏ రెస్టారెంట్‌కో.. హోటల్‌కో వెళ్లేవారు. ఇప్పుడు చేతిలో సెల్‌ఫోన్ ఉంటేచాలు.. ఎలాంటి ఆహారమైనా మన దగ్గరికే వస్తోంది. కొవిడ్ సమయంలో ఫుడ్ ఆర్డర్ పెట్టుకోవడంతో మొదలైందీ సంస్కృతి. ఇందులో భాగంగా వచ్చినవే... క్లౌడ్ కిచెన్లు. ఈ తరహా వంటశాలలు హైదరాబాద్‌లో వేగంగా విస్తరిస్తున్నాయి. విశాఖపట్నం, విజయవాడల్లోనూ క్రమంగా పెరుగుతున్నాయి. రెగ్యులర్ హోటళ్లలోని వంటకాలతో పోల్చితే విభిన్న ఆహార పదార్థాలతో భోజన ప్రియుల్ని క్లౌడ్ కిచెన్లు ఆకర్షిస్తున్నాయి. ఉద్యోగాలు చేస్తున్న భార్యాభర్తలు, బ్యాచిలర్ యువత ఎక్కువగా వీటిపై ఆధారపడుతున్నారు.

ఫుడ్ డెలివరీ మాత్రమే చేసే ఈ క్లౌడ్ కిచెన్లకు రెస్టారెంట్ల లాంటి గదులు, ఎక్కువ మంది పనివాళ్లూ అవసరం లేదు. రుచిగా వంట చేయగలిగే సామర్థ్యం, శుభ్రమైన వంట గది ఉంటే చాలు. ప్రత్యేకంగా అద్దె భారం ఉండదు. దాంతో గృహిణులకు ఇది చక్కటి ఆదాయమార్గంగా మారింది. పలువురు యువకులూ స్నేహితులతో కలిసి క్లౌడ్ కిచెన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. తమ వంటశాలపై ఒక సోషల్ మీడియా ఖాతా తెరిచి... అందులో విస్తృతంగా ప్రచారం చేస్తూ, ఆహారప్రియుల్ని ఆకర్షిస్తున్నారు. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాంలతో అనుసంధానం అవుతున్నారు.

రెస్టారెంట్లకంటే తక్కువ ధరలకు పదార్థాలు అందిస్తుండటంతో వీటికి ఆదరణ పెరుగుతోంది. కస్టమర్ల



అభిరుచికి తగ్గట్లు అల్పాహారం, శాకాహారం, మాంసాహారం, బిర్యానీ, పిజ్జా, బర్గర్లు తదితర అన్ని రకాల వంటకాలను అందిస్తున్నారు. వీరు మధ్యాహ్న భోజనానికి రూ. 80-90 వరకు వసూలు చేస్తున్నారు.

రోజుకు రూ.3 వేల విలువైన ఆర్డర్లు

– మాధవి, ఉప్పల్, హైదరాబాద్

ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో క్లౌడ్ కిచెన్ ఆలోచన వచ్చింది. నా భర్త సహకారంతో వంటలు చేయడం ప్రారంభించా. రోజుకు రూ.3 వేలు, వారాంతాల్లో రూ.8 వేల వరకు విలువైన ఆర్డర్లు వస్తున్నాయి. ఇందులో నాణ్యత, శుభ్రత పాటించడం అత్యంత ప్రధానమైన అంశాలు.

ఏడాది ముందే వనవాసం వీడింది

యువ మహిళా ఐపీఎస్ చొరవ..



బనాస్ కాంతా (గుజరాత్): గుజరాత్‌లోని బనాస్‌కాంతా జిల్లా ఏఎస్పీ సుమన్ నాలా చొరవతో దాదాపు 300 మంది గిరిజనులు 11 ఏళ్ల తర్వాత తిరిగి స్వగ్రామంలో అడుగుపెట్టారు. 2021 బ్యాచ్ అధికారిణి అయిన ఈమె తన ఇంట్లో పనిచేసే గిరిజన మహిళ అల్కాను మెట్టినింటి వివరాలు ఆరా తీశారు. తాను ఎప్పుడూ ఆ గ్రామానికి వెళ్లలేదని.. ఓ హత్యకేసు, దాడి కారణంగా 2014లో తమ తెగకు చెందిన కుటుంబాలను 'చడోతరు' అనే గిరిజన ఆచారం కింద బహిష్కరించినట్లు ఆమె చెప్పింది. ఈ కుటుంబాల్లో కొంతమంది బనాస్‌కాంతాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆశ్రయం పొందగా.. మరికొందరు సూరత్‌కు వలస వెళ్లారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన సుమన్ నాలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రంగంలోకి దిగిన అధికారులు.. రెండు తెగల పెద్దలతో మాట్లాడి ఒప్పించారు. బహిష్కరణకు గురైన గిరిజనులు మళ్లీ స్వగ్రామానికి చేరారు. బాధిత కుటుంబాలకు చెందిన 21 ఎకరాలను కూడా తిరిగి అప్పగించారు. ఎన్జీవోల సాయంతో వీరికి ఇళ్లు నిర్మించే ప్రయత్నాలు చేస్తున్నారు.

భరణం చెల్లించేందుకు.. దొంగగా మారి..



నాగ్‌పుర్: విడాకులు తీసుకున్న మాజీ భార్యకు భరణం చెల్లించేందుకు ఓ వ్యక్తి దొంగగా మారి కటకటాల పాలయ్యాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో చోటుచేసుకుంది. రోడ్డుపై వెళుతున్న 74 ఏళ్ల మహిళ మెడలోని గొలుసును ఇటీవల ఓ దుండగుడు లాక్కొని పారిపోయాడు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా గణపతి నగర్‌కు చెందిన కన్హయ్య నారాయణ్ బౌరాషిని అరెస్టు చేసి విచారించగా.. అతడు నేరాన్ని అంగీకరించాడు. మొదటి భార్య విడాకులు తీసుకోవడంతో ఆమెకు నెలకు రూ.6వేలు భరణంగా చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పిందని, ఉద్యోగం లేక దొంగతనాలు చేస్తున్నానని తెలిపాడు. కన్హయ్య నుంచి ఓ మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్, 10 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



తండ్రి కూడా ఓ నాయకుడే

ఓ తండ్రిగా పిల్లలను సరైన దారిలో నడిపించడం కూడా నాయకత్వంతో సమానమే. శారీరకంగా, మానసికంగా, నైతికంగా బలంగా ఉన్న వ్యక్తులే సమర్థులైన సారథులు కాగలరు. ప్రతి సందర్భంలోనూ పిల్లల వెన్నంటి ఉండటం, క్లిష్టపరిస్థితుల్లో వారికి ధైర్యమివ్వడం, సరైన నిర్ణయాలు తీసుకోవడంలో మార్గనిర్దేశం చేయడం, వారిలో నైతిక విలువలను పెంపొందించడం.. ఇవన్నీ నాయకుడి లాంటి తండ్రి నిర్వర్తించాల్సిన బాధ్యతలు.

– రాండీ స్టాంప్స్, ఎలక్షన్ స్ట్రాటజిస్ట్

10 నిమిషాల్లోనే ఆసుపత్రి..

● విపత్తుల్లో సంజీవని.. ఈ 'భీష్మ'

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, మంగళగిరి: విపత్తులు, భారీ ప్రమాదాల్లో క్షతగాత్రులకు అత్యవసర చికిత్సలు అందించడం కష్టంతో కూడుకున్న పని. ఇప్పుడా సమస్యను తీర్చేందుకు వచ్చేసింది 'భీష్మ'. ఇదో పోర్టబుల్ సంచార ఆసుపత్రి. ఆరోగ్య మైత్రి క్యూబ్ పేరిట.. భారత్ హెల్త్ ఇనీషియేటివ్ ఫర్ సహయోగ్ హితా అండ్ మైత్రి(భీష్మ)ని రక్షణ, ఆరోగ్య మంత్రిత్వ శాఖలు తీర్చిదిద్దాయి. గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)కు మూడు 'భీష్మ' యూనిట్‌లను కేంద్రం కేటాయించింది.

ఏమిటిది?... భీష్మ యూనిట్ 72 మినీ క్యూబ్‌లతో కూడిన చిన్న ఆసుపత్రి. టన్ను బరువు ఉండే దీనిని రోడ్డుమార్గంలో సులువుగా ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. డ్రోన్లు, పారాచూట్‌తోపాటు హెలికాప్టర్‌లోనూ తరలించవచ్చు. 10 నిమిషాల్లో ఆసుపత్రిగా మార్చేయవచ్చు.

◆ భీష్మ లెవెల్-3 ట్రామా సెంటర్‌గా సేవలందిస్తుంది. గోల్డెన్ అవర్‌లో వ్యక్తి ప్రాణాలను కాపాడే అడ్వాన్స్‌డ్ ట్రామా లైఫ్ సపోర్ట్, విపత్తుల్లో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించేందుకు టాక్టికల్ కాంబాట్ క్యాజువాల్టీ కేర్ ఇందులో ఉన్నాయి.

సాంకేతికత తోడుగా...

భీష్మ... సౌర విద్యుత్తుతో నడుస్తుంది. వెంటిలేటర్లు, జనరేటర్లు, పరీక్షల కిట్లు, డాక్యుమెంటేషన్ టూల్స్‌తోపాటు పోర్టబుల్ ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్, ఏఈడీ, యాంటీబయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్లు, మినీ ల్యాబ్, సర్జికల్ కిట్లు, ఈసీజీ/బీపీ/ఎస్‌పీవో2 సిస్టం ఉన్నాయి. పది నిమిషాల్లో 30కిపైగా పరీక్షల ఫలితాలను అందించే సామర్థ్యం దీని సొంతం. ఒక్కో యూనిట్‌లో 200 మంది దాకా క్షతగాత్రులకు చికిత్సలు, 20 అత్యవసర సర్జరీలు చేయొచ్చు.



భీష్మ యూనిట్ గురించి వివరిస్తున్న తన్మయ్ రాయ్

సన్నద్ధత దిశగా..

భీష్మ యూనిట్లను ఎయిమ్స్‌లో శనివారం ప్రదర్శించారు. విశ్రాంత ఎయిర్ మార్షల్ డాక్టర్ తన్మయ్ రాయ్... యూనిట్‌ను ఆసుపత్రిగా ఎలా మార్చవచ్చో వివరించారు.



సర్జికల్ స్టేషన్



సిబ్బంది అవసరాలను తీర్చే టెంట్లు



రూ.263 కోట్లే

ఇంటర్నెట్ డెస్క్: అరుదైన వస్తువులను వేలం వేసే సదబీ సంస్థ తాజాగా పురాతన డైనోసార్ శిలాజాన్ని వేలం వేయగా.. ఏకంగా 30.5 మిలియన్ డాలర్లకు (రూ.263 కోట్లు) ఓ వ్యక్తి కొనుగోలు చేశారు. ఇది 150 మిలియన్ సంవత్సరాల కిందటిదని నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటివరకు ప్రపంచంలో మూడో అత్యంత విలువైన డైనోసార్ అస్థిపంజరమిది. గతేడాది జులైలో నిర్వహించిన వేలంలో అపెక్స్ అనే మరో డైనోసార్ శిలాజం 44.6 మిలియన్ డాలర్లు (రూ.380 కోట్లు) పలికింది. తాజా వేలంలో శిలాజాన్ని ఎవరు కొన్నారన్న విషయాన్ని సంస్థ బయటపెట్టలేదు. ఇదే వేలంలో అంగారక గ్రహం నుంచి తీసుకొచ్చిన పెద్దరాయి ధర 5.3 మిలియన్ డాలర్లు (రూ.45 కోట్లు) పలికింది.

సింగిల్ మేజర్ మార్పునకు అపరాధ రుసుము తగ్గింపు

ఈనాడు, అమరావతి: ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలలు సింగిల్ మేజర్ విధానంలోకి మారేందుకు దరఖాస్తు చేసుకోవడానికి నిర్ణయించిన అపరాధ రుసుములను ఉన్నత విద్యామండలి సవరించింది. రూ.2 వేలుగా ఉన్న అపరాధ రుసుమును రూ.1,000కి, రూ.5 వేలుగా ఉన్న దాన్ని రూ.2 వేలకు తగ్గించింది. అపరాధ రుసుము లేకుండా దరఖాస్తులను ఈ నెల 24 వరకు స్వీకరించనుంది. రూ.1,000తో ఈ నెల 27 వరకు, రూ.2 వేలతో 30 వరకు స్వీకరించనుంది.

ఒక రోజు శాస్త్రవేత్త అవుతారా?



విద్యార్థులూ.. మీకు శాస్త్ర పరిశోధనలపై ఆసక్తి ఉందా? ఒక రోజు శాస్త్రవేత్త అవుతారా? అందుకు హైదరాబాద్‌లోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన పరిశోధన సంస్థలు సీసీఎంబీ, ఐఐసీటీ, ఎన్‌జీఆర్ఐ మరోసారి అవకాశం కల్పిస్తున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ... 'మన్ కీ బాత్'లో ప్రసంగిస్తూ.. ప్రయోగశాలల్లో 'ఒక రోజు శాస్త్రవేత్త'గా గడపాలని విద్యార్థులకు సూచించారు. ఈక్రమంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు దేశంలో సీఎస్ఐఆర్‌కు చెందిన 37 ప్రయోగశాలల్లో జులై 21 నుంచి 25 వరకు ఈ అవకాశం కల్పించారు. పాఠశాల విద్యార్థులకు పరిశోధన వాతావరణాన్ని పరిచయం చేయడం, శాస్త్రవేత్తలతో చర్చించే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యం. ప్రతిరోజూ 75 నుంచి 100 మంది విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తారు. ఆన్‌లైన్ ద్వారా https://jigyasa-csir.in/v2/auth/index.html ఈ అడ్రస్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. – ఈనాడు, హైదరాబాద్

కోతికొమ్మచ్చి.. నగరంలో వద్దొచ్చి



ఖమ్మంలో కోతుల బెడద నివారణకు నగరపాలక సంస్థ ప్రత్యేక బృందాలతో వాటిని పట్టుకుంటోంది. కోతులను ఆకర్షించేందుకు జాలీతో కూడిన ప్రత్యేక వాహనంలో అరటి పండ్లు, కూరగాయలు తదితరాలను ఉంచి కాలనీల్లో నిలుపుతున్నారు. కోతులు లోపలికి చేరగానే సిబ్బంది జాలీని కిందికి వదులుతున్నారు. వివిధ కాలనీల్లో ఇలా పట్టిన కోతులను తీసుకెళ్లి అధికారుల అనుమతితో అడవిలో వదులుతున్నట్లు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య తెలిపారు. – ఈనాడు, ఖమ్మం

టోల్‌ప్లాజాల వార్షిక పాస్‌పై సందేహాలున్నాయా?

ఈనాడు, హైదరాబాద్: జాతీయ రహదారులపై టోల్‌ప్లాజాల వద్ద ఆగస్టు 15 నుంచి వార్షిక పాస్ విధానాన్ని అమలులోకి తెస్తున్న ఎన్‌హెచ్ఏఐ.. మార్గదర్శకాలను విడుదల చేసింది. పాస్ వినియోగం, చెల్లుబాటు, ఇతర సందేహాలపై స్పష్టత నిచ్చింది. రూ.3 వేలతో వార్షిక పాస్ తీసుకుంటే టోల్‌ప్లాజాల మీదుగా 200 ట్రిప్పులను ఉపయోగించుకోవచ్చు. ఫాస్టాగ్ కలిగిన వాహనదారులే ఈ పాస్ తీసుకోవడానికి అర్హులు. వార్షిక పాస్ తీసుకోవడం తప్పనిసరి కాదు.

పాస్‌ను ఎలా తీసుకోవాలి..

వార్షిక పాస్‌ను రాజ్‌మార్గ్ యాత్రా మొబైల్ అప్లికేషన్ లేదా ఎన్‌హెచ్ఏఐ వెబ్‌సైట్‌లో మాత్రమే యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది. వాహనం, దాని ఫాస్టాగ్ నంబరును ధ్రువీకరించిన తర్వాత ఎన్‌హెచ్ఏఐ పాస్‌ను జారీ చేస్తుంది. రుసుము రూ.3 వేలను రాజ్‌మార్గ్ యాత్రా యాప్ ద్వారా లేదా ఎన్‌హెచ్ఏఐ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే చెల్లించాలి. చెల్లింపులు పూర్తయిన 2 గంటలలోపు రిజిస్టర్ ఫాస్టాగ్‌లో పాస్‌ను అందుబాటులో ఉంచుతారు. దీని కోసం కొత్తగా మళ్లీ ఫాస్టాగ్ తీసుకోవాల్సిన అవసరం లేదు. నిబంధనల ప్రకారం (వాహనం విండ్ షీల్డ్‌పై సరిగ్గా అతికించడం, వాహన రిజిస్ట్రేషన్ నంబర్‌కు లింక్ అయి ఉండటం, బ్లాక్‌లిస్టులో లేకపోవడం) ఉంటే వార్షిక పాస్‌ను ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్‌తో తీసుకోవచ్చు.

వాణిజ్యేతర వాహనాలకే..

వార్షిక పాస్‌ను ప్రైవేట్ వాణిజ్యేతర వాహనాలకే(కారు, జీపు, వ్యాను తదితర) ఇస్తారు. ఏదైనా వాణిజ్య వాహనానికి తప్పుడు సమాచారంతో వార్షిక పాస్‌ను తీసుకుంటే నోటీసులు లేకుండానే ఎన్‌హెచ్ఏఐ రద్దు చేస్తుంది.

ఎక్కడెక్కడ.. ఎంతకాలం!

జాతీయ రహదారులు(ఎన్‌హెచ్), జాతీయ ఎక్స్‌ప్రెస్ వే(ఎన్ఈ) ఫీజు ప్లాజాలలో ఈ వార్షిక పాస్ చెల్లుబాటు అవుతుంది. ఎక్స్‌ప్రెస్ వే లు, రాష్ట్ర రహదారులు(ఎస్‌హెచ్)లపై ఉన్న ఫీజు ప్లాజాలో ఈ వార్షిక పాస్ పని చేయదు. ఇక్కడ ప్రస్తుతం చెల్లిస్తున్న విధంగానే ఫాస్టాగ్ రుసుమును చెల్లించాలి. వార్షిక పాస్ తీసుకున్న రోజు నుంచి ఒక సంవత్సరం లేదా 200 ట్రిప్పుల వరకు ఈ పాస్ చెల్లుతుంది. వీటిలో ఏది ముందుగా పూర్తయితే అదే ప్రామాణికం.

ఎలా లెక్కిస్తారంటే!

◆ ప్రతి టోల్‌ప్లాజా క్రాసింగ్‌ను ఒక ట్రిప్‌గా లెక్కిస్తారు. వెళ్లి తిరిగి వస్తే రెండు ట్రిప్‌లుగా లెక్కిస్తారు. క్లోజ్డ్ టోలింగ్ ఫీజు ప్లాజాలలో మాత్రం ఎంట్రీ, ఎగ్జిట్‌ను ఒక ట్రిప్‌గా లెక్కిస్తారు.

◆ వార్షిక పాస్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎస్ఎంఎస్ ద్వారా అందిస్తారు.

◆ ఫాస్టాగ్ వాలెట్‌లోని డబ్బుల ద్వారా వార్షిక పాస్‌కు రూ.3 వేలను చెల్లించడం కుదరదు. యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలి.

EENADU Vol: 51, Issue: 341 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao


ట్రంప్‌ను కుదిపేస్తున్న ‘స్నేహం’!

● ఎప్‌స్టీన్‌తో బంధంపై మీడియాలో కథనాలు ● ఉలిక్కిపడ్డ అమెరికా అధ్యక్షుడు ● పరువు నష్టం దావాతో ఎదురుదాడి

అమెరికాను కుదిపేసిన ఎప్‌స్టీన్ సెక్స్ ట్రాఫికింగ్ కుంభకోణం తాజాగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఎప్‌స్టీన్ ఫైల్లో ఏముందో బయట పెట్టాలంటూ సొంత పార్టీ కార్యకర్తలు, మద్దతుదారుల నుంచే ఆయనపై ఒత్తిడి పెరుగుతోంది. దీనికి తోడు ఎప్‌స్టీన్ 50వ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆయనకు ట్రంప్ రాసిన లేఖను వాల్‌స్ట్రీట్ జర్నల్ బయటపెట్టి ఈ అగ్నికి మరింత ఆజ్యం పోసింది. దీంతో ఆ పత్రాలను బయట పెట్టేందుకు ట్రంప్ అంగీకరించాల్సి వచ్చింది. మరోవైపు వాల్‌స్ట్రీట్‌పై ఆయన పరువు నష్టం దావా వేశారు.

1980లలో ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌నకు పరిచయం

డిగ్రీ కూడా పూర్తి చేయని జెఫ్రీ ఎప్‌స్టీన్ 1970లలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవాడు. ఆ సమయంలో ఓ విద్యార్థి తండ్రి అతడిని వాల్‌స్ట్రీట్‌లోని ఓ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌కు పరిచయం చేశారు. ఆ తర్వాత నాలుగేళ్లలోనే ‘ఎప్‌స్టీన్ అండ్ కో’ పేరుతో సొంతంగా జెఫ్ ఒక అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థను ప్రారంభించాడు. కొన్ని సంవత్సరాల్లోనే అది భారీ విజయం సాధించింది. రూ.కోట్లల్లో డబ్బులు వచ్చిపడ్డాయి. రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు, కళాకారులతో ఎప్‌స్టీన్‌కు పరిచయాలు పెరిగాయి. వారిని సంతోషపెట్టేందుకు ఆయన.. పేద, మధ్యతరగతి యువతులు, బాలికలకు డబ్బు ఆశగా చూపి లొంగదీసుకునేవాడు. వారిని సంపన్న స్నేహితుల వద్దకు పంపించేవాడు.



2000 సంవత్సరం నాటి చిత్రంలో ట్రంప్, మెలానియా, ఎప్‌స్టీన్, గిలిన్ మ్యాక్స్‌వెల్

ప్రైవేటు జెట్లను నడిపేవాడు. ఇంత సంపాదించినా ఎప్‌స్టీన్ మీడియాకు దూరంగా ఉండటంతో ఆయన గురించి సాధారణ ప్రజలకు పెద్దగా తెలియలేదు. 2022 సెప్టెంబరులో అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, నటులు కెవిన్ స్పేసీలతో కలిసి ఎప్‌స్టీన్ తన ప్రైవేటు జెట్‌లో ఆఫ్రికా ఖండంలో పర్యటించేందుకు వెళ్లారు. ఈ విషయం ‘న్యూయార్క్’ మ్యాగజీన్ తెలిపింది. దీంతో ‘రహస్య కుబేరుడు జెఫ్ ఎప్‌స్టీన్’ పేరుతో ఓ కథనాన్ని ప్రచురించింది. ఆ సమయంలో.. తనకు ఎప్‌స్టీన్ 15ఏళ్ల నుంచి తెలుసని, అతడికి కూడా తనలాగే అందమైన యువతులు, బాలికలు అంటే ఇష్టమని ట్రంప్ వ్యాఖ్యానించారు. 1990లలో మొదలైన వీరి స్నేహం 2004 వరకు కొనసాగింది. వీరిద్దరితోపాటు ఎప్‌స్టీన్ స్నేహితురాలు, సెక్స్ కుంభకోణంలో మరో కీలక వ్యక్తి గిలిన్ మ్యాక్స్‌వెల్, ట్రంప్ సతీమణి మెలనియా కలిసి దిగిన ఫొటోలు ఇటీవలే బయటకు వచ్చాయి. ఎప్‌స్టీన్ స్నేహితుల్లో క్లింటన్, ట్రంప్‌లతోపాటు అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ కుటుంబీకులు, మీడియా మొఘల్ మర్డోక్, మిషెల్ బ్లూంబర్గ్, రిచర్డ్ బ్రాన్సన్, మైకెల్ జాక్సన్, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ఇజ్రాయెల్ మాజీ ప్రధాని ఎహూద్ బరాక్, సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ పేర్లు బయటకు వచ్చాయి.

సెక్స్ కుంభకోణం ఇలా వెలుగులోకి..

14 ఏళ్ల తమ కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ 2005లో ఓ బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం వెలుగుచూసింది. దీంతో ఎప్‌స్టీన్‌పై పామ్ బీచ్ పోలీసులు లైంగిక వేధింపుల అభియోగాలు మోపారు. 2008లో తన తప్పును ఆయన అంగీకరించడంతో 18 నెలలపాటు కారాగారంలో ఉన్నాడు. ఆ తర్వాత ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక 2019లో ఫెడరల్ ప్రాసిక్యూటర్లు.. అతడిపై లైంగిక, అక్రమ రవాణా ఆరోపణలు చేస్తూ మరోసారి అభియోగాలు మోపారు. అదే ఏడాది ఆగస్టు 10న జైల్లో శిక్ష అనుభవిస్తున్న అతడు మరణించాడు. కొందరు దీన్ని ఆత్మహత్యగా నిర్ధారించగా.... మస్క్‌సహా మరికొందరు ఆయన మరణంపై అనుమానాలను వ్యక్తం చేశారు. ఎప్‌స్టీన్ మరణంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరగాలని ట్రంప్ సైతం డిమాండు చేశారు. ఈ నేపథ్యంలో 2024 జనవరిలో కోర్టు విచారణకు సంబంధించి 950 పత్రాలు బయటకు వచ్చాయి. అందులో ట్రంప్ పేరు ఉంది. కానీ ఆయనపై ఎటువంటి నేరం మోపలేదు. ఎప్‌స్టీన్ కేసు విచారణలో చాలామంది ప్రముఖుల పేర్లు వినిపించడంతో ఆయన మరణంపై అనుమానాలు మరింతగా పెరిగాయి. విచారణ పత్రాలను విడుదల చేయకపోవడంతో ఈ కేసును ‘డీప్ స్టేట్’ కాపాడుతోందన్న ప్రచారం కొనసాగింది. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్.. తాను ఎన్నికైతే ఎప్‌స్టీన్ ఫైళ్లను విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని పక్కన పెట్టేశారు. పత్రాలను బయటపెట్టాలని అడిగితే అది అసాధ్యమని ప్రభుత్వం గత వారం తేల్చి చెప్పింది. దీంతో డిమాండ్లు ఒక్కసారిగా తీవ్రతరమయ్యాయి. దీంతో దిగి వచ్చిన ట్రంప్ గ్రాండ్ జ్యూరీ పత్రాలను విడుదల చేయాలని కోర్టును ఆశ్రయించారు.

(ఈనాడు ప్రత్యేక విభాగం)

ఏం జరగొచ్చు..

కోర్టులు సాధారణంగా గ్రాండ్ జ్యూరీ విచారణ పత్రాలను విడుదల చేయడానికి ఇష్టపడవు. ప్రత్యేక సందర్భాల్లో తప్ప బయటపెట్టవు. 2019లో ట్రంప్‌పై కాంగ్రెస్ అభిశంసన కేసు విచారణ జరుగుతున్నప్పుడు ఎప్‌స్టీన్ సంబంధించిన గ్రాండ్ జ్యూరీ పత్రాలను హౌస్ డెమొక్రాట్లు కోరగా కోర్టు నిరాకరించింది. ఒకవేళ కోర్టు అంగీకరించి పత్రాలను విడుదల చేసినా.. ఏ విషయాలను విడుదల చేయాలి.. బాధితులు, సాక్షుల సున్నితమైన సమాచారాన్ని ఎలా రక్షించాలి.. అన్న విషయమై నిర్ణయం తీసుకోవడానికి వారాలు, నెలలు పట్టవచ్చు. అంతేకాకుండా కుంభకోణానికి సంబంధించిన శక్తివంతమైన వారి పేర్లను బయటపెట్టకపోవచ్చు.

వాల్‌స్ట్రీట్ జర్నల్, రూపర్ట్ మర్డోక్‌పై ట్రంప్ పరువు నష్టం దావా

● 10 కోట్ల డాలర్లు చెల్లించాలని డిమాండ్

వాషింగ్టన్: సంపన్న ఫైనాన్షియర్, సెక్స్ ట్రాఫికింగ్ కుంభకోణంలో నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్, తనకు మధ్య స్నేహాన్ని బయటపెడుతూ కథనాన్ని ప్రచురించినందుకు వాల్‌స్ట్రీట్ జర్నల్‌తోపాటు మీడియా మొఘల్ రూపర్ట్ మర్డోక్‌పై 10 బిలియన్ డాలర్లకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దావా వేశారు. న్యూస్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాబర్ట్ థామ్సన్, ఇద్దరు మీడియా సంస్థ రిపోర్టర్లను ప్రతివాదులుగా చేర్చారు. మియామీ ఫెడరల్ కోర్టులో ఈ దావా దాఖలు చేశారు. తప్పుడు కథనంతో తన పరువుకు భంగం కలిగించారని, ఆర్థికంగా ఇబ్బంది పెట్టారని ట్రంప్ ఆరోపించారు. ‘ఈ వ్యాజ్యం మీకు ఇష్టమైన కోసమే కాదు.. ఏపీని, సీబీఎస్ సహా మిగిలిన వార్తా సంస్థలు ప్రచురించే నకిలీ వార్తలను ఇకపై సహించని అమెరికన్లకు అండగా ఉండటానికి దాఖలు చేశా’ అని తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో ట్రంప్ పేర్కొన్నారు.

ఎప్‌స్టీన్ 50వ పుట్టిన రోజు సందర్భంగా ట్రంప్ ఆయనకో కానుక పంపించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. ఆ బహుమతి ఓ లేఖ అని.. అందులో చేతితో గీసిన మహిళ నగ్న చిత్రం ఉందని తెలిపింది. దానిపై ట్రంప్ సంతకంతోపాటు ‘హ్యాపీ బర్త్‌డే.. నీ ప్రతి రోజూ ఓ అద్భుతమైన రహస్యంగా మారాలని ఆకాంక్షిస్తున్నా’ అని రాశారని వెల్లడించింది.

గ్రాండ్ జ్యూరీ పత్రాలను విడుదల చేసేందుకు అంగీకారం

మరోవైపు ఎప్‌స్టీన్ సెక్స్ ట్రాఫికింగ్ కుంభకోణానికి సంబంధించి రహస్య పత్రాలను విడుదల చేయాలని వస్తున్న డిమాండ్లపై డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ట్రంప్ ఆదేశాల మేరకు.. ఎప్‌స్టీన్‌తోపాటు ఈ కేసులో దోషిగా తేలిన బ్రిటన్ సామాజికవేత్త గిలిన్ మ్యాక్స్‌వెల్ కేసుకు సంబంధించిన పత్రాలను విడుదల చేయాలని కోర్టులో డిప్యూటీ అటార్నీ జనరల్ టాడ్ బ్లాంకే అభ్యర్థనను దాఖలు చేశారు.

ఈ నెలాఖరులో నైసార్ ప్రయోగం!

ప్రకృతి వైపరీత్యాలపై నిశిత పరిశీలన

దిల్లీ: భారత్, అమెరికాల సంయుక్త ఉపగ్రహం నైసార్ ప్రయోగానికి రంగం సిద్ధమవుతోంది. అంతరిక్షం నుంచి భూమిపై ఒక సెంటీమీటరు కంటే తక్కువ వైశాల్యాన్ని కూడా హైరిజల్యూషన్‌లో చిత్రాలు తీయగల ఈ శాటిలైట్‌తో భూఉపరితల మార్పులకు కారణాలను కనుగొనవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ మిషన్ జులై 2025 చివరి నాటికి ప్రయోగించనున్నారు. నిర్దిష్ట తేదీని ఇంకా ప్రకటించలేదు.

నైసార్ పూర్తిపేరు నాసా, ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్. ఈ శాటిలైట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి, జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా ప్రయోగించనున్నారు. ఈ ప్రత్యేక మిషన్ కోసం నాసా.. ఈ నెల 21న విలేకరుల సమావేశాన్ని నిర్వహించబోతోంది. దీనికోసం ఇప్పటివరకూ 150 కోట్ల డాలర్లు ఖర్చు చేశారు. గత పదేళ్లుగా ఈ మిషన్‌పై పనిచేస్తున్నారు. ఆధునిక రాడార్ ఇమేజింగ్ ద్వారా అంతరిక్షం నుంచి ఈ ఉపగ్రహం భూ ఉపరితలాన్ని స్పష్టంగా చూడగలదు. దీనిలో డ్యూయెల్ ఫ్రీక్వెన్సీ రాడార్ ఉంది. ఈ తరగతిలో ఇది ప్రపంచంలోనే మొట్టమొదటిది. ఇది వ్యవసాయం, వరద ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు, వాతావరణ మార్పులపై ముఖ్యమైన సమాచారాన్ని అందిస్తుంది. భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటాలు, కొండచరియలు విరిగిపడటం, వరదలు, భూమి కుంగిపోవడం వంటి ప్రకృతి వైపరీత్యాలను పర్యవేక్షించడంలో, అర్థం చేసుకోవడంలో శాస్త్రవేత్తలకు సహాయం చేస్తుంది. ఈ ఉపగ్రహం 12 రోజులకోసారి మొత్తం భూమిని స్కాన్ చేస్తుంది. ప్రతి కదలిక లేదా మార్పును పర్యవేక్షిస్తుంది.

పంజాబ్‌లో ఆప్ ఎమ్మెల్యే రాజీనామా

చండీగఢ్: ఆప్ నాయకురాలు, పంజాబ్ మాజీ మంత్రి అన్‌మోల్ గగన్ మాన్ శనివారం శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు. లేఖను స్పీకరుకు పంపారు. పూర్వాశ్రమంలో ప్రసిద్ధ గాయకురాలైన అన్‌మోల్ గగన్‌మాన్ 2022లో ఖరార్ శాసనసభ నియోజకవర్గం నుంచి మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికై క్యాబినెట్ మంత్రి అయ్యారు. గత సంవత్సరం ఆ పదవి నుంచి ఆమెను తొలగించారు. “నా హృదయం భారంగా ఉంది. రాజకీయాల నుంచి విరమించాలని నిర్ణయించుకున్నాను. పార్టీ పట్ల సుహృద్భావం కలిగివున్నా. ప్రజల ఆకాంక్షల్ని పార్టీ నెరవేరుస్తుందని భావిస్తున్నాను” అని ఆమె సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. రాజకీయాల నుంచి వైదొలగడానికి కారణాలను వెల్లడించలేదు.

పట్నా హత్య కేసులో ఐదుగురి అరెస్ట్

పరారీలో ప్రధాన నిందితులు

కోల్‌కతా: బిహార్‌లోని పట్నాలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ హత్యకు గురైన గ్యాంగ్‌స్టర్ చందన్ మిశ్రా కేసుతో సంబంధమున్న ఐదుగురు శనివారం అరెస్టయ్యారు. ప్రధాన నిందితులంతా పట్నా నుంచి పారిపోయారన్న సమాచారంతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా తనిఖీలు నిర్వహించారు. నిందితులు తప్పించుకునేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేసిన ఐదుగురిని పోలీసులు కోల్‌కతాలో అరెస్ట్‌చేశారు. వీరిని అరెస్ట్‌చేసిన రెండు ఫ్లాట్ల నుంచి సెల్‌ఫోన్లను, కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. చందన్‌మిశ్ర గురువారం హత్యకు గురైన సంగతి తెలిసిందే.



తమ దేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా సియోల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దక్షిణ కొరియా కార్మిక సంఘాల నాయకులు

ఉగ్రవాదుల రక్షణకు పాక్ చట్ట సవరణ

● మరణశిక్ష యావజ్జీవ ఖైదుగా మార్పు
● చట్ట సవరణకు సెనెట్ ఆమోదం

ఇంటర్నెట్ డెస్క్: ఉగ్రమూకలను పెంచి పోషిస్తోన్న పాకిస్థాన్ ఆ విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గడంలేదు. ఉగ్రవాదులకు, హైజాకర్లకు ఆశ్రయం కల్పించినవారికి విధించే మరణశిక్షను రద్దుచేసే చట్టం సవరణకు పాక్ సెనెట్ ఆమోదముద్ర వేసింది. పాక్ నేర శిక్షాస్మృతి ప్రకారం.. హైజాకింగ్‌కు పాల్పడిన వ్యక్తికి ఉద్దేశపూర్వకంగా ఆశ్రయం కల్పిస్తే గరిష్ఠంగా మరణశిక్ష పడుతుంది. బలప్రయోగంతో మహిళను వివస్త్రను చేస్తే గతంలో ఏడేళ్ల జైలు శిక్ష ఉండేది. 1983లో దాన్ని మరణశిక్షగా మార్చారు. ఈ తరహా నేరాల్లో శిక్షను తగ్గించాలని పాకిస్థాన్‌లో కొంతకాలంగా డిమాండ్లు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ‘క్రిమినల్ చట్ట సవరణ బిల్లు- 2025’ను తీసుకొచ్చారు. హైజాకర్లకు ఆశ్రయం కల్పించడం, మహిళలను బహిరంగంగా వివస్త్రను చేయడం వంటి నేరాల్లో దోషులుగా తేలినవారికి మరణశిక్షల బదులు యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా మార్పులు ప్రతిపాదించారు. త్వరలోనే ఇది చట్టరూపం దాల్చనుంది. విపక్షాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనా పరిగణనలోకి తీసుకోలేదు.

టీఆర్ఎఫ్ మీద ఉగ్ర ముద్రపై..

నిషేధిత లష్కరే తయ్యిబా (ఎల్‌ఈటీ) ముసుగు సంస్థ ‘ది రెసిస్టెన్స్ ఫ్రంట్’ (టీఆర్ఎఫ్)ను ఉగ్రవాద సంస్థగా అమెరికా గుర్తించడంపై పాకిస్థాన్ స్పందించింది. పహల్గాం దాడికి, లష్కరే తయ్యిబాకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. ఉగ్రసంస్థ నెట్‌వర్క్‌ను ఇప్పటికే తాము ధ్వంసం చేసినట్లు పేర్కొంది. “పహల్గాం దాడికి సంబంధించిన దర్యాప్తు నేటికీ పూర్తికాలేదు. పహల్గాం దాడిని లష్కరే తయ్యిబాతో ముడిపెట్టడం వాస్తవాలను తప్పుదారి పట్టించడమే. ఈ చర్యతో పాక్‌ను ప్రపంచం ముందు అవమానించడమే అవుతుంది. జమ్మూకశ్మీర్‌లో మానవ హక్కుల దురాగతాల నుంచి దృష్టి మళ్లించడంలో, పాక్ వ్యతిరేక ప్రచారంలో భారత్‌కు రికార్డు ఉంది” అని ఎదురుదాడి చేసింది.

ఒబామాపై విచారణ చేపట్టాలి: గబ్బార్డ్

ఇంటర్నెట్‌డెస్క్: రష్యా జోక్యంతోనే 2016 అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించారని ప్రచారం చేసిన మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాపై విచారణ నిర్వహించాలని నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ డిమాండ్ చేశారు. ఈ ప్రచారం వెనక పెద్ద కుట్ర ఉందని ఆరోపించారు. ఇందులో ఒబామాతో పాటు ఆయన కార్యాలయంలోని సీనియర్ అధికారులు, మాజీ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జేమ్స్ క్లాపర్, డైరెక్టర్ జాన్ బ్రెన్నాన్, డైరెక్టర్ జేమ్స్ కోమీ పాల్గొన్నట్లు ఆరోపించారు.

కాంగోలో కాల్పుల విరమణ ఒప్పందం

డకార్: తూర్పు కాంగోలో దశాబ్దాల నుంచి కాంగో ప్రభుత్వ సేనలకూ, రువాండా మద్దతు ఉన్న తిరుగుబాటుదారులకూ మధ్య సాగుతున్న యుద్ధానికి శనివారం తెరపడింది. రెండు పక్షాలూ శాశ్వతంగా కాల్పులు విరమించాలని, ఆగస్టు 18 నాటికి సమగ్ర శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలనీ ఖతార్‌లో అంగీకారం కుదిరింది. జూన్ 27న అమెరికా మధ్యవర్తిత్వంతో కాంగో-రువాండా మధ్య కుదిరిన శాంతి ఒప్పందానికి అనుబంధంగా ఇది ఉంటుంది. తిరుగుబాటుదారులు తూర్పు కాంగోలో రెండు ముఖ్యమైన పట్టణాలను కైవసం చేసుకున్నప్పటికీ శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.

బోల్సొనారోపై ఆంక్షలు.. బ్రెజిల్ జడ్జి వీసా రద్దు

ఇంటర్నెట్ డెస్క్: బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో కాలి చీలమండకు ఎలక్ట్రానిక్ పర్యవేక్షక పరికరాన్ని అమర్చి, ఆయన కదలికల్ని గమనించాలని ఆ దేశ సుప్రీంకోర్టు ఆదేశించడంపై అమెరికా దీటుగా స్పందించింది. ఆంక్షలు విధించిన బ్రెజిల్ న్యాయమూర్తి, ఆయనకు మద్దతుగా నిలిచిన న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులకు వీసాలు రద్దు చేసింది. అంతకుముందు ట్రంప్ స్పందిస్తూ.. తన మిత్రుడైన బోల్సొనారో పట్ల బ్రెజిల్ న్యాయవ్యవస్థ అన్యాయంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. బోల్సొనారోపై బ్రెజిల్ సుప్రీం ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఆరోపించారు. న్యాయస్థాన చర్యలు బ్రెజిల్ పౌరుల ప్రాథమిక హక్కుల్ని ఉల్లంఘించడమే కాకుండా అమెరికన్లను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నమేనని మండిపడ్డారు. 2022 ఎన్నికల్లో ఓటమిని అంగీకరించని బోల్సొనారో.. ఆ ఎన్నికలు రద్దు చేసి తిరుగుబాటుకు కుట్ర పన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో సుప్రీం ఫెడరల్ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాత్రి పూట ఇల్లు విడిచి వెళ్లకూడదని, విదేశీ రాయబారులతో మాట్లాడరాదని ఆదేశించింది.

ఇండిగో విమానం ల్యాండింగ్‌లో సమస్య.. ప్రయాణికులు హడల్

ఇంటర్నెట్‌డెస్క్: ఇండిగో విమానం ల్యాండింగ్ సమయంలో గందరగోళం నెలకొనడంతో ప్రయాణికులు హడలిపోయారు. శనివారం ఉదయం ముంబయి నుంచి బయలుదేరిన 6ఈ5349 విమానం.. నాగ్‌పుర్‌లోని బాబాసాహెబ్ అంబేడ్కర్ విమానాశ్రయంలో దిగే సమయంలో దారి స్పష్టంగా కనిపించకపోవడంతో దాదాపు 15 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టింది. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. రెండో ప్రయత్నంలో విమానం సురక్షితంగా ల్యాండైంది. విజిబిలిటీ తక్కువగా ఉన్నందునే ఇలా జరిగిందని అధికారులు తెలిపారు.

అక్రమ బెట్టింగ్ కేసులో మెటా, గూగుల్‌కు ఈడీ సమన్లు


దిల్లీ: అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లపై మనీ లాండరింగ్ దర్యాప్తులో భాగంగా టెక్ దిగ్గజాలు మెటా, గూగుల్ ప్రతినిధులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శనివారం సమన్లు జారీచేసింది. ఈనెల 21న ఏజెన్సీ ముందు హాజరవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొంది. తమకు సంబంధించిన సామాజిక మాధ్యమాల్లో అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఇస్తున్న వాణిజ్య ప్రకటనలపై వీరిని ఈడీ ప్రశ్నించే అవకాశం ఉంది.

యూపీలో భారీ ట్రక్కు పైకి దూసుకెళ్లిన మినీ వ్యాను

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సహా ఆరుగురి మృతి

మథుర: ప్రయాణికులున్న మినీ వ్యాను భారీ ట్రక్కు పైకి దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సహా ఆరుగురు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథురలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆగ్రాకు చెందిన ధరంవీర్(50) మథురలో స్వీట్లు తయారుచేసి విక్రయిస్తుంటాడు. కుటుంబంతో కలిసి ఆయన తన స్వగ్రామమైన హరల్‌పుర్‌కి వెళ్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగింది. ధరంవీర్, ఆయన ఇద్దరు కుమారులు, సహా మరో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ధరంవీర్ భార్య, కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భవిష్యత్తులో భూకంపాలను ఇలా తెలుసుకోవచ్చు..



ఈటీవీ భారత్: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో గత పది రోజుల వ్యవధిలో వరుస భూకంపాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భూకంప మూలాలను తెలుసుకోవడంపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టారు. దేశవ్యాప్తంగా గత వందల ఏళ్లలో వచ్చిన భారీ భూకంపాలపై ఐఐటీ కాన్పుర్ ఎర్త్‌సైన్స్ విభాగ ప్రొఫెసర్ జావెద్ మాలిక్ ‘ఈటీవీ భారత్’కు కీలక సమాచారాన్ని తెలిపారు. భూకంపాలకు శాస్త్రీయ ఆధారాలు లభించనిచోట గ్రంథాలు, శాసనాల నుంచి చారిత్రక ఆధారాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు. ఆ సమాచారంతో దేశంలోని యాక్టివ్ ఫాల్ట్‌లైన్ ప్రదేశాలను మ్యాపింగు చేస్తున్నట్లు చెప్పారు. పాత భూకంపాల సమాచారం భారత్ వద్ద అందుబాటులో లేదని, నేపాల్ లాంటి దేశంలో మాత్రం ఈ సమాచారంపై డాక్యుమెంట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అందుకే శతాబ్దాల క్రితం భారత్‌లో వచ్చిన భూకంపాల గురించి తెలుసుకునేందుకు అక్బర్ నామా, బాబర్ నామా, సంస్కృత గ్రంథాల వంటి వాటిని పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమాచారం వాస్తవమా?.. కాదా? అనేది నిర్ధరించుకునేందుకు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తామని జావెద్ మాలిక్ తెలిపారు.

దౌత్య విభేదాల తర్వాత.. తొలిసారి మాల్దీవులకు ప్రధాని మోదీ



ఇంటర్నెట్ డెస్క్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జులై 23 నుంచి 26 వరకు బ్రిటన్, మాల్దీవుల్లో పర్యటించనున్నారు. గతేడాది మోదీపై, భారత్‌లోని లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన అంతరం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ విభేదాల అనంతరం ప్రధాని మాల్దీవులకు వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. తొలుత భారత్ - బ్రిటన్ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందంపై జరిగే చర్చల్లో పాల్గొని ఒప్పందంపై ప్రధాని సంతకం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం జులై 25, 26 తేదీల్లో మాల్దీవులకు వెళతారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా మోదీ హాజరవుతారు.

కశ్మీర్ యువతను నాశనం చేసిన హింసావాదం: బిలాల్ ఘనీ

శ్రీనగర్: కశ్మీర్‌లో హురియత్ కాన్ఫరెన్స్ తన ఔచిత్యాన్ని కోల్పోయిందని వేర్పాటువాదాన్ని వీడి ఇటీవలే ప్రధాన రాజకీయ స్రవంతిలో కలిసిన బిలాల్ ఘనీ లోన్ అన్నారు. హింస వల్ల యువతకు ఎంతో నష్టం జరిగిందని, అది కశ్మీర్‌కు వినాశనాన్ని తెచ్చిందే తప్ప సాధించిందేమీ లేదని ఒక వార్తాసంస్థ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కశ్మీరీ ముస్లింలకు, పండిట్‌లకు మధ్య సయోధ్య చాలా ముఖ్యమన్నారు. ఇరు వర్గాల మధ్య విశ్వాసం సడలిందని, నమ్మకాన్ని పునరుద్ధరించే చర్యలు పునఃప్రారంభించాలని సూచించారు. ‘పొరుగున కశ్మీరీ పండిట్ నివసిస్తుంటే అతణ్ని పరిరక్షించాల్సిన బాధ్యత తనదేనని ప్రతి కశ్మీరీ ముస్లిం అర్థం చేసుకోవాలి. గతంలో ఎవరిపట్ల అయినా పొరపాట్లు జరిగివుంటే అలాంటి వారితో మాట్లాడి వారికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉంది’ అని ఆయన అన్నారు. కశ్మీర్‌ను పాకిస్థాన్ బలవంతంగా చేజిక్కించుకుంటుందన్నది హాస్యాస్పదమైన ఆలోచనగా చెప్పారు. కశ్మీర్‌లో వేర్పాటువాద ఉద్యమం విఫలమైందన్నారు.

రాష్ట్రపతికి కోర్టు గడువు విధించవచ్చా?

రేపు సుప్రీంకోర్టు విచారణ


దిల్లీ: రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా తేల్చాలని కోర్టులు నిర్దేశించవచ్చా అన్న అంశంపై ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ జరపనుంది. అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌లు ఈ ధర్మాసనంలో సభ్యులుగా ఉంటారని సుప్రీంకోర్టు వెబ్‌సైట్ పేర్కొంది. శాసనసభలు ఆమోదించిన బిల్లులపై రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్రపతి ఒక కాలావధిలోగా చర్యలు తీసుకోవాలని గత ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనిపై స్పందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తనకు రాజ్యాంగంలోని 143(1) అధికరణం ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకొని 14 కీలక ప్రశ్నలను అత్యున్నత న్యాయస్థానం ముందుంచారు. ప్రజా ప్రయోజనంతో ముడిపడివున్న చట్టపరమైన అంశాలపై రాష్ట్రపతి సుప్రీంకోర్టు అభిప్రాయం తెలుసుకునేందుకు ఆ కోర్టు ముందు తన ప్రశ్నను ఉంచవచ్చని, సుప్రీంకోర్టు దానిపై విచారణ జరిపి తన అభిప్రాయాన్ని రాష్ట్రపతికి తెలియజేయవచ్చని 143(1) అధికరణం చెబుతోంది.

వియత్నాంలో పడవ బోల్తా.. 34 మంది మృతి

హాలాంగ్‌బే: సందర్శకులతో నిండివున్న ఒక పడవ అకస్మాత్తుగా ముంచుకొచ్చిన గాలివానలో చిక్కి బోల్తా పడటంతో 34 మంది మరణించిన సంఘటన వియత్నాంలోని ప్రసిద్ధ పర్యాటక స్థలం హాలాంగ్‌బేలో శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది గల్లంతయ్యారని ప్రభుత్వ మీడియా తెలిపింది. ప్రమాదం జరిగిన సమయంలో 48 మంది పర్యాటకులు, ఐదుగురు సిబ్బంది పడవలో ఉన్నారు. సహాయ సిబ్బంది 11 మందిని సురక్షితంగా బయటకు తీయగలిగారు. అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో కూడుకున్న వర్షం ప్రారంభం కావడంతో ఈ ప్రమాదం జరిగిందని వీఎన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక వెల్లడించింది. మృతులందరూ హనోయ్ నగరానికి చెందినవారేనని పేర్కొంది.

ఇరాన్‌లో బస్సు బోల్తా.. 21 మంది మృతి

టెహ్రాన్: దక్షిణ ఇరాన్‌లోని ఫార్స్ ప్రావిన్స్ రాజధాని షిరాజ్‌లో శనివారం ఉదయం బస్సు బోల్తా పడి 21 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 34 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనకు గల కారణాలు తెలియలేదు. దర్యాప్తు తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.



గంగానదికి వరద పోటెత్తడంతో బిహార్ రాజధాని పట్నా సమీపంలో నీట మునిగిన ఓ నివాస ప్రాంతం



గంగానది ఉప్పొంగడంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో నీట మునిగిన మణికర్ణికా ఘాట్

మమత, హిమంతల మధ్య మాటల యుద్ధం


కోల్‌కతా: పశ్చిమ బెంగాల్, అస్సాం సీఎంలు మమతా బెనర్జీ, హిమంత బిశ్వ శర్మల మధ్య శనివారం మాటల యుద్ధం చెలరేగింది. భాజపా నేతృత్వంలోని అస్సాం ప్రభుత్వం బెంగాలీ మాట్లాడేవారిని భయభ్రాంతులకు గురిచేస్తోందని మమత ఆరోపించగా, ఆమె బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని హిమంత పేర్కొన్నారు. “దేశంలో, అస్సాంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో రెండో స్థానంలో ఉన్నది ‘బంగ్లా’. అన్ని భాషలూ మతాలను గౌరవిస్తూ శాంతియుత సహజీవనం చేయాలనుకునే పౌరులు వారి సొంత భాషను మాట్లాడుతున్నందుకు వేధింపులకు గురిచేయడం విపక్షాత్మకం, రాజ్యాంగ విరుద్ధం” అని మమత తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అస్సాంలో భాజపా విభజన ఎజెండా అన్ని హద్దులూ దాటిపోయింది. అస్సాం ప్రజలు దీనిపై తిరగబడతారు. తన భాష, గుర్తింపుల గౌరవంతో పాటు ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న ప్రతి ధీశాలి పౌరుని వెంట నేనున్నాను, అని ఆమె అన్నారు. “దీదీ, మేము మా సొంత ప్రజలపై పోరాటం సాగించడం లేదు. సరిహద్దులకు ఆవలి నుంచి ముస్లింల చొరబాటును మాత్రమే వ్యతిరేకిస్తున్నాం. ఈ చొరబాట్ల వల్ల అనేక జిల్లాల్లో హిందువులు తమ సొంత నేలపైనే మైనారిటీలుగా మారారు” అని హిమంత బదులిచ్చారు. తాము ప్రజల్ని భాష, మత ప్రాతిపదికన విభజించబోమని చెప్పుకొచ్చారు.



గాజాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ పాలస్తీనియన్లకు మద్దతుగా శనివారం దిల్లీలో ప్రదర్శన చేస్తున్న ప్రజలు

ఈనాడు సినిమా

రామోజీ ఫిల్మ్‌సిటీలో... మిరాయ్



తేజ సజ్జా

ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకొస్తున్న పాన్ ఇండియా చిత్రాల్లో 'మిరాయ్' ఒకటి. సంచలన విజయం సాధించిన 'హను - మాన్' తర్వాత తేజ సజ్జా కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. రితికా నాయక్ కథానాయిక. మంచు మనోజ్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్‌లో పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో భాగంగా ఛేజింగ్ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. భారీహంగులతో రూపుదిద్దుకుంటున్న చిత్రమిది. కథానాయకుడు తేజ సజ్జా సూపర్ యోధగా శక్తిమంతమైన పాత్రని పోషిస్తున్నారు. ఆయుధం మధ్యా సాగే ఈ కథని, ఒక విజువల్ వండర్‌గా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. సెప్టెంబరులో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. వచ్చే వారంలోనే పాటని విడుదల చేయడానికి రంగం సిద్ధమైంది. శ్రియ, జయరామ్, జగపతిబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి గౌర హరి సంగీతం అందిస్తున్నారు.

కేరళలో... కలర్‌ఫుల్ పాటతో!



చిరంజీవి

పరుగులు పెడుతోంది చిరంజీవి - అనిల్ రావిపూడి కలయికలోని సినిమా. పక్కా ప్రణాళికతో అనుకున్నట్టుగానే చిత్రీకరణ కొనసాగుతోంది. ప్రస్తుతం కేరళలో ఓ పాటని, కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. నాయకానాయికలు చిరంజీవి, నయనతారపై చిత్రీకరిస్తున్న ఈ పాట కలర్‌ఫుల్‌గా, మంచి మెలోడీతో సాగుతుందని సినీ వర్గాలు తెలిపాయి. పెళ్లి సందడితో సాగే ఈ పాట ఓ సంబరాన్ని కళ్లకు కట్టనుంది. "చిరంజీవిని స్టైలిష్‌గా ఆవిష్కరించనున్న చిత్రమిది. అనిల్ రావిపూడి మార్క్ వినోదంతో, ఒకప్పుడు చిరంజీవి తన సినిమాలతో చేసిన సందడిని గుర్తు చేస్తుంద"ని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆయితే కేరళలో చిత్రీకరణ జరుగుతున్న ప్రదేశం నుంచి లీక్ అయిన కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై నిర్మాణ సంస్థ స్పందించింది. ఈ సినిమాకి సంబంధించిన అనధికారిక వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఓ ప్రకటనలో హెచ్చరించింది. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు.

హృదయాల్ని హత్తుకునే లిటిల్ హార్ట్స్



శివాని, మౌళి

ఎన్నో అద్భుతమైన కథలను అందిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తోంది ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్. ఇప్పుడీ సంస్థ నిర్మాణంలో రాబోతున్న మరో చిత్రమే 'లిటిల్ హార్ట్స్'. మౌళి, శివానీ నాగారం ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సాయి మార్తాండ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రాబోతున్నట్టు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా పోస్టర్‌ను విడుదల చేసింది ఈటీవీ విన్. "మీ హృదయాల్ని హత్తుకోవడానికి 'లిటిల్ హార్ట్స్' సిద్ధంగా ఉంది" అనే వ్యాఖ్యని జోడించింది. యువతను ఆకట్టుకునే అంశాలతో రూపొందుతున్న ఈ సినిమాకు '#90s' ఫేమ్ ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

మా నాన్న బంగారం

ETV WIN



'సగుమోము కనలేని'

ఉద్యోగం, చదువులు అంటూ కుటుంబానికి దూరంగా నగరంలో బతుకుతున్న యువతీయువకులు ఎందరో. ఇప్పుడిలాగే కష్టపడి చదివి ఐటీ రంగంలో మంచి ఉద్యోగం సంపాదిస్తుంది ఓ అమ్మాయి. తండ్రి గారాల పట్టిగా పెరిగిన ఆమె ఉద్యోగం కోసం సిటీకి వస్తుంది. అక్కడ ఆఫీస్ పనులతో ఎంత తీరిక లేకుండా గడుపుతున్నా ఆమెకు.. నాన్నతో ఫోన్ మాట్లాడనిదే తెల్లారదు. అలా ఓ రోజు తండ్రి నుంచి ఫోన్ కాల్ వచ్చాకా ఆమె జీవితం కొత్త మలుపు తిరుగుతోంది. ఆ తర్వాత ఏమైందో తెలియాలంటే 'సగుమోము కనలేని' చిత్రం చూడాల్సిందే. ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్ 'కథా సుధ'లో భాగంగా నేటి నుంచి ఈ సినిమా అలరిస్తోంది. దీనికి అనురాధ దర్శకత్వం వహించారు. తనికెళ్ల భరణి, శరణ్య శర్మ, ఇందుమతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. 'మా నాన్న బంగారం' అంటూ ఇటీవలే విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది.

"మనం చేసే సినిమాతో కేవలం వినోదమే కాకుండా సమాజానికి ఏదో ఒక బలమైన విషయాన్ని చెప్పాలనే ఆశయం ఉన్న నిర్మాతని నేను'' అన్నారు ప్రముఖ నిర్మాత ఎ.ఎం.రత్నం. 'కర్తవ్యం' మొదలుకొని 'భారతీయుడు', 'ఖుషి', 'బాయ్స్', 'రన్'... ఇలా గుర్తుండిపోయే సినిమాలెన్నో చేసిన నిర్మాత ఆయన. ఇటీవల మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావుతో కలిసి పవన్‌కల్యాణ్ హీరోగా 'హరి హర వీరమల్లు' సినిమాని నిర్మించారు. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత ఎ.ఎం.రత్నం శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

అనుభవంతో చెబుతున్నా... 'హరి హర వీరమల్లు' విజయం ఖాయం!



ఎ.ఎం.రత్నం

"పవన్‌కల్యాణ్‌తో ఇది నాకు మూడో సినిమా. 'ఖుషి', 'బంగారం' తర్వాత 'సత్యాగ్రహి' సినిమాని ఆరంభించాం కానీ అది కార్యరూపం దాల్చలేదు. పవన్‌కల్యాణ్‌తో ఈసారి ఓ గొప్ప పీరియాడికల్ సినిమా చేయాలనే తపనతో 'హరి హర వీరమల్లు' ప్రారంభించా. సొమ్ము చేసుకోవడమే నా లక్ష్యమై ఉంటే, ఏదో ఒక కమర్షియల్ సినిమా చేసేవాణ్ని. కానీ నిర్మాతగా నాకున్న అభిరుచి, తపనతోనే ఈ కథని చెప్పాలనుకున్నా. 'భారతీయుడు' సహా ఎన్నో భారీ సినిమాల్ని నిర్మించాను కానీ, నా జీవితంలో సుదీర్ఘమైన ప్రయాణం చేసింది ఈ సినిమాకే. పవన్‌కల్యాణ్ ఏకధాటిగా డేట్స్ ఇచ్చినా వెంటనే పూర్తి చేయగలిగే చిత్రం కాదు ఇది. సెట్స్, గ్రాఫిక్స్‌తో ముడిపడిన చారిత్రక కథ ఇది. అందుకే ఇంత ఆలస్యమైంది. సినిమా ఎలా ఉంటుందోననే సందేహాలు చాలామందిలో ఉండేవి కానీ, ట్రైలర్‌తో అందరి అనుమానాలు పటాపంచలయ్యాయి. 90 శాతానికిపైగా విజయాల్ని అందుకున్న నిర్మాతగా అనుభవంతో చెబుతున్నా, 'హరి హర వీరమల్లు' ఘన విజయం సాధిస్తుంది''.

❑ "పవన్‌కల్యాణ్ ఎప్పుడూ సమాజం గురించి ఆలోచిస్తుంటారు. నేనూ అలా సినిమాతో ఏదో ఒకటి సమాజానికి ఇవ్వాలనే ఆలోచనతోనే ఉంటాను. ఓ గొప్ప చారిత్రాత్మక కథలో బలమైన సందేశం కూడా ఉంటే బాగుంటుందని నమ్మాం. ఆ చర్చల క్రమంలోనే ఇది రెండు భాగాల కథ అయ్యింది. ఇది 17వ శతాబ్దం నేపథ్యంలో సాగే ఓ కల్పిత కథ. బయట ప్రచారం జరుగుతున్నట్టుగా వేరెవ్వరి కథ కాదు. హరి హర రాయలు, బుక్కరాయలు కథ కూడా అని మొదట ప్రచారం సాగింది. అవేవీ వాస్తవాలు కాదు. విష్ణువు, శివుడితోపాటు, వీరమల్లు అనే వీరుడిని సూచించే పేరుతో రూపొందిన చిత్రమిది''.

❑ "పవన్‌కల్యాణ్ సహకారం లేకుండా ఇంత భారీ చిత్రాన్ని రూపొందించడం సాధ్యం కాదు. ఎన్నికలయ్యాక ఆయన మొదట చేసింది ఈ సినిమానే. జ్యోతికృష్ణ మా అబ్బాయి అని చెప్పడం లేదు కానీ, తను చరిత్రతో ముడిపెడుతూనే, ఈ తరానికీ చేరువయ్యేలా 'ఇండియానా జోన్స్' తరహాలో గొప్పగా సినిమాని మలిచాడు. ఉన్నతమైన సాంకేతిక విలువలతో ఈ సినిమాని తీశాడు. పవన్‌కల్యాణ్ అభిమానుల కోరిక మేరకు ఈ నెల 23 రాత్రి నుంచే ప్రదర్శనల్ని ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం. ప్రభుత్వాల నుంచి అనుమతి కూడా కోరాం. హిందీతోపాటు, ఇతర భాషల్లోనూ ప్రచార కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నాం''.

పవన్‌కల్యాణ్‌కి జోడీగా రాశీఖన్నా

పుష్కరకాలంగా కెరీర్‌ని కొనసాగిస్తున్న కథానాయిక రాశీ ఖన్నా. ఇప్పటివరకూ ఆమెకు అగ్ర కథానాయకుడు పవన్ కల్యాణ్‌తో కలిసి నటించే అవకాశం దక్కలేదు. 'ఉస్తాద్ భగత్‌సింగ్'తో ఆ అవకాశాన్ని సొంతం చేసుకొంది. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఇందులో శ్రీలీల ఓ కథానాయికగా నటిస్తోంది. ఇద్దరు కథానాయికలకి చోటున్న ఈ కథలో మరో పాత్ర కోసం రాశీ ఖన్నాని ఎంపిక చేసుకున్నారు. ఇప్పటికే ఆమె సెట్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ సాగుతోంది. పవన్‌కల్యాణ్‌తోపాటు, ఇతర తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. విజయవంతమైన 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్ - హరీశ్‌శంకర్ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



రాశీ ఖన్నా

'కిల్లర్' లుక్



ఎస్.జె.సూర్య, ప్రీతి అస్రాని

దర్శకుడిగా పరిచయమైన ఎస్.జె.సూర్య ఆ తర్వాత నటుడిగా బిజీ అయిపోయారు. కథానాయకుడిగా, సహ నటుడిగా, ప్రతినాయకుడిగా తెలుగు, తమిళ భాషల్లో చాలా సినిమాలు చేశారు. పదేళ్ల విరామం తర్వాత ఆయన మళ్లీ మెగాఫోన్ పట్టారు. 'కిల్లర్' పేరుతో ఓ సినిమాని తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆయనే హీరో. ప్రీతి అస్రాని కథానాయిక. శ్రీ గోకులం మూవీస్, ఏంజెల్ స్టూడియోస్ పతాకాలపై వి.సి.ప్రవీణ్, బైజు గోపాలన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని శనివారం విడుదల చేశారు. అందులో సూర్య స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ స్వరాలు సమకూరుస్తున్నారు.

వినోదాల 'హృదయపూర్వం'



మాళవిక, సంగీత్, మోహన్‌లాల్

మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'హృదయపూర్వం'. ఈ సినిమాని సత్యన్ అంతికాడ్ తెరకెక్కిస్తున్నారు. ఆంటోని పెరుంబవూర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవిక మోహనన్, సంగీత్ ప్రతాప్, సంగీత, సిద్దిఖీ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 28న రానున్న నేపథ్యంలో చిత్ర బృందం టీజర్‌ని విడుదల చేసింది. ఈ టీజర్‌లోని ప్రారంభ సంభాషణలు..''ఎక్కడి నుంచి మీరు?, కేరళ. ఓ మంచిది నాకు మలయాళ చిత్ర పరిశ్రమంటే చాలా ఇష్టం. ఫఫా అంటే ఇష్టం. ఫఫా? ఫహాద్ ఫాజిల్'' అంటూ ఆయన సినిమాలను పొగుడుతుంటాడు ఓ వ్యక్తి. వెంటనే మోహన్‌లాల్.. కానీ మాకు మంచి సీనియర్ నటులు కూడా ఉన్నారని అనగానే అతను "లేదు లేదు ఓన్లీ ఫఫా''అనడంతో మోహన్‌లాల్ వెంటనే ఓకే అంటూ వెళ్లిపోతున్న సన్నివేశాలతో సాగుతున్న ఈ టీజర్ నవ్వులు పూయిస్తోంది.

కుటుంబానికి ఏదైనా జరిగితే.. వేట తప్పదు

"నా కుటుంబానికి ఏదైనా ప్రమాదం జరిగితే.. వేటాడటం తప్పద''ని అంటున్నారు విలక్షణ నటుడు సునీల్ శెట్టి. మరి ఆయన మాటల వెనుక అర్థమేంటో తెలుసుకోవాలంటే 'హంటర్ సీజన్ 2' చూడాల్సిందే. జాకీష్రాఫ్, సునీల్ శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన సిరీస్ ఇది. ప్రిన్స్ ధీమాన్, అలోక్ బాత్రా దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేశారు. ఇందులో సునీల్ ప్రత్యర్థుల నుంచి తన కుమార్తెను రక్షించడానికి చేస్తున్న ప్రయత్నాలను చూపిస్తున్న ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగుతోంది. ఈ ట్రైలర్‌లో ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు జాకీ ష్రాఫ్. ఈ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌ను విక్రమ్ మెహ్రా, సిద్ధార్థ్ ఆనంద్ నిర్మించారు. ఈ నెల 24న విడుదల కానుందీ సిరీస్.



సునీల్ శెట్టి, జాకీష్రాఫ్

ప్రథమార్ధంలో వసూళ్లు రూ.5,723 కోట్లు


● ఓర్మాక్స్ మీడియా నివేదిక



'ఛావా'

ఈ ఏడాది ప్రారంభమై చూస్తుండగానే అప్పుడే ఆర్నెళ్లు గడిచిపోయాయి. ఎన్నో వైవిధ్యమైన చిత్రాలు బాక్సాఫీసు వద్ద అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి. ఇందులో భాగంగానే ఈ ప్రథమార్ధంలో మన ఇండియన్ బాక్సాఫీసుకు రూ.5,723 కోట్లు వసూళ్లు దక్కాయి. ఈ విషయాన్ని తెలుపుతూ శనివారం ఓర్మాక్స్ మీడియా 'ఇండియా బాక్సాఫీస్ రిపోర్ట్: జనవరి-జూన్ 2025' పేరుతో ఓ నివేదికను విడుదల చేసింది. ''జనవరి-జూన్ నెలల్లో విడుదలైన సినిమాల బాక్సాఫీసు రాబడి రూ.5,723 కోట్లుగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం బాక్సాఫీసు దగ్గర వసూళ్లు 14శాతం పెరిగాయి. ఇందులో భాగంగా 17 సినిమాలు రూ.100కోట్ల మార్కును దాటాయి'' అని పేర్కొంది. ఈ నివేదికను ఆధారంగా చేసుకొని వసూళ్ల పరంగా ఏడాది ప్రథమార్ధంలో రూ.693 కోట్ల భారీ వసూళ్లతో అగ్రస్థానంలో నిలిచింది హిందీ చిత్రం 'ఛావా'. దీని తర్వాత వెంకటేశ్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఉంది. ఇదే పంథా కొనసాగితే ఈ ఏడాది బాక్సాఫీసు రూ.13,500 కోట్లతో రికార్డు స్థాయి వసూళ్లతో ముగియవచ్చని.. ఇది ఇండియన్ థియేటర్ మార్కెట్‌కు అత్యధిక వసూళ్లు సాధించిన సంవత్సరంగా మారుతుందని నివేదిక పేర్కొంది.

గల్లీలో 'రాజుగాని సవాల్'



రవీందర్, బాపిరాజు, డింపుల్ హయాతి

"మా జీవితాల్లో జరిగిన కొన్ని సంఘటనల్ని ఆధారంగా చేసుకునే ఈ సినిమాని తెరకెక్కించాం'' అన్నారు లెలిజాల రవీందర్. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'రాజుగాని సవాల్'. రితికా చక్రవర్తి కథానాయిక. నిర్మాత, పంపిణీదారుడు బాపిరాజు ఆగస్టు 8న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల వేడుకని నిర్వహించారు. కథానాయికలు డింపుల్ హయాతి, రాశీ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లెలిజాల రవీందర్ మాట్లాడుతూ ''మధ్య తరగతి జీవితాల్లో ఎన్నో సవాళ్లు ఉంటాయి. గల్లీలో అందరితో కలిసి సరదా సరదాగా గడిపే రాజుకి ఓ పెద్ద సమస్య ఎదురైనప్పుడు దాన్ని ఎలా ఎదుర్కొన్నాడు? ఎవరికి సవాల్ విసిరాడనే విషయాలు ఇందులో కీలకం. స్నేహంతోపాటు కుటుంబ అనుబంధాల్ని అత్యంత సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు భరత్‌భూషణ్, కె.ఎల్.దామోదర్‌ప్రసాద్, గోరటి వెంకన్న, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, టి.ప్రసన్నకుమార్, డా.భద్రం, సంధ్య రాథోడ్, రవీందర్ బొమ్మకంటి తదితరులు పాల్గొన్నారు.

నవ్వులు.. అల్లర్లు ఇంకాస్త ఆలస్యం

బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్, మృణాల్ ఠాకూర్ జంటగా 'సన్ ఆఫ్ సర్దార్ 2' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి విజయ్ కుమార్ అరోరా దర్శకత్వం వహించారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ట్రైలర్, టీజర్‌లు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తాయి. ఈ నెల 25న ఈ చిత్రం రానున్నట్లు ఇప్పటికే వెల్లడించాయి సినీ వర్గాలు. ఇప్పుడు దీని కోసం అభిమానులు మరిన్ని రోజులు వేచి చూడాల్సిందే. తాజాగా కొన్ని కారణాల వల్ల ఈ చిత్రాన్ని ఆగస్టు 1న విడుదల చేయనున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది చిత్రబృందం. "నవ్వులు.. అల్లర్లకు ఇంకాస్త ఆలస్యం కానుంద''నే వ్యాఖ్యను జోడించింది. సంజయ్ మిశ్రా, ముకుల్ దేవ్, రవి కిషన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.



మృణాల్ ఠాకూర్

ఈనాడు బిజినెస్ వారాంతం

యెస్ బ్యాంక్ లాభంలో 59% వృద్ధి



దిల్లీ: 2025-26 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో యెస్ బ్యాంక్ నికర లాభం 59% పెరిగి రూ.801 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 5.7% పెరిగి రూ.2,371 కోట్లుగా నమోదైంది. రుణాల మంజూరు 5% పెరగడం, నికర వడ్డీ మార్జిన్ 0.10% పెరిగి 2.5 శాతానికి చేరడం ఇందుకు దోహదం చేసింది. ఇతర ఆదాయం 46 శాతం పెరిగి రూ.1,752 కోట్లకు చేరింది. పెట్టుబడులపై లాభాలు రూ.484 కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో పెట్టుబడులపై రూ.32 కోట్ల నష్టం రావడం గమనార్హం. చిన్న మొత్తాల (రిటెయిల్) రుణాల వృద్ధిపై అప్రమత్త వైఖరిని కొనసాగిస్తున్నట్లు యెస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది మిగిలిన కాలంలో రుణాల వృద్ధి వేగవంతం కావొచ్చనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. స్థూల మొండి బకాయిలు రూ.1,223 కోట్ల నుంచి రూ.1,458 కోట్లకు పెరిగాయి. యెస్ బ్యాంక్‌లో 20% వాటాను జపాన్‌కు చెందిన సుమిటోమో మిత్సుయి కార్పొరేషన్ బ్యాంక్(ఎస్ఎంబీసీ) కొనుగోలు చేసే ప్రక్రియ సెప్టెంబరు చివరికల్లా పూర్తి అయ్యే అవకాశం ఉందని కుమార్ తెలిపారు. యెస్ బ్యాంక్ కనీస మూలధన నిష్పత్తి 16.2 శాతంగా ఉంది.

స్నాప్‌డీల్ మాతృ సంస్థ ఏస్‌వెక్టార్ ఐపీఓ!

దిల్లీ: ఇ-కామర్స్ కంపెనీ స్నాప్‌డీల్ మాతృ సంస్థ ఏస్‌వెక్టార్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చేందుకు కాన్ఫిడెన్షియల్ మార్గంలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. స్నాప్‌డీల్‌తో పాటు సాస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్) సంస్థ యునికామర్స్, వినియోగదారు బ్రాండ్ నిర్మాణ సంస్థ స్టెల్లార్ బ్రాండ్స్‌లను కూడా ఏస్‌వెక్టార్ నిర్వహిస్తోంది. ఇందులో యూనికామర్స్ 2024లో నమోదైన సంగతి విదితమే. ఈ ఐపీఓకు అప్పట్లో 168.32 రెట్ల భారీ స్పందన లభించింది. ఏస్‌వెక్టార్‌ను కునాల్, రోహిత్ స్థాపించారు.



లలితా జువెలరీలో బంగారు నగలపై తక్కువ తరుగు!

హైదరాబాద్: బంగారం ధర పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో లలితా జువెలరీ సంస్థ బంగారు నగలపై తరుగును భారీగా తగ్గించింది. బంగారు చెయిన్లపై 1%, గాజులపై 3%, ఉంగరాలపై 5.5%, నెక్లెస్‌లపై 6% తరుగు ఉంటుందని సంస్థ తెలిపింది. ఇది హోల్‌సేల్ ధరకన్నా తక్కువ కావడం విశేషమని పేర్కొంది. అన్ని నగలు హెచ్‌యూఐడీ ముద్రతో లభిస్తాయని వెల్లడించింది. రాళ్లు పొదిగిన నగలు అయితే రాళ్ల బరువు, బంగారం బరువును విడివిడిగా లెక్కగట్టి చివరి ధరను వేస్తున్నట్లు వివరించింది. దీంతో బంగారం ధరను రాళ్లకు కూడా చెల్లించే భారం తగ్గుతుందని పేర్కొంది. అలాగే బంగారు నగలతో పాటు వజ్రాభరణాలను కూడా టోకు ధరలకే విక్రయిస్తున్నామని తెలిపింది. వజ్రాభరణాలకు మజూరీ లేదని, కేవలం తరుగు మాత్రమే తీసుకుంటామని వెల్లడించింది. ఇది కూడా మార్కెట్‌లో అందరి కంటే తక్కువగా వసూలు చేస్తున్నామని పేర్కొంది. పాత నగలు ఇచ్చి నగలు కొనుగోలు పథకంలో చేరొచ్చని, పాత నగల బరువుకు కొత్త నగను తరుగు లేకుండా కొనుగోలు చేసుకోవచ్చని వెల్లడించింది.

కోడి గుడ్లు

20న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	520
గోదావరి	503
విశాఖపట్నం	540
చిత్తూరు	563

షుగర్, గ్యాస్ ట్యాబ్లెట్లు తెగ వాడుతున్నారు

- వ్యాధుల తీవ్రత, మందుల వినియోగంలో అనూహ్య మార్పులు
- అధిక అమ్మకాలు సాధిస్తున్న 'గ్లైకోమెట్', 'ప్యాన్' బ్రాండ్లు

ఈనాడు - హైదరాబాద్

'డోలో 650', 'ఆగ్‌మెంటిన్'.. ఇటీవల వరకు మనదేశంలో అత్యధిక అమ్మకాలు నమోదు చేసిన ఔషధ బ్రాండ్లు. 'డోలో 650'.. జ్వరానికి వాడే పారాసెట్మాల్ మందు కాగా, 'ఆగ్‌మెంటిన్' యాంటీ బయోటిక్ ఔషధం. ఇది అమాక్సిలిన్, క్లవులానిక్ యాసిడ్ కలిసిన మిశ్రమ ఔషధం. వైరల్ జ్వరం, ఇతరత్రా చిన్నపాటి ఆరోగ్య సమస్యలతో డాక్టర్‌ను సంప్రదించిన వారికి.. ఈ మందులను రాసి, '3 రోజులు వాడాక మళ్లీ రండి, చూద్దాం' అని సలహా ఇవ్వడం ఎక్కువ మందికి అనుభవమే. ఇప్పుడు వీటికి మించి మధుమేహం (షుగర్), గ్యాస్ నివారణ మందుల విక్రయాలు పెరుగుతున్నాయి.



కారణాలు ఇవీ..

పట్టణీకరణ, పెరిగిన పోటీ, విపరీతమైన పని ఒత్తిడి, ఆహార అలవాట్లలో మార్పుల వల్ల ప్రజల్లో ఎక్కువ మంది జీర్ణకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. పొట్ట ఉబ్బరం, అల్సర్లు, గ్యాస్ సమస్యలు ఎక్కువవుతున్నాయి. షుగర్ వ్యాధి పీడితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రపంచంలోనే షుగర్ వ్యాధికి మనదేశం కేంద్రస్థానంగా మారుతోందని ఇప్పటికే ఎన్నో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అందుకే మందుల వినియోగంలో మార్పులు కనిపిస్తున్నాయి.

రూ.కోట్లలో విక్రయాలు

తాజాగా దేశీయ మార్కెట్లో అత్యధిక అమ్మకాలు నమోదు చేస్తున్న మందుల్లో షుగర్, గ్యాస్ సమస్యలను అదుపుచేసే మందుల బ్రాండ్లు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది మే నెలలో అమ్మకాలు పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. మే నెలలో యూఎస్‌వీ లిమిటెడ్‌కు చెందిన 'గ్లైకోమెట్', అల్కెమ్ ల్యాబ్స్‌కు చెందిన 'ప్యాన్' బ్రాండ్లు అత్యధిక అమ్మకాలు సాధించాయి. గ్లైకోమెట్, షుగర్ వ్యాధిని అదుపు చేయడానికి వినియోగించే మెట్‌ఫార్మిన్ మందు. గ్యాస్ సమస్యను అదుపు చేసేందుకు వినియోగించే పెంటప్రజోల్ మందును, 'ప్యాన్' అనే బ్రాండుతో ఆల్కెమ్ ల్యాబ్స్ విక్రయిస్తోంది. గత నెలలో 'గ్లైకోమెట్' రూ.74 కోట్ల అమ్మకాలను నమోదు చేసింది. 'ప్యాన్' అమ్మకాలు రూ.70 కోట్లకు చేరుకున్నాయి. తద్వారా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన మందుల బ్రాండ్లుగా ఈ రెండూ గుర్తింపు తెచ్చుకున్నాయి. 'ఆగ్‌మెంటిన్' బ్రాండ్ అమ్మకాలు తక్కువగా నమోదవుతున్నాయి. గత నెలలో రూ.52 కోట్ల అమ్మకాలను ఈ మందు నమోదు చేసింది. అంతకు ముందు నెలలో రూ.66 కోట్ల అమ్మకాలను సాధించింది. వ్యాధుల తీవ్రతలో వస్తున్న మార్పులను ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

భవిష్యత్‌లో ఈ మందులకు గిరాకీ పెరిగే అవకాశం



సమీప భవిష్యత్తులో జలుబు-దగ్గు, మలేరియా, నొప్పి నివారణ మందులు, విటమిన్ల అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని ఆ వర్గాలు వివరిస్తున్నాయి. మందుల వాడకంలో మార్పులు ఒకెత్తు అయితే, మొత్తం మీద మందుల అమ్మకాలు క్రమం తప్పకుండా పెరుగుతున్నాయి. అధిక జనాభా, వ్యాధుల తీవ్రత పెరగడం, వైద్య సదుపాయాలు విస్తృతంగా అందుబాటులోకి రావడం దీనికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

12 నెలల్లో రూ.2.29 లక్షల కోట్లు

గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది మే నెల మధ్య కాలంలో దేశీయ ఫార్మా పరిశ్రమ దాదాపు రూ.2.29 లక్షల కోట్ల విలువైన మందుల అమ్మకాలు సాధించింది. అంతకు ముందు ఇదే కాలంతో పోలిస్తే ప్రస్తుత అమ్మకాల్లో 7.2 శాతం అధికం కావడం గమనార్హం. ఈ ఏడాది మే నెలలోనే రూ.19,720 కోట్ల మందుల అమ్మకాలు నమోదయ్యాయి. కార్డియాక్, గ్యాస్ట్రోఇంటెస్టినల్, యాంటీ-ఇన్ఫెక్టివ్స్ విభాగాలకు చెందిన మందుల అమ్మకాలు పెరుగుతున్నాయి. సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, టొరెంట్ ఫార్మా, ఇప్కా లేబొరేటరీస్, ఆల్కెమ్ ల్యాబ్స్, జీఎస్‌కే... తదితర కంపెనీలు అధిక అమ్మకాలు సాధిస్తున్నాయి. గత ఏడాది కాలంలో 'ఆగ్‌మెంటిన్' బ్రాండ్ అమ్మకాలు రూ.819 కోట్లు కాగా, 'గ్లైకోమెట్' రూ.810 కోట్ల అమ్మకాలు సాధించింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1:1 బోనస్ షేర్లు

- రికార్డు తేదీ వచ్చే నెల 27
- రూ.5 ప్రత్యేక డివిడెండు



ముంబయి: ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏకీకృత ప్రాతిపదికన రూ.16,258 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో నమోదైన రూ.16,475 కోట్లతో పోలిస్తే లాభం 1.31 శాతం తగ్గింది. అయితే స్టాండలోన్ పద్ధతిలో నికర లాభం రూ.16,174 కోట్ల నుంచి రూ.18,155 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ.83,701 కోట్ల నుంచి పెరిగి రూ.99,200 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.63,467 కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలోని రూ.59,817 కోట్లతో పోలిస్తే పెరిగాయి. కీలకమైన నికర వడ్డీ ఆదాయం 5 శాతమే పెరిగి రూ.31,400 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 3.46 శాతం నుంచి స్వల్పంగా తగ్గి 3.35 శాతానికి పరిమితమైంది. మరోవైపు స్థూల రుణాల్లో 6.7 శాతం వృద్ధి ఉంది.

✦ ఇక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తొలిసారిగా బోనస్ షేర్లను ప్రకటించింది. 1:1 నిష్పత్తిలో వాటాదార్లకు బోనస్ షేర్లను ఇచ్చేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. వచ్చే నెల 27ను రికార్డు తేదీగా నిర్ణయించింది. సెప్టెంబరు 18, ఆలోపు బోనస్ షేర్లను మదుపర్ల ఖాతాలో జమ చేస్తారు.

కేటాయింపులు పెరిగాయ్: జూన్ 30 నాటికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏలు) నిష్పత్తి 1.33 శాతం నుంచి 1.4 శాతానికి పెరిగింది. మొత్తం కేటాయింపులు రూ.2,602 కోట్ల నుంచి రూ.14,442 కోట్లకు పెరిగాయి. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ తొలి పబ్లిక్ ఆఫర్ ద్వారా సమీకరించిన రూ.9,000 కోట్లకు సమానమైన నిధులను 'ఫ్లోటింగ్ ప్రొవిజన్స్' కింద కేటాయించడంతో మొత్తం కేటాయింపులు బాగా పెరిగినట్లు కనిపిస్తున్నాయి. అయితే ఏవైనా రుణాలు మొండి బకాయిలుగా మారొచ్చేమోననే అంచనాతో ముందు జాగ్రత్తగా ఈ కేటాయింపులు జరపలేదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ముఖ్య ఆర్థిక అధికారి శ్రీనివాసన్ వైద్యనాథన్ తెలిపారు. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కొత్త మొండి బకాయిలు రూ.9,000 కోట్లకు పెరిగాయి. అంతకుముందు త్రైమాసికంలో ఇవి రూ.7,500 కోట్లుగా ఉన్నాయి. ఒకవేళ వ్యవసాయ విభాగాన్ని మినహాయిస్తే కొత్త మొండి బకాయిలు రూ.6,200 కోట్ల నుంచి రూ.6,800 కోట్లకు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్ మార్కెట్ వాటాను కూడా పెంచుకోవాలని అనుకుంటున్నామని వైద్యనాథన్ చెప్పారు. జూన్ 30 నాటికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కనీస మూలధన నిష్పత్తి 19.9 శాతంగా ఉంది.

✦ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.5 ప్రత్యేక మధ్యంతర డివిడెండును కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం రూ.13,558 కోట్లు



ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జూన్ త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ రూ.13,558 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.11,696 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 15.9 శాతం అధికం.

✦ స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం రూ.11,059 కోట్ల నుంచి 15.5 శాతం పెరిగి రూ.12,768 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 10.6 శాతం పెరిగి రూ.21,635 కోట్లకు చేరింది. ట్రెజరీ కార్యకలాపాల ఆదాయంతో కలిపి ఇతర ఆదాయం 13.7 శాతం పెరిగి రూ.7,264 కోట్లకు చేరింది.

✦ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.41 శాతం నుంచి స్వల్పంగా తగ్గి 4.34 శాతానికి పరిమితమైంది.

✦ మొత్తం కేటాయింపులు (పన్నులు కాకుండా) రూ.1,332 కోట్ల నుంచి రూ.1,815 కోట్లకు చేరాయి. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి జూన్ 30 నాటికి 2.15 శాతం నుంచి 1.67 శాతానికి మెరుగైంది.

✦ డిపాజిట్ల వృద్ధి 12.8 శాతంగా నమోదైంది. దేశీయ రుణాల వృద్ధి 12 శాతానికి చేరింది. కొత్తగా 83 శాఖలను తెరవడంతో జూన్ 30 నాటికి మొత్తం బ్యాంకు శాఖల సంఖ్య 7,066కు చేరింది.

✦ మూలధన లభ్యత నిష్పత్తి 16.97 శాతంగా నమోదైంది. ప్రస్తుతానికి మూలధన సమీకరణ ప్రణాళికలు ఏమీ లేవని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా వెల్లడించారు.

యూనియన్ బ్యాంక్ లాభంలో 12% వృద్ధి



దిల్లీ: 2025-26 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో యూనియన్ బ్యాంక్ నికర లాభం 12% పెరిగి రూ.4,116 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికర లాభం రూ.3,679 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.30,874 కోట్ల నుంచి రూ.31,791 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.9,412 కోట్ల నుంచి రూ.9,113 కోట్లకు పరిమితమైంది. స్థూల నిరర్థక ఆస్తులు 4.54% నుంచి 3.52 శాతానికి; నికర నిరర్థక ఆస్తులు 0.9% నుంచి 0.62 శాతానికి తగ్గాయి. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.1,651 కోట్ల నుంచి తగ్గి రూ.1,153 కోట్లకు పరిమితమయ్యాయి. 2025 జూన్ చివరినాటికి బ్యాంకు స్థూల రుణాలు రూ.9,12,214 కోట్ల నుంచి 6.83 శాతం పెరిగి రూ.9,74,489 కోట్లకు చేరాయి.

'మోసపూరిత' రిఫండ్ సందేశాలొస్తున్నాయ్

అప్రమత్తంగా ఉండాలంటున్న ఐటీ విభాగం



ఈనాడు, హైదరాబాద్: ఆదాయపు పన్ను(ఐటీ) రిటర్నులు దాఖలు చేసి, రిఫండ్ కోసం ఎదురు చూస్తున్నారా? బ్యాంకు ఖాతాను ధ్రువీకరించాలని మీ మెయిల్ లేదా ఫోన్‌కు సందేశం వచ్చిందా? అది మోసపూరితం కావచ్చు. ఇలాంటి సందేశాలపై పన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా ఉండాలని ఆదాయపు పన్ను విభాగం హెచ్చరిస్తోంది.

✦ పన్నుకు సంబంధించి ఏదైనా సందేశం వచ్చినప్పుడు అది పన్ను విభాగం నుంచే వచ్చిందా అనేది పరిశీలించాలి. ఇ-మెయిల్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చిన లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవకూడదు. ✦ రిఫండు కోసం బ్యాంకు వివరాలను తెలియజేస్తూ, ఒక ఫారాన్ని పూర్తి చేయాలని చెప్పే సందేశం వచ్చిందంటూ అనుమానించాల్సిందే. బ్యాంకు వివరాలు పేర్కొని, ఓటీపీ నమోదు చేశారంటే మీ ఖాతా ఖాళీ అయిపోతుంది. ✦ రిఫండుకు సంబంధించిన ఏ వివరాలైనా.. ఇ-ఫైలింగ్ పోర్టల్‌లోనే అందుబాటులో ఉంటాయని తెలిపింది.

ట్రక్కుల వయసు మీరుతోంది

- దేశీయ సగటు పదేళ్లు
- కొవిడ్ సమయంలో కొనుగోళ్లు తగ్గాయ్
- కొత్త వాటికి మారాల్సిన సమయమిదే
- పరిశ్రమకు కలిసి రావొచ్చు

దేశీయంగా మధ్య, భారీ వాణిజ్య వాహనాల (ఎం అండ్ హెచ్‌సీవీ-ట్రక్కుల విభాగం) సగటు వయసు పదేళ్లకు చేరింది. దీంతో వీటి స్థానంలో కొత్త వాహనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇది పరిశ్రమకు కలిసి రావొచ్చని తయారీ సంస్థలు, రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తున్నాయి.



ఎందుకిలా?

కొవిడ్ సమయంలో భారీ వాహనాలకు గిరాకీ తగ్గడం, ఇటీవలి సంవత్సరాల్లోనూ విక్రయాలు బలహీనంగా నమోదు కావడంతో పాత వాహనాలు పెరిగిపోయి మొత్తం వాహనాల సగటు వయసు పదేళ్లకు చేరింది. ఇది రెండు దశాబ్దాల్లోనే అత్యధికంగా ఉంది. కొవిడ్ మహమ్మారి ప్రబలంగా ఉన్న సమయంలో వాహన యజమానులు కొత్త వాహనాల కొనుగోళ్లను వాయిదా వేశారు. దేశీయంగా ట్రక్కుల విక్రయాల పరిమాణం 2023-24లో స్థిరంగా ఉంది. 2024-25లో విక్రయాలు 4 శాతం తగ్గాయి. దీంతో వాహనాల సగటు వయసు పదేళ్లకు చేరడానికి దారి తీసిందని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కింజల్ షా వెల్లడించారు.

గిరాకీ పెరుగుతుంది!

మన దేశంలో ట్రక్కుల వయసు మీరిన కారణంగా భర్తీ గిరాకీ (రీప్లేస్‌మెంట్ డిమాండ్) గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు. వాహన ఆపరేటర్లు మెరుగైన సాంకేతికత, వేగవంతమైన టర్నోండ్‌తో కొత్త, మరింత సమర్థవంతమైన మోడళ్ల వైపు మొగ్గు చూపుతున్నారని ట్రక్కుల తయారీదార్లు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు 2023 ఏప్రిల్ 1 నుంచి 15 ఏళ్ల వయసు మీరిన ప్రభుత్వ వాహనాలను తుక్కుగా మార్చాలనే కచ్చితమైన నిబంధనతో మధ్య కాలానికి రీప్లేస్‌మెంట్ గిరాకీ పెరుగుతుందని భావిస్తున్నారు.

✦ 2009-10 నుంచి నేటి వరకు బీఎస్0-బీఎస్6 ఉద్గార స్థాయి ట్రక్కులు సుమారు 37 లక్షలు విక్రయమయ్యాయి. గత 4 ఏళ్లలోనే సుమారు 10 లక్షల బీఎస్6 ట్రక్కులు విపణిలోకి వచ్చాయి. మరో 8.5 లక్షల వాహనాలు కొనసాగుతున్నాయి. అంటే 50 శాతం ట్రక్కులు గత 15 ఏళ్లలోనే విక్రయమయ్యాయి. వీటి సగటు వయసు 11 ఏళ్లను మించింది. అందుకే దేశీయ వాణిజ్య వాహన విభాగంలో వాహనాల వినియోగ జీవితం ముగింపునకు వచ్చిందని, రీప్లేస్‌మెంట్‌కు ఇదే సమయమని విశ్లేషకులు చెబుతున్నారు.

60 శాతానికి రీప్లేస్‌మెంట్ విక్రయాలు

రహదారుల మౌలిక సదుపాయాలు మెరుగైనందున, రీప్లేస్‌మెంట్ గిరాకీ బాగా పెరగొచ్చని వోల్వో ఐషర్ వాణిజ్య వాహనాల సీఈఓ, ఎండీ వినోద్ అగర్వాల్ వెల్లడించారు. గతంలో ట్రక్కులు నెలకు సుమారు 8,000-10,000 కి.మీ. తిరుగుతుండగా, కొత్తగా వస్తున్న ట్రక్కులు 15,000-20,000 కి.మీ. ప్రయాణిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం రీప్లేస్‌మెంట్ విక్రయాల వాటా ట్రక్కుల విభాగంలో 60 శాతంగా ఉందని వినోద్ తెలిపారు. అయితే ఈ విభాగంలో మొత్తం విక్రయాలు మాత్రం గత గరిష్ఠ స్థాయికి చేరలేదన్నారు. 2019లో 2,95,000 వాహనాలు విక్రయమవగా ఇప్పటి వరకు ఇదే గరిష్ఠ స్థాయి. 2024-25లో 2,48,000 వాహనాలు అమ్ముడుపోయాయి. ట్రక్కుల విభాగం అధిక టన్నేజీ, పేలోడ్‌కు మారుతున్నందున, వీటి పరంగా 2024-25 ట్రక్కుల విక్రయాలు 10 శాతం పెరిగాయని అనుకోవచ్చని వినోద్ వివరించారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభంలో 33% వృద్ధి

దిల్లీ: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జూన్ త్రైమాసికంలో రూ.1,169 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలోని రూ.880 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 33% అధికం. మొత్తం ఆదాయం రూ.9,500 కోట్ల నుంచి రూ.10,374 కోట్లకు పెరిగింది. బ్యాంకు ఆర్జించిన వడ్డీ సైతం రూ.8,335 కోట్ల నుంచి రూ.8,589 కోట్లకు చేరుకుంది. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) 4.54% నుంచి 3.13 శాతానికి పరిమితం కాగా, నికర ఎన్‌పీఏలు సైతం 0.73% నుంచి 0.49 శాతానికి తగ్గాయి.

ఇండియా సిమెంట్స్ నష్టం రూ.132.90 కోట్లు

దిల్లీ: జూన్ త్రైమాసికంలో ఇండియా సిమెంట్స్ రూ.132.90 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని నమోదు చేసింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో రూ.58.47 కోట్ల లాభం ఉండడం విశేషం. ఆదాయం రూ.1042.27 కోట్ల నుంచి రూ.1033.85 కోట్లకు తగ్గింది. డిసెంబరు 24, 2024 నుంచి ఈ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్‌కు అనుబంధ సంస్థగా మారింది. కంపెనీకి ఉన్న ప్లాంట్ల మొత్తం వార్షిక సామర్థ్యం 14.75 మిలియన్ టన్నులుగా ఉన్న సంగతి తెలిసిందే.

తక్కువ వేతన జీవుల్లో 93% మందికి క్రెడిట్ కార్డులే ఆధారం



ముంబయి: ఖర్చులను తట్టుకునేందుకు క్రెడిట్ కార్డులపై ఆధారపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. నెలకు రూ.50,000 కంటే తక్కువ ఆర్జిస్తున్న వారిలో 93% మంది తమ అవసరాలు తీర్చుకునేందుకు క్రెడిట్ కార్డులనే ఆశ్రయిస్తున్నారని థింక్360.ఏఐ విడుదల చేసిన ఒక నివేదిక వెల్లడించింది. దేశంలో 20,000 మందికి పైగా వేతన జీవులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తుల ఆర్థిక ప్రవర్తనను 12 నెలల పాటు విశ్లేషించి, ఈ సంస్థ రూపొందించిన నివేదిక ప్రకారం..

◗ స్వయం ఉపాధి పొందుతున్న వారిలో 85% మంది క్రెడిట్ కార్డులనే వాడుతున్నారు. దీంతో పాటు 'ఇప్పుడు కొనండి, తర్వాత చెల్లించండి (బీఎన్‌పీఎల్) సేవలను వాడుకుంటున్న వారి సంఖ్య గణనీయంగానే ఉంది. స్వయం ఉపాధి పొందుతున్న వారిలో 20%, ఉద్యోగుల్లో 15% మంది ఈ సేవలను ఉపయోగించుకుంటున్నారు.

◗ దేశంలో క్రెడిట్ కార్డులు, బీఎన్‌పీఎల్ ఇప్పుడు ఒక తప్పనిసరి అవసరంగా మారిందని థింక్360.ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ అమిత్ దాస్ అన్నారు. ఉద్యోగులు, వృత్తి నిపుణులతో పాటు, తాత్కాలికంగా ఉపాధి పొందుతున్న వారూ (గిగ్ వర్కర్లు) ఆర్థిక అవసరాల కోసం వీటిని ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు.

◗ ఫిన్‌టెక్‌లు డిజిటల్ రుణాల విషయంలో ఒక విప్లవాన్ని తీసుకొచ్చాయి. 2023లో ఫిన్‌టెక్‌లు రూ.92,000 కోట్లకు పైగా వ్యక్తిగత రుణాలను విడుదల చేశాయి. కొత్త రుణాల్లో ఇవి 76 శాతానికి సమానం. తక్కువ ఆదాయం ఉన్న వర్గాలు.. స్వల్ప కాలిక, డిజిటల్ ప్రధాన రుణాల వైపు మొగ్గు చూపిస్తున్నారని నివేదిక పేర్కొంది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)


కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్	269.00	182.00	3379.00	2846.00
జేకే సిమెంట్	324.25	184.82	3352.53	2807.57
రిలయన్స్ పవర్	44.68	(97.85)	2025.31	2069.18
ఆర్‌బీఎల్ బ్యాంక్	200.00	372.00	----	-----
ఓరియంటల్ హోటల్స్	8.71	3.64	107.24	84.78
ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్	581.00	503.00	5189.00	4278.00

జియో ఫైనాన్షియల్, అలయాంజ్ జట్టు

దిల్లీ: భారత్‌లో రీఇన్సూరెన్స్ సంయుక్త సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేసేందుకు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జేఎఫ్ఎస్ఎల్), అలయాంజ్ గ్రూపు ఆఫ్ జర్మనీ అనుబంధ సంస్థ అయిన అలయాంజ్ యూరప్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ సంయుక్త సంస్థలో ఇరు సంస్థలకు సమాన వాటా ఉండనుంది. భారత బీమా మార్కెట్‌లో అధిక వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడమే జేవీ ఏర్పాటు ఉద్దేశం. అలయాంజ్‌కు ఉన్న బలమైన అండర్‌రైటింగ్, అంతర్జాతీయ రీఇన్సూరెన్స్ సామర్థ్యాన్ని, జేఎఫ్ఎస్ఎల్ స్థానిక అనుకూలతలను ఒక్కచోటికి చేర్చేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని ఇరు సంస్థలు ఒక ప్రకటనలో తెలిపాయి.

భారత్-ఐరోపా దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- అక్టోబరు 1 నుంచి అమల్లోకి
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



ముంబయి: భారత్, నాలుగు ఐరోపా దేశాల సమూహం ఈఎఫ్‌టీఏ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అక్టోబరు 1 నుంచి అమల్లోకి వస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ శనివారం 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఈ రెండు పక్షాలూ గతేడాది మార్చి 10న వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ)పై సంతకం చేశాయి. యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ)లో ఐస్‌లాండ్, లీచ్టెన్‌స్టీన్, నార్వే, స్విట్జర్లాండ్ సభ్య దేశాలుగా ఉన్నాయి. ఈ ఒప్పందం కింద భారత్‌లో 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల(రూ.8.5 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. స్విస్ వాచీలు, చాక్లెట్లు, కట్-పాలిష్ చేసిన వజ్రాల వంటి అనేక ఉత్పత్తులను తక్కువ లేదా సున్నా సుంకాలతో అనుమతిస్తుంది. ఒప్పందం అమలు తర్వాత పదేళ్ల కాలంలో 50 బిలియన్ డాలర్లు, మిగిలిన అయిదేళ్ల కాలంలో 50 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టాలి. ఇది భారత్‌లో 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించేందుకు దోహదం చేయనుంది. ఈఎఫ్‌టీఏలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి స్విట్జర్లాండ్. మిగిలిన మూడు దేశాలతో భారత్ వాణిజ్యం తక్కువే. ఈ ఒప్పందం అమలు తర్వాత భారతీయ వినియోగదారులకు స్విస్ వాచీలు, చాక్లెట్లు, బిస్కెట్లు వంటి స్విస్ ఉత్పత్తులు తక్కువ ధరకు లభించే అవకాశం ఉంది.

దేశ ప్రయోజనాలే ముఖ్యం: 2025-26 అసోచామ్ మొదటి మేనేజింగ్ కమిటీ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అమెరికాతో టారిఫ్ చర్చలు దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే ఉంటాయన్నారు. ప్రపంచం భారత్ బలాన్ని గుర్తిస్తోందని, ఇది చర్చల్లో ప్రయోజనాన్ని ఇస్తోందన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశాలతో చర్చలు జరుపుతోందని, పరస్పర స్నేహపూర్వక ఆర్థిక వ్యవస్థలను చూస్తున్నాం అని తెలిపారు. పంపిణీ వ్యవస్థలను జాగ్రత్తగా చూసుకోని దేశాలు తర్వాత బాధపడతాయని పేర్కొన్నారు. దేశంలో గిరాకీ ఎక్కువగా ఉంది. అన్నింటికీ దిగుమతులమీదే ఆధారపడకుండా, దేశీయంగా పరిశ్రమల అభివృద్ధి జరగాలన్నారు. కొవిడ్ మనకు మంచి పాఠాలు నేర్పిందని, శాశ్వత అయస్కాంతాలు, ఎరువుల ఎగుమతుల నిషేధం మరో పెద్ద పాఠం నేర్పిందని పేర్కొన్నారు.

ముగిసిన భారత్-యూఎస్ అయిదో విడత చర్చలు

భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో రెండు దేశాలకు చెందిన ప్రతినిధి బృందాలు చర్చలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా జులై 14-17 వరకూ నాలుగు రోజులపాటు వాషింగ్టన్‌లో అయిదో విడత చర్చలు జరిగాయి. భారత బృందానికి వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నాయకత్వం వహించారు. భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ 26% సుంకం విధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆగస్టు 1 వరకూ వీటిని వాయిదా వేశారు. దీనికి సంబంధించి ఇరు దేశాలూ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం చర్చలు నిర్వహిస్తున్నాయి. ఈసారి వ్యవసాయం, వాహన సంబంధిత అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. డెయిరీ, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల్లో రాయితీ ఇవ్వాలని భారత్‌ను అమెరికా కోరుతున్న సంగతి తెలిసిందే.

సాయంకాలం వేళ చక్కటి చిరుతిళ్లు

పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి రాగానే చిరుతిళ్లు అడుగుతారు. అప్పటికప్పుడు చేసే ఓపిక లేకపోతే పిజ్జా, బర్గర్, చాక్లెట్లు, బిస్కట్లు లాంటి జంక్‌ఫుడ్ ఇవ్వాల్సొస్తుంది. వాటితో జేబుకు చిల్లు, ఒళ్లు గుల్ల. అందుకు బదులుగా నిలవుండే పిండివంటలు కొన్ని చేసేయండి.. రెండు వారాలు రుచి ఆరోగ్యాల స్నాక్స్ సిద్ధంగా ఉంటాయి. ఈసారి వీటిని ప్రయత్నించండి.. చిన్నారులకు నచ్చేస్తాయి..

నూనె లేకుండా పనీర్ మసాలా

కొన్ని కూరల్లో నూనె ఎక్కువ పడుతుంది. పనీర్ మసాలా కూడా అలాంటిదే. కానీ ఆ రెసిపీని నూనె అసలే వేయకుండానూ చేయొచ్చు.



పనీర్ మసాలా కోసం- ఉల్లి తరుగు - అర కప్పు, టొమాటో ముక్కలు - కప్పు, పనీర్ - 200 గ్రాములు, లవంగాలు - 3, యాలకులు - 2, జీడిపప్పు - పావు కప్పు, అల్లం - అంగుళం ముక్క, వెల్లుల్లి - 2 రెబ్బలు, ఉప్పు - రుచికి తగినంత, పచ్చిమిర్చి - 2, దాల్చినచెక్క - చిన్న ముక్క, బిర్యానీ ఆకు - 1, మిరియాలు - చెంచా, కశ్మీరీ మిర్చి - 6, కొత్తిమీర తరుగు - గుప్పెడు, తాజా క్రీమ్ - 2 టేబుల్ స్పూన్లు, కసూరీ మేథీ, పంచదార - చెంచా చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. ప్యాన్‌లో దాల్చినచెక్క, బిర్యానీ ఆకు, యాలకులు, మిరియాలు, లవంగాలు, ఎండుమిర్చిలను వేయించాలి. వాటిని పళ్లెంలోకి తీసి.. జీడిపప్పును వేయించాలి. దాన్ని కూడా తీసి ఉల్లి, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి తరుగులను వేయించాలి. లేత గోధుమ రంగులోకి మారాక టొమాటో ముక్కలను జతచేయాలి. మెత్తగా ఉడికిందనుకున్నాక సెగ తీసేయాలి. అన్నీ చల్లారాక ఉప్పు, పంచదార చేర్చి గ్రైండ్ చేయాలి. కడాయిలో క్రీమ్ వేడిచేసి పనీర్ ముక్కలను వేయించాలి. అందులో గ్రైండ్ చేసిన మిశ్రమం జోడించాలి. నాలుగైదు నిమిషాల తర్వాత కొత్తిమీర చల్లితే చాలు నూనె లేని పనీర్ మసాలా సిద్ధం.

పెరుగు మురుకులు



కావలసినవి: బియ్యప్పిండి - ఒకటిన్నర కప్పు, మినప్పిండి - పావు కప్పు, పెరుగు - ముప్పావు కప్పు, ఉప్పు - రుచికి తగినంత, పచ్చిమిర్చి - 8, నువ్వులు - గుప్పెడు, నెయ్యి - 2 చెంచాలు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: వెడల్పాటి పాత్రలో బియ్యప్పిండి, మినప్పిండి, తగినన్ని నీళ్లు, పెరుగు, ఉప్పు, నువ్వులు, నెయ్యి, కచ్చాపచ్చా దంచిన పచ్చిమిర్చి వేసి కలపాలి. ఈ పిండిని మురుకుల గిద్దల్లో ఉంచి.. కాగుతున్న నూనెలోకి ఒత్తుకోవాలి. మధ్యస్థమైన సెగ మీద బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. చల్లారిన తర్వాత గాలి చొరబడని డబ్బాలో ఉంచితే చాలా రోజులు నిలవుంటాయి.

కాజూ కత్లీ



కావలసినవి: జీడిపప్పు - 150 గ్రాములు, పంచదార - ఒకటిన్నర కప్పు, రోజ్ వాటర్ - నాలుగు చుక్కలు, యాలకుల పొడి - పావు చెంచా, నెయ్యి - 3 చెంచాలు

తయారీ: జీడిపప్పును గ్రైండ్ చేయాలి. ఇది తేలిగ్గానే పొడి అవుతుంది కనుక ఒకసారి తిప్పితే సరిపోతుంది. ఎక్కువసేపు గ్రైండ్ చేస్తే అందులోంచి నూనె బయటకు వచ్చి ఉండలు కడుతుంది. పంచదారలో సుమారుగా కప్పు నీళ్లు పోసి వేడిచేయాలి. పంచదార కరిగిపోయి నీళ్లు మరుగుతున్నప్పుడు జీడిపప్పు పొడి, జతచేసి కలియతిప్పుతుండాలి. ఐదు నిమిషాల తర్వాత.. యాలకుల పొడి, రోజ్ వాటర్, రెండు చెంచాల నెయ్యి జోడించి ఇంకో నాలుగు నిమిషాలు ఉడికించాలి. మిశ్రమం అంచుల నుంచి విడిపోతున్నప్పుడు సెగ తీసేయాలి. బేకింగ్ షీట్ మీద నెయ్యి రాసి.. ఈ మిశ్రమాన్ని సమంగా సర్దాలి. చల్లారాక.. డైమండ్ ఆకారంలో కట్ చేసుకుని.. భద్రం చేసుకుంటే పిల్లలకు సాయంత్రాలు బలాన్నిచ్చే చిరుతిండి అందించినట్లవుతుంది.

ఆలూ సేవ్



కావలసినవి: బంగాళదుంపలు - 5, శనగపిండి - కప్పున్నర, బియ్యప్పిండి - అర కప్పు, మిరియాల పొడి - చెంచా, పానీపూరీ మసాలా - ఒకటిన్నర చెంచా, ఉప్పు, నిమ్మ ఉప్పు - తగినంత, పల్లీలు - అర కప్పు, పుట్నాలపప్పు - పావు కప్పు, ఛాట్ మసాలా - అర చెంచా, పంచదార - చెంచా, కారం - అర చెంచా, కరివేపాకు - 3 రెబ్బలు, ఎండుమిర్చి - 3

తయారీ: బంగాళదుంపలను ఉడికించి, పొట్టు తీసి మెదపాలి. అందులో రెండు చెంచాల వేడి నూనె, మిరియాల పొడి, పానీపూరీ మసాలా, ఉప్పు, నిమ్మ ఉప్పు, శనగపిండి, బియ్యప్పిండి వేసి బాగా కలపాలి. అదనంగా నీళ్లు పోయాల్సిన అవసరం లేదు.. బంగాళదుంపల్లో ఉండే తడి సరిపోతుంది. ఈ మిశ్రమాన్ని నూనె రాసిన కారప్పూస గిద్దల్లో వేసి.. కాగుతున్న నూనెలో ఒత్తుకుని బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. ప్యాన్‌లో చెంచా నూనె వేడయ్యాక.. పల్లీలు, పుట్నాలపప్పు, ఎండుమిర్చి, కరివేపాకు ఒకదాని తర్వాత ఒకటిగా వేయాలి. అవి వేగాక సెగ తీసేసి..ఆలూ భుజియాలో వేయాలి. అందులో ఛాట్ మసాలా, పంచదార, కారం కూడా జతచేసి.. కలపాలి. పూర్తిగా చల్లారాక డబ్బాలో భద్రం చేసుకోవాలి.

మేథీ మఠరీ



కావలసినవి: గోధుమపిండి - ఒకటిన్నర కప్పు, ఉప్మారవ్వ - టేబుల్ స్పూన్, ఉప్పు - రుచికి తగినంత, నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు, వాము - చెంచా, కసూరీ మేథీ - 3 టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి - అర చెంచా, మిరియాలు - చెంచా, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: వెడల్పాటి పాత్రలో గోధుమపిండి, తగినన్ని నీళ్లు, రవ్వ, నెయ్యి, వాము, కసూరీ మేథీ, మిరియాలు, మిరియాల పొడి, ఉప్పు వేసి బాగా కలిపి 20 నిమిషాలు నాననివ్వాలి. ఈ పిండితో కాస్త మందమైన చపాతీలు చేసి.. నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కట్ చేయాలి. అన్నీ అయ్యాక.. కాగుతున్న నూనెలో బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. చల్లారిన తర్వాత గాలి చొరబడని డబ్బాలో నిలవచేసుకోవాలి.

బాదం గులాబీ బైట్స్



కావలసినవి: బాదంపప్పు - 2 కప్పులు, పాలు - కప్పు, యాలకుల పొడి - అర చెంచా, కుంకుమపువ్వు - కొద్దిగా, నెయ్యి - చెంచా, ఎండిన గులాబీ రేకలు - ఒకటిన్నర చెంచా, పంచదార ఒకటిన్నర కప్పు

తయారీ: బాదంపప్పును పది నిమిషాలు వేడినీళ్లలో నానబెట్టి పొట్టు తీయాలి. మిక్సీజార్‌లో ఆ పప్పులకు తోడు పాలు పోసి.. మెత్తగా గ్రైండ్ చేయాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో పంచదార, కొన్ని నీళ్లు చేర్చి సన్న సెగ మీదుంచాలి. అందులో బాదం పేస్టు జతచేసి ఉండలు కట్టకుండా కలియతిప్పు తుండాలి. రెండు నిమిషాల తర్వాత యాలకుల పొడి, కుంకుమపువ్వు, ఎండిన గులాబీ రేకలు జోడించి కలియబెడుతూనే ఉండాలి. దగ్గరగా అయ్యిందను కున్నాక దించేయాలి. వేడిగా ఉండగానే ఈ బాదం మిశ్రమాన్ని నెయ్యి రాసిన పళ్లెంలో సమంగా సర్ది.. ముక్కలుగా కట్ చేసుకోవాలి. పూర్తిగా చల్లారాక.. తడిలేని సీసాలో భద్రం చేసుకుంటే చాన్నాళ్లు నిలవుంటాయి.

రాగి చిప్స్



కావలసినవి: రాగిపిండి - 2 కప్పులు, గోధుమపిండి - కప్పు, బియ్యప్పిండి - అర కప్పు, ఛాట్ మసాలా - ముప్పావు చెంచా, పసుపు - చెంచా, ఉప్పు - రుచికి తగినంత, కారం - ఒకటిన్నర చెంచా, జీలకర్రపొడి - అర చెంచా, నూనె - వేయించడానికి తగినంత

తయారీ: కడాయిలో నూనె వేడి చేయాలి. అది కాగేలోగా.. వెడల్పాటి పాత్రలో రాగిపిండి, గోధుమపిండి, బియ్యప్పిండి, కారం, సగం ఛాట్ మసాలా, ఉప్పు, పసుపు, జీలకర్రపొడి వేసి కలియబెట్టాలి. అందులో కొన్ని కొన్ని నీళ్లు పోస్తూ ఉండలు కట్టకుండా చపాతీపిండిలా కలపాలి. ఈ మిశ్రమాన్ని కారప్పూస గిద్దల్లో రిబ్బన్ పకోడీ బ్లేడ్ ఉంచి.. కాగుతున్న నూనెలో ఒత్తుకోవాలి. వేయించి తీశాక మిగిలిన ఛాట్ మసాలా చల్లితే మరింత రుచిగా ఉంటాయి. ఇవి రెండు వారాలు నిలవుంటాయి.

నేరేడు క్యాండీ స్టిక్స్

ఇది నేరేడుపండ్ల సీజన్ కదా! వీటితో నోటికి హితవనిపించే క్యాండీ స్టిక్స్ చేసుకుందామా.. జామూన్లు మాత్రం తెచ్చుకుంటే చాలు.. మిగిలినవన్నీ ఇంట్లో ఉండే పదార్థాలే. ఇందుకు పెద్దగా శ్రమించాల్సిన అవసరం కూడా లేదు.



నేరేడుపండ్ల క్యాండీల కోసం నేరేడుపండ్లు - పావు కిలో, పంచదార - 2 టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి, జీలకర్ర పొడి - చెంచా చొప్పున, నిమ్మరసం - టేబుల్ స్పూన్, రాక్ సాల్ట్ - కొద్దిగా తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. పండ్లను కడిగి ఉడికించాలి. చల్లారాక చేత్తో మెదిపి, గింజలు తీసేసి గ్రైండ్ చేయాలి. ఈ గుజ్జులో పంచదార, నిమ్మరసం కలిపి మళ్లీ ఉడికించాలి. చిక్కగా అయ్యాక దించేసి.. సిలికాన్ మ్యాట్ మీద ఒక రోజంతా ఎండబెట్టాలి. అందులో రాక్ సాల్ట్, మిరియాల పొడి, జీలకర్ర పొడి జతచేసి బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ముద్దల్లా చేసిఐస్‌క్రీమ్ స్టిక్స్ మీద లాలిపాప్‌లా అమర్చాలి. అంతే.. పులుపు, తీపిల కలయికతో వారెవా అనిపించే క్యాండీ స్టిక్స్ సిద్ధమైపోతాయి.

వారెవా ఏమి ఉప్మా!



పాఠకవంట

చిటపట చినుకులు పడుతుంటే.. వేడి వేడిగా, కారం కారంగా ఏదైనా తినాలనిపిస్తుంది కదూ! మొక్కజొన్న కండెలు కాల్చుకుని, కాస్త ఉప్పు, నిమ్మరసం అద్ది తినాలనిపించడం కూడా సహజమే! అనేక పోషకాలున్న మొక్కజొన్నను ఏదో రూపంలో తినమని నిపుణులు కూడా చెబుతున్నారు. కాబట్టి కొంచెం భిన్నంగా ఉప్మా చేసుకుందామా... వీటితో ఉప్మా ఏమిటా అని ఆశ్చర్యపోతున్నారా? చాలా రుచిగా ఉంటుంది... ఎలా చేయాలో చూడండి.

కావలసినవి: లేత మొక్కజొన్న కండెలు - 4, ఉల్లిపాయ - 1, పచ్చిమిరపకాయలు - రెండు, నూనె - 3 చెంచాలు, ఆవాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర - అరచెంచా చొప్పున, ఎండుమిర్చి - 1, కరివేపాకు - రెండు రెబ్బలు, కొత్తిమీర - గుప్పెడు, ఉప్పు - రుచికి తగినంత

తయారీ: ఉల్లి, పచ్చిమిర్చిలను తరిగి ఉంచాలి. మొక్కజొన్న కండెలను కార్న్ కట్టర్‌తో లేదా చేత్తో గింజలు ఒలుచుకోండి. అవి సుమారుగా రెండు కప్పులు అవుతాయి. వాటిని మిక్సీజార్‌లో వేసి నీళ్లు పోయకుండా పల్స్ బటన్ ప్రెస్ చేసి రెండుసార్లు తిప్పుకోవాలి. ఎక్కువగా తిప్పితే పిండిలా అయిపోతుంది. కొంచెం గింజలు నలిగితే చాలు అప్పుడు రవ్వలా ఉంటుంది. గింజలు మరీ లేతగా ఉంటే కొంచెం ముద్దగా అవుతుంది. మరేమీ పర్వాలేదు కడాయిలో నూనె వేడిచేసి ఆవాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, కరివేపాకు, ఎండుమిర్చిలతో తాలింపు వేయాలి. అవి వేగాక.. నిలువుగా కోసిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిరపకాయ ముక్కలు వేయాలి. అవి కాస్త రంగు మారాక.. మొక్కజొన్న రవ్వ, ఉప్పు వేసి కలిపి, మూత పెట్టేసి సన్నని సెగ మీద కాసేపు మగ్గనివ్వాలి. ఐదు నిమిషాల తర్వాత ఒకసారి మొత్తం కలిపి కొత్తిమీర వేసి మళ్లీ మూత పెట్టాలి. మెత్తగా ఉడికిందనుకున్నాక దించేస్తే.. పోషకాల మొక్కజొన్న ఉప్మా రెడీ! ఇదెంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఒకసారి చేసి చూడండి.



– కె.వి.సుమలత, గుడివాడ, కృష్ణా జిల్లా

కరకరలాడే ఫిష్ ఫింగర్స్

చేపలు తినడం వల్ల కంటిచూపు మెరుగుపడుతుంది కనుక తరచూ తింటుండాలి. చేపలతో కూర, పులుసు సంగతి సరే.. 'ఫిష్ ఫింగర్స్' మరీ మరీ బాగుంటాయి. అవి హోటల్ స్టయిల్లో ఉండాలంటే ఇలా ప్రయత్నించండి!

కావలసినవి: ముల్లు లేని చేప - 300 గ్రాములు, రవ్వ - అర కప్పు, ఉప్పు - రుచికి తగినంత, కారం - ఒకటిన్నర చెంచా, సోంపు - పావు చెంచా, నిమ్మరసం - రెండున్నర చెంచాలు, పసుపు - అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్ట్ - రెండు చెంచాలు, గుడ్డు - 1, నూనె - వేయించడానికి సరిపడా

చెఫ్ స్పెషల్



తయారీ: గుడ్డును బాగా గిలకొట్టి పక్కన ఉంచాలి. చేప ముక్కల్లో సగం ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, సోంపు, నిమ్మరసం జతచేసి అరగంట నానబెట్టండి. రవ్వలో కారం, మిగిలిన ఉప్పు వేసి కలపండి. మ్యారినేట్ చేసిన చేప ముక్కలను ముందు గుడ్డుసొనలో ముంచి తీసి రవ్వలో దొర్లించి.. కాగుతున్న నూనెలో వేయించండి. అంతే.. కరకరలాడే 'ఫిష్ ఫింగర్స్' తయారైపోతాయి.



– శ్రీదేవి, హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణురాలు

నిమిషంలో కలాకండ్!

పాలను బాగా మరిగిస్తే కలాకండ్ తయారవుతుంది. అయితే అడుగంటకుండా కలియతిప్పుతూనే ఉండాలి. అంత పరిశ్రమ లేకుండా తేలిగ్గా ఈ స్వీట్ చేసుకోవచ్చు. ఎలాగంటారా..



మలై పనీర్ - 500 గ్రాములు, కండెన్స్‌డ్ మిల్క్ - అర లీటర్, నెయ్యి - చెంచా, మిల్క్ పౌడర్, పంచదార, యాలకుల పొడి - ముప్పావు చెంచా, గులాబీ రేకలు - కొద్దిగా, డ్రైఫ్రూట్స్ పలుకులు - 2 చెంచాలు చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. ప్యాన్‌లో నెయ్యి వేడిచేసి మలై పనీర్‌ను వేయించాలి. అందులో కండెన్స్‌డ్ మిల్క్, యాలకుల పొడి జోడించి కలియతిప్పాలి. చిక్కగా అయ్యాక దించేయాలి. ఈ మిశ్రమాన్ని బేకింగ్ షీట్ మీద సమంగా పరిచి.. డ్రైఫ్రూట్స్ పలుకులు, గులాబీ రేకలు చల్లితే తియ్యతియ్యటి కలాకండ్ సిద్ధమైపోతుంది.

ధోక్లా.. ఇడ్లీ.. ఇడియప్పమ్..

సౌకర్యం







ఇడ్లీ కుక్కర్ మనకేం కొత్త కాదు.. ఇప్పుడు దాన్ని మరింత ఆధునికంగా, ప్రయోజనకరంగా రూపొందించారు. అదే మల్టీ పర్పస్ కుక్కర్. ఇందులో ఇడ్లీ, ఇడియప్పమ్, ధోక్లాలు చేయొచ్చు. కూరగాయ ముక్కలనూ ఉడికించవచ్చు. ఇది అద్దంలా కనిపించే స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఆకర్షణీయంగానూ ఉంది, మన్నిక ఎక్కువ. నాన్‌స్టిక్ కోటింగ్ వల్ల శుభ్రపరచటం తేలిక. సిలికాన్ హ్యాండిల్స్ చేతులు కాలనివ్వవు. లిఫ్టర్ ఉన్నందున పాత్రలోంచి ప్లేట్లు బెసకకుండా సులువుగా తీయొచ్చు.

తియ్యతియ్యటి ఛెనా ఝిల్లీ

పొరుగు రుచి



ఒడిశాలో ప్రసిద్ధ వంటకం ఛెనా ఝిల్లీ. ఇది కొంచెం గులాబ్ జామూన్‌ను గుర్తుచేసేలా ఉంటుంది కానీ.. రెండూ దేనికదే భిన్నం.

ఛెనా ఝిల్లీ కోసం ఉప్మారవ్వ - ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, పాలు - 6 కప్పులు, పంచదార - రెండు కప్పులు, మైదా - టేబుల్ స్పూన్, వెనిగర్ - 2 టేబుల్ స్పూన్లు, జీడిపప్పుల పొడి - చెంచా, కుంకుమపువ్వు - కొద్దిగా, యాలకుల పొడి - ముప్పావు చెంచా, బేకింగ్ సోడా - పావు చెంచా, నూనె - వేయించడానికి సరిపడా తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. పాలను బాగా మరిగించాలి. చిక్కగా అయ్యాక వెనిగర్‌లో కొద్దిగా నీళ్లు కలిపి పాలలో పోస్తే.. పాలు విరుగుతాయి. ఆ పాలను వడకట్టి, నీరంతా పోయాక గ్రైండ్ చేయాలి. అందులో రవ్వ, మైదా, కప్పు పంచదార, సగం యాలకుల పొడి, జీడిపప్పుల పొడి, కుంకుమపువ్వు, బేకింగ్ సోడా జోడించి కలిపి పైపింగ్ బ్యాగ్‌లో వేయాలి.

మిగిలిన పంచదారలో ఒకటిన్నర కప్పుల నీళ్లు, యాలకుల పొడి, జతచేసి పాకం పట్టాలి. ప్యాన్‌లో నూనె వేడిచేయాలి. అది కాగేలోగా.. పనీర్ మిశ్రమాన్ని చేగోడీలు లేదా చిన్న జిలేబీల్లా ఒత్తి నూనెలో వేయాలి. అవి చక్కగా వేగి.. లేత గోధుమ రంగులోకి మారాక తీసి.. పంచదార పాకంలో వేయాలి. అంతే.. తియ్యతియ్యటి 'ఛెనా ఝిల్లీ' తిని ఆనందించటమే తరువాయి.

ఇవి ఎగ్ ప్లాంట్స్!

చిత్రంగా..









అవాలు, మెంతులు, ధనియాల్లా గుడ్లు కూడా మొలకెత్తాయనుకోండి.. భలే ఉంటుంది కదా! అవేం గింజలు కాదుగా అంటారా?! కళా హృదయం ఉంటే ఏదైనా సాధ్యమేనని నిరూపిస్తూ.. ప్లేటుల్లో ఎగ్ ప్లాంట్స్ నాటేశారు. చూసి ఆనందించండి!






తీపీ ఘాటుల పానీయం

మార్కెట్లో దొరికే కూల్‌డ్రింక్స్‌కు బదులు ఆరోగ్యకరమైన పానీయాలు ఇంట్లోనే చేసుకుంటున్నాం కదా! ఈసారి ఉసిరి, నారింజ, జామకాయల కలయికతో నోరూరించే పానీయం మీ కోసం..



ఈ జ్యూస్ కోసం.. జామకాయలు, నారింజపండ్లు - 2 చొప్పున, ఉసిరిపొడి - చెంచా, పంచదార - 10 చెంచాలు, అల్లం ముద్ద, మిరియాల పొడి - అర చెంచా చొప్పున, ఉప్పు - రుచికి సరిపడా తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. ముందుగా నారింజపండ్ల రసం తీయాలి. జామకాయకు చెక్కు, గింజలు తీసేసి ముక్కలు కోసుకోవాలి. వాటిని మిక్సీజార్‌లో వేసి.. 4 టేబుల్ స్పూన్ల నీళ్లు చేర్చి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో ఉసిరిపొడి, మిరియాల పొడి, పంచదార, ఉప్పు, నారింజ జ్యూస్ జతచేసి ఇంకోసారి గ్రైండ్ చేస్తే సరిపోతుంది. ఇందులో తగినంత నీళ్లు చేర్చి తాగారంటే సూపర్ టేస్టీగా ఉంటుంది. ఇంకా ప్రత్యేకంగా ఉండాలంటే.. నీళ్లకు బదులు చల్లటి సోడా కలపొచ్చు.

జలసూత్రం



అంతర్జాతీయ చెస్ దినోత్సవం



జులై 20
చరిత్రలో ఈనాడు

ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ (ఫిడే) స్థాపనకు గుర్తుగా ఏటా జులై 20న 'అంతర్జాతీయ చెస్ దినోత్సవం' (International Chess Day) నిర్వహిస్తారు. చదరంగం అనేది అత్యంత ప్రజాదరణ కలిగిన ప్రపంచవ్యాప్త క్రీడ. శాస్త్రీయ, మేధోపరమైన ఆలోచనల కలయికతో అత్యంత పురాతన సాంస్కృతిక ఆటల్లో ఇది ఒకటి. 64 చతురస్రాలు కలిగిన బోర్డుపై ఇద్దరు ఆడే ఆట చెస్. ప్రతి ఆటగాడికి 16 పావులు (ఎనిమిది మంది సైనికులు, రెండు గుర్రాలు, రెండు బిషప్‌లు, రెండు రూక్స్, ఒక మంత్రి, ఒక రాజు) ఉంటాయి. బోర్డుపై ప్రతి దానికి ప్రత్యేక కదలిక మార్గం ఉంటుంది. ప్రత్యర్థి రాజును 'చెక్‌మేట్' చేయడం ద్వారా ఆటలో విజయాన్ని సాధించొచ్చు. ఇది ప్రధానంగా నియమ - నిబంధనలతో రూపొందిన ఆట. ప్రతి ఎత్తుకు మన ఆలోచనా విధానం మారుతూ ఉంటుంది. ముఖ్యంగా తార్కిక జ్ఞానాన్ని, ఏకాగ్రతను పెంపొందించుకోవడంతోపాటు వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఉపయోగపడుతుంది. ప్రజలందరూ దీన్ని ఆడేలా ప్రోత్సహించడంతోపాటు చదరంగం వల్ల కలిగే ప్రయోజనాలను చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

❖ చదరంగానికి పుట్టినిల్లుగా భారతదేశాన్ని పేర్కొంటారు. క్రీ.శ. 7వ శతాబ్దంలో గుప్తుల కాలంలో ఇది ప్రాచుర్యంలో ఉన్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఆ సమయంలో దీన్ని 'చతురంగ' అని పిలిచేవారు. క్రీ.శ. 10వ శతాబ్దం నాటికి ఇది ఆసియా నుంచి మిడిల్ ఈస్ట్, యూరప్ దేశాలకు విస్తరించింది. 15 నుంచి 19వ శతాబ్దం ప్రారంభం వరకు ఇది రాజాస్థానాలు, ఉన్నత వర్గాల వారికి పరిమితమైంది. 20 శతాబ్దం నాటికి క్రమంగా అన్ని వర్గాల ప్రజలు దీన్ని ఆడటం ప్రారంభించారు.

❖ ఆధునిక భారతదేశంలో చెస్‌ను ప్రాచుర్యంలోకి తెచ్చిన ఘనత విశ్వనాథన్ ఆనంద్‌కు దక్కుతుంది. చెన్నైకి చెందిన ఈయన 19 ఏళ్ల వయసులో మన దేశ మొట్టమొదటి గ్రాండ్ మాస్టర్ అయ్యారు. ఇటీవలే చెన్నైకి చెందిన హరికృష్ణన్ భారత్ తరపున 87వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించాడు.

చారిత్రక నేపథ్యం:

అంతర్జాతీయంగా చెస్ నియమాలను ప్రామాణీకరించి, పోటీలను నిర్వహించి, ప్రపంచవ్యాప్తంగా ఆటను ప్రోత్సహించే ఉద్దేశంతో 1924, జులై 20న పారిస్ కేంద్రంగా ఫిడే ఏర్పడింది. వివిధ జాతీయ చెస్ సమాఖ్యలను కలుపుతూ, ప్రపంచ చాంపియన్‌షిప్‌లను, ఇతర ప్రధాన టోర్నమెంట్‌లను పర్యవేక్షించడం దీని విధి. ప్రస్తుతం ఇందులో 203 సభ్య సమాఖ్యలు ఉన్నాయి. ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లో ఉంది. దీనికి ఆర్కాడీ డ్వోర్కోవిచ్ ప్రెసిడెంట్‌గా (2018 నుంచి), విశ్వనాథన్ ఆనంద్ వైస్ ప్రెసిడెంట్‌గా (2022 నుంచి) ఉన్నారు.

■ ఫిడే ఏర్పాటు గుర్తుగా ఏటా జులై 20న 'అంతర్జాతీయ చెస్ దినోత్సవం' జరుపుకోవాలని ఫిడేలోని సమాఖ్య దేశాలు 1966లో నిర్ణయించాయి. 2019, డిసెంబరు 12న ఐక్యరాజ్యసమితి కూడా ఈ దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించింది.

☛ 2025 నినాదం: "Every Move Counts"

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

నిష్పక్షపాతం.. స్వేచ్ఛా ఎన్నికలే లక్ష్యం!





ప్రజాస్వామ్యంలో అతిముఖ్యమైన ఎన్నికల నిర్వహణ నిష్పక్షపాతంగా జరగాలని, ఇందులో ప్రభుత్వ జోక్యం లేకుండా స్వేచ్ఛగా నిర్వహించేందుకు ఒక వ్యవస్థ ఉండాలని రాజ్యాంగకర్తలు భావించారు. దీని ఫలితంగా అన్ని రకాల ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగం ఉద్దేశించిన యంత్రాంగమే కేంద్ర ఎన్నికల సంఘం. ఇది 1950 జనవరి 25న ఏర్పాటైంది. కేంద్ర ఎన్నికల సంఘం శాశ్వతమైన స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ. ఇది దేశంలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలను నిర్వహిస్తుంది.

కేంద్ర ఎన్నికల సంఘం

రాజ్యాంగంలోని 15వ భాగంలో 324-329 వరకు ఉన్న నిబంధనలు కేంద్ర ఎన్నికల సంఘం గురించి తెలియజేస్తాయి. దీని ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలో ఉంది. ఈ భవనాన్ని 'నిర్వాచన్ సదన్' అనే పేరుతో పిలుస్తారు. దేశంలో రాజ్యాంగ నిబంధనలు, పార్లమెంట్ శాసనాలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహిస్తారు.

నిర్మాణం

కేంద్ర ఎన్నికల సంఘం నిర్మాణం గురించి 324 (2) నిబంధన వివరిస్తుంది.

✦ భారత ఎన్నికల సంఘం 1950 జనవరి 25 - 1989 అక్టోబరు 15 వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో ఏకసభ్య వ్యవస్థగా పని చేసింది. ఎన్నికల సంఘంపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించేందుకు రాష్ట్రపతి 1989 అక్టోబరు 16 నుంచి ఇద్దరు ఎన్నికల కమిషనర్‌లను నియమించారు. కానీ 1990లో ప్రధాని వి.పి.సింగ్ తిరిగి ఏకసభ్య వ్యవస్థగా మార్చారు.

✦ 1993లో ప్రధాని పి.వి. నరసింహారావు ఒక ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లతో కూడిన త్రిసభ్య కమిషన్‌గా (బహుళ సభ్యవ్యవస్థ) మార్చారు.



☛ మొట్టమొదటి ఎన్నికల ప్రధాన కమిషనర్ - సుకుమార్ సేన్

నియామకం

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్లను భారత రాష్ట్రపతి నియమిస్తారు. ప్రాంతీయ ఎన్నికల కమిషనర్లను ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సంప్రదించి నియమిస్తారు.

☛ సివిల్ సర్వీసెస్‌కు చెందిన అధికారిని ఎన్నికల సంఘం విధుల నిర్వహణలో సహకరించేందుకు డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌గా నియమిస్తారు. ఎన్నికల సమయంలో జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు.

☛ 325 ప్రకరణ ప్రకారం ఓటుహక్కు కల్పించేటప్పుడు పౌరుడి పట్ల కుల, మత, జాతి, పుట్టుక, స్త్రీ, పురుష లాంటి వివక్ష పాటించరాదు.

జీతభత్యాలు - పదవీకాలం

ఆర్టికల్ 324 (5) ప్రకారం, పార్లమెంట్ చట్టంలో పేర్కొన్న విధంగా కేంద్ర ఎన్నికల సంఘం ఛైర్మన్, సభ్యుల అర్హతలు, జీతభత్యాలు, పదవీకాలాన్ని రాష్ట్రపతి నిర్ణయిస్తారు.

☛ కేంద్ర సంఘటిత నిధి నుంచి వీరి జీతభత్యాలు చెల్లిస్తారు. సాధారణ పరిస్థితుల్లో జీతభత్యాల్లో కోత విధించరాదు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు సమాన అధికారాలు, జీతభత్యాలుంటాయి.

☛ సుప్రీంకోర్టు న్యాయమూర్తికి వర్తించే ఉద్యోగ నిబంధనలు, జీతం, హోదాను కలిగి ఉంటారు. ఎన్నికల కమిషనర్ల పదవీకాలం ఆరేళ్లు లేదా పదవీ విరమణ వయసు (65 ఏళ్లు) వరకు పదవిలో కొనసాగుతారు.

☛ వీరు తమ పదవికి ఏ సమయంలోనైనా స్వచ్ఛందంగా రాజీనామా చేయవచ్చు. వీరు తమ రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి సమర్పిస్తారు.

తొలగింపు

అసమర్థత, అధికార దుర్వినియోగం లాంటి కారణాలతో సుప్రీంకోర్టు న్యాయమూర్తులను తొలగించే పద్ధతిలో అభిశంసన తీర్మానం ద్వారా వీరిని తొలగిస్తారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన ఈ తీర్మానం ప్రత్యేక మెజార్టీతో ఆమోదం పొందితే రాష్ట్రపతి వారిని పదవి నుంచి తొలగించవచ్చు.

అధికారాలు - విధులు

భారత ఎన్నికల సంఘం పార్లమెంట్‌కు జరిగే ఎన్నికలకు రాష్ట్రపతి పేరుతో, రాష్ట్రాలకు జరిగే శాసనసభ ఎన్నికలకు గవర్నర్ పేరుతో నోటిఫికేషన్ జారీ చేస్తుంది.


❖ నిర్ణీత కాలవ్యవధిలో ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా నమోదు చేయడం, సవరించడం చేస్తుంది.

❖ వివిధ రాజకీయ పార్టీలకు గుర్తింపు ఇవ్వడం, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఎన్నికల గుర్తులు కేటాయించడం ఎన్నికల సంఘం ముఖ్యవిధి.

❖ ఎన్నికల నిర్వహణకు తేదీ, ఇతర వివరాలతో ఎన్నికల ప్రకటన, అభ్యర్థుల నామినేషన్ పత్రాలు పరిశీలించడం.

❖ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా తగిన నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుంది.

❖ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నియమావళిని వర్తింపజేయడం.



☛ ఎక్కువ కాలం ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా పనిచేసింది - కె.వి.కె.సుందరం

❖ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సక్రమంగా జరగలేదని భావిస్తే, తిరిగి ఓట్లు లెక్కించాల్సిందిగా ఆదేశించడం.

❖ పార్లమెంట్ సభ్యుల అనర్హతలపై రాష్ట్రపతికి, శాసనసభ సభ్యుల అనర్హతలపై గవర్నర్‌కు సలహాలివ్వడం.

❖ ఎన్నికల నేరాలు, అభ్యర్థుల మరణం లాంటి కారణాలతో ఎన్నికలను వాయిదా వేయడం.



☛ ప్రస్తుత కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ - జ్ఞానేష్ కుమార్

326వ నిబంధన: భారత రాజ్యాంగం పౌరులందరికీ వయోజన ఓటుహక్కును కల్పించింది. వీరు లోక్‌సభ ఎన్నికలు, రాష్ట్ర విధానసభ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవచ్చు. రాజ్యాంగం అమల్లోకి వచ్చే సమయానికి 326 నిబంధన ప్రకారం 21 ఏళ్లు నిండిన వయోజనులందరికీ ఓటుహక్కును కల్పించారు.

● 1988లో 61వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటుహక్కును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. ఈ చట్టం 1989 నుంచి అమల్లోకి వచ్చింది.

327వ నిబంధన: పార్లమెంట్ ఎన్నికలు, రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించిన విధివిధానాలను ఈ నిబంధన తెలియజేస్తుంది. ఈ ప్రకరణ ప్రకారం పార్లమెంట్ వీటన్నింటినీ రూపొందిస్తుంది.

328వ నిబంధన: ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఎన్నికల విధివిధానాలను పార్లమెంట్ రూపొందించకపోతే రాష్ట్ర శాసనసభ రూపొందించి, అమలు చేసుకోవచ్చు.

329వ నిబంధన: ఈ ప్రకరణ ప్రకారం 327, 328 నిబంధనలను అనుసరించి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఏ న్యాయస్థానం జోక్యం చేసుకోవడానికి వీల్లేదు.

జాతీయ ఓటర్ల దినోత్సవం

కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పడి 2011 జనవరి 25 నాటికి 60 సంవత్సరాలు పూర్తయ్యాయి. దీన్ని పురస్కరించుకుని నాటి నుంచి మనదేశంలో ఏటా జనవరి 25ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఓటర్లలో చైతన్యం, యువతను ఓటర్లుగా నమోదు చేయించే లక్ష్యంతో దీన్ని చేపట్టారు.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

---

716 Word of the Day

Stymie

Telugu meaning: అడ్డుకోవడం, దిగ్బంధించడం

English meaning: The word stymie (స్టైమీ) is a verb that means to block, hinder, or prevent the progress of something.

Synonyms: Hinder, Obstruct

Antonyms: Assist, Facilitate


Usage: **1.** The new regulations may stymie the growth of small businesses.

2. Heavy rains stymied the rescue operations in the flood-affected area.

Current Affairs



President Droupadi Murmu presents Kalinga Ratna Award to Union Education Minister Dharmedra Pradhan on July 15 in Cuttack, Odisha. The event organised by the Sarala Sahitya Sansad. The award recognizes individuals who have made significant contributions in the fields of education, literature, culture, or public service.



Union Ministe for Power and Housing & Urban Affairs, Manohar Lal launches Assistance in Deploying Energy Efficient Technologies in Industries & Establishments (ADEETIE) scheme on 15 July at Panipat, Haryana. The scheme is to accelerate industrial energy efficiency, particularly in MSMEs.



India successfully test-fired nuclear-capable short-range ballistic missiles Prithvi-II & Agni-I from an integrated test range off the Odisha coast on 17 July 2025. Both missiles met all mission objectives and technical parameters, reaffirming their accuracy and operational readiness.


✦ Prithvi - II is a liquid - fuelled, surface-to-surface missile with a range of 350 km, known for its accuracy.

✦ Agni - I, slightly longer in range, operates on solid fuel and can strike targets up to 700 kms away.

For more Current Affairs: Scan QR code

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

కేబినెట్ మిషన్ ప్రణాళిక



కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య అధికమైన అసంతృప్తులతో వేవెల్ ప్రణాళిక వీగిపోయింది. స్వేచ్ఛా భారతమే లక్ష్యంగా కాంగ్రెస్ జాతీయ నాయకులు, ప్రజలు, పాకిస్థాన్ ఏర్పాటే ధ్యేయంగా ముస్లింలీగ్ ఉద్యమాన్ని ఉద్ధృతంగా సాగించాయి. ఈ సమయంలోనే బ్రిటన్‌లో అధికారం చేతులు మారింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అట్లీ భారతదేశ సమస్య పరిష్కారం కోసం ముగ్గురు కేబినెట్ మంత్రుల బృందాన్ని ఇండియాకు పంపాడు. ఈ మంత్రిత్రయం ప్రతిపాదించిన అంశాలు, భారత నాయకుల స్పందన, జిన్నా వ్యతిరేక ప్రదర్శనకు కారణాలు తదితరాలపై పోటీపరీక్షార్థులకు అవగాహన ఉండాలి.

భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలనే ప్రతిపాదనకు వ్యతిరేకి అయిన బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ 1945లో ఇంగ్లండ్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓడిపోయింది. దీంతో చర్చిల్ తన అధికారాన్ని కోల్పోయాడు.

కేబినెట్ మిషన్ ప్లాన్

కేబినెట్ మిషన్ బృందంలో లార్డ్ పెథిక్ లారెన్స్ (ఛైర్మన్), సర్ స్టాఫర్డ్ క్రిప్స్ (సభ్యుడు), ఎ.వి.అలెగ్జాండర్ (సభ్యుడు) ఉన్నారు. వీరు 1946 మార్చి 24న భారతదేశానికి వచ్చారు.

కేబినెట్ మిషన్ ప్లాన్ ప్రధానాంశాలు, ప్రత్యక్ష చర్యా దినోత్సవం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

నర్సింగ్ అప్రెంటిస్ పోస్టులు

శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్), తిరుపతి సంస్థలో నర్సింగ్ అప్రెంటిస్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలోని టెర్షియరీ కేర్ మెడికల్ సెంటర్‌లలో ఆయా పోస్టులను భర్తీ చేస్తారు. మొత్తం పోస్టుల సంఖ్య 100. దరఖాస్తు ఫీజు రూ.590. ఆఫ్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 4 ఆగస్టు 2025.

ఈఎస్ఐసీ హైదరాబాద్‌లో పోస్టులు

ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 46. అర్హులైన అభ్యర్థులు 2025, జులై 28, 29, 30, 31, ఆగస్టు 1, 4, 5, 6 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ ప్రవేశాలకు నేడే (జులై 20) చివరి తేదీ

- సీడ్యాక్, బెంగళూరులో 280 అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రిసెర్చ్ పోస్టులు. బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, పీజీ, పీజీ డిప్లొమా, ఎంఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులు అర్హులు.
- హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్‌లో 30 ఉద్యోగాలు. పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- కొచ్చిన్ షిప్‌యార్డులో గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams
Reasoning
Grid

1.

2	4	6	8
3	6	9	12
4	8	12	16
5	10	15	?

A) 18 B) 20 C) 22 D) 25

2.

1	1	2	3
5	8	13	21
34	55	89	144
233	377	610	?

A) 987 B) 999 C) 900 D) 1000

3.

6	8	3	8
3	9	8	8
7	8	2	3
16	25	13	?

A) 17 B) 19 C) 22 D) 18

4.

2	10	2	?
1	7	9	17
6	3	1	10
8	2	9	19

A) 20 B) 22 C) 17 D) 14

5.

2	3	5	7
11	13	17	19
23	29	31	37
41	43	47	?

A) 56 B) 55 C) 52 D) 53

6.

1	4	9	16
25	36	49	64
81	100	121	144
169	196	225	?

A) 256 B) 235 C) 250 D) 230

7.

2	3	6	11
18	27	38	51
66	83	102	123
146	171	198	?

A) 225 B) 227 C) 223 D) 220

8.

1	2	3	4
2	4	6	8
3	6	9	12
4	8	12	?

A) 14 B) 16 C) 20 D) 18

9.

11	13	17	19
23	29	31	37
41	43	47	53
59	61	67	?

A) 71 B) 73 C) 69 D) 75

10.

4	8	12	16
5	10	15	20
6	12	18	24
7	14	21	?

A) 28 B) 27 C) 25 D) 24

11.

2	6	12	20
30	42	56	72
90	110	132	156
182	210	240	?

A) 272 B) 274 C) 276 D) 278

12.

9	5	7	21
11	10	8	29
14	11	7	32
8	12	12	?

A) 29 B) 30 C) 32 D) 37

13.

1	2	4	7
11	16	22	29
37	46	56	67
79	92	106	?

A) 121 B) 122 C) 120 D) 118

14.

10	20	30	60
15	30	45	90
20	40	60	120
25	50	75	?

A) 125 B) 130 C) 100 D) 150

15.

4	5	7	140
6	12	13	?
11	9	8	792
10	7	5	350

A) 846 B) 946 C) 836 D) 936

16.

2	8	9	1619
10	2	3	1215
8	12	13	?
15	3	2	1720

A) 3033 B) 4140 C) 2929 D) 3230

17.

6	9	3	57
7	5	4	?
9	3	2	29
8	4	5	37

A) 39 B) 29 C) 27 D) 37

18.

11	13	17	160
23	29	31	?
41	43	47	1810
59	61	67	3666

A) 696 B) 586 C) 698 D) 598

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

త్వరలో రైళ్లూ ఎగుమతి చేస్తాం

- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్
- కాజీపేటలో రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పరిశీలన
- కాచిగూడ-జోధ్‌పుర్ రైలు ప్రారంభం


ప్రత్యేక రైలులో ప్రయాణిస్తూ విజ్ఞప్తులు పరిశీలిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్. చిత్రంలో మహేశ్వర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

ఈనాడు, హైదరాబాద్: రానున్న రోజుల్లో రైళ్లను ఎగుమతి చేసే దేశంగా భారత్ ఎదగబోతోందని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేటలో నిర్మాణంలో ఉన్నది మెగాకోచ్ ఫ్యాక్టరీగా అవతరించనుందని చెప్పారు. ఇక్కడ ఇంజిన్లు, బోగీలు, మెట్రో రైళ్ల తయారవుతాయని.. ఇది దేశానికి తలమానికం కావడం ఖాయమన్నారు. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులతో కలిసి శనివారం హైదరాబాద్ సమీపంలోని శంకర్‌పల్లి నుంచి కాజీపేటకు ప్రత్యేక రైలులో ప్రయాణిస్తూ విండో ఇన్‌స్పెక్షన్ చేశారు. కాజీపేట మండలం అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయూ) పనులను పర్యవేక్షించారు. అనంతరం అక్కడే విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ రూ.500 కోట్లతో పనులు ప్రారంభించామని.. డిసెంబరు నాటికి నిర్మాణాలు పూర్తవుతాయని చెప్పారు. వచ్చే ఏడాదిలో తయారీ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. మనదేశంలో ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన వందే భారత్ రైళ్లకు పెద్దఎత్తున డిమాండ్ ఏర్పడిందని.. 150 కావాలని ఆర్డర్లు వచ్చాయన్నారు. మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ 40 ఏళ్ల నుంచి ఉందని.. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూడా ప్రయత్నాలు చేశారని గుర్తుచేశారు. మోదీ ప్రధాని అయ్యాక ఆ కోరిక నెరవేరిందన్నారు. విమానాశ్రయం విషయంలోనూ ముందడుగు పడిందని, రాష్ట్ర ప్రభుత్వం భూమిని పౌర విమానయాన శాఖకు అప్పగిస్తే.. మిగతా ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని చెప్పారు. అంతకుముందు శంకర్‌పల్లి నుంచి కాజీపేటకు ప్రత్యేక బోగీలో వచ్చే సమయంలో కాజీపేట-బల్లార్ష మార్గంలో నాలుగో లైన్ కూడా వస్తుందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. హైదరాబాద్‌కు ప్రస్తుతం రోజూ వస్తున్న సుమారు 650 రైళ్లను 1,300కి పెంచేందుకు అవసరమైన ప్రణాళిక తయారు చేస్తామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇస్తే ఔటర్ రింగ్ రైలు మార్గంలో డ్రైపోర్టులు కూడా ఏర్పాటు చేస్తామన్నట్లు తెలిసింది. భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య రైల్వే మంత్రితో సమావేశమై పలు విజ్ఞప్తులు చేశారు.

రాజస్థానీయుల కోరిక మేరకు..

సాయంత్రం కాచిగూడ స్టేషన్‌లో.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవలతో కలిసి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ జెండా ఊపి కాచిగూడ-జోధ్‌పుర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలోని రాజస్థానీయుల కోరిక మేరకు కాచిగూడ-జోధ్‌పుర్ (భగత్-కీ కోఠీ) మధ్య నూతన ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్‌తోపాటు కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో శాసనమండలి వైస్ ఛైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మీర్జా రియాజుల్ హసన్, ఏవీఎన్‌రెడ్డి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, డీఆర్ఎం లోకేశ్ విష్ణోయ్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్ కెరీర్ శిక్షణకు 8 మంది ఐఏఎస్‌లు

ఈనాడు, అమరావతి: ముస్సోరిలోని లాల్‌బహదూర్ నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో ఈ నెల 21 నుంచి ఆగస్టు 16 వరకు జరగనున్న మిడ్ కెరీర్ శిక్షణ (ఎంసీటీపీ)కు రాష్ట్రం నుంచి 8 మంది ఐఏఎస్ అధికారులు వెళ్లనున్నారు. ఈ శిక్షణకు వెళ్లేందుకు ఐఏఎస్‌లు నారాయణ భరత్‌గుప్తా, ఎ.మల్లికార్జున, వి.ప్రసన్నవెంకటేశ్, ఎం.వేణుగోపాల్‌రెడ్డి, మనజీర్ జిలానీ, కేవీఎన్ చక్రధరబాబు, గిరీషా, డీకే బాలాజీలకు అనుమతినిస్తూ, శనివారం వీరిని రిలీవ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

‘అధికారులను అంతం చేసే చట్టం లేదని జగన్ గుర్తుంచుకోవాలి’

రాజమహేంద్రవరం(దేవీచౌక్), న్యూస్‌టుడే: ‘అధికారంలోకి వస్తాం.. మీ అంతు చూస్తాం’ అంటూ అధికారులను బెదిరిస్తున్న మాజీ సీఎం జగన్.. అలాంటి చట్టమేదీ దేశంలో లేదని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు హితవు పలికారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా జగన్ మాట్లాడే భాష తీరు మార్చుకోవాలని, బెదిరింపులతో అధికారంలోకి రాలేరని సూచించారు. వైకాపా హయాంలోని ముఖ్య అధికారులంతా ప్రస్తుతం జైలుకు వెళ్తున్నారని గుర్తుచేశారు. 2029లో కూడా కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ఏటా 300 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయని, దిగువన ఉన్న రాష్ట్రాలకు వాటిని వాడుకునే హక్కు ఉంటుందని వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎటువంటి నష్టం ఉండదని వివరించారు.

సర్వే చేసి భూమి హద్దులు చూపండి

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తన భూమిని సర్వే చేసి హద్దులు చూపించాలని జేసీ ఆదేశించినా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని కర్నూలు జిల్లా కోడుమూరు మండలం అమడగుంట్లకు చెందిన కృష్ణుడు అనే వ్యక్తి వాపోయారు. న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం వినతిపత్రం సమర్పించారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. కృష్ణా జిల్లా కోడూరు మండలంలోని తన పొలం పక్కనున్న డొంక బోదెను ఆక్రమించి మురుగు, వర్షపు నీరు పోకుండా అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని విజయవాడకు చెందిన రోజా కోరారు.

ఆర్టీసీ స్థలాలను ‘లులు’కు కట్టబెట్టొద్దు: సీపీఐ

ఈనాడు, అమరావతి: విజయవాడలోని పాత బస్టాండ్, విద్యాధరపురం డిపోలాంటి విలువైన ఆర్టీసీ స్థలాలను ‘లులు’ సంస్థకు కట్టబెట్టడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. దాదాపు రూ.400 కోట్ల విలువైన విజయవాడ పాత బస్టాండ్ స్థలంతో పాటు భారీ విలువలగల విద్యాధరపురం డిపో స్థలాన్ని కార్పొరేట్ సంస్థకు కారుచౌకగా లీజు ప్రాతిపదికన కట్టబెట్టేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని విమర్శించారు. మరోవైపు అన్య మతస్థుల పేరుతో తితిదే ఉద్యోగులను సస్పెండ్ చేయకుండా వారిని తితిదేలోనే ఇతర విభాగాల్లో పని చేసేటట్లు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సెల్బీసీ తవ్వకానికి లైడార్ సర్వే

- వానాకాలం సాగునీటి విడుదలకు చర్యలు: తెలంగాణ మంత్రి ఉత్తమ్

ఈనాడు, హైదరాబాద్: శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం నిర్మాణంలో మిగిలిన 10 కి.మీ. పనుల పూర్తికి లైడార్ సర్వే నిర్వహించనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం సచివాలయంలో ఆయన తన శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ‘ఎన్జీఆర్ఐ, జీఎస్ఐ సంస్థల సహకారంతో లైడార్ సర్వే నిర్వహిస్తాం. సొరంగం తవ్వకాలను డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానం(డీబీఎం)తో పూర్తి చేస్తాం. సొరంగం పునరుద్ధరణకయ్యే ఖర్చు విషయంలో వెనక్కు తగ్గం. సొరంగాల నిర్మాణంలో అనుభవం ఉన్న మాజీ ఈఎన్సీ జనరల్ హర్పాల్‌సింగ్‌ను శాఖకు గౌరవ సలహాదారుగా నియమిస్తున్నాం. వాలంతరితో పాటు నీటిపారుదల శాఖ భూముల్లో ఆక్రమణలను తొలగిస్తాం. శాఖలో పదోన్నతుల ప్రక్రియను రెండు నెలల్లో పూర్తయ్యేలా అధికారులు చూడాలి. ప్రాజెక్టుల కింద పంటలకు అవసరమైన సమయంలో ఇంజినీర్లు సాగునీటిని విడుదల చేయాలి. చివరి ఆయకట్టు వరకు చేరేలా చూడాలి’ అని ఆదేశించారు. సమీక్షలో శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్‌పాటిల్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మళ్లీ దంచికొట్టిన వరుణుడు

- జవహర్‌నగర్, కాప్రా, ఉప్పల్‌లలో వానబీభత్సం
- కాప్రాలో అత్యధికంగా 7.8 సెం.మీ నమోదు


జవహర్‌నగర్ న్యూ వెంకటేశ్వరకాలనీలో వరద ప్రవాహం


శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లి-కేవీదొడ్డి గ్రామాల మధ్య రోడ్డుపై ఎంటేరు వాగు ఉద్ధృతి

ఈనాడు, హైదరాబాద్ - బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ మహా నగరంలో వరుసగా రెండో రోజు శనివారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ప్రధాన నగరంతోపాటు శివారు ప్రాంతాలు అల్లాడాయి. ఉప్పల్ పరిధిలోని కాప్రాలో అత్యధికంగా 7.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దాంతో కాప్రా చెరువు ఉగ్రరూపం దాల్చింది. డాబాగార్డెన్స్ వద్ద ఉన్న వరద నాలా ప్రహరీ కుప్పకూలడంతో నీరంతా పక్కనే ఉన్న డాబాగార్డెన్స్, మల్లికార్జుననగర్ రోడ్లను ముంచెత్తింది. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. జవహర్‌నగర్, ఉప్పల్, మల్కాజిగిరి ప్రాంతాల్లో వరుణుడు బీభత్సం సృష్టించాడు. అయ్యప్పకాలనీలో పక్షవాతంతో మంచానికి పరిమితమైన వృద్ధుడి ఇంట్లోకి నీరు వెళ్లడంతో స్థానికులు గమనించి... ఆయన్ను రక్షించారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో విజయవాడ జాతీయ రహదారి మోకాల్లోతు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ప్రధాన నగరంలోని సికింద్రాబాద్, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఉప్పల్‌లో 6.85 సెం.మీ, చర్లపల్లిలో 5.2 సెం.మీల వర్షపాతం నమోదైంది. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం నుంచి ఇంకా పలు ప్రాంతాలు కోలుకోలేదు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పైగా కాలనీ, ప్యాట్నీనగర్‌లలో రోడ్లపై బురద మేటలు వేసింది.

‘జంట’ జలాశయాల్లోకి కొత్త నీరు

హిమాయత్‌సాగర్, గండిపేట(ఉస్మాన్‌సాగర్) జంట జలాశయాల్లోకి కొత్త నీరు చేరుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ఉస్మాన్‌సాగర్‌కు మూసీ నది ద్వారా 1,250 క్యూసెక్కులు, హిమాయత్‌సాగర్‌కు ఈసీ నది ద్వారా 1,600 క్యూసెక్కుల వరద వస్తోంది. గండిపేట జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,790 అడుగులు కాగా ప్రస్తుతం 1782.50 అడుగులుగా ఉంది. హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1763.50 అడుగులు కాగా ప్రస్తుతం 1758.80 అడుగులకు చేరింది.

■ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 8.37 సెం.మీ. వర్షం కురిసింది. కాలనీల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించి... వరద వెళ్లిపోయేలా పురపాలక సిబ్బందికి సూచనలు చేశారు.

ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్సవుతున్నారు?

- సినిమాలు, ఓటీటీలు చూసి హత్యలు
- పోలీసులకు చిక్కకూడదని కుయుక్తులు
- అయినా 99% మంది పట్టివేత

ఈనాడు, హైదరాబాద్: కారు కొనుక్కోవాలంటే అందుకు అవసరమయ్యే సొమ్ము కష్టపడి సంపాదించాలి. అంతేతప్ప తాళం తెరిచే తెలివితేటలు ప్రదర్శిస్తే పోలీసులు పట్టుకుంటారన్న సంగతి గుర్తుంచుకోవాలి. అప్పుడు జైలు జీవితం గడపడంతో పాటు జీవితాంతం దొంగతనం మచ్చ మోయాల్సి వస్తుంది. గమ్యానికి చేరుకోవాలంటే రాజమార్గంలో వెళ్లాలి. తప్పుడు మార్గంలో పయనిస్తే బోల్తాపడటం ఖాయం. ఇటీవలి కాలంలో సినిమాలు, సీరియళ్లు, ఓటీటీలు చూసి... పోలీసుల దర్యాప్తు ఎలా ఉంటుంది, ఆధారాలు దొరక్కుండా ఏం చేయాలి, ఒకవేళ దొరికితే ఎలా బురిడీ కొట్టించాలో తెలుసుకున్నామనుకుని... హత్యలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ‘దృశ్యం’ సినిమాలోలా హత్య చేశాక, ఏవో ఎత్తులు వేసి తప్పించుకోవచ్చని భ్రమపడుతున్నారు. జీవితమంటే సినిమా కాదని, నేరం జరిగితే నిందితులను పట్టుకునేంతవరకూ పోలీసులు గాలిస్తుంటారన్న సంగతి వారికి తెలియడం లేదు. అందుకే నేరానికి పాల్పడిన గంటల వ్యవధిలోనే దొరికిపోతున్నారు. ఓ సినిమాలో అన్నట్టు... ఇంత చిన్న లాజిక్ వారెలా మిస్సవుతున్నారు?

ఇవిగో ఉదంతాలు..

● గత జనవరిలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్‌లో కట్టుకున్న భార్యను హత్య చేసి, శరీరాన్ని ముక్కలు చేసి, ఉడకబెట్టి, పొడి చేసి, దాన్ని నీళ్లలో కలిపిన గురుమూర్తి ఉదంతంలో తొలుత పోలీసులే హతాశులయ్యారు. అయితే, ఫిర్యాదు అందిన మూడు రోజుల్లోనే కేసును పరిష్కరించారు. శరీర భాగాలను ఛిద్రం చేయడానికి వాడిన వస్తువులు, ఉడకబెట్టడానికి ఉపయోగించిన పాత్రల నుంచి ఆధారాలు సేకరించి అతడి బండారం బట్టబయలు చేశారు.

● రూ.7 లక్షల అప్పు తిరిగివ్వాలని ఒత్తిడి చేస్తున్న యర్రం అనురాధారెడ్డిని హత్య చేసిన చంద్రమోహన్... పోలీసులకు పట్టుబడకుండా మృతదేహాన్ని మాయం చేయడం గురించి, ముక్కలు చేసేందుకు వాడాల్సిన రాతి రంపాల గురించి గూగుల్‌లో అన్వేషించాడు. మృతదేహాన్ని ఆరు ముక్కలుగా నరికి పాలిథిన్ కవర్‌లో చుట్టి ఫ్రిజ్‌లో పెట్టాడు. దుర్వాసన రాకుండా అగరుబత్తీలు వెలిగించేవాడు... సెంటు చల్లేవాడు. తలభాగాన్ని సంచిలో పెట్టి చాదర్‌ఘాట్ వద్ద మూసీ నదిలో పడేశాడు. అయినా పోలీసులకు దొరికిపోయాడు. మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022లో ఈ ఘటన జరిగింది.

● ఏడో తరగతి చదువుతున్న తమ కుమార్తెను లోబరచుకొని దాచాడని భావించిన క్యాబ్ డ్రైవర్ మురళి, ఆయన భార్య ద్వారక... ఆటోడ్రైవర్ కుమార్‌పై కక్ష పెంచుకున్నారు. కుమార్‌పై వలపు వల విసిరిన ద్వారక... ఫోన్ చేసి ఖాళీగా ఉన్న బంధువుల ఇంటికి రప్పించింది. కుమార్తె ఎక్కడుందో చెప్పాలంటూ చిత్రహింసలు పెట్టడంతో కుమార్ అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. అతడిని దంపతులిద్దరూ కలిసి కోదాడ సమీపంలోని సాగర్ కాలువలో శరీరానికి బండరాళ్లు కట్టి మరీ విసిరేశారు. కుమార్ ఆటో నంబర్ ప్లేట్ మార్చిన మురళి... దాన్ని తానే వాడుకోవడం మొదలుపెట్టాడు. 2023 మార్చి 11న కుమార్ హత్య జరిగింది. 2024 డిసెంబరులో మాదాపూర్‌లోని గూగుల్ కార్యాలయం వద్ద ఆటోను గమనించిన కుమార్ బావమరిది... తన బావ ప్రత్యేకంగా తయారు చేసుకున్న బంపర్ ఉండటంతో అనుమానించి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మురళిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా... హత్య ఉదంతం బయటపడింది.

● ప్రియుడు తిరుమలరావు మాయలో పడి కట్టుకున్నోడిని పెళ్లయిన నెల రోజుల్లోనే సహస్ర అలియాస్ ఐశ్వర్య గత జూన్‌లో హత్య చేయించింది... అప్పులు తీర్చేందుకు సొంత అత్త తాడికొండ రామవ్వ పేరిట జీవిత బీమా చేయించి మరీ రోడ్డు ప్రమాదం రూపంలో ఇటీవల హత్య చేయించాడు సిద్దిపేట జిల్లా పెద్ద మాసాన్‌పల్లికి చెందిన తాళ్ల వెంకటేశ్... వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్త వస్తువుల స్వామిని ఈ నెల 13న ప్రమాదాన్ని తలపించేలా కారుతో ఢీకొట్టించి హత్య చేసిన అతడి భార్య స్వాతి, ఆమె ప్రియుడు గుంటి సాయికుమార్, తమ్ముడు మహేశ్... వీరందరి బండారం కొన్ని గంటల్లోనే బయటపడింది.

2023లో జరిగిన హత్యలు, కారణాలు

కారణం	సంఖ్య
కుటుంబ వివాదాలు	176
లైంగిక ఈర్ష్య	136
భూమి, ఆస్తి వివాదాలు	89
పాత కక్షలు	73
ప్రేమ వ్యవహారాలు	18
సుపారీ హత్యలు	8
పరువు హత్యలు	2
ఇతర కారణాలు	287
మొత్తం	789

తప్పించుకోవడం అసాధ్యమంటున్న పోలీసులు

నేరం చేస్తే తప్పించుకోవడం అసాధ్యం. దర్యాప్తు ఆలస్యం కావచ్చేమోకానీ నిందితులు పట్టుబడటం ఖాయం. హత్యలు వంటి నేరాల్లో 99 శాతం మంది నిందితులు దొరుకుతూనే ఉన్నారు. ఇటీవల కాలంలో సెల్‌ఫోన్ ద్వారా నిందితులను పోలీసులు పట్టుకుంటుండటంతో కొందరు నేరగాళ్లు తదనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కానీ, దర్యాప్తులో సెల్‌ఫోన్ ఒక అవకాశం మాత్రమే. ఏదైనా సమస్య వస్తే సామరస్యంగా పరిష్కరించుకోవాలి తప్ప హత్యల్లాంటి నేరాలకు పాల్పడవద్దని, తదనంతర జీవితాన్ని దుర్భరంగా మార్చుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

2024లో జరిగిన హత్యలు, కారణాలు	కుటుంబ వివాదాలు	లైంగిక ఈర్ష్య	భూమి, ఆస్తి వివాదాలు	చిన్న గొడవలు	డబ్బుల వివాదాలు	ఇతర కారణాలు
	229	102	82	82	53	308


ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేసిన జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌కు పుష్పగుచ్ఛంఅందించి అభినందనలు తెలుపుతున్న గవర్నర్ జిష్ణుదేవ్, చిత్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ ఎ.కె.సింగ్ ప్రమాణం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు 7వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎ.కె.సింగ్‌తో ప్రమాణం చేయించారు. దైవసాక్షిగా, రాగద్వేషాలకు అతీతంగా, రాజ్యాంగ, చట్టబద్ధంగా విధులు నిర్వహిస్తానని ఆయన ప్రమాణం చేశారు. అంతకుముందు రిజిస్ట్రార్ జనరల్ గోవర్ధన్‌రెడ్డి.. జస్టిస్ ఎ.కె.సింగ్ బదిలీ ఉత్తర్వులను చదివి వినిపించారు. ప్రమాణం అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

‘బనకచర్ల’తో నష్టం ఒక్క బంగాళాఖాతానికే

ప్రజాస్వామ్యంలో ఉండే అర్హత జగన్‌కు లేదు: మంత్రి నిమ్మల


మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, పక్కన ఎమ్మెల్యేలు బండారు, రాజు

చోడవరం, న్యూస్‌టుడే: ‘ఏటా మూడు వేల టీఎంసీల గోదావరి వరద జలాలు సముద్రంలో వృథాగా కలుస్తున్నాయి. ఆ నీటిని మాత్రమే రాష్ట్రం వాడుకొనే అవకాశం ఉంది. రాయలసీమను సస్యశ్యామలం చేయాలని బనకచర్ల ప్రాజెక్టు ద్వారా బంగాళాఖాతంలోకి వృథాగా పోయే నీటిని వినియోగించుకునేందుకు మనం ఆలోచన చేశాం. దీనివల్ల బంగాళాఖాతానికి తప్ప మరెవ్వరికీ నష్టం లేదు’ అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో మంత్రి శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాలు, పార్టీలు వేరైనా తెలుగు ప్రజలు బాగుండాలనే సీఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారు తప్ప, ఎవరినీ ఇబ్బందికి గురిచేసే సమస్యే లేదని స్పష్టం చేశారు. రప్పా.. రప్పా.. అంటూ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేయాలనుకునే జగన్‌కు ప్రజాస్వామ్యంలో ఉండే అర్హత లేదని మంత్రి ధ్వజమెత్తారు. మద్యం కుంభకోణంలో రూ.30 వేల కోట్ల ప్రభుత్వ ఆదాయాన్ని దోచేసిన వారిని అరెస్టు చేస్తే తప్పేముందని ప్రశ్నించారు. 2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేసేలా పనులు సాగుతున్నాయని వెల్లడించారు.

‘సీఎక్స్‌వో’ క్లబ్‌లో చేరండి

విదేశాల్లో కంపెనీలు పెట్టిన ప్రవాసాంధ్రులకు ఏపీఎన్ఆర్‌టీ పిలుపు


ఈనాడు, అమరావతి: విదేశాల్లో కంపెనీలు స్థాపించిన ప్రవాసాంధ్రులు తమ వ్యాపారాలు, సత్సంబంధాలను (నెట్‌వర్కింగ్) పెంపొందించుకోవడానికి.. ఆయా దేశాల్లో స్థానికంగా ఉన్న ఎన్ఆర్ఐ యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు ‘సీఎక్స్‌వో’ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) డైరెక్టర్ (పెట్టుబడులు) కె.శేషబాబు తెలిపారు. ఈ క్లబ్‌లో చేరడం వల్ల వివిధ ప్రయోజనాలు పొందే అవకాశముంటుందని, అందరూ ముందుకు రావాలని శనివారం ఓ ప్రకటనలో ఆయన కోరారు. ఈ క్లబ్‌లో చేరే వారికి ఇతర దేశాల్లోని కంపెనీల ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పాలసీ తయారీదారులతో నేరుగా అనుసంధానమయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. స్థానికంగా, గ్లోబల్ ఎక్స్‌పోజర్ కోసం యాక్సిలేటర్‌లను పొందొచ్చన్నారు. సీఎక్స్‌వో మ్యాగజైన్ ఫీచర్లు, స్పీకర్ ప్లాట్‌ఫాంల ద్వారా గుర్తింపు పొందే అవకాశముంటుందని వెల్లడించారు. తాము పొందిన జ్ఞానాన్ని యువ ప్రతిభావంతులతో పంచుకోవచ్చని, ఆయా రంగాల్లో ప్రముఖ పారిశ్రామికవేత్తల నుంచి మార్గదర్శనం పొందొచ్చని వివరించారు.

మరిన్ని ప్రయోజనాలు..

● విజయవాడ, విశాఖ, తిరుపతి, అంతర్జాతీయ బిజినెస్ హబ్‌లలో నిర్వహించే ప్రైవేటు సమావేశాల్లో పాల్గొనే అవకాశం ● ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులతో పాలసీ ఫోరమ్‌ల ద్వారా నేరుగా భేటీ కావొచ్చు ● దేశీయ, అంతర్జాతీయ ఈవెంట్లలో రాయితీ ధరలతో పాల్గొనవచ్చు ● ఎన్ఆర్ఐలకు ప్రయాణ, రవాణా, న్యాయపరమైన మద్దతు ● అత్యవసర అంశాల్లో ప్రత్యేక సహాయం ● తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం, ఇతర ప్రముఖ ఆలయాల్లో దర్శనాలు ● లీడ్ జనరేషన్, అనలిటిక్స్ కోసం లేక్ బీటుబీ తరహా అత్యాధునిక టూల్స్ ఉచిత వినియోగం ● ఏపీలోని ఇండస్ట్రీ ఎక్స్‌పోలపై ప్రత్యేక రాయితీలు, ప్రీమియం ఎగ్జిబిటర్ స్లాట్లు పొందొచ్చు.

రోగి ఆరోగ్య సంరక్షణే కీలకం

- ఎన్ఎస్ఐ సదస్సులో ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి


కార్యక్రమంలో ఏఐజీ ఛైర్మన్ డా.నాగేశ్వరరెడ్డి. చిత్రంలో డా.కల్యాణ్, డా.సుబోధ్‌రాజు, పీవీఎస్ రాజు, డా.జీవీరావు, డా.మానస్ పాణిగ్రహి, డా.పరితోష్ పాండే, డా.అభిరామ్

ఈనాడు, హైదరాబాద్: వైద్య సేవల విషయంలో రోగి ఆరోగ్య సంరక్షణే కీలకమని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆసుపత్రి ఛైర్మన్ డా.నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటు ప్రాక్టీస్ చేసే వైద్యులు మెడికో లీగల్ అంశాలు, నైతిక బాధ్యత, రోగి సంరక్షణ తదితర అంశాలపై చర్చించాలన్నారు. అందుకు ఎన్ఎస్ఐ వేదికలు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ఏఐజీ ఆసుపత్రి న్యూరో సర్జరీ విభాగం శుక్ర, శనివారాల్లో న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్ఐ) ఆధ్వర్యంలో ప్రైవేటు న్యూరోసర్జరీ వైద్యుల సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ..రోగులకు స్థిరమైన, నాణ్యతతో కూడిన సేవలు అందించేందుకు ఎన్ఎస్ఐ బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని అన్నారు. ఏఐజీ ఆసుపత్రి న్యూరోసర్జరీ విభాగం డైరెక్టర్, ఎన్ఎస్ఐ ఛైర్మన్ డా.సుబోధ్‌రాజు మాట్లాడుతూ..దేశంలో న్యూరో సర్జికల్ ప్రాక్టీసు వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. గచ్చిబౌలిలోని ది వెస్టిన్ హోటల్, ఏఐజీ ఆసుపత్రిలలో జరిగిన సదస్సుల్లో సీనియర్ వైద్య నిపుణులు, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్యానెల్ చర్చలు, కేస్‌స్టడీలు, ప్రశ్నోత్తరాల కార్యక్రమాలను నిర్వహించారు. డా.మానస్ పాణిగ్రహి, డా.పరితోష్ పాండే, డా.కల్యాణ్, పీవీఎస్ రాజు, డా.జీవీరావు, డా.అభిరామ్, డా.సురేశ్, డా.రఘు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను సంరక్షించే ప్రవాసీలను గౌరవించుకోవాలి

- తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్
- తెలుగు వర్సిటీ-2024 ప్రతిభా పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలతో మంత్రి గడ్డం వివేక్, ఆచార్య నిత్యానందరావు, వ్యాసకృష్ణ, ఆచార్య కోట్ల హనుమంతరావు, రింగు రామ్మూర్తి

హైదరాబాద్, న్యూస్‌టుడే: విదేశాల్లో స్థిరపడినప్పటికీ మాతృభాషను సంరక్షిస్తున్న తెలుగువారిని గౌరవించుకోవాలని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ పేర్కొన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం శనివారం ‘ప్రతిభా పురస్కారాలు-2024’ ప్రదానం చేసింది. ఈ వేడుకకు హాజరైన మంత్రి మాట్లాడుతూ..పలువురు ప్రముఖులను గుర్తించి పురస్కారాలు అందించడం గొప్ప విషయమన్నారు. పురస్కారాల నగదు పారితోషికాన్ని పెంచడానికి క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ ఎండీ(ఉగాండా) వ్యాస కృష్ణ రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలు అందుకున్నవారు

డా.యాకూబ్ (కవిత్వం), డా.ఎం.ఎ.శ్రీనివాసన్ (పరిశోధన), ఎల్.నరేందర్ (చిత్రలేఖనం), బైరోజు చంద్రశేఖర్ (శిల్పం), డా.ఆర్.ప్రసన్నరాణి (నృత్యం), డా.బి.రాధా సారంగపాణి (సంగీతం), కె.కైలాష్ (పత్రికా రంగం), దుప్పల్లి శ్రీరాములు (నాటక రంగం), గజవెల్లి సమ్మయ్య(జానపద కళా రంగం), ఆముదాల మురళి (అవధానం), డా.పులిగడ్డ విజయలక్ష్మి (ఉత్తమ రచయిత్రి), పోల్కంపల్లి శాంతాదేవి(నవల) పక్షాన ఆమె కోడలు సంధ్యలకు రూ.20,116 నగదుతో పాటు శాలువా కప్పి అభినందన పత్రాలు అందజేశారు.